విజయవాడ
పరిసర ప్రాంత దేవాలయాలు
కృష్ణాపుష్కర వైభవము



వెల
99/-

- గాజుల సత్యనారాయణ



వి.జి.యస్.బుక్ లింక్స్
విజయవాడ

విజయవాడ (కృష్ణాజిల్లా) పరిసర ప్రాంత దేవాలయాలు

కృష్ణా పుష్కర వైభవము

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక గ్రంథములకు మోహన్ పబ్లికేషన్స్, ఆధ్యాత్మిక గ్రంథనిలయం కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,రాజమహేంద్రవరం .



గాజుల సత్యనారాయణ

కృష్ణా పుష్కర వైభవం

ప్రథమ ముద్రణ : ఆగస్టు 2016

శుభాకాంక్షలతో

వి.జి.యస్. పబ్లిషర్స్

5-6-59/3, ఫస్ట్ ఫ్లోర్, తమ్మిన కృష్ణ వీధి,

సాయిరాం థియేటర్ వెనుక, విజయవాడ - 9.

ఫోన్ : 2512222, 2510202.

ఫ్యాక్స్ : 0866 - 2515555.

వి.జి.యస్. బుక్ లింక్స్

3-1-399, నింబోలిఅడ్డా, కాచీగూడ,

హైదరాబాద్ - 500 027.

ఫోన్ : 040-24650717.

ముద్రణ :

శ్రీ మారుతి ప్రింటర్స్

5-6-59/3, తమ్మిన కృష్ణ వీధి, సాయిరాం థియేటర్ వెనుక, విజయవాడ - 9.

కృష్ణా పుష్కర వైభవము

శ్రీ కృష్ణా పుష్కర నిర్ణయము



శ్రీ దుర్ముఖి నామ సంవత్సరం దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసము, శుక్ల అష్టమి, తత్కాల నవమి, గురువారం, అనురాధ నక్షత్రము, బ్రహ్మం యోగం సమయంలో రా. 9:28ని.లకు గురువు ఉత్తరఫల్గుణి 2వ పాదము, కన్యారాశిలో ప్రవేశించాడు. రాత్రికాలంలో ప్రవేశమైన కార ణంగా, **ది.12-08-2016వ తేదీ నుండి 12 రోజులు అనగా ది.23-08-2016వరకు** సార్ధ త్రికోటి సహిత శ్రీ కృష్ణవేణి నదికి పుష్కరాలు జరుగును. ఈవిధంగా గురుడు కన్యారాశిలో ప్రవేశించ గానే మూడు కోట్ల యాబది లక్షల తీర్థముల సమేతుడై పుష్కరుడు కృష్ణానదిని ఆశ్రయిం చును. ఈ పుష్కర కాలంలో ప్రతివారు తమశక్తికొలది స్నాన, దాన, జపాదులతో పాటు, తమతమ పితృదేవతలకు పిండ ప్రదానాలు శ్రాద్ధ కర్మ లాచరించి పవిత్రమైన శ్రీ కృష్ణవేణీ నదిలో స్నానమాచరించి పాపములను బాపుకొని శ్రీ కనకదుర్గ మల్లేశ్వరులను దర్శించి ఆయురారోగ్య భోగభాగ్యములతో సుఖింతురు గాక.

విషయసూచిక

పరమ పవిత్రం పుష్కరం

పుష్కరం అంటే పన్నెండు సంవత్సరాలు, ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి భారతదేశములోని 12 ముఖ్యమైన జీవనదులన్నింటికీ 'పుష్కరాలు' వస్తాయి. పుష్కర సమయములో ఆయానదులలో స్నానము ఆచరిస్తే ఆరోగ్యము మరియు ప్రత్యేక పుణ్యఫలం ప్రాప్తిస్తుందని ప్రతీతి.

బృహస్పతి ఒక రాశి నుండి మరొక రాశిలోకి ప్రవేశించినప్పుడు ఆయానదికి పుష్కరాలు వస్తాయి. బృహస్పతి ఆ రాశిలో ఉన్నంతకాలము ఆ నది పుష్కరములో ఉన్నట్టే. పుష్కరకాలము సాధారణముగా ఒక సంవత్సరము పాటు ఉంటుంది. పుష్కరకాలములోని మొదటి పన్నెండు రోజులను ఆది పుష్కరము అని, చివరి పన్నెండు రోజులను అంత్య పుష్కరము అని వ్యవహరిస్తారు. ఈ మొదటి మరియు చివరి పన్నెండు రోజులు మరింత ప్రత్యేకమైనవిగా భక్తులు భావిస్తారు.

పుష్కర కాలంలో చేసే స్నానాలకు, ఇచ్చే దానాలకు మంచి ఫలితాలుంటాయని మన పూర్వీకుల ప్రగాఢ నమ్మకం. సాధారణ రోజుల్లో సంవత్సరం పాటు పవిత్ర నదులలో స్నానం ఆచరిస్తే ఎంత ఫలితముంటుందో, పుష్కరాల్లో ఒక్కసారి స్నానం చేస్తే అంతే ఫలితం దక్కుతుందని చెబుతారు. మనసుతో, వాక్కుతో, శరీరంతో చేసిన వివిధ వేలకొలది పాపాలన్నీ పుష్కర స్నానం వల్ల తొలగుతాయని విశ్వాసం. వంద కన్యాదానాలు చేస్తే ఎంతటి ఫలితం లభిస్తుందో అంత ఫలితం పుష్కర స్నానం వల్ల లభిస్తుందని మన పూర్వీకుల నమ్మకం.

అంతేగాకుండా పుష్కర కాలంలో చేసే దానాల వలన కలిగే ఫలితాలు అంతా ఇంతా కావు. దానాలలో సాలిగ్రామ దానం, శిలాదానం, కన్యాదానం, తిలపాత్ర దానం, సరస్వతీ దానం..ఇవీ ఉత్తమమైన దానాలు. నదీ స్నానం చేసి ఇవి దానం చేస్తే ఫలితాలు ఉత్తమంగా ఉంటాయని కూడా చెబుతారు. అందుకే పుష్కరాల్లో ఏరోజున ఏ వస్తువులు దానం చేయాలో కూడా తెలియజేయబడింది. ఈ పుష్కర సమయములో సూర్యుడు ఉదయించక ముందే లేచి నదిని స్మరిస్తూ స్నానం చేయాలి. దీనివలన పాపాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ సమయములో ముక్కోటి దేవతలందరూ ఆ నదిలో ఉంటారు కనుక పుష్కరాల కాలంలో నదీమతల్లికి హారతి యివ్వటం అంటే సకల దేవతలకు హారతులిచ్చినట్లే! ఈ నమ్మకంతో భక్తులంతా తమ శక్తిననుసరించి హరతులిచ్చి, పాప ప్రక్షాళనం చేసుకొన్న తృప్తి ననుభవించి తమ జీవితాలు ధన్యమైనాయనే మహదానందంతో శేషజీవితాన్ని గడుపుతారు

జీవులకు మూడు కర్మల ద్వారా ముక్తి లభిస్తుంది. రేవానది తీరాన తపస్సు చేస్తే ముక్తి. గంగాతీరాన తనువును చాలిస్తే ముక్తి. కురుక్షేత్రంలో దానం చేస్తే ముక్తి. ఈ మూడింటి ఫలము పొందాలంటే పుష్కర సమయంలో పవిత్ర కృష్ణానదిలో స్నానం చేస్తే ఫలితం లభిస్తుందని వేదం చెపుతోంది.

పుష్కరాల సమయంలో నదికి వెళ్ళి స్నానం చేయాలనుకొనేవారు, ముందురోజు సంప్రదాయబద్ధంగా అభ్యంగన స్నానం చేసి, దేవతారాధన గావించి, నివేదనలు సమర్పించి, కృష్ణానది పుష్కర తీర్థయాత్ర జయప్రదంగా జరగాలని ప్రార్థించి, హారతిని ఇచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలి. కుటుంబసభ్యులందరూ ఒకపూట మాత్రమే భోజనం చేసి, రెండవపూట కేవలం పాలను మాత్రమే తీసుకొని నది దగ్గరకు బయలుదేరాలి.

కృష్ణా పుష్కరాల సందర్భంగా సమంత్రకంగా సంకల్పపూర్వకంగా స్నానాలు, జపాలు, దానాలు, పూజలు, పిండప్రదానాలు చేస్తుంటారు. పురోహితుల సహాయంతో పుష్కరాల సమయంలో చేయవలసిన కార్యక్రమాలు చేయటం వలన సర్వశుభాలు పొందుతారు. అయితే ఎక్కువమందికి పురోహితులతో ఈ పుష్కర విధులు చేయించుకొనే అవకాశం, ఆర్థిక, శక్తి ఉండకపోవచ్చును. ఇటువంటి వారు నిర్మలమైన భక్తి ప్రపత్తులతో నిండు హృదయంతో కృష్ణానదిలో పుణ్యస్నానం ఆచరించి, స్నాన, దాన, పిండప్రదాన, పుష్కరవ్రత, కృష్ణవేణి మాత పూజ అనుగ్రహం మరియు వివిధ దేవతల అనుగ్రహం కోసం, పుష్కరుడు, బృహస్పతుల చల్లని ఆశీస్సుల కోసం 3 సార్లు నదీ జలాలను దోసిలితో తీసుకుని "క్షమించమని ప్రార్థించి" ఆ జలాలను కృష్ణానదిలోకి వదలాలి. తర్వాత బ్రాహ్మణోత్తముల ఆశీర్వాదం తీసుకొని ఆలయాలకు వెళ్ళి భగవద్దర్శనం చేసుకొని, తృప్తిగా కృష్ణవేణి తల్లికి మరొకసారి నమస్కరించి తమ ఇళ్ళకు చేరుకోవాలి.

వివిధ కారణాల చేత చాలామందికి ఈ పుష్కరకాలంలో స్నానం చేసే అవకాశం లేక అసంతృప్తితో బాధతో ఉంటారు. ఇటువంటివారు తమకు తెలిసినవారిచేత కృష్ణానది జలాలను తెప్పించుకొని, పుష్కరాలు జరుగుతున్న సమయంలో ఆ జలాలను తలపై జల్లుకోవడం, లేదా స్నానం చేసే నీళ్ళల్లో కలుపుకొని స్నానం చేయటం కూడా పుణ్యప్రదమే. తరువాత కృష్ణాపుష్కారాల మహత్యం తెలియజేసే గ్రంథాన్ని చదువుకోవటం వలన పుణ్యం లభిస్తుంది.

బ్రహ్మదేవుడు శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో నక్షత్రాలను, గ్రహాలను, నదులను, సాగరాలను, పర్వతాలను సృష్టించాడు. మానవులకు ఇంద్రియసుఖాన్ని కలిగించాడు.

వివేకాన్ని ప్రసాదించాడు. ధర్మాధర్మాలను, కర్మలను తెలుసుకొని ఆచరించే శక్తిని ప్రసాదించాడు. కనుక ఆధ్యాత్మిక ప్రవృత్తితో మనం ప్రకృతిని ఆరాధిస్తూ, ఇంద్రియ నిగ్రహంతో కర్మలను ఆచరిస్తూ జీవితాన్ని గడపాలి. భూమియందు జీవించే సమస్త ప్రాణులకు జీవనాధారము గాలి తర్వాత జలము. సర్వప్రాణికోటి జీవన పరిణామ దశలన్నిటికి జలమే మూలము. మానవ నాగరికతలన్నీ ఎక్కువగా నదులు ప్రవహించే ప్రాంతాలలోనే వర్ధిల్లాయి. నదీ సంస్కృతి ఎంతో విశిష్టమైనది. కొన్ని పురాణ కథల ప్రకారం దేవతలు పరస్పర శాపాల వలన సర్వప్రాణి కోటిని రక్షించుటకు భూమిమీద నదులుగా ప్రవహిస్తున్నారని తెలుస్తుంది.

మానవ సంస్కారాలన్నీ అగ్ని–జలములతో కూడుకొని ఉండటం మనం గమనించవచ్చును. జలప్రపూర్ణములైన నదులు మానవాళికి భుక్తి, భక్తి, ముక్తిదాయకాలు. ఈ నదీతీరములలో దివ్యక్షేత్రాలు నెలకొనటం వలన యజ్ఞయాగాదులు జరగటం వలన, మహర్షుల ఆశ్రమాలు ఉండటం వలన పావనములై తీర్థములై ఆయా ప్రదేశాలు గొప్ప పుణ్యతీర్థక్షేత్రాలుగా విరాజిల్లుచున్నాయి.

పుష్కర వ్రత మహిమ

పూర్వకాలంలో సౌవీరదేశాన్ని ధర్మబద్ధంగా, ప్రజానురంజకంగా సుమతి అనే రాజు పాలించేవాడు. అయితే ఆయనకు సంతానం లేకపోవటం అనేది ఒకేఒక్క చింత. తరువాత ఆస్థాన పురోహితుల సూచన మేరకు నియమనిష్ఠలతో యజ్ఞయాగాదులు నిర్వహించి, పరమేశ్వరుని గూర్చి గొప్ప తపస్సు చేశాడు. పరమేశ్వరుని అనుగ్రహంతో సుమతికి పుత్రసంతానం కలిగింది. అతనికి చిత్రరథుడు అనే పేరుపెట్టి సమస్త విద్యలు నేర్పి, గొప్పవాడిగా తీర్చిదిద్దాడు. కుమారుని యొక్క అభివృద్ధిని చూచి సుమతి ఎంతో ఆనందపడ్డాడు. ఒకసారి కృత్స్నమదుడు అనే మునీశ్వరుడు కృష్ణవేణి నది పుష్కరాల సందర్భంగా సంప్రదాయబద్ధంగా కర్మలన్నీ నిర్వహించాలని దానికి కావలసిన ధనాన్ని అడగటానికి రాజు అయిన సుమతి దగ్గరకు వచ్చాడు. రాజు మహర్షిని సాదరంగా ఆహ్వానించి, సముచితరీతిలో పూజించి వినయంతో తన కుమారుని భవిష్యత్తు గూర్చి చెప్పమని అడిగాడు. మహాత్ముడైన ఋషీశ్వరుడు మందహాసం చేస్తూ దివ్యదృష్టితో చిత్రరథుని పూర్వజన్మ వృత్తాంతాన్ని గ్రహించి ఈ విధంగా చెప్పాడు.

"రాజా! పూర్వం చోళదేశంలో సుధర్ముడు అనే బ్రాహ్మణోత్తముడు వేదవేదాంగాలు అధ్యయనం చేసి గృహస్థధర్మాన్ని అనుసరిస్తూ జీవనం గడపసాగాడు. శ్రీ మహా విష్ణువును నిరంతరం అర్చించే పుణ్యం వలన ఆ పండితునికి ఒక పుత్రుడు జన్మించాడు. అతనికి సుశర్మ అని నామకరణం చేసి సంప్రదాయ విహితమైన అన్ని విద్యలు అతనికి ఉపదేశించి, యుక్త వయస్సులో వివాహాన్ని కూడా చేసి తాను వానప్రస్థ దీక్ష వహించి అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేస్తూ సద్గతిని పొందాడు. సుశర్మ తల్లిని ఆప్యాయంగా చూస్తూ సంసార యాత్రను కొనసాగిస్తున్నాడు. కాని కాలం ఒకరీతిగా ఉండదు కదా! కొంతకాలానికి అత్తాకోడళ్ళు మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. అది చిలికిచిలికి గాలివాన అయింది. సంసారంలో కలతలు పెరిగి చివరకు భార్యమాటలకు తలవంచి, తల్లిని ఇంటినుండి బయటకు పంపాడు సుశర్మ. ఈవిధంగా జరిగిన కొంతకాలానికే అకాలమృత్యువు వాతపడి తనువు చాలించాడు సుశర్మ. అయితే పూర్వజన్మలోని దైవభక్తి కలిగి ఉండటం చేత ఆ పుణ్యఫలం వలన ఈ జన్మలో నీకు పుత్రునిగా జన్మించాడు. అయితే మాతృమూర్తి విషయంలో తప్పు చేశాడు కాబట్టి, ఆ తల్లి దుః ఖానికి కారణభూతుడైనాడు కనుక అల్పాయుష్కుడు అయినాడు. నీ కుమారుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడు కాడు. మరికొంతకాలానికి మరణిస్తాడు నీ కుమారుడు అని కృత్స్నమదుడు చెప్పాడు. సుమతి ఎంతో విలపించి ఆపదగట్టెక్కే మార్గాన్ని అనుగ్రహించమని మునిని అనేక విధాల ప్రార్థించాడు. అప్పుడు ఆ మహర్షి రాజుతో దీనికి ఒకటే మార్గమున్నది. కృష్ణవేణి పుష్కరాలు త్వరలో ప్రారంభమవుతాయి. నీవు, నీ కుమారునితో కలసి 12 రోజులపాటు పుష్కరవ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే నీ కుమారుడు దీర్ఘాయువు కలిగి ఉంటాడని తెలియజేశాడు. ఆ మాటలు విన్న రాజు సంతసించి, మహర్షికి కావలసిన ధనాన్ని ఇచ్చి తనతో పాటు ఆయనను కూడా తీసుకొని కృష్ణా పుష్కరాలకు బయలుదేరాడు.

కృష్ణా పుష్కరాలు జరిగిన 12 రోజులు కృష్ణానదిలో స్నానాలు చేసి, పుష్కర వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించి, 12 రోజులలో చేయవలసిన దానాలు యథావిధిగా ఆచరించి తన కుమారునితో కలిసి తిరిగి తన రాజ్యానికి వచ్చాడు. కృష్ణా పుష్కర వ్రత ప్రభావం వలన చిత్రరథుడు మధ్యంతర మరణం నుండి విముక్తి పొంది, సుదీర్ఘకాలం పాటు సౌవీరదేశాన్ని పరిపాలించి చివరకు ముక్తిని పొందాడు. మనందరం కూడా పుష్కరవ్రతం వలన దుఃఖాలను, కష్టాలను, వ్యాధులను, పాపాలను పోగొట్టుకొని సుఖజీవనం సాగించవచ్చును. ఇదియే పుష్కర వ్రత మహిమ.

పుష్కర శ్రాద్ధ కథ

ఒకనాడు శౌనకాది మహామునులు సూతుని వద్దకు పోయి మహర్షి కృష్ణా పుష్కర కాలమున పిండ ప్రదాన మాహాత్మ్యమును మాకు వివరింపవలెనని కోరగా అంతట సూతుడు ఆనాడు నారదునకు బ్రహ్మ చెప్పిన వృత్తాంతమును మీకు చెప్పెదను. సావధానువులై వినండని ఈవిధంగా చెప్పసాగాడు.

పూర్వం మాళవదేశంలో గోవిందశర్మ అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి గుణవతి రూపవతి యగు లక్ష్మీదేవమ్మ అనే భార్య, శివశర్మ అనే కుమారుడు ఉండేవారు. అతడు వేదవేదాంగాలు అభ్యసించాడు. 'అహమేవ పండితః" అనే భావనతో ఇంకా అనేక శాస్త్రాలు చదివి చివరకు ఏ విద్యమీద, ఏ సంప్రదాయం మీద విశ్వాసం లేక నాస్తికుడై వేదానికి వ్యతిరేకమైన కర్మలు చేయిస్తూ, సత్కర్మభ్రష్టుడై, తాను చెప్పిందే వేదం! తాను చేసేదే ఆచారం! అనే స్థాయికి చేరుకొని లెక్కకు మించిన ధనాన్ని సంపాదించాడు. ప్రజలు మాత్రం అతనిని మహాపండితునిగా భ్రమించేవారు. సంసారం పట్ల అశ్రద్ధ వహించి ముఖ్యంగా ధనసంపాదననే ధ్యేయంగా జీవనం సాగించేవాడు. ఒకసారి ప్రక్క ఊరికి పోతూ, అడవిదారిలో ప్రయాణం చేస్తూ అనుకోని విధంగా పులిచేత చంపబడ్డాడు.

గోవిందశర్మకు శివశర్మ అనే పుత్రుడు ఉన్నాడు. తండ్రిని మించిన తనయుడుగా గుర్తింపు పొందిన పరమదుర్మార్గుడు. తండ్రి సంపాదించిన ధనంతో ఏ పనీపాటా చేయక విలాస జీవితం గడిపేవాడు. తల్లి ఎంత చెప్పినా ఆమె మాట పెడచెవినపెట్టి తాను చేయాలనుకున్నది చేసేవాడు. తల్లి కుమారుని అకృత్యాలను చూచి తల్లడిల్లిపోయేది. సద్బుద్ధిని ప్రసాదించమని నిత్యము పరమేశ్వరుడిని ప్రార్థించేది. ఆమె ప్రార్థనలు ఫలించేకాలం సమీపించింది. కృష్ణా నదికి పుష్కరాలు వచ్చాయి. ఈ పుష్కరాలకు వచ్చే వేశ్యలతో విహరించి ఆనందించాలని భావించి శివశర్మ కృష్ణా పుష్కరాలకు బయలుదేరాడు. తల్లికూడా వస్తానన్నది. ఏ ఆలోచనలో ఉన్నాడో ఏమోకాని సరే నన్నాడు. ఆవిధంగా తల్లి కుమారుడు కృష్ణా పుష్కరాలకు బయలుదేరారు. శివశర్మ కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించే భక్తులను చూసి హేళన చేయసాగాడు. అతని శ్రద్ధ శృంగారం మీదనే తప్ప ఆధ్యాత్మికంపైన లేదు. తల్లి ఎంత చెప్పినా వినిపించుకోలేదు. పుత్రుని దుష్ప్రవర్తన చూచి తల్లి ఎంతో బాధపడేది.

ఇట్లుండగా పరమసాధ్వియగు అతని తల్లి లక్ష్మీదేవమ్మ తన కుమారునిచే ఈ పుష్కరతీర్థమున ఒక్కసారైనను స్నానమాచరించి తన భర్తకు పిండ శ్రాద్ధం చేయించ వలెననే సంకల్పంతో పరిపరి విధాల బోధించినది. నాయనా ఈ పుష్కరకాలమున పిండప్రదానము ఆచరించిన పితృదేవతలు ముక్తులయ్యెదరని పెద్దలు చెప్పుదురు. అందువలన నీ తండ్రి దుర్మరణము పొందాడు. తల్లిదండ్రులు పుత్రులు కావలయునని కోరుట కర్మలాచరించి తరింపచేయుదురని కదా? కావున నీవు ఈనాడు తీర్థశ్రాద్ధము ఆచ రించాలి అని అనేకసార్లు చెప్పింది. చివరకు తల్లి మాటలు త్రోసిపుచ్చలేక మంత్ర ములు చెప్పి ఆలస్యము చేస్తే నేను చెయ్యను అని ఖచ్చితంగా చెప్పాడు. తల్లి అంగీ కరించినది. అంతట శివశర్మ ఆ పుష్కరతీర్థమున కాకి మునిగినట్లు మునిగి శ్రద్ధా రహితుడై పురోహితుడు చెప్పినట్లుగా పిండప్రదానము చేసాడు.

నరకలోకంలో భయంకరమైన శిక్షలు అనుభవిస్తున్న గోవిందశర్మ శ్రాద్ధపుణ్యకర్మ ఫలంవలన ఆనాటినుండి స్వర్గభోగాలు అనుభవించసాగాడు. కృష్ణానదిలో పుష్కర సమయంలో స్నానం చేయడంవలన, దానాలు చేయడం వలన, అశ్రద్ధగానైనా పుష్కర శ్రాద్ధం చేయటం వలన పితృదేవతల అనుగ్రహం శివవర్మ మీద ప్రసరించింది. ఆవిధంగా క్రమక్రమంగా అతని మనస్సు కూడా మార్పుచెందింది. తాను గడిపిన గత జీవితాన్ని తలచుకొని తనను తానే నిందించుకొన్నాడు. ప్రాయశ్చిత్తంగా తన వద్ద ఉన్న ధనాన్ని దానం చేసి, నిరాడంబరంగా ఉంటూ పౌరోహిత్యం చేస్తూ ప్రజలందరికీ సదాచారాన్ని నేర్పి వారిచేత పుణ్యకర్మలు చేయిస్తూ క్రమం తప్పకుండా కృష్ణా పుష్కరాలలో పుష్కర శ్రాద్ధం చేస్తూ ఎంతో ఆనందంగా జీవించాడు. ఆవిధంగా మరణానంతరం సద్గతులు పొందాడు.

కావున ఈ పుష్కరకాలమున పితృ దేవతలకు చేసే పిండ ప్రదానాలు విశేష ఫలము నిచ్చును. ఏమియు చేయలేని అశక్తుడు శివకేశవులను భక్తితో తమశక్తి కొలది పూజించినను విశేషఫలములు పొందెదరు. **ఇట్టి కథను చదివినను, విన్నను దుష్ఫలితాలు తొలగి స్వర్గసుఖాలు అనుభవింతురని, సూతుడు శౌనకాది మహా మునులకు చెప్పాడు.**

శ్రీ కృష్ణా పుష్కర వ్రతము పూజా విధానము

కృష్ణా పుష్కర వ్రతమునకు కావలసిన పూజా ద్రవ్యములు

పసుపు, కుంకుమ, మంచిగంధం, పుష్పములు, కొబ్బరికాయలు, కొబ్బరిబోండాలు-2, అరటిపండ్లు, తమలపాకులు, పోకచెక్కలు, అగరువత్తులు, హారతి కర్పూరం, టవలు, అంగవస్త్రం, క్రొత్తచీర, జాకెట్టు ముక్కలు-2, పసుపుకొమ్ములు, ఖర్జూరపండ్లు, దీపారాధనకు వత్తులు, నూనె, అగ్గిపెట్టె, ఉద్ధరిణి, పంచపాత్ర, పళ్ళెములు-2, బియ్యం, బెల్లం, ఎండుద్రాక్ష, విస్తరాకులు, చిల్లరపైసలు, మామిడికొమ్మలు, కృష్ణవేణి మాత ప్రతిమ, గురుగ్రహ ప్రతిమ.

మీ శక్తి కొలది దానం చేయుటకు ఇతర వస్తువులు

స్వయం పాకమునకు కావలసినవి : పప్పులు, **కూరగాయలు, బియ్యం, వగైరా.**
తర్పణమునకు కావలసినవి : నువ్వులు, బెల్లం, పిండి, అరటిదున్న, దర్భలు, శిల
పుష్కరవ్రతం చేయు వారు ముందుగా నది స్నానం మంత్రపూర్వకంగా చేయవలెను.

స్నానసంకల్పం

అస్యాంమహానద్యాం సమస్తపాపక్షయార్థం, కన్యాగతే దేవగురౌ, సార్ధ త్రికోటి తీర్థసహిత, తీర్థరాజ సమాగమాఖ్య మహాపర్వణి పుణ్యకాలే కృష్ణానదీ స్నానమహం కరిష్యే ॥ శరీర శుద్ధ్యర్థం అఘమర్షణ స్నానమహం కరిష్యే.
అని ముక్కు మూసుకుని 3 సార్లు మునగాలి.

అర్ఘ్య మంత్రములు

శ్లో॥ బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవనమస్కృత ।
గృహాణార్ఘ్యం మయాదత్తం కన్యాస్థో భార్యయాసహ ॥
తారాదేవి సహిత బృహస్పతియే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.



శ్లో॥ సహ్యాద్రి శిఖరోద్భూతే సర్వకామప్రదాయిని ।
కృష్ణవేణి శుభేగంగే గృహాణార్ఘ్యం నమోస్తుతే ॥
కృష్ణవేణ్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.



శ్లో॥ పుష్కరాక్ష జగన్నాథ లక్ష్మ్యా సహజనార్దన ।

అర్ఘ్యంగృహాణ కృష్ణాయాంకన్యా యుక్తే బృహస్పతౌ ॥

లక్ష్మీదేవి సహిత విష్ణవే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ పద్మాసన జగన్నాథ త్రైలోక్యధ్వాంతనాశన ।

గృహాణార్ఘ్యం మయాదత్తం కన్యాయుక్తే బృహస్పతౌ ॥

ఉషాచ్ఛాయా పద్మినీ సహిత ఆదిత్యాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ అష్టమూర్తే మహేశాన గంగాధర కృపానిధే ।

గౌర్యాసహ గృహాణార్ఘ్యం కన్యాయుక్తే బృహస్పతౌ ॥

గౌరీదేవి సహిత మహేశ్వరాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.



శ్లో॥ చతుర్ముఖ జగత్స్రష్ట సత్యలోకరతావ్యయ ।

సరస్వత్యాచ సహితం గృహాణార్ఘ్యం నమోస్తుతే ॥

సరస్వతీదేవి సహిత బ్రహ్మయే నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ తీర్థరాజమహాభాగ పుష్కరాఘ వినాశన ।

గృహాణార్ఘ్యం మయాదత్తం సర్వతీర్థాదినాయక ॥

సార్థత్రికోటి తీర్థ సహిత పుష్కర రాజాయ నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ ఇంద్రాద్యావసవోరుద్రా స్సాధ్యా విశ్వే తథాశ్వినౌ ।

సామగాశ్చ సురాస్సర్వే గృహ్ణంత్వర్ఘ్యం మయార్పితం ॥



ఇంద్రాది సర్వదేవేభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ మునయో వాలఖిల్యాద్యాస్సప్త చైవమహర్షయః ।

కన్యాస్థితే గురౌసర్వే గృహ్ణంత్వర్ఘ్యం మయార్పితం ॥

వాలఖిల్యాది సప్తర్షిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.



శ్లో॥ అగ్నిష్వాత్తా బర్హిషదోఽ నగ్నయ స్సాగ్నయస్తథా ।

ఆజ్యపాః పితరస్త్వర్ఘ్యం గృహ్ణంత్వపిచసోమపాః ॥

అగ్నిష్వాత్తాది పితృభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ సనకాద్యాస్తథా సిద్ధాకపిలాద్యామహౌ జసః ।

సంగృహ్ణంతు మయాదత్తం అర్ఘ్యం కన్యాస్థితే ॥

గురౌ సనకాది మహర్షిభ్యో నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ కృష్ణవేణి మహాగంగే సర్వపాప విమోచని ।

భక్త్యా దత్తం మయాదేవి గృహాణార్ఘ్యం నమోస్తుతే ॥

కృష్ణవేణ్యై నమః ఇదమర్ఘ్యం సమర్పయామి.

కృష్ణవేణి పుష్కర వ్రతం

కృష్ణానదిలో స్నానం చేసిన తరువాత ఇంటి దగ్గర మీ పూజా మందిరంలో కృష్ణవేణి పుష్కరవ్రతమునకు కావలసిన సామాగ్రి సిద్ధం చేసుకోవాలి. నూతనవస్త్రంతో మండపాన్ని ఏర్పాటు చేసుకొని దానిపై బియ్యంపోసి అందులో తమలపాకు ఉంచి దానిపై కృష్ణవేణి ప్రతిమను పసుపు కుంకుమలతో అలంకరించి ఉంచాలి.

హరిః ఓం, శ్రీమహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః అని ఈ క్రింది మంత్రములు చదువుతూ దీపారాధన చేయాలి.

ఓం ఉద్దేప్య స్వజాత వేదోపఘ్నం నిరృతింమమ ।
పశూగ్శ్చ మహ్యా మావహా జీవనంచ దిశోదశ ॥ అని చెప్పి దీపమును వెలిగించవలెను.
భోదీప! బ్రహ్మరూపేణ సర్వేషాం హృది సంస్థిత ।
అతస్త్వాం స్థాపయామ్యద్య మదజ్ఞాన మపాకురు ॥ అని దీపమునకు నమస్కారము చేయవలెను.
ఓం అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపివా ।
యః స్మరేత్ పుండరీకాక్షం స బాహ్యా భ్యంతరః శుచిః ॥

పై మంత్రమును చెప్పుచూ మూడుసార్లు జలమును శిరస్సుపైన, తన చుట్టూ చల్లుకోవలెను.

ఓం దేవీం వాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపాః పశవోవదంతి।
సానో మంద్రేష మూర్జందుహానా ధేనుర్వాగస్మా నుపసుష్టుతైతు ॥



ఆయం ముహూర్తః సుముహూర్తో అస్తు.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే ॥
తదేవలగ్నం సుదినం తదేవ తారాబలం చంద్రబలం తదేవ ।
విద్యాబలం దైవబలం తదేవ లక్ష్మీపతే తేంఘ్రియుగం స్మరామి ॥
యత్ర యోగోశ్వరః .... శరణ్యే త్ర్యంబకే దేవి నారాయణి నమోస్తుతే ॥

ఓం శ్రీ లక్ష్మి నారాయణాభ్యాం నమః ఓం శ్రీ ఉమామహేశ్వరాభ్యాం నమః ఓం శ్రీ వాణీ హిరణ్యగర్భాభ్యాం నమః ఓం శచీపురందరాభ్యాం నమః ఓం అరుంధతీ వసిష్ఠాభ్యాం నమః ఓం ఇంద్రాద్యష్ట దిక్పాలక దేవతాభ్యో నమః ఓం శ్రీ ఆదిత్యాది నవగ్రహ దేవతాభ్యో నమః ఓం శ్రీ గురుభ్యో నమః ఓం శ్రీ సర్వేభ్యో మహాజనేభ్యో నమః

ఆచమనం

ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయ స్వాహా, ఓం గోవిందాయ నమః, ఓం విష్ణవే నమః, ఓం మధుసూదనాయ నమః, ఓం త్రివిక్రమాయ నమః, ఓం వామనాయ నమః, ఓం శ్రీధరాయ నమః, ఓం హృషీకేశాయ నమః, ఓం పద్మనాభాయ నమః, ఓం దామోదరాయ నమః, ఓం సంకర్షణాయ నమః, ఓం వాసుదేవాయ నమః, ఓం ప్రద్యుమ్నాయ నమః, ఓం అనిరుద్ధాయ నమః, ఓం పురుషోత్తమాయ నమః, ఓం అధోక్షజాయ నమః, ఓం నారసింహాయ నమః, ఓం అచ్యుతాయ నమః, ఓం జనార్ధనాయ నమః, ఓం ఉపేంద్రాయ నమః, ఓం హరయే నమః , శ్రీ కృష్ణాయ నమః

భూశుద్ధి *ఉత్తిష్ఠంతు భూత పిశాచాః యేతేభూమి భారకాః ।*
ఏ తేషా మవిరోధేన బ్రహ్మ కర్మ సమారభే ॥

ప్రాణాయామం ఓమ్ భూః । ఓమ్ భువః । ఓగ్ం సువః । ఓమ్ మహ । ఓమ్ జనః । ఓమ్ తపః । ఓగ్ం సత్యం । ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్ ॥ ఓమాపోజ్యోతీ రసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం ।


సంకల్పం

శ్రీ మహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రాహ్మణః ద్వితీయపరార్ధే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమ పాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్దక్షిణ దిగ్భాగే శ్రీశైలశ్య ఈశాన్యప్రదేశే అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన శ్రీ దుర్ముఖి నామ సంవత్సరే దక్షిణాయనే వర్షఋతౌ శ్రావణమాసే శుక్లపక్షే... తిథౌ... వాసరే, శుభనక్షత్రే, శుభయోగే, శుభకరణే, ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభతిథౌ, శ్రీమాన్.... గోత్ర... నామధేయః.... మమధర్మపత్నీసమేతస్య, ఇహపత్నీ, ఇహజన్మనీ, జన్మాంతరేషు, పాపానామపనోదరార్ధం, ఇష్టదేవతాప్రీత్యర్ధం, ఐశ్వర్యాభివృద్ధ్యర్ధం, ధర్మార్ధ కామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్ధం సర్వవిధ అభివృద్ధ్యర్ధం, అఖండచైతన్య సిద్ధ్యర్ధం, కన్యాగతేదేవగురౌసార్థత్రికోటి తీర్థసహిత కృష్ణానదీ పుష్కర సమాగమ మహాపుణ్యకాలే, కల్పోక్త ప్రకారేణ కృష్ణవేణి పూజాం కరిష్యే ॥ తదంగ కలశారాధనం, ప్రతిమాశోధనం కరిష్యే అని ముందుగా కలశపూజచేసి

అనంతరం కృష్ణవేణి మాత విగ్రహమునకు షోడశోపచారములతో పూజ చేయవలెను.

కలశారాధన


శ్లో॥ కలశస్య ముఖే విష్ణుః కంఠేరుద్రస్సమాశ్రితాః ।
మూలేతత్రస్థితోబ్రహ్మా మధ్యే మాతృగణా స్మృతాః ॥
కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరా ।
ఋగ్వేదోథ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః ॥



శ్లో॥ గంగేచ యమునే కృష్ణే గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేర్యా జలేస్మిన్ సన్నిధిం కురు

కలశములోని నీరును పుష్పముతోగాని, ఆకుతోగాని ఈ క్రింది మంత్రమును చదువుతూ దేవతలపైన పూజాద్రవ్యముల పైన తమపైన ప్రోక్షించుకోవలెను.

మంత్రం



శ్లో॥ అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపివా ।
యస్స్మరే త్పుండరీకాక్షం సబాహ్యాంభ్యతరశ్శుచిః ॥


తరువాత గణపతిపూజ చేయవలెను. (స్థలాభావం వలన గణపతి పూజ ఇవ్వలేదు)
కృష్ణవేణి మాత ప్రతిమకు ఈ క్రింది మంత్రములతో ప్రాణప్రతిష్ఠ చేయవలెను.

అసునీతే పునరస్మాసు చక్షుః పునః ప్రాణమిహనో దేహిభోగమ్ ।
జ్యోక్పశ్యేమ సూర్య ముచ్చరంత మనుమతే మృడయాన స్వస్తి ॥
అమృతంవై ప్రాణా అమృతమాపః ప్రాణానేథవయధాస్థాన ముపహ్వాయతే ॥
స్థిరోభవ, వరదోభవ ॥ సుప్రసన్నోభవ ॥ మమ అభిముఖోభవ స్థిరాసనం కురు...

అధ ప్రాణప్రతిష్ఠా ముహూర్తః సుముహూర్తో అస్తు.

కృష్ణవేణి మాత ప్రతిమను పంచామృతములతో అభిషేకించాలి.

పంచామృత స్నానం



పాలు : *ఓం అప్యాయస్వ సమేతుతే విశ్వతస్సోమ*
వృష్ణియం భవావాజస్య సంగథే – క్షీరేణ స్నపయామి.

పెరుగు : *ఓం దధిక్రావ్ణ్ణో అకారిషం జిష్ణోరశ్వస్య వాజినః*

సురభినో ముఖాకరత్ప్రాణ ఆయూగ్ం షి తారిషత్ – దధ్నా స్నపయామి.

నెయ్యి : ఓం శుక్రమసి జ్యోతిరసి తేజోసి దేవోవస్సవితోత్పునా
త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసోసూర్యస్య రశ్మిభిః – ఆజ్యేన స్నపయామి.


తేనె : ఓం మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః
మాధ్వీర్నఃసంత్వోషధీఃమధునక్తముతోషసి
మధు మత్పార్థివగ్ం రజః, మధుద్యౌరస్తునః పితా ॥
మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం అస్తుసూర్యః । మాధ్వీర్గావో భవంతునః ।
ఓం శ్రీ కృష్ణవేణి దేవ్యై నమః మధునా స్నపయామి.

పంచదార : ఓం స్వాదుఃపవస్వ దివ్యాయజన్మనే స్వాదురిం ద్రాయ సుహవీతునామ్నే
స్వాదుర్మిత్రాయ వరుణాయవాయవే బృహస్పతయే మధుమాగ్ం అదాభ్యః
ఓం శ్రీ కృష్ణవేణి దేవ్యై నమః శర్కరేణ స్నపయామి
ఓం శ్రీ కృష్ణవేణి దేవ్యై నమః పంచామృతస్నానం సమర్పయామి.

కృష్ణవేణి ధ్యానం



శ్లో॥ పద్మాస్యాం పద్మపత్రాక్షీం పద్మగర్భ స్వరూపిణీం
చింతయే త్పద్మచరణాం పద్మాసన నివాసినీం
చతుర్భుజాం చంద్రచూడాం వరదాంపద్మధారిణీం
త్రైలోక్యపావనీందేవీం దివ్యపుష్పోప శోభితాం
సుధా సంపూర్ణ సౌవర్ణకలశద్వయ ధారిణీం
క్షౌమయుగ్మ పరీధానాం రక్త కుంకుమ ధారిణీం
దివ్యకర్పూర గంధాఢ్యాం శ్వేత చందన చర్చితాం
లసన్మంజీర చరణాం క్వణత్కంకణ మండితాం
నానారత్నమయాం రమ్యాం లసన్మకుటధారిణీం
ముక్తా ప్రవాళ సంమ్మిశ్ర దివ్యహార విభూషితాం
దివ్యమందార సంభూత పుష్పాలంకృత విగ్రహాం
భక్తానుగ్రహ కామాయ ప్రాదుర్భూతాం సురేశ్వరీం
కమండలు ధరాందేవీ జపమాలాధరాంశుభాం
ఇంద్రనీల సమానాభాం ప్రసన్నాం పరమేశ్వరీం
త్ర్యక్షాం హంస సమారూఢాం మహాపుణ్యాంబు వాహినీం



చక్రం త్రిశూలం పరశు మక్షమాలాం చ బిభ్రతీం
దివ్యభూషణ సంయుక్తాం బ్రహ్మవిష్ణు శివాత్మికాం
సార్ధత్రికోటి తీర్థైశ్చ సంయుతాం సహ్యాజాంశుభాం
ధ్యాయామి తీర్థరాజేనయుతాం కృష్ణాపగాం సదా ॥



కృష్ణవేణ్యై నమః ధ్యాయామి ధ్యానం సమర్పయామి

ఆవాహనం అఘక్షయకరేదేవి చంద్రచూడ ప్రియేఽనఘే
నిజరూపం సమాధాయ సమాగచ్ఛాత్రశోభనే ॥ ఆవాహనం సమర్పయామి

ఆసనం అనంతదివ్య సంకాశ మానందాఖ్యం మహాసనం
అనేకరత్న ఖచితం ఆసనార్థం ప్రకల్పితం । ఆసనం సమర్పయామి

పాద్యం మహాదేవ జటాజూటస్థితే లోకప్రియే – నఘే
పాద్యం గృహాణ హేగంగే కృష్ణవేణి భయాపహే॥ పాద్యం సమర్పయామి.

అర్ఘ్యం కృష్ణవేణీ నమస్తుభ్యం సర్వపాపప్రణాశని
గృహాణార్ఘ్యం మయాదత్తం భక్తానాం ప్రియకారిణి॥ అర్ఘ్యం సమర్పయామి

ఆచమనం తదుద్భవం మహాపుణ్యమమృతం హ్యామృతోద్భవం
గృహాణాచమనం కృష్ణేకృపయాభక్తవత్సలే॥శుద్ధాచమనీయం సమర్పయామి

పంచామృత స్నానం క్షీరోదధి సముద్భూతం క్షీరం స్నానార్థముత్తమం
పంచామృతం సమానీతం స్వీకురుష్వ నమోస్తుతే ॥ పంచామృతస్నానం సమర్పయామి

శుద్ధోదక స్నానం సహస్ర శిరసే దేవి పవిత్రం విమలంజలం
స్నానార్థం యాత్సమానీతం కృష్ణవేణీ నమోస్తుతే॥ శుద్ధోదకస్నానం సమర్పయామి

వస్త్రం లసత్క్షౌమ యుతం దేవి గుణాతీతే – ను కంపయా
మయోపనీతం సుభగే గృహాణ పరమేశ్వరీ వస్త్రం సమర్పయామి.

కంఠసూత్రం ససూత్రం గ్రథితం దివ్యం పవిత్రం పరమం శుభం ।
గృహాణ కంఠభూషార్థం కృష్ణే సాగరగామిని ॥ కంఠసూత్రం సమర్పయామి.

గంధం కర్పూరాగరు కస్తూరీ తక్కోలాఢ్యం మనోహరం

గంధం గృహాణ దేవిత్వం కృష్ణవేణి నమోస్తుతే ॥ దివ్యశ్రీచందనం సమర్పయామి

అక్షతాన్ అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీన్ తండుల నిర్మితాన్
గృహాణవరదే దేవి కృష్ణవేణి నమోస్తుతే ॥ అక్షతాన్ సమర్పయామి

కుంకుమ హరిద్రా కుంకుమంచైవ సింధూరం కజ్జలాదికం
నీలలోహిత తాటంకే గృహాణ పరమేశ్వరి ॥ కుంకుమం సమర్పయామి

మల్లికాశోక పున్నాగ చంపకాచోత్పలాని చ
కృష్ణేమయోపనీతాని పుష్పాణి ప్రతిగృహ్యతాం ॥ పుష్పాణిపూజయామి

అధాంగపూజ



ఓం సాగర గామిన్యై నమః - పాదౌ పూజయామి
ఓం సహ్యాద్రి జాయై నమః - జానునీ పూజయామి
ఓం విమలజంఘాయై నమః - జంఘే పూజయామి
ఓం కామ దాయిన్యై నమః - ఊరూ పూజయామి
ఓం గుహ్యాయై నమః - గుహ్యం పూజయామి
ఓం మిధ్యాదృష్ట్యాం మధ్యభాగాయై నమః - మధ్యమం పూజయామి



ఓం భక్తవరదాయై నమః - హస్తౌ పూజయామి
ఓం గంభీరాయై నమః - నాభిం పూజయామి
ఓం సాగరోన్ముఖాయై నమః - హృదయం పూజయామి
ఓం తుంగభద్రానదీ గర్భస్థాయై నమః - ఉదరం పూజయామి
ఓం త్రినేత్రాయై నమః - నేత్రాణి పూజయామి
ఓం సంతోషపూరిత వదనాబ్జాయై నమః - వదనం పూజయామి
ఓం సుదంతాయై నమః - దంతాన్ పూజయామి
ఓం సునాసాయై నమః - నాసికాం పూజయామి



ఓం బింబోష్ఠ్యై నమః - ఓష్ఠౌ పూజయామి
ఓం గంభీరకంఠాయై నమః - కంఠం పూజయామి
ఓం అర్థ చంద్రాకారాయై నమః - ఫాలం పూజయామి
ఓం కరుణా పూరితాపాంగాయై నమః - అపాంగాని పూజయామి
ఓం సుకేశాయై నమః - కేశాన్ పూజయామి
ఓం షష్టధికశతత్రయ తీర్థాత్మికాయై నమః - శిరః పూజయామి
ఓం కృష్ణవేణ్యై నమః - సర్వాణ్యంగాని పూజయా

శ్రీ కృష్ణవేణి మాత అష్టోత్తర శతనామావళి

ఓం శ్రీ సహ్యాద్రిశిఖరోత్పన్నాయై నమః
ఓం శ్రీ మహాదేవ్యై నమః
ఓం శ్రీకర్యై నమః
ఓం శ్రీపరిగ్రహాయై నమః
ఓం శ్రీ కృష్ణాయై నమః
ఓం శ్రీ భవాన్యై నమః
ఓం శ్రీమాత్రే నమః
ఓం శ్రీ జయాన్వితాయై నమః
ఓం శ్రీ శాంకర్యై నమః
ఓం శ్రీ శివాయై నమః
ఓం శ్రీ శివాన్యై నమః
ఓం శ్రీ దురంధరాయై నమః
ఓం శ్రీ దుర్గాయై నమః
ఓం శ్రీ సదాంభోజాయై నమః
ఓం శ్రీ మత్త్రిపుర సుందర్యై నమః
ఓం శ్రీకాళ్యై నమః
ఓం శ్రీపదాయై నమః
ఓం శ్రీ మదిందిరాయై నమః
ఓం శ్రీ చక్రధారిణ్యై నమః
ఓం శ్రీ మద్బాలాయై నమః
ఓం శ్రీ పరమేశ్వర్యై నమః
ఓం శ్రీ చక్రరాజనీలయాయై నమః
ఓం శ్రీ వర్ణాయై నమః
ఓం శ్రీ పతివ్రతాయై నమః
ఓం శ్రీ మదనంత ఫలదాయిన్యై నమః
ఓం శ్రీ బీజాయై నమః
ఓం శ్రీ కరావర్తాయై నమః
ఓం శ్రీ జయాయై నమః
ఓం శ్రీ విరాజితాయై నమః
ఓం శ్రీ మూలాయై నమః
ఓం శ్రీ మద్భ్రూమధ్యమాయై నమః

ఓం శ్రీ వసుంధరాయై నమః
ఓం శ్రీ తోయాయై నమః
ఓం శ్రీ ముఖాయై నమః
ఓం శ్రీ నికేతనాయై నమః
ఓం శ్రీ విలాసిన్యై నమః
ఓం భ్రూయుగాయై నమః
ఓం శ్రీ మదంబాయై నమః
ఓం సింహాసన సంస్థితాయై నమః
ఓం శ్రీ జంఘాయై నమః
ఓం శ్రీ శ్రీ భగాయై నమః
ఓం శ్రీమత్కటి చక్ర విరాజితాయై నమః
ఓం శ్రీ మధ్యమాయై నమః
ఓం విశాలాక్ష్యై నమః
ఓం విద్యాయై నమః
ఓం వరాయై నమః
ఓం శ్రియై నమః
ఓం శ్రీ మానిన్యై నమః
ఓం శ్రీ కరాబ్జాయై నమః
ఓం శ్రీ మత్సింహాసనేశ్వర్యై నమః
ఓం శ్రీ వక్షాయై నమః
ఓం శ్రీ పరిజ్ఞానాయై నమః
ఓం శ్రీ జటాయై నమః
ఓం స్మితాననాయై నమః
ఓం శ్రీ మదాగమ సంవేద్యాయై నమః
ఓం వేదాంత ప్రదీపితాయై నమః
ఓం శివజటాజూట నివాసాయై నమః
ఓం భద్రాసన మధ్యస్థాయై నమః
ఓం వీణాగాన లోలుపాయై నమః
ఓం శ్రీ మచ్చిత్రాంబరధరాయై నమః
ఓం శ్రీ మత్కంచుక ధారిణ్యై నమః
ఓం శ్రీ మంత్రరాజ ఫలదాయై నమః

ఓం శ్రీ మద్గిరివరాత్మజాయై నమః
ఓం మదద్భుత చారిత్రాయై నమః
ఓం వత్సాంకిత వక్షస్యై నమః
ఓం శ్రీ మత్యై నమః
ఓం శ్రీ మదాపగాయై నమః
ఓం శ్రీ మదాంబికాయై నమః
ఓం శ్రీ గుణాయై నమః
ఓం శ్రీ మదనఘాయై నమః
ఓం శ్రీ మదలకాయై నమః
ఓం శ్రీ కుచద్వయాయై నమః
ఓం దంతాయై నమః
ఓం శ్రీకచాయై నమః
ఓం శ్రీ మత్కాంచన పుష్పాభినాసికాయై నమః
ఓం శ్రీ మనోహరాయై నమః
ఓం శ్రీ విగ్రహాయై నమః
ఓం విశేషాయై నమః
ఓం శ్రీ భావాయై నమః
ఓం శ్రీ ధరాత్మజాయై నమః
ఓం నారాయణ పాదాబ్జ మరందాయై నమః
ఓం శ్రీ కరార్చితాయై నమః
ఓం సప్తకులోద్ధారకాయై నమః
ఓం శ్రీ భూనీలాదిసంస్తుతాయై నమః
ఓం ఖేచర్యై నమః
ఓం మహానాసాయై నమః
ఓం నేత్రాయై నమః
ఓం మనోరథాయై నమః
ఓం శ్రీనామ్న్యై నమః
ఓం మహాదీప్తాయై నమః
ఓం శ్రీ బలాయై నమః
ఓం మహామతయే నమః
ఓం శ్రీ భూషణాయై నమః
ఓం శతాంగాయై నమః
ఓం దివ్యామృత వాహిన్యై నమః
ఓం ముని సతీబృంద
సేవితా మలపాదుకాయై నమః
ఓం శ్రీ సురబృందతరంగిణ్యై నమః
ఓం గోహత్యాపాపౌఘహరిణ్యై నమః
ఓం మహానద్యై నమః
ఓం స్త్రీగమనాపరాధహారిణ్యై నమః
ఓం శ్రీ మద్భూషణ భూషితాంగ్యైనమః
ఓం పండిత పూజితాయై నమః
ఓం హత్యాఘ నివారిణ్యై నమః
ఓం అశ్వత్థవృక్ష మూలజాయై నమః
ఓం షష్ట్యధిక శతత్రయ తీర్థ
సహిత సాగరగామిన్యై నమః
ఓం శ్రీ శైలోత్సంగవాసిన్యై నమః
ఓం వశిష్ఠాది మునిస్తవనీయాయైనమః
ఓం శ్రీ కృష్ణవేణ్యై నమః

శ్రీ కృష్ణవేణీ అష్టోత్తర శతనామావళి సమాప్తః

ధూపం *సుగంధితు రసీభూతం గంధ ద్రవ్యవిశేషితం ।*
ఆఘ్రేయ ధూపకం కృష్ణేకృపయా ప్రతిగృహ్యతాం॥ ధూపం సమర్పయామి.

దీపం *అతివర్ణోజ్వలం దీపం అజ్ఞానాంధ వినాశనం ।*
కృష్ణవేణి మహాగంగేగృహాణ సురవందితే ॥ దీపం దర్శయామి

ధూప దీపానంతర మాచమనీయం సమర్పయామి.

నైవేద్యం అన్నం చతుర్విధందేవి రసైష్షడ్భి స్సమన్వితం ।
నిత్యతృప్తికరం కృష్ణే గృహాణసుర వందితే ॥ నైవేద్యం సమర్పయామి

తాంబూలం నాగవల్లీ దళైర్యుక్తం ముక్తాచూర్ణ సమన్వితం ।
కర్పూర భావితం కృష్ణే తాంబూలం ప్రతిగృహ్యతాం ॥ తాంబూలం సమర్పయామి.

నీరాజనం అత్యుజ్జ్వలం మహాదేవి అజ్ఞానాది వినాశనం ।
నీరాజనం కృష్ణవేణి గృహాణ సరితాంవరే ॥ నీరాజనం సమర్పయామి

మంత్రపుష్పం సహ్యాద్రి శిఖరో ద్భూతే త్రికంటక విరాజితే ।
గృహాణ ప్రార్థితే కృష్ణే మంత్ర పుష్పాంజలిం సదా ॥ మంత్రపుష్పం సమర్పయామి

నమస్కారాన్ మందాకిని నమస్తుభ్యం నమస్తే సురపూజితే ।
కృష్ణవేణి నమస్తుభ్యం సరిదంశే నమోస్తుతే॥ నమస్కారాన్ సమర్పయామి

ప్రదక్షిణ ప్రదక్షిణం కరోమ్యద్య సర్వపాప వినాశని ।
సర్వపాప హరేదేవి కృష్ణవేణి నమోస్తుతే ॥ ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి

నివేదన మహాఫలం సమానీతం గృహాణ సురపూజితే ।
మనోభీష్టప్రదేదేవి దేవ దేవస్యవల్లభే ॥ ఫలం నివేదయామి

అనయాధ్యానావాహనాది, షోడశోపచార పూజయాచ, భగవతీ సర్వాత్మికా శ్రీ కృష్ణవేణీ దేవతాసుప్రీతా సుప్రసన్నా వరదాభవతు – శ్రీ కృష్ణవేణీ ప్రసాదం శిరసా గృహ్ణామి ॥

శ్రీ బృహస్పతి పూజా ప్రారంభం

ఆచమనం ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయ స్వాహా, ఓం మాధవాయ స్వాహా, ఓం గోవిందాయ నమః .... హరయే శ్రీ కృష్ణాయ నమః

ప్రాణాయామం ఓమ్ భూః । ఓమ్ భువః । ఓగ్ం సువః । ఓమ్ మహ । ఓమ్ జనః । ఓమ్ తపః । ఓగ్ం సత్యం । ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్ ఓమాపోజ్యోతీరసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం ॥

సంకల్పం మమ ఉపాత్త దురితక్షయ ద్వారా యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే... నామధేయవత్యాః మమాచరిత వ్రతకల్పోక్త సంపూర్ణ సకలఫలావాప్త్యర్థం బృహస్పతి పూజాం కరిష్యే। తదంగ ప్రతిమాశోధనం కరిష్యే ॥

ముందుగా కృష్ణవేణి మాతను పూజించిన విధంగానే బృహస్పతి ప్రతిమను ప్రతిష్ఠించి పంచామృతాలతో శుద్ధి చేయవలెను.

బృహస్పతింసాంగం సాయుధం సహవానం నశక్తిపత్నీపుత్ర పరివార బృహస్పతి మావాహ యామి, స్థాపయామి పూజయామి । ప్రాణ ప్రతిష్ఠాపన ముహూర్త స్సుముహూర్తోస్తు స్థిరోభవ। వరదోభవ, సుప్రసన్నోభవ, ఇష్టకామ్యార్థ ఫలసిద్ధి దోభవ. తదంగ కలశారాధనం కరిష్యే।।

కలశారాధన



కలశస్య ముఖేవిష్ణుః కంఠేరుద్ర స్సమాశ్రితః
మూలేతత్రస్థితోబ్రహ్మా మధ్యే మాతృగణా స్మృతాః ॥
కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరా ।
ఋగ్వేదోథ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః
అంగైశ్చ సహితాస్సర్వే కలశాంబు సమాశ్రితాః ॥

గంగేచ యమునే కృష్ణే గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు

ధ్యానం





ఆగచ్ఛవిబుధాచార్య కన్యాస్థ సురపూజిత
తవపూజాం కరిష్యామి తారయా సహిత స్వచ
జీవనే జీవరూపోసికన్యాస్థోపి సురార్చిత,
తవపూజాం కరిష్యామి తారయా సహితస్వై
చతుర్భుజం దండహస్తం వరదాభయ పాణినం,
కన్యారాశి సమారూఢం గురుంధ్యాత్వా నమామ్యహం ॥

తారాదేవి సహిత శ్రీ బృహస్పతయే నమః ధ్యాయామి ధ్యానం సమర్పయామి

ఆవాహనం

ఆవాహయామి తారేశం గురుం పీతాంబరధరం
నానాలంకార రుచిరం నమామి సురవందితం
ఓం శ్రీ బృహస్పతయే నమః ఆవాహయామి

ఆసనం



బృహస్పతే సురాధ్యక్ష సర్వకల్మషనాశన ।
సింహాసనం రత్నమయం గృహాణ సురపూజిత ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః ఆసనం సమర్పయామి

పాద్యం

రక్తాంభోరుహ సారాధ్య నవీనాయతలోచన ।
గృహాణపాద్యమనఘ సురాణాంచ హితేరత ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః పాద్యం సమర్పయామి.

అర్ఘ్యం

సురాధ్యక్ష మహాబాహో తవ ప్రీత్యా నమస్కృతః
అర్ఘ్యం గంగాజలోపేతం గృహ్ణీష్వ సురసత్తమ ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః అర్ఘ్యం సమర్పయామి

ఆచమనం దండాక్షసూత్ర వరదాభయ పాణేమనోహర ।
గృహాణాచమనం దేవ భార్యయా సహిత ప్రభో ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః ఆచమనీయం సమర్పయామి

శుద్ధోదక స్నానం లసన్మకుట మాణిక్య శోభయా ధ్వాంతనాశన ।
స్నాపయామి సురేశ త్వాం శుద్ధం గంగాజలై శ్శుభైః ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః శుద్ధోదక స్నానం సమర్పయామి

పంచామృత స్నానం



పాలు : ఓం ఆప్యాయస్వ సమేతు తే విశ్వతస్సోమ
వృష్ణియం భవావాజస్య సంగథే
ఓం శ్రీ బృహస్పతయే నమః క్షీరేణ స్నపయామి.

పెరుగు : ఓం దధిక్రావణ్ణో అకారిషం జిష్ణోరశ్వస్య వాజినః
సురభినో ముఖాకరత్ప్రాణ ఆయూగ్ంషి తారిషత్
ఓం శ్రీ బృహస్పతయే నమః దధ్నా స్నపయామి.

నెయ్యి : ఓం శుక్రమసి జ్యోతిరసి తేజోసి దేవోవస్సవితోత్పునా
త్వచ్ఛి ద్రేణ పవిత్రేణ వసోసూర్యస్య రశ్మిభిః
ఓం శ్రీ బృహస్పతయే నమః ఆజ్యేన స్నపయామి.

తేనె : ఓం మధువాతా ఋతాయతే మధుక్షరంతి సింధవః,
మాధ్వీర్న స్సంత్వోషధీఃమధునక్తముతోషసి మధుమత్పార్థివగ్ం రజః,
మధుద్యౌరస్తునః పితా మధుమాన్నోవనస్పతి
ర్మధుమాగ్ం అస్తుసూర్యః, మాధ్వీర్గావో భవంతు నః ।
ఓం శ్రీ బృహస్పతయే నమః మధునా స్నపయామి.

పంచదార : ఓం స్వాదుఃపవస్వ దివ్యాయజన్మనే స్వాదురింద్రాయ సుహవీతునామ్నే
స్వాదుర్మిత్రాయ వరుణాయవాయవే బృహస్పతయే మధుమాగ్ం అదాభ్యః
శర్కరేణ స్నపయామి.
ఓం శ్రీ బృహస్పతయే నమః పంచామృతస్నానం సమర్పయామి.

వస్త్రం స్వర్ణవర్ణమయ వాసోగృహ్యతాం గ్రహనాయక ।
గురోభక్తేష్ట ఫలద కన్యాస్థ కృపయామయి ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః వస్త్రం సమర్పయామి.



యజ్ఞోపవీతం ఉపవీతం మయానీతం, నవతంతు వినిర్మితం ।
బ్రహ్మ గ్రంధి సమాయుక్తం గృహాణ విబుధేశ్వర ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః యజ్ఞోపవీతం సమర్పయామి.

గంధం కర్పూరాగరు కస్తూరీ సహితం చందనం శివం ।
సర్వశాస్త్రార్థ తత్వజ్ఞ స్వీకురుష్వ నమోస్తుతే ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః గంధం సమర్పయామి



అక్షతాన్ అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీన్ తండులాన్ శుభాన్
గృహాణ పరమానంద బృహస్పతి నమోస్తుతే ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః అక్షతాన్ సమర్పయామి

పుష్పాణి తస్మా దశ్వా అజాయంత మేకే చోభయాదతః గావోహ జజ్ఞిరే తస్మాత్ తస్మాజ్జాతా అజావయః
చంపకాశోక పున్నాగకేతకీ వకులానిచ । అన్యాని చ సు పుష్పాణి స్వీకురు ద్విజనాయక ॥
ఓం శ్రీ బృహస్పతయే నమః పుష్పాణి సమర్పయామి

అధాంగపూజ



ఓం రక్తాంబుజపదాయ నమః	–	పాదౌ పూజయామి
ఓం గురవే నమః	–	గుల్ఫౌ పూజయామి
ఓం జదద్విదితాయ నమః	–	జానునీ పూజయామి
ఓం జీవాయ నమః	–	జంఘే పూజయామి
ఓం గీష్పతయే నమః	–	ఊరూం పూజయామి
ఓం సురాచార్యాయ నమః	–	కటిం పూజయామి
ఓం సురవందితాయ నమః	–	ఉదరం పూజయామి
ఓం మహాత్మనే నమః	–	నాభిం పూజయామి
ఓం ఇంద్ర వరదాయినే నమః	–	వక్షస్థలం పూజయామి
ఆజానుబాహవే నమః	–	బాహూన్ పూజయామి
ఓం కంచుకంఠాయ నమః	–	కంఠంపూజయామి
ఓం రత్నకుండలధారిణే నమః	–	కర్ణౌ పూజయామి
ఓం సునాసాయ నమః	–	నాసికాం పూజయామి
ఓం సువదనాయ నమః	–	వదనం పూజయామి
ఓం పుండరీకాక్షాయ నమః	–	నేత్రే పూజయామి
ఓం బృహస్పతయే నమః	–	శిరః పూజయామి
ఓం సర్వాభీష్టఫలప్రదాయ నమః	–	సర్వాణ్యంగాని పూజ



శ్రీ బృహస్పతి (గురుడు) అష్టోత్తర శతనామావళి

ఓం గురవే నమః
ఓం గుణవరాయ నమః
ఓం గోప్త్రే నమః
ఓం గోచరాయ నమః
ఓం గోపతిప్రియాయ నమః
ఓం గుణినే నమః
ఓం గుణవతాంశ్రేష్ఠాయ నమః
ఓం గురూణాంగురవే నమః
ఓం అవ్యయాయ నమః
ఓం జేత్రే నమః
ఓం జయంతాయ నమః
ఓం జీవాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం జయావహాయ నమః
ఓం అంగీరసాయ నమః
ఓం అధ్వరాసక్తాయ నమః
ఓం వివిక్తాయ నమః
ఓం అధ్వరకృతే నమః
ఓం వాచస్పతయే నమః
ఓం వశినే నమః
ఓం వరిష్ఠాయ నమః
ఓం వాగ్విచక్షణాయ నమః
ఓం చిత్తశుద్ధికరాయ నమః
ఓం చిత్రశిఖండిజాయ నమః
ఓం బృహద్భానవే నమః
ఓం బృహస్పతయే నమః
ఓం అభీష్టదాయ నమః
ఓం సురారాధ్యాయ నమః
ఓం ధన్యాయ నమః
ఓం గీష్పతయే నమః
ఓం గిరీశాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం ధీవరాయ నమః
ఓం దివ్యభూషణాయ నమః
ఓం ధనుర్ధరాయ నమః
ఓం దైత్యహంత్రే నమః
ఓం దయాసారాయ నమః
ఓం దారిద్ర్యనాశకాయ నమః
ఓం దక్షిణాయన సంభవాయ నమః
ఓం ధనుర్మీనాధిపాయ నమః
ఓం ధనుర్బాణధరాయ నమః
ఓం అంగీరసకులోద్భవాయ నమః
ఓం సింధుదేశాధిపాయ నమః
ఓం స్వర్ణవర్ణాయ నమః
ఓం చతుర్భుజాయ నమః
ఓం హేమాంగదాయ నమః
ఓం పుష్యనాథాయ నమః
ఓం కాశపుష్ప సమానాభాయ నమః
ఓం కలిదోష నివారకాయ నమః
ఓం ఇంద్రాదిదేవాయ నమః
ఓం దేవతాభీష్ట దాయకాయ నమః
ఓం అసమానబలాయ నమః
ఓం భాసురాభీష్ట దాయకాయ నమః
ఓం పుణ్యవివర్ధనాయ నమః
ఓం ధర్మరూపాయ నమః
ఓం ధనాధ్యక్షాయ నమః
ఓం ధర్మపాలనాయ నమః
ఓం సర్వవేదార్థ తత్వజ్ఞాయ నమః
ఓం స్వమతాను గతామరాయ నమః
ఓం ఋగ్వేదపారగాయ నమః
ఓం సదానందాయ నమః
ఓం సర్వాగమజ్ఞాయ నమః
ఓం సర్వవేదాంతవిదే నమః
ఓం బ్రహ్మవిద్యా విశారదాయ నమః

ఓం సమానాధిక నిర్ముక్తాయ నమః
ఓం సర్వలోకవశంవదాయ నమః
ఓం సురేంద్రవంద్యాయ నమః
ఓం దేవాచార్యాయ నమః
ఓం వేదసిద్ధాంత పారగాయ నమః
ఓం సదానందాయ నమః
ఓం పీడాహరాయ నమః
ఓం అద్వితీయ రూపాయ నమః
ఓం ప్రహృష్టనేత్రాయ నమః
ఓం విప్రాణాంపతయే నమః
ఓం భార్గవశిష్యాయ నమః
ఓం విపన్నహితకారిణే నమః
ఓం సురాచార్యాయ నమః
ఓం దయావతే నమః
ఓం శుభలక్షణాయ నమః
ఓం లోకత్రయగురవే నమః
ఓం స్వరూపాయ నమః
ఓం సర్వేశాయ నమః
ఓం సర్వదాహృష్టాయ నమః
ఓం సర్వపూజితాయ నమః
ఓం అక్రోధనాయ నమః
ఓం మునిశ్రేష్ఠాయ నమః

ఓం విశ్వాత్మనే నమః
ఓం విశ్వకర్త్రే నమః
ఓం విశ్వయోనయే నమః
ఓం అయోనిజాయ నమః
ఓం భూర్భువాయ నమః
ఓం మహాబలాయ నమః
ఓం కాశ్వపేయాయ నమః
ఓం అభీష్టఫలదాయ నమః
ఓం దేవాసుర సుపూజితాయ నమః
ఓం ఆచార్యాయ నమః
ఓం దానవారయే నమః
ఓం సురమంత్రిణే నమః
ఓం పురోహితాయ నమః
ఓం కాలజ్ఞాయ నమః
ఓం కాలఋగ్వేత్రే నమః
ఓం చిత్తగాయ నమః
ఓం ప్రజాపతయే నమః
ఓం విష్ణవే నమః
ఓం కృష్ణాయ నమః
ఓం సూక్ష్మాయ నమః
ఓం ప్రతిదేవోజ్జ్వలగ్రహాయ నమః
ఓం బృహస్పతయే నమః

శ్రీ బృహస్పతి అష్టోత్తర శతనామావళి సమాప్తః

ధూపం



యత్పురుషం వ్యదధుః కతి ధావ్యకల్పయన్ ।
ముఖం కిమస్య కౌ బాహూ కావూరూపాదావుచ్యేతే ॥
వనస్పత్యుర్భవైర్దివ్యై ర్నానాగంధై స్సుసంయుతః ।
ఆఘ్రేయస్సర్వ దేవానాం ధూపోయం ప్రతిగృహ్యతాం ॥

దీపం



బ్రాహ్మణోస్య ముఖామాసీత్ బాహూ రాజన్యః కృతః
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత ॥
సాజ్యంత్రివర్తిసంయుక్తం వహ్నినాయోజితం ప్రియం
గృహాణ మంగళం దీపం త్రైలోక్య తిమిరాపహం ॥
భక్త్యాదీపం ప్రయచ్ఛామి దేవాయ పరమాత్మనే ।
త్రాహిమాన్నరకాద్ఘోరాద్దివ్యజ్యోతిర్నమోస్తుతే ॥

నైవేద్యం

చంద్రమా మనసో జాతః చక్షో స్సూర్యో అజాయత ।



ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత ॥
నైవేద్యం షడ్రసోపేతం నానావ్యంజన సంయుతం ।
దధ్యాజ్యభక్ష్యం సంయుక్తం సంగృహాణాఘనాశన ॥



అని చెప్పి పుష్పముతోగాని, తమలపాకుతో గాని నీటిలో ముంచి
"ఓం భూర్భువస్సువః ఓం తత్సవితుర్వ రేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ ।

సత్యం త్వర్తేన పరిషించామి । అమృతమస్తు । అమృతోపస్తరణమసి ॥ (అని ఆ నీటిని నైవేద్య పదార్థాలపై చల్లి ఎడమచేతి వ్రేళ్ళను గిన్నెలా ఉంచి, కుడి మోచేతిని పట్టుకుని కుడిచేతితో ఈ విధంగా చెప్పుచూ స్వామికి నివేదనమును చూపవలెను.) ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం వ్యానాయ స్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం సమానాయ స్వాహా, ఓం బృహస్పతే స్వాహా ఓం శ్రీ బృహస్పతే నమః మహా నైవేద్యం సమర్పయామి । అమృతాపి ధానమసి ఉత్తరాపోశనం సమర్పయామి అని కొంచెము నీరు చిలకరించవలెను. హస్తౌ ప్రక్షాళయామి, పాదౌ ప్రక్షాళయామి, శుద్ధాచమనీయం సమర్పయామి (కొద్దిగా నీరు విడువలెను.)

తాంబూలం

నాభ్యా ఆసీదంతరిక్షమ్ శీర్ణో ద్యౌస్సమవర్తత ।
పద్భ్యాం భూమిర్దిశ శ్రోత్రాత్ । తథాలోకాగ్ం అకల్పయన్
పూగీఫలైస్స కర్పూరై ర్నాగవల్లీ దళైర్యుతం
ముక్తాచూర్ణేన సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతాం ॥



ఓం శ్రీ బృహస్పతే నమః తాంబూలం సమర్పయామి.

నీరాజనం

వేదాహమేతం పురుషం మహాంతమ్ ఆదిత్యవర్ణం తమసస్తుపారే
సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామాని కృత్వాభి వదన్ యాదాస్తే ।
నీరాజనం జగజ్జీవం నీరాజాసనవందిత ।
భక్తార్తి భంజనం దేవం స్వీకురుష్వ మయార్పితం ॥



ఓం శ్రీ బృహస్పతే నమః కర్పూర దివ్య నీరాజనం సమర్పయామి

మంత్రపుష్పం

ధాతాపురస్తాద్య ముదాజహార శక్రప్రవిద్వాన్ ప్రదిశశ్చతస్రః
త్వమేవం విద్వానమృత ఇహభవతి నాన్యః పంథా అయనాయ విద్యతే ॥
(మీకు అవకాశం ఉంటే పూర్తి మంత్రపుష్పం చెప్పుకోవచ్చును.)



గృహాణ తారకారూప సర్వదేవాభి పూజిత ॥
ఓం శ్రీ బృహస్పతే నమః సువర్ణదివ్య మంత్ర పుష్పం సమర్పయామి ॥

ప్రదక్షిణ

"యానికానిచ పాపాని జన్మాంతర కృతాని చ
తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥

పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః
త్రాహిమాం కృపయా దేవ శరణాగత వత్సల ॥
అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ
తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష బృహస్పతి ॥
ప్రదక్షిణం కరిష్యామి సర్వభ్రమ నివారణం
సంసార సాగరాన్మాం త్వ ముద్ధ రస్వ మహాప్రభో ॥



ఓం శ్రీ బృహస్పతే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి
ఛత్రం సమర్పయామి - ఛత్రార్థే అక్షతాన్ సమర్పయామి
చామరం సమర్పయామి - తదర్థే అక్షతాన్ సమర్పయామి
నృత్యం దర్శయామి - తదర్థే అక్షతాన్ సమర్పయామి
గీతం శ్రావయామి - తదర్థే పుష్పం సమర్పయామి
సమస్త రాజోపచారాన్ సమర్పయామి (అక్షతలు వేసి నమస్కరించవలెను)

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం బృహస్పతే ।
యత్పూజితం మయాదేవ పరిపూర్ణం తదస్తుతే ॥
నమస్కృతః ఇతి బృహస్పతి పూజా సమాప్తం:

పుష్కర రాజు పూజ ఇక్కడ మరల సంకల్పం చెప్పుకొని **"సార్థత్రికోటి తీర్థసహిత శ్రీ పుష్కర రాజ పూజాం" కరిష్యే** అని సంకల్పం చేసిన తరువాత శ్రీ మహావిష్ణువును అష్టోత్తర శత నామములతో గాని, సహస్ర నామాలతో గాని, పురుషసూక్త విధానంగా పూజచేసి **"తత్ సత్ బ్రహ్మార్పణ మస్తు"** అని నీటి ధారవిడచి అనంతరము కృష్ణవేణి పుష్కర కథను చదువుకొనవలెను.

కృష్ణా పుష్కర వ్రత కథ

చతుర్ముఖ బ్రహ్మ శ్రీ మహావిష్ణువుతో "దేవా! ఈ కలియుగమునందు మానవులు తరించుటకు మార్గమును తెలుప"మని కోరగా, శ్రీమహావిష్ణువు తన అంశతో కృష్ణను సృజించాడు. ఆమె యొక్క అతి సుందరమైన ముఖారవిందములు, రూపలావణ్యాది విశేషములను చూసి బ్రహ్మదేవుడు ఆశ్చర్యము పొంది కృష్ణను తనకు పుత్రికగా ఇవ్వమని శ్రీమహావిష్ణువుని కోరాడు. అంతట విష్ణువు యొక్క అనుగ్రహంతో బ్రహ్మ కృష్ణను తన పుత్రికగా స్వీకరించాడు. ఆనాటి నుండి కృష్ణను బ్రహ్మపుత్రిక అని పిలుచుచుండిరి. కొంతకాలమునకు దేవతలు భూలోకం పాపభూయిష్టమై ఉండుటను శ్రీ మహావిష్ణువుకు తెలుపగా ఆ పాప పరిహారమునకై తరుణోపాయమును ఆలోచించి తన యొక్క రూపచతుష్టయము గల కృష్ణను తనకు యిమ్మనమని మరల బ్రహ్మను శ్రీ మహావిష్ణువు కోరగా బ్రహ్మ తిరిగి కృష్ణను విష్ణువునకు యిచ్చాడు.

అంతట శ్రీ మహావిష్ణువు తన స్వాధీనములో ఉన్న కృష్ణను భూలోకమున ఎచ్చట చేర్చవలెనని దేవేంద్రాది దేవతలను కోరగా వారు ఒకచోట పర్వతరూపమున నిలచి తపస్సు చేయుచున్న "సహ్యముని"ని శ్రీ మహావిష్ణువునకు చూపించారు. అంతట వారంతా అచ్చటకు చేరుకుని ఆ మునితో దేవతలు "ఓ మునీంద్రా! ఈ పర్వత రూపమున నిలిచి నీవు యింతటి ఘోరమయిన తపస్సు ఎందుకు చేయుచున్నావు? ఈ భూలోకమును ఉద్ధరించుటకు విష్ణు స్వరూపియగు కృష్ణతో కలిసి శ్రీ మహావిష్ణువు వచ్చియున్నారు. ఆమె ఎవరు ఏది కోరిననూ వారి వారి మనోభీష్టములను తీర్చగలదు" అని వారు చెప్పగా, ఆ మాటలు విన్న సహ్యముని వారందరికి నమస్కారం చేసి షోడశోప చారములతో పూజించి తన యొక్క కోర్కె తీర్చవలసినదని విష్ణువును, కృష్ణను దేవతలను ప్రార్థించి ఓ మహానీయులారా! శ్రీ మహావిష్ణువును చేరుటకు నేను తపస్సు చేయుచున్నాను. నా కోర్కె తీర్చుటకు చింతామణి అయిన కృష్ణను సంతోషముతో మీరు తెచ్చియున్నారు. నా జన్మ తరించినది. నేను ఆ మహానదీమతల్లికి భక్తిపూర్వక ముగా సేవలు చేసి జ్ఞానమును పొందగలను. దయచేసి హరి వికాసంబూని విష్ణు, కృష్ణలగు మీరిరువురునూ నాపై మీ స్థానములను నిల్పి నన్ను కృతార్థుడ్ని చేయమని శ్రీ మహావిష్ణువుని కోరాడు. అంతట కృష్ణ అనుగ్రహించి సహ్యమునీంద్రా! నా అంశతో నీపై నివశింతును. నీ ఈ ఉపకారంచే లోకమంతయు పవిత్రం కాగలదని చెప్పెను. శ్రీ మహావిష్ణువు సహ్యమునితో ఓ మునీంద్రా! నీవుతరించునట్లు పర్వత రూపమున ఉన్న నీపై నేను కూడా నిత్యనివాసము ఏర్పరుచుకొంటాను. ఆవిధంగా నీవును ధన్యుడవైతివి అని చెప్పాడు. ఈ విధంగా విష్ణు, కృష్ణలు ఇరువురు పర్వత రూపుడగు మునిని చేరగా అంతట ఆ పర్వతరాజు వారిని రత్న పుష్పాదులచే పూజించాడు. తరువాత శ్రీ మహావిష్ణువు శ్వేతాశ్వత్థ (తెల్లని రావిచెట్టు) రూపంలో ఆ సహ్యమునిపై నిలిచాడు. ఆ వృక్ష అంతర్భాగము నుండి కృష్ణ జన్మించి, ధవళాకృతిం చెంది భూమియందు ప్రవహింపసాగినది. ఆ మహానదీ ఉత్పత్తి స్థానం నుండి సాగర సంగమము వరకు అనంతపుణ్య తీర్థాలు, క్షేత్రాలు ఎన్నో కలవు. వాటియొక్క మహాత్మ్యము చదివినవారు, విన్నవారు ఆ నదియందు స్నానమాచరించినవారు అనంతపుణ్య ఫలప్రాప్తిని పొందగలరు. కృష్ణానది ప్రవహించు ప్రదేశములందు నివసించువారు స్నాన దానాది కర్మలు చేయువారు సమస్తపాపముల నుండి విముక్తులై పుణ్యఫల ప్రాప్తిని పొందగలరు. ఈ కృష్ణానది పుష్కర సమయంలో ఎవరైతే వేదోక్తంగా స్నాన, దానాది క్రియలు చేయుదురో అట్టివారు ఇహపరాలందు ధన్యతను పొందుతారు.

కృష్ణవేణి స్తోత్ర పంచకము

కృష్ణవేణి నమస్తుభ్యం సర్వపాప ప్రణాశిని । త్రిలోకీ పావనజలే రంగత్తుంగ తరంగిణి॥
విష్ణుదేహాత్సముత్పన్నే శ్రీశైలోత్సంగ గామిని । కృష్ణవేణితి విఖ్యాతే మమపాపం వ్యపోహయ ॥
శుద్ధస్ఫటిక సంకాశాం ద్విభుజాం పద్మధారిణీమ్ । శివమూర్తిధరాం కృష్ణవేణీం నమామ్యహం ప్రణతో
కమండలు ధరాం దేవీం జపమాలాధరాం శుభామ్ । బ్రాహ్మీం సువర్ణవర్ణాభాం కృష్ణాం త్వాం ప్రణతో
సర్వదేవమయీం సాక్షా ద్బ్రహ్మ విష్ణు శివాత్మికామ్ ।ఫలదాం సర్వతీర్థానాం కృష్ణాం త్వాం ప్రణతో

కృష్ణా పుష్కరకాలమున 12 రోజులలో చేయవలసిన దానములు

1వ రోజు – బంగారం, వెండి, ధాన్యం, భూమి, అన్నశ్రాద్ధము
2వ రోజు – ఆవులు, వస్త్రములు, రత్నములు, ఉప్పు
3వ రోజు – ఫలములు, కూరలు, బెల్లం, వెండితో చేసిన గుఱ్ఱం ప్రతిమ
4వ రోజు – నెయ్యి, నూనె, తేనె, పాలు, చక్కెర.
5వ రోజు – ధాన్యం, పండ్లు, గేదెలు, ఎడ్లు, నాగలి.
6వ రోజు – గంధపు చెక్క, కర్పూరం, కస్తూరి, ఔషధములు, సుగంధద్రవ్యములు.
7వ రోజు – ఇల్లు, వాహనము, ఆసనము, మంచము.
8వ రోజు – పుష్పములు, కందమూలములు, అల్లం, గంధం చెక్క
9వ రోజు – కన్యాదానం, పిండప్రదానం, సేవకాదానం
10వ రోజు – పుష్పమాల, ముత్యాలహారము, వెండి, శాకదానం.
11వ రోజు – వాహనం, యజ్ఞోపవీతం, పుస్తకములు, తాంబూలం
12వ రోజు – షోడశమహాదానములు, నువ్వులు, మేకను దానమివ్వాలి.

షోడశమహాదానములు : 1.ఆవు, 2.బంగారం, 3.వెండి, 4.తేనె, 5.గేదె, 6.రత్నములు, 7.ప్రత్తి, 8.ఏనుగు, 9.గుఱ్ఱము, 10.దాసీ, 11.త్రాసు, 12.ఇల్లు, 13.మేక, 14.మంచం, 15.కన్యాదానం, 16.పుస్తకం.

మొదటిరోజున హిరణ్య శ్రాద్ధము, 9వ రోజున అన్నశ్రాద్ధము, 12వ రోజున అన్నశ్రాద్ధము ముఖ్యముగా చేయవలెను. **గమనిక :** పై శ్రాద్ధములన్నియు చేయుటకు వీలుపడనిచో ఏదో ఒక రోజైనా తీర్థ హిరణ్య శ్రాద్ధములు తప్పక చేయవలెను.

తర్పణవిధి

తీర్థ శ్రాద్ధే గయాశ్రాద్ధే – ప్రత్యబ్దేచమహాలయే ।
పరేహరి ద్విజః కుర్యాత్ – తర్పణం తిల సంయుతం ॥

పింద ప్రమాణమ్

తీర్థశ్రాద్ధే గయాశ్రాద్ధే– దర్భశ్రాద్ధే మహాలయే
సేతుబంధే ప్రయాగాయాం – కుర్యాదామల కోపమః

పిండదానము



ఆదౌపితా తథామాతా సాపత్నీ జననీతథా ।
మాతామహస్సపత్నీకా ఆత్మ పత్న్యస్త్వనంతరం ॥
సుతభ్రాతృపితృవ్యాశ్చ మాతులా స్సహభార్యకాః ।
దుహితా భగినీ చైవ దౌహిత్రో భాగినేయకః ॥
పితృష్వసా మాతృష్వసా జామాతాభావుకస్నుషా ।
శ్వశురస్స్యాలకశ్చైవ స్వామినో గురురిక్థనః ॥



పుష్కరకాల సమయమున పిండప్రదానము చేయవలసినవారు


1.తండ్రి, 2.తండ్రితండ్రి, 3.తండ్రితాత, 4.తల్లి సవతితల్లి, 5.తండ్రి తల్లి, 6.తండ్రికి తాతమ్మ, 7.తల్లితండ్రి, 8.తల్లితాత, 9.తల్లిముత్తాత, 10.తల్లితల్లి, 11.తల్లినాయనమ్మ, 12.తల్లినానమ్మకుఅత్త, 13.తనభార్య, 14.కుమారుడు, 15.అన్నదమ్ములు, 16.పిన తండ్రి, పెదతండ్రి, 17.మేనమామలు, 18.కూతురు, 19.అక్కచెల్లెలు, 20.కూతురు కొడుకు, 21.మేనల్లుడు, 22.తండ్రిఅక్కాచెల్లెలు, 23.పినతల్లి,పెదతల్లి, 24.అల్లుడు, 25.బావ తోడబుట్టినదాని భర్త, 26.కోడలు, 27.మామగారు, 28.మేనమామ కొడుకులు, 29.ప్రభువులు, 30.గురువులు ధనసహాయం చేసినవారు.

తీర్థ శ్రాద్ధీయ పిండ ప్రదాన క్రమము



శ్లో॥ పితృణాం పశ్చిమే భాగే - మాతృపిండం విధీయతే ।
మాతామహాశ్చ తత్పూర్వే - ఆత్మ పత్నీ తదుత్తరే ॥
సుత భ్రాతృ పితృవ్యాశ్చ - మాతా పిత్రోశ్చమధ్యమే ।
మాతామహా మహి మధ్యే - మాతులాస్సహభార్యకాః ॥
శ్వశూశ్వశురయోర్మధ్యే - శ్యాలకస్స విధీయతే ।
దుహిత్రాదితతోన్యేషాం - శేషం దక్షిణతోవిధిః ॥
పుంపిండం నామత స్త్రీణాం - తత్పుత్రం సముపస్థితం ।
అంగుష్ఠ పరిమాణంతు గోత్రం - మన్యం నసంస్పృశేత్ ॥
నిరాశాః పితరోయాంతి - విపరీతే భవేద్యది ॥

పితృ దేవతలకు పిండ దానక్రమ వివరణ



ఎవరెవరికి తీర్థవిధి పెట్టాలి ?

భార్యయును మరణించివారికి సపత్నీక, పుత్రులును మరణించినవారికి సపుత్ర అనియు, భర్తయును మరణించినవారికి సభర్తృకా అనియు, పుత్రులును మరణించిన స్త్రీలకు స సంతతి అని చెప్పవలెను. బ్రాహ్మణుల పేరు చివర 'శర్మ' అని క్షత్రియుల పేరు చివర 'వర్మ' అనివైశ్యుల పేరు చివర 'గుప్త' అని ఇతరుల పేరు చివర 'దాస' అని చెప్పాలి.

పితృపితామహ ప్రపితామహులు (తండ్రి, తాత, ముత్తాత) ....గోత్రము

మాతృపితామహప్రపితామహీలు (తల్లి, నాయనమ్మ, ముత్తవ్వ) .... గోత్రము

అస్మత్	గోత్రం	పేరు (శర్మాణం)	రూపం
1. అస్మత్ పితరం (తండ్రి)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
2. " పితామహం (తాత)	.... గోత్రం	.... శర్మాణం	రుద్ర రూపం
3. " ప్రపితామహం (ముత్తాత)	.... గోత్రం	.... శర్మాణం	ఆదిత్య రూపం
4. " మాతరం (తల్లి)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
5. " పితామహీం (తండ్రి తల్లి)	.... గోత్రాం	.... పదాం	రుద్ర రూపాం
6. " ప్రపితామహీం (తాత తల్లి)	.... గోత్రాం	.... పదాం	ఆదిత్యరూపాం
7. " సాపత్నీ మాతరం (సవతి తల్లి)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
8. " మాతామహం (తల్లి తండ్రి)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
9. " మాతుః పితామహం (తల్లి తాత)	.... గోత్రం	.... శర్మాణం	రుద్ర రూపం
10. " మాతుఃప్రపితామహం (తల్లి ముత్తాత)	.... గోత్రం	.... శర్మాణం	ఆదిత్య రూపం

11.	”	మాతామహీం (తల్లి తల్లి)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
12.	”	మాతుఃపితామహీం (తల్లి నాయనమ్మ)	.... గోత్రాం	.... పదాం	రుద్ర రూపాం
13.	”	మాతుఃప్రపితామహం (తల్లి తాతమ్మ)	.... గోత్రాం	.... పదాం	ఆదిత్యరూపాం
14.	”	ఆత్మ పత్నీం (తన యొక్క భార్య)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
15.	”	సుతం (కుమారుడు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
16.	”	భ్రాతరం (అన్నదమ్ములు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
17.	”	పితృవ్యం (పినతండ్రి పెద తండ్రులు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
18.	”	మాతులం (మేనమామ)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
19.	”	దుహితారం (కుమార్తె)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
20.	”	భగినీం (తోబుట్టువు)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
21.	”	దౌహిత్రం (కుమార్తె కొడుకు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
22.	”	భాగినేయకం (సోదరి కుమారుడు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
23.	”	పితృభగినీం (మేనత్త)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
24.	”	మాతృభగినీం (పినతల్లి, పెత్తల్లులు)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
25.	”	జామాతరం (అల్లుడు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
26.	”	భావుకం (తోబుట్టువు భర్త)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
27.	”	స్నుషాం (కోడలు)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం
28.	”	శ్వశురం (మామగారు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
29.	”	శ్వశ్రూం (అత్తగారు)	.... గోత్రాం	.... పదాం	వసు రూపాం


30. ” స్యాలకం (భార్య అన్నదమ్ములు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
31. ” స్వామినం (ప్రభువు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
32. ” గురుం (గురువు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం
33. ” రిక్థినం (యాచకుడు)	.... గోత్రం	.... శర్మాణం	వసు రూపం

గోత్రము / పేరు తెలియనివారికి సంప్రదాయముననుసరించి శివ/విష్ణు చెప్పుకొనవలెను.

కృష్ణానది తీర్థ మహాత్మ్యం

కృష్ణానదీ తీర్థమహాత్మ్యాన్ని తెలిపే ఒక పురాణ గాథ బహుళ ప్రచారంలో ఉంది. జమదగ్ని మహర్షి కాలంచేశాక వారికి ఉత్తర క్రియలు చేయించగల వారెవరనే మీమాంస వచ్చింది. సహ్యాద్రిపైన గల దత్తాత్రేయ స్వామివారు ఇందుకు సమర్థులని విని జమదగ్ని కుమారుడు పరశురాముడు దత్తాత్రేయుల వారిని ఆశ్రయించి తన తండ్రి అంత్యక్రియలు చేయించాల్సిందిగా కోరాడు. 360 తీర్థాల్లో స్నానం చేసి వస్తే నీ తండ్రి అంత్యక్రియలు నేను చేయిస్తానని పరశురాముడికి దత్తాత్రేయ మహర్షి తెలిపాడు. అపుడు పరశురాముడు సహ్యాద్రిపై ఒక బాణాన్ని సంధించాడు. 360 తీర్థాలు పాతాళం నుంచి పైకుబుకి వచ్చి నదిగా ప్రవహించాయి. అందులో పరశురాముడు సుస్నాతుడై రాగా అతని తండ్రి కర్మకాండలని దత్తాత్రేయ స్వామి వారిచే పూర్తి చేయించాడు. ఆవిధంగా సహ్యాద్రిపై ఉద్భవించిన కృష్ణానదిలో తీర్థస్నానాలు చేసిన వారి పాపాలు నివృత్తి అయి పుణ్యం లభిస్తుంది. గంగానదిలో స్నానం చేసిన భక్తుల పాపాల్ని గంగాదేవి స్వీకరించి కాకి రూపం పొంది కృష్ణా సాగర సంగమంలో హంసలదీవిలో స్నానం చేసి కాకి రూపం పోగొట్టుకొని హంస రూపంలో తిరిగి స్వస్థలానికి చేరుకుటుందని ప్రతీతి.




పడమర
పితృ వర్గము
దక్షిణం
మాతామహ వర్గము
వివరణము
పిండ ప్రదాన విధి

శ్రీ కనకదుర్గ దేవాలయం - విజయవాడ



కృష్ణాజిల్లా, విజయవాడ పట్టణమునందు కృష్ణాతీరమున, ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంచేసియున్న కనకదుర్గమ్మ గొప్ప మహిమలు గల తల్లి. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో శుద్ధ పాడ్యమి మొదలుకొని దశమి వరకూ శ్రీ దుర్గాదేవికి నవరాత్రి మహోత్సవాలు కనుల పండుగగా దేశమంతా ఘనంగా, అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఈ నవరాత్రులలో అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రకాల అవతార మూర్తులుగా అలంకరించి ప్రతి అవతారానికి విశేష పూజలు, అర్చనలు జరుపుతారు. దశమినాడు శ్రీ రాజ రాజేశ్వరీ దేవిగా కనక దుర్గాదేవిని అలంకరించి అర్చిస్తారు. ఈ తొమ్మిది రోజులు రోజుకొకరి చొప్పున రాక్షసులను సంహరించి దశమి రోజున శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు ఈ అమ్మవారు దర్శనమిస్తారు.

చరిత్ర : పూర్వకాలంలో దనువు పుత్రులైన రంభ కరంభులనే వారు సంతానం కోసం ఈశ్వరుని గూర్చి ఘోర తపస్సు చేశారు. కరంభుడు నీటిలోను, రంభుడు పంచాగ్నుల యందున తపస్సు చేస్తుండగా ఇంద్రుడు మొసలి రూపంలో వచ్చి కరంభుని సంహరించాడు. సోదరుని మృతికి విచారగ్రస్తుడైన రంభుడు తన తల నరుక్కొని పరమేశ్వరుడికి అర్పించడానికి పూనుకున్నాడు. అప్పుడు శంకరుడు అతనికి ప్రత్యక్షమై అతని భక్తికి మెచ్చి వరం కోరుకోమన్నాడు. "పుత్రసంతతి లేని నాకు నువ్వే మూడు జన్మలు పుత్రునిగా జన్మించాలి. ఆ బిడ్డ ముల్లోకాలని జయించేవాడు, వేదవేదాంగ విదుడు, కామరూపుడు, దీర్ఘాయుష్మంతుడు కావాలి" అని రంభుడు పరమేశ్వరుణ్ణి వరం కోరాడు. పరమేశ్వరుడు అతనికి ఆ వరం ప్రసాదించాడు. రాక్షస స్వభావుడైన రంభుడు ఇంటికి తిరిగిపోతూ దారిలో ఒక మహిషిని చూసి దానితో బలాత్కారంగా మైథునం సాగించాడు. అప్పుడు రుద్రుడు తన అంశతో ఆ మహిషిగర్భంలో ప్రవేశించాడు. కొంతకాలానికి మహిషా కారంతో బిడ్డ జన్మించాడు. అతడే మహిషాసురుడు. అతడు మహాబలవంతుడై ఇంద్రుని జయించి స్వర్గాధిపత్యం పొంది ముల్లోకాలని గజగజలాడిస్తూ లోకకంటకుడయ్యాడు.

ఒకసారి మహిషాసురుడు కాత్యాయన మహర్షి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ స్త్రీ రూపం ధరించి మహర్షి శిష్యుని బాధిస్తూ ఉండడంతో మహర్షి ఉగ్రుడై స్త్రీ చేతిలో నీకు మరణం సిద్ధిస్తుందని శపించాడు. అయినా ఆ అసురుడు తన దుష్టబుద్ధిని వీడక స్త్రీలని, సాధుపుంగవులని, దేవతలని, ఋషులని బాధిస్తూనే వచ్చాడు. అప్పుడు దేవతలంతా కలిసి ఆదిశక్తిని ప్రార్థించారు. ఆ దేవి "ఉగ్రచండి" అనే పేరిట ఉద్భవించి మహిషాసురుణ్ణి సంహరించింది. మరోజన్మలో మళ్ళీ ఈ మహిషుడు రంభుడి పుత్రుడిగా పుట్టి తన దానవ నైజంతో దేవతలని పీడిస్తూ ఉంటే, ఆ దేవతల ప్రార్థనపై ఆదిశక్తి "భద్రకాళి" రూపంలో అవతరించి మహిషుని మట్టుపెట్టింది. మూడవ జన్మలో ఈ మహిషుడు ఘోర తపస్సు చేసి బ్రహ్మ వద్ద వరాలు పొంది ఇష్టానువర్తిగా వ్యవహరిస్తూ లోక పీడితుడయ్యాడు. ఆ మహిషునికి ఒక రోజు మహాకాళి తనని ఒరిసిపట్టి తల నరికి రక్తపానం చేస్తున్నట్లు భయంకరమైన కల వచ్చింది. ఇందుకు భయకంపితుడై మహిషుడు భద్రకాళిని గూర్చి ఘోరతపస్సు చేశాడు. అప్పుడు దేవి ప్రత్యక్షమైంది. ఇక తనకు జనన మరణాలు లేకుండా వరం ప్రసాదించమని, నీ చేతిలో హతుడైన నాకు నీ యజ్ఞభాగార్హత కలుగజేయవలసిందని మహిషుడు కోరాడు. "మహిషా! నువ్వు రుద్రాంశసంభుడవు. నాకు వాహనం కావడానికి బ్రహ్మ నిన్ను సృష్టించాడు. ఇక నువ్వు నా వాహనంగా ఉండి నేను నిలిచిన చోట పాదాక్రాంత శరీరుడవై నా సన్నిధిని నిలిచి ఉంటావు" అని దేవి పలికింది. ఆ తర్వాత మహిషుడికి మళ్ళీ జగన్మాత మాయ కప్పడంతో మళ్ళీ అసుర చేష్టలకు పూనుకొని దేవతలను, మునులను పీడిస్తూ ఉండడంతో దేవతల ప్రార్థనపై మరో శక్తి శ్రీ కనక దుర్గామాతగా వెలసి సపరివారుడైన మహిషాసురుని సంహరించి ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గాదేవిగా వెలసింది.



ఇంద్రకీలాద్రి చరిత్ర : కనకదుర్గామాత ఇంద్రకీలాద్రిపై వెలసి ఉండడానికి ఒక కథ ఉంది. పూర్వము దుర్గామాత ఆలయం ఉన్న కొండను ఇంద్రకీలాద్రి అంటారు. ఈ పర్వతాన్ని అధిష్టించిన వాడు ఇంద్రకీలుడు అనే యక్షుడు. అతడు ప్రతిరోజు కృష్ణవేణీ నదిలో స్నానం చేస్తూ నదికి ఉత్తరభాగంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. అతని తపస్సుకు మెచ్చి పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నారు. పార్వతీ పర మేశ్వరులకు తాను ఆసనం అయ్యే భాగ్యం ప్రసాదించాల్సిందిగా ఇంద్రకీలుడు వరం కోరాడు. 'తథాస్తు' అన్నారు పార్వతీ

పరమేశ్వరులు. అతని కోరిక తీర్చడానికి మహిషాసుర సంహారానంతరం కనకదుర్గామాత ఇంద్రకీల పర్వతం మీద ఆవిర్భ వించింది. ఇక్కడ దుర్గాదేవి ఎనిమిది చేతుల్లో ఎనిమిది ఆయుధాలు కలిగి, సింహాన్ని అధిష్ఠించి, మహిషాసురున్ని శూలంతో పొడుస్తూ ఉన్నట్లు మనకు కనిపిస్తుంది. అరి, శంఖ, కేత, శూల, పాశ, అంకాశ, మౌర్వి, శానకాలనేవి దుర్గాదేవి ఎనిమిది చేతులలో ధరించే ఎనిమిది ఆయుధాల పేర్లు. ఈ దేవిమూర్తికి ఎడమ భాగంలో శ్రీచక్రం స్థాపించబడి ఉంది. ఆ శ్రీచక్రానికి ప్రక్కన గణపతి దేవతామూర్తి కొలువై ఉన్నారు. ఈ కనక దుర్గ అమ్మవారి ఆలయంలో జరిగే పూజలన్నీ శ్రీ చక్రానికి జరుగుతాయి. ఇదొక ప్రత్యేకత.

ఇంద్రకీలాద్రి - దుర్గాకుండము : దుర్గాదేవి ఆలయానికి పశ్చిమాన చిన్న కుండము ఉంది. దీనిని దుర్గాకుండమని అంటారు. దీని మధ్యలో చిన్న గుంట ఉన్నది. ఏనాడు కూడా ఈ కుండం (కోనేరు) ఎండడం అంటూ ఉండదు. దీనిలోపల వరుణయంత్రం ప్రతిష్ఠించబడిందని అంటారు. ఈ దుర్గాకుండం మహాత్మ్యాన్ని గురించి అగస్త్యులవారు శ్రీరామచంద్రమూర్తికి తెలిపిన పురాణగాథ ఇది. “దుర్గాదేవి ఆలయానికి నైఋతి కోణంలో ఈశ్వరుని చేత ఈ దుర్గాకుండం నిర్మించబడిందని గంగానదీ, బ్రహ్మపుత్రా నదీ, శ్వేతభద్ర, సరస్వతి, యమున, తమసానది, విపాత, బహుధ, సింధు, తాపిని, రేవా, ముచికుంద, పినాకిని, సోమోద్భవ, శోనాభద్ర, జమదగ్ని, మహానది, శాఘ్రువ యోష్ణి, వింధ్యా, చర్మణ్వతి, అరుణానది, విధూతపాప, వ్యాఘ్రునది, గోమతి, గండకి, సరయూనది, విశాల, విమల, శరావతి, వేగవతి, భోగవతి, అమృతాపగని, చంద్రభాగ, బ్రహ్మిణి, ఇంద్రనది, వైనతేయ, సప్తగోదావరి, మలాపహారిణి, భామాదూర్వాసా, అమరావతీ, సహ్యాకేయ, సింహనది, కృష్ణవేణి, తుంగభద్ర, బ్రహ్మనది, ప్రణవాషీరనది, భీమస్వనా, భృగునది, ఉత్తరపినాకిని, సువర్ణముఖి, వాశిష్ట విష్ణుప్రదోద్భవన, మముద్వతి, దక్షిణపినాకిని, అమరప్రియ, కావేరి, తామ్రపర్ణి, మురిజా వేణుభేదిని మొదలైన నదులన్నీ వాటి స్వీయాంశతో ఈ కుండంలో ప్రవేశించాయని తెలియజేశారు. అందుచేత ఈ దుర్గాకుండములో స్నానం చేసిన వారికి సమస్త నదులలో స్నానం చేసిన పుణ్యంతో పాటు, వారు కోరిన కోరికలన్నీ నెరవేరుతాయని, పవిత్ర శివసాయుజ్యం ప్రాప్తిస్తుందని పురాణగాథ ప్రకారం తెలియవస్తుంది.

శక్తిపీఠంగా విజయవాడ : దక్షుణి యజ్ఞశాలలో పార్వతీదేవి యోగాగ్నిలో దూకి శరీరత్యాగం చేయగా పరమశివుడు వివశుడై ఆ దేవి కళేబరాన్ని భుజం మీద ఎత్తుకొని సంచారం చేస్తుండగా మహావిష్ణువు తన ఆయుధంతో ఆ కళేబరాన్ని ఖండ ఖండాలు చేశాడని, ఆ ఖండాలు 51 అని అవి పలుస్థానాల్లో పడ్డాయని, అవన్నీ శక్తి పీఠాలని, వాటిలో 18 ముఖ్యమైనవి కాగా, మిగిలిన శక్తిపీఠాలలో విజయవాడ



ఒకటని చెబుతారు. 10వ శతాబ్దంలో పశ్చిమ చాళుక్యరాజైన త్రిభువనమల్లు ఈ ప్రాంతంను పాలించాడని చరిత్ర తెలియజేస్తుంది. యుద్ధమల్లుని బెజవాడ శాసనం చాలా ప్రాచీన మైంది. క్రీస్తు శకం 927 మొదలు 934 వరకు ఇతడు రాజ్యపాలన చేశాడు. ఆనాడు విజయవాడకు రాజేంద్రచోళ పురమనే పేరు కూడా ఉంది. మొగలి తామ్రశాసనం ప్రకారం శ్రీసింగభూపాలుడు, శ్రీకృష్ణదేవరాయలు, విజయవాడ శ్రీ కనక దుర్గామల్లేశ్వరులకు అంగరంగ వైభోగమంటపాలతో దేవాలయం అభివృద్ధి చేసి, నిత్యకైంకర్యానికి దానపట్టాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.

కృష్ణానదీ తీరంలో విజయవాడలో ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గాదేవి స్వయంభువు. ఈ ఆలయంలో శ్రీ చక్రం ఉంది. ఈ శ్రీచక్రా నికి అగస్త్యులవారు తమ తపఃఫలాన్ని ధార పోశారనీ, ఆదిశంకరులు విచ్చేసి శ్రీ చక్రం లోని రౌద్ర బీజాలు తొలగించిన పిదప దుర్గా మాత శాంతమూర్తి అయి తనను దర్శించే భక్తుల అభీష్టాలు నెరవేరుస్తున్నదని చెబుతారు.

మల్లేశ్వరుడు- మల్లిఖార్జునుడు : పరమ పవిత్రమైన ఈ ఇంద్రకీలాద్రి మీద బ్రహ్మాది దేవతలందరి కోరిక మీద దుర్గాదేవి మహిషాసుర మర్ధినీ రూపంతో అవతరించింది. కనక ప్రభలతో వెలుగొందుతున్న ఆ దేవి కాల క్రమంలో కనకదుర్గగా కీర్తించబడింది. అలాంటి ఇంద్రకీలాద్రి మీద పరమేశ్వరుణ్ణి కూడా కొలువుండేలా చేయాలనే సత్సంకల్పంతో బ్రహ్మదేవుడు పరమనిష్ఠతో శతాశ్వమేథ యాగాన్ని చేయగా, అతని భక్తి శ్రద్ధలకు మెచ్చిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో ఆ చతుర్ముఖునికి దర్శనమిచ్చాడు. ఇలా ఇంద్రకీలాద్రి మీద దివ్యజ్యోతిర్లింగ స్వరూపుడై నిలిచిన పరమేశ్వరుణ్ణి బ్రహ్మదేవుడు మల్లిక పుష్పాలతో భక్తిగా అర్చించాడు. అలా భక్తిగా తనని అర్చించిన బ్రహ్మదేవుడి భక్తిశ్రద్ధలకు సంతోషించిన పరమేశ్వరుడు ఆయనకు బ్రహ్మలోకాన్ని ప్రసాదించాడు. ఆవిధంగా బ్రహ్మదేవుడిచేత ప్రథమంగా మల్లికార్జున (మల్లికా) పుష్పాలతో అర్చించ బడిన కారణంగా ఆ స్వామికి మల్లికేశుడు అనే పేరు వచ్చింది. అనంతరం బ్రహ్మ దేవుడు ఈ కొండపైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల కళ్యాణం జరిపించాడు. ఆ సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. శ్రీ కనకదుర్గమ్మ తల్లి వెలిసిన ప్రాంతానికి

ఉత్తరంగా ఈ మల్లేశ్వరస్వామి వెలిసిన నాటినుంచీ బ్రహ్మేంద్రాది దేవతల చేత సైతం పూజలందుకుంటున్నారు. అలాగే కలియుగంలో అగస్త్య మహర్షి ఈ మల్లేశ్వరుడికి జయసేనుడు అనే పేరుపెట్టి అర్చించాడని ఒక ఐతిహ్యం కూడా లోకంలో ప్రసిద్ధమై ఉంది. కాలక్రమంలో కలిప్రభావం వల్ల ఈ జ్యోతిర్లింగం అంతర్నిహితమై (అదృశ్యంగా) ఉండటాన్ని గమనించిన శ్రీ శంకరాచార్యుల వారు కనక దుర్గాదేవికి ఉత్తర భాగంలో మల్లేశ్వర లింగాన్ని పునః ప్రతిష్టించారు. ఆనాటి నుంచీ మల్లేశ్వరస్వామి కూడా ఎంతో వైభవంతో భక్తులందరిచేత అర్చించబడుతున్నాడు. అయితే ఈ మల్లేశ్వరస్వామికి దక్షిణంగా శ్రీ కనకదుర్గా అమ్మవారు కొలువున్న కారణంగా శ్రీ కనకదుర్గ క్షేత్రంగా లోకంలో ఇది ప్రసిద్ధి చెందింది.

శ్రీ దుర్గా మల్లేశ్వరుడి మహిమలు : ఇంద్రకీలాద్రిమీద శ్రీ కనక దుర్గాదేవి వెలిసిన తరువాత ఆమె వియోగాన్ని భరించలేని పరమేశ్వరుడు మల్లికార్జున రూపంలో ఇక్కడే దుర్గమ్మకి ఉత్తరభాగాన వెలిసాడు. అప్పటినుంచి కనకదుర్గ క్షేత్రంగా ఉన్న ఈ ప్రాంతం శ్రీ దుర్గామల్లేశ్వర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. కలియుగంలో కనక దుర్గమ్మతోపాటు మల్లికార్జునుడు కూడా తన మహిమల్ని చూపాడు, భక్తసులభుడైన ఈ మల్లేశ్వరుడి మహిమలు గురించి స్పష్టంగా తెలియజేసే శాసనాలుకూడా ఎన్నో ఉన్నాయి. ఈ శాసనాల్లో పల్లకేతు భూపాలుడు వేయించినశాసనం మల్లేశ్వరస్వామి మహిమలగురించి రెండు సంఘట నల్ని స్పష్టంగా తెలియ జేస్తుంది.



శ్రీ విజయేశ్వరస్వామి వృత్తాంతం : ద్వాపరయుగంలో పాండవ మధ్య ముడైన అర్జునుడు పాశుపతాస్త్రం కోసం ఈ ఇంద్రకీలాద్రిపైననే తపస్సు చేశాడని, నిత్యం త్రిసంధ్యలలో కృష్ణవేణీ నదీస్నానం ఆచరించి, అమ్మవారిని అర్చించి, మల్లేశ్వరస్వామిని పూజిస్తుం డేవాడు. పార్థుడికి గల దశ నామాల్లో 'విజయుడు' అనేది ఒకటి. దాన్నిశాశ్వతం చేస్తూ ఆది దంపతులు జంటగా ప్రత్యక్షమై విజయుడిని అనుగ్రహించారు. ఆ విజయుడి పేరిట ఈప్రాంతం ఆనాటినించి 'విజయవాటిక'గా విజయవాడగా ప్రసిద్ధిచెందింది. పార్థుడికి పాశుపతాస్త్రంప్రసాదించాడు పరమేశ్వరుడు. అందుకు కృతజ్ఞతగా పార్థుడు ఇంద్రకీ లాద్రిపైన దక్షిణభాగంలో ఒక శివలింగాన్ని ప్రతిష్టించాడు. విజయుడు ప్రతిష్టించి పూజించడంచేత అక్కడ శివుడు 'విజయేశ్వర స్వామి'గా ప్రసిద్ధిచెందాడు. ఇక్కడ అయ్యవారి చెంతన ప్రతిష్టించబడిన అమ్మవారి పేరు బ్రహ్మాస్త్రీశ్వరీ దేవిగా చెబుతారు.

పాతబస్తీ విఘ్నేశ్వరుడు - విజయవాడ

విజయవాడ పాతబస్తీలోని కెనాల్‌రోడ్డులో విఘ్నేశ్వరునికి ప్రత్యేక ఆలయాన్ని నిర్మించి భక్తులు అనాదిగా కొలుస్తున్నారు. శ్రీకనకదుర్గమ్మ ఆలయానికి వెళ్ళే ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో ఉన్న ఆలయంలో భారీ విగ్రహరూపంలో కనిపిస్తారు ఈ స్వామి. పిలిస్తేపలికే దైవంగా ఆపదలో ఉన్న భక్తులకు నేనున్నానంటూ అభయమిచ్చి ఆదుకునే పార్వతీ తనయుని ప్రతిదినం వందలాది మంది భక్తులు దర్శించి తమ కోర్కెలు తీర్చమంటూ వేడుకొని పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా బుధవారం రోజున భక్తులు ఎక్కువగా ఉండ్రాళ్ళ పూజలు చేస్తారు. ఉండ్రాళ్ళతో పాటుగా పులిహోరా, దద్దోజనం, చక్కెరపొంగలి, కట్టుపొంగలి వంటి ప్రసాదాలను కూడా ఈ స్వామివారికి నివేదిస్తారు. ఇక్కడ ఒక ఆచారము ఉన్నది. ప్రసాదాలు ఇంటివద్ద చేయుటకు అవకాశం లేనివారు దేవస్థానం వారు నిర్ణయించిన టిక్కెట్టు ధరను నగదు రూపేణా చెల్లిస్తే వారు భక్తులకు కావాల్సిన ప్రసాదాన్ని తయారు చేయించి స్వామికి నివేదన చేసి ఇచ్చే అవకాశం ఇక్కడ ఉంది. ఈ ఆలయ స్థలపురాణం గురించి పెద్దగా తెలియరాలేదు. కానీ 1964వ సంవత్సరంలో నగరంలోని స్థానిక వ్యాపారులందరూ కలిసి సంవత్సరంలో ఎన్ని రోజులు ఉన్నాయో, అంతమంది మొత్తం (365) సభ్యులతో ఒక సంఘంగా ఏర్పడి వీరందరూ రోజుకి ఒకరు చొప్పున స్వామికి నిత్యపూజలు నిర్వహించి నిత్యం నైవేద్యం పెట్టేందుకు నిర్ణయించుకున్నారు. ఆనాటినుంచి నేటివరకూ అదే సాంప్రదాయం కొనసాగుతోంది. రోజురోజుకు భక్తుల రద్దీ అసాధారణంగా పెరుగుతుంది. ఈ స్వామివారికి పర్వదినాలలో ఉత్సవాలు కూడా ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం(కొత్తగుళ్ళు) - విజయవాడ



కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో వన్‌టౌన్‌లో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఉన్నది. ఇది చాలా పురాతాన ఆలయంగా సుమారు 100 సంవత్సరాల చరిత్ర గల ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి మకర తోరణంతో, పసుపు వర్ణముతో కూడిన ముఖ వర్ఛ స్సుతో భక్తులకు కను

విందు చేస్తుంది. సకల అలంకరణతో, నిలుచున్న భంగిమలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి ఎదురుగా ఉన్న శ్రీ చక్రానికి నిత్యం కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఆర్యవైశ్యుల ఆడబిడ్డగా అవత రించిన వాసవీదేవికి మహిళాభక్తులు ప్రతి సంవత్సరం ఒక వేడుకగా ఒడిబియ్యాన్ని సమర్పిస్తారు. చైత్ర మాసంలో వసంత నవరాత్రులు, శ్రావణమాసంలో ప్రత్యేకపూజలు, ఆశ్వీయుజమాసంలో శరన్నవ రాత్రులు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు ఇచ్చట ఘనంగా నిర్వహించ బడతాయి. ఈ ఆలయ ప్రాంగణంలో ప్రక్కనే నగరేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. నగరేశ్వరుడు ప్రత్యేక వెండి మంటపంలో కొలువుదీరి ఉన్నారు. గర్భాలయం ముఖమంటపంలో ఎడమవైపు పార్వతీదేవి కొలువుదీరి ఉన్నది. ఈ ఆలయానికి చేరువలోనే విజయగణపతి మందిరం ఉన్నది. ఇచ్చట స్వామివారు రజత కవచంతో దర్శనమిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే కోదండరామస్వామి వారికి ఉపాలయంఉన్నది. ఇచ్చట శ్రీ సీతారామలక్ష్మణమూర్తులు భక్తులకు దర్శనమిస్తారు. సాధారణంగా రామాలయాల్లో శ్రీరామునికి ఎడమవైపు సీతాదేవి ఉంటుంది. కాని ఇచ్చట శ్రీరామునికి కుడివైపు సీత, ఎడమవైపు లక్ష్మణస్వామివారు ప్రతిష్ఠితులై ఉన్నారు. ఇది ఒక విశే షంగా చెబుతారు. శ్రీరామచంద్రునికి ఇరువైపులా శంఖుచక్రాలు ఉన్నాయి. అందుచే ఈ రాముడు రామ నారాయణుడిగా భక్తులు పిలుస్తారు. ఇచ్చట సీతారాములకు ఏకాంతసేవ, పవళింపుసేవలు కన్నుల పండువగా జరుగుతాయి. ఈ ఆలయ లోగిలి లోనే ఆండాళ్‌కు దివ్యసన్నిధి ఉన్నది. శ్రీ రామానుజుల వారి సన్నిధితో పాటూ, పన్నిద్ద రాళ్వార్లు ఒకే మంటపంలో కొలువుతీరి ఉన్నారు. ఇచ్చట కొలువుతీరి ఉన్న హనుమంతుడు దాసాంజనేయుడుగా భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే శ్రీరామ కోటి స్థూపం కూడా ఉన్నది. ఈ స్థూపంపై శ్రీరామరక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా భక్తుల కొరకు లిఖించబడి ఉన్నాయి.


శ్రీ కోదండరామస్వామి ఆలయం - విజయవాడ



కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో వన్‌టౌన్‌లో భావనారాయణ వీధిలో శ్రీ కోదండరామస్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయానికి 200 సంవత్సరాల ఘన మైన చరిత్ర ఉన్న పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. 1962వ సంవత్సరం వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం పునః

నిర్మితమైన ఈ ఆలయం 50 సంవత్సరాల స్వర్ణోత్సవాన్ని జరుపుకున్నది. రాజ గోపురం, విమానగోపురం లేని ఒక అధునాతన ఆలయమే శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం. ఆలయ ప్రవేశ ద్వారం పైభాగంలో నాలుగు అశ్వాలతో కూడిన ఒక రథం మలచబడింది. ప్రక్కనే శ్రీకృష్ణుని గీతోపదేశం చిత్రం మలచబడింది. ద్వారానికి రెండు వైపులా రెండు కాళ్ళపై నిలబడిన గజరాజులు వాటిపైన వ్యాళ సింహరూప ప్రతిమలు స్వాగతం పలుకుతూ కనిపిస్తాయి. రెండు అంతస్తులు గల ఈ ఆలయంలో తిరునామంతో లోహకవచ ధ్వజస్తభం ప్రతిష్టించబడి ఉన్నది. ఈ ధ్వజస్తంభానికి క్రిందిఅరలో ఆంజనేయస్వామివారి మందిరం ఉన్నది. గర్భాలయంలో సీతా లక్ష్మణ సమేత శ్రీరామ చంద్రమూర్తి భక్తులకు దర్శనమిస్తారు. శ్రీరామునికి కుడిభాగంలో సీతాదేవి, ఎడమభాగంలో లక్ష్మణ స్వామివారు ఉన్నారు. రామకథలోని కొన్ని ఘట్టాలు ఈ ఆలయ గోడలపై శిల్పాలుగా మలచారు. పసిబాలుని రూపంలో ఉన్న శ్రీరాముని కౌసల్య ఊయల ఊపుతున్న దృశ్యం, గౌతమశాపం, శివధనుర్భంగం, సీతాకళ్యాణం, దశకంఠుని సీతాపహరణం, జటాయువు అడ్డుకొనే దృశ్యం, వాలీ సుగ్రీవుల యుద్ధ దృశ్యం, శబరి రామునికి ఎంగిలి పండ్లు ఇచ్చే దృశ్యం, రామ పట్టాభిషేకం మొదలైన దృశ్యాలు అత్యంత సుందరంగా మలచబడి ఉన్నాయి. ఇచ్చట సంవత్సరంలో 12 రకాల ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు జరుగుతాయి. వీటితోపాటు కార్తీకమాసంలో పునర్వసు నక్షత్రాన ప్రత్యేక పూజలు, శ్రీరామనవమి ఉత్సవాలు, ధనుర్మాస ఉత్సవాలు, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలన్నింటిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

త్రిశక్తిపీఠం - విజయవాడ



విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ ప్రక్కన గల త్రిశక్తిపీఠం అనే దేవీ ఆలయం నగరంలోని ప్రసిద్ధ ఆలయాల్లో ఒకటి. మొదట 1947వ సంవత్సరంలో ఇక్కడ కాళీమాత విగ్రహం అతి వైభవంగా ప్రతిష్ఠాపన జరిగింది. ఆనాటినుండి భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ ఆలయం, 1989వ సంవత్సరంలో త్రిశక్తిపీఠంగా రూపు దిద్దుకొని భక్తులను మరింతగా ఆకర్షిస్తున్నది. త్రిమాతలు ఇచ్ఛాక్రియాజ్ఞాన శక్తికి ప్రతీకలైన శ్రీ మహాకాళి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి

అమ్మవార్ల దివ్య మంగళరూపాలు దేదీప్యమానమైన విగ్రహాలతో ఈ ఆలయం విల సిల్లుతోంది. ఈ ముగ్గురు మూర్తులలో శ్రీమహాకాళి స్వయంభూశక్తిగా వెలసిన తల్లిని నెల్లూరు పరిసరారణ్యముల నుండి 1941వ సంవత్సరంలో ఇక్కడకు తెచ్చి అక్కడ ఉన్న చిన్న ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆ తరువాత 1989వ సంవత్సరంలో భక్తుల కోరిక మేరకు అధునాతన ఆలయ సముదాయంగా ఆలయ ఆధ్యాత్మిక సలహా దారులచే పునఃప్రతిష్ఠ గావింపబడి వేలాది భక్తుల మనోభీష్టం నెరవేర్చుచున్నది. దసరా పండుగరోజుల్లో ఈ త్రిశక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రతీకగా వస్తుంది. నిత్యం భక్తులతో కళ కళలాడే ఈ ఆల యంలో నిత్య పూజలతో పాటు, ప్రత్యేకపూజలు, దసరా పండుగ పర్వదినాలలో గొప్ప ఉత్సవాలు జరుగును.

శ్రీ సాయిబాబా దేవాలయం - కృష్ణలంక



కృష్ణాజిల్లా విజయవాడ కృష్ణలంకలోని భ్రమరాంబ పురంలో ఈ సాయిబాబా మందిరం ఉన్నది. ఇది చాలా పురాతనమైన ఆలయం. ఆంధ్రప్రదేశ్‌లోని మొట్ట మొదటి సాయిబాబా మందిరం ఇదేనని తెలుస్తుంది. 1947 ఆగస్టునెలలో రాంపిళ్ళ లక్ష్మణరావుగారి చేతులమీదుగా ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగినట్లు చెబుతారు. బాబా విగ్రహం 5.4 అడుగుల ఎత్తు ఉంటుంది. బాబా విగ్రహం సిమెంటుతో చేయబడి నది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగటంతో బాబా ఆలయం ఆగస్టు 1992లో పునర్నిర్మాణం చేయబడింది. సిహెచ్. అశ్వినిదత్, వినయ కుమారి గార్లు బాబా పాలరాతి విగ్రహాన్ని బహూకరించి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించారు. ఆలయ ప్రాంగణంలోనే ధుని ఉన్నది. ఈ ఆలయంలో ప్రతి గురువారం మధ్యాహ్నం అన్నదానం జరుగుతుంది. అదే రోజు సాయంత్రం బాబాకు పల్లకి సేవ జరుగుతుంది. గురుపూర్ణిమ రోజు బాబాకు అన్నాభిషేకం జరుగుతుంది. అదేరోజు పేదలకు అన్నదానం కూడా జరుగుతుంది. విజయదశమి రోజు బాబా సమాధిని అలంకరించి, బాబాకు అనేక దీపాలతో హారతిని సమర్పించి పల్లకి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. బాబాకు చందన అలంకారం కూడా జరుగుతుంది. నూతన ఆంగ్ల సంవత్సరాదినాడు (31 డిసెంబర్) బాబా ఆలయం రాత్రంతా భక్తుల కొరకు తెరిచే ఉంటుంది. ప్రతి సంవత్సరం మాఘమాసంలో సాయివ్రతము, సహస్ర జ్యోతిర్లింగార్చన ఘనంగా జరుగుతుంది. ఉగాది పర్వదినాన బాబాకు సహస్ర కలశాభిషేకం జరుగుతుంది.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం - లబ్బీపేట - విజయవాడ



కృష్ణాజిల్లా, విజయవాడ, బందరురోడ్డు, లబ్బీపేటలో ఉన్న ఎంతో ప్రసిద్ధి చెందిన దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం. ఇది నిర్మాణం జరిగి అర్ధశతాబ్ది అయి ఉంటుంది. ఇది దేవాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఈ ఆలయ కార్య క్రమాలు నిర్వహించబడుచున్నవి. ఈ ఆలయం నిత్యం భక్తులతో ఎంతో కలకలలాడుతుంది. ఈ ఆలయంలోని స్వామి ఎంతో మహిమగల స్వామిగా ప్రసిద్ధి. పర్వదినాలలో విశిష్ట పూజలు జరుగును. ఇక్కడకు వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువే! నిత్యం పూజలు అనేకం జరుగుతూనే ఉంటాయి.

మరకత శ్రీ రాజరాజేశ్వరీ దేవాలయం - విజయవాడ



విజయవాడలోని బందరురోడ్డు, పటమట సెంటర్‌లో ఆధునిక యుగంలో అపురూపమైన శిల్పకళతో రూపుదిద్దుకున్న గొప్పదేవస్థానం ఇది. ఈ ఆలయం లోని శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారిమూర్తి అత్యంత అపురూపమైన మరకత శిల (పచ్చ)తో చెక్కబడింది. ఈ ఆలయపు గోడలన్నీ రాతితో చెక్కబడి శ్రీచక్రం లోని వివిధ చక్రాలు, వాటిలోని దేవతామూర్తులను అద్భుతంగా దర్శింపజేస్తూ ఉంటాయి. ఈ ఆలయ శిఖరం సుమారు శ్రీచక్ర ఆకారంను పోలి ఉంటుంది. అమ్మవారి ముందు కూర్మం (తాబేలు)పై మాణిక్యం (కెంపు)తో చేసిన శ్రీచక్రం అలరారుతూ ఉంటుంది. 2002లో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చే ఈ ఆలయంలో కుంకుమాభిషేకం మరియు ప్రతిష్ఠ జరుపబడింది. అధిక సంఖ్యలో భక్తులు ఈ దేవాలయాన్ని సంద ర్శిస్తారు. నిత్యపూజలతో పాటు పర్వదినాలలో విశేషపూజలు కూడా నిర్వహిస్తారు. నిత్యం ఈ ఆలయం భక్తులతో రద్దీగా ఉంటుంది.

మాచవరం దాసాంజనేయస్వామి - విజయవాడ



విజయవాడలోని ఏలూరు రోడ్డు మాచవరం ప్రాంతమునందు శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయం కలదు. విజయవాడ పట్టణంలోనే కాక రాష్ట్రంలోని నలుమూలల నుండి భక్తులు అమితంగా కొలిచే దేవాలయాల్లో మాచవరంలోని శ్రీదాసాం జనేయ స్వామి ఆలయం ప్రముఖంగా పేర్కొన వచ్చు. ఈ ఆలయానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. పూర్వం వ్యాసరాయలనే ఆంజనేయుని భక్తుడు పాదచారిగా పర్యటిస్తూ తాను బసచేసిన ఊళ్ళలో ఆంజనేయుని విగ్రహాలను ప్రతిష్టించేవాడని, ఆ పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకొని ఆంజనేయస్వామి ప్రేరణపై ప్రస్తుతం ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి వచ్చి అక్కడ శంఖు-చక్రాదులతో తనకి లభించిన స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి శ్రీ దాసాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారని తెలుస్తుంది. ఈ ఆలయంలో పూజలు నిర్వహిస్తే భక్తుల కోర్కెలు శీఘ్రంగా నెరవేరుతాయని విద్యా, ఉద్యోగ, వ్యాపారాల్లో అన్నింటా కూడా విజయం చేకూరుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. నగరంలో ఏ చోటా కొత్త వాహనాలు కొనుగోలు చేసినా శ్రీ దాసాంజనేయస్వామి వారి ఆలయం వద్ద వాహన పూజను జరిపించటం కూడా ఏనాటినుండో ఆనవాయితీగా వస్తుంది. ఇక్కడ నిత్యపూజలతో పాటు హనుమజయంతి మొదలగు పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు జరుపుదురు. ప్రతి మంగళవారంలో ఈ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోతుంది.

శివరామకృష్ణ క్షేత్రం - విజయవాడ



విజయవాడ పాత సత్యనారాయణపురం రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో దాతల సహాయంతో నిధులు సేకరించి ఈ ఆలయ సముదాయాలను నిర్మించారు. ఈ ఆలయ సముదాయాన్ని రామకోటి క్షేత్రంగా పిలుస్తారు. అక్కడ శివుడు, వెంకటేశ్వరుడు, రాముడు, కృష్ణుడు, అమ్మవారి విగ్రహాలు, ఆంజనేయ స్వామి,

నవగ్రహాలు మొదలగు దేవతామూర్తుల ప్రతిష్టలు కలవు. అందువలన భక్తులు దీనిని శివరామకృష్ణ క్షేత్రంగా పిలుస్తారు. కాలక్రమేణా ఇక్కడ దేశవ్యాప్తంగా పేరొం దిన త్యాగరాయ ఆరాధనోత్సవాలు ప్రతియేటా క్రమం తప్పకుండా జరుపుచున్నారు. దాదాపు వంద ఏళ్ళుగా వస్తున్న రామకోటి ఉత్సవాలను కూడా నిర్వహించడంతో శివరామకృష్ణ క్షేత్రానికి విశిష్టత ఏర్పడింది. ఇక్కడ నిత్యం ధార్మిక కార్యక్రమాలు, పూజలు, యజ్ఞాలు, హోమాలు నిర్వహించటం పరిపాటిగా వస్తున్నది. ప్రతినిత్యం ఇక్కడ ఏదో ఒక ధార్మిక కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాలలో పాల్గొంటారు.

శ్రీ శివకామేశ్వరీ సహిత నీలకంఠేశ్వరస్వామి - విజయవాడ


కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో అయోధ్యనగర్ ప్రాంతంలో ఈ శివకామేశ్వరీ సహిత నీలకంఠేశ్వరస్వామివారి ఆలయం ఉన్నది. శ్రీ ధర్మపరిషత్, శ్రీ మహాపరిషత్ అధ్యక్షులు శ్రీ హెచ్.ఎస్.వి. ప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్వహించబడుతున్నది. ఈ ఆలయ నిర్మాణం మూడు అంతస్తులతో కూడి ఉంటుంది. ఈ ఆలయం ముందు భాగంలో దత్తాత్రేయుని విరాట్ స్వరూపం కనిపిస్తుంది. ఈ ఆలయంలోకి ప్రవేశించ గానే ఒక ఎత్తైన వేదికపైన దశ హస్తాలతో శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకొంటుంది. మరోవైపు ధ్యానముద్రలో పరమేశ్వరుడు దర్శనమిస్తాడు. గర్భాలయానికి ముందు ధ్వజస్తంభం, గర్భాలయంలో స్వామివారు శ్రీ నీలకంఠేశ్వరునిగా భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి మాస శివరాత్రికి, కార్తీక మాసంలో, ప్రతి సోమవారం నీలకంఠేశ్వర స్వామివారికి విశేష అభిషేకం జరుగుతుంది. అన్నం, పెరుగు, శుద్ధోదకం, నెయ్యి, విభూతి, గంధం మొదలైన వాటితో ఈ అభిషేకం జరుగుతుంది. అభిషేకం తరువాత స్వామివారిని అతి సుందరంగా అలంకరిస్తారు. శ్రీ నీల కంఠేశ్వరస్వామివారికి ఎడమవైపు ప్రత్యేక ఆలయంలో శివకామేశ్వరీ దేవి కొలువుదీరి ఉన్నది. అమ్మవారు నాలుగు హస్తాలతో, పై హస్తాలలో పాశాంకుశాలను, క్రింది హస్తాలలో అభయ, వరద ముద్రలను కలిగి ఉన్నది. అమ్మవారి ముందు ఉన్న శ్రీచక్రానికి, అమ్మవారికి నిత్యం కుంకుమపూజ నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం పర్వదినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దేవీ నవరాత్రుల సందర్భంగా దశవిధ అలంకారాలతో అమ్మవారిని అలంకరిస్తారు. నీలకంఠేశ్వరస్వామివారికి కుడివైపు విజయగణపతి ఆలయం ఉంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే శ్రీ వెంకటేశ్వరుడు శ్రీదేవి, భూదేవిలతో కొలువుతీరి ఉన్నాడు. ఈ ఆలయ ప్రాంగణంలో రథాకృతి మండపాలలో గణపతి, ఆంజనేయుడు, సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయ స్వామివార్లు ఉన్నారు. ఈ ఆలయ ప్రాంగణంలోని రెండవ అంతస్తులో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం

ఉన్నది. ఈ ఆలయంలో ఒక ఉన్నత పీఠంపై సాయినాథుడు ఆసీనులై ఉన్నారు. మూడవ అంతస్తులో నిత్యజీవితంలో తారసపడే ద్వాదశరాశులు కొలువై ఉన్నాయి. గ్రహదోషాలతో బాధపడేవారు ఈ రాశుల క్రింద ఉన్న దైవాన్ని పూజిస్తే గ్రహదోషాల నుండి విముక్తి పొందగలరని భక్తుల విశ్వాసం.

శ్రీ సాయిబాబా దేవాలయం -ముత్యాలంపాడు



కృష్ణాజిల్లా విజయవాడ పట్టణంలోని ముత్యాలంపాడులో శ్రీ సాయిబాబా ఆలయం ఉన్నది. 1988వ సంవత్సరం మార్చి 10న ఈ సాయి మందిరాన్ని నిర్మించి సాయిబాబా చిన్న విగ్రహాన్ని చందోలు రాఘన నారాయణ శాస్త్రి గారిచే తయారుచేసిన ఆకర్షణ యంత్రంతో సాయి బాబాను ప్రతిష్టించారు. దాదాపు 10 సంవత్సరముల తరువాత 1998 జులై 9వ తేదీన సాయిబాబా పెద్దవిగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆనాటి నుండి ఈ ఆలయం భక్తులతో కళకళ లాడుతుంది. మందిరంపై ఉన్న స్థూపాకార గోపురం ఉన్నతంగా ఉండి చాలా దూరం వరకు కనిపిస్తుంది. ఈ గోపురంపైన అర్జునుడికి గీతాబోధ చేస్తున్న శ్రీకృష్ణుని విగ్రహం ఉంటుంది. మందిరగోడపై నిలువెత్తు సాయినాథుని ప్రతిమ కనిపిస్తుంది. ఒకే పీఠంపై రెండు సాయినాథుని విగ్రహాలు పూజలందుకోవటం ఈ ముత్యాలంపాడు సాయిబాబా ఆలయ ప్రత్యేకత. ఈ సాయి మందిరంలో ఉదయం కాగడ హారతితో బాబా అర్చనలు ప్రారంభం అవుతాయి. తరువాత బాబాకు అభిషేకం జరుగుతుంది. ప్రతి గురువారం ఈ అభిషేకాన్ని భక్తులే స్వయంగా నిర్వహిస్తారు. పెద్దదైన బాబా ప్రధాన విగ్రహానికి సహస్రధారతో అభిషేకం చేయటం జరుగుతుంది. ప్రతి గురువారం, ప్రతి ఆదివారం భక్తులు భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ ఆవరణలోనే ద్వారకామాయిలో వేంచేసి ఉన్న బాబాను భక్తులు దర్శించుకొంటారు. ఈ ఆలయ ప్రాంగణములోగల వినాయక మందిరంతో పాటూ, ఎక్కిరాల భరద్వాజ స్వామివారి మందిరం కూడా ఉన్నాయి. బాబాదర్శనం అనంతరం ఈ ఆలయ ప్రాంగణంలోగల బాబా ధుని చుట్టూ ప్రదక్షిణ చేసి ధునిలో భక్తులు కొబ్బరికాయలు సమర్పించు కొంటారు. ఈ ప్రాంగణములోనే ఉన్న అశ్వత్థ వృక్షము క్రింద నాగేంద్ర స్వామి



వారి పుట్ట ఉన్నది. ఈ పుట్ట సమీపంలో సర్పాకృతి ఉన్నది. భక్తులు ఈ దేవతా వృక్షానికి, సర్పాకృతికి కూడా పూజలు చేస్తారు. ఇచ్చటనే మద్దివృక్షం క్రింద గురుస్థానం ఉంటుంది. ప్రత్యేక మందిరంలో ఈ గురు భారీ బాబా చిత్రం భక్తులకు కనువిందు చేస్తుంది. ఈ చిత్తరువు ముందు సాయి దివ్య పాదుకలు ఉన్నాయి. ఈ మందిర ప్రాంగణంలోనే దాసాంజనేయస్వామి వారి మందిరం ప్రత్యేకంగా నిర్మించబడి ఉన్నది. సాయికి ఇష్టమైన లెండివనం కూడా ఈ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం సాయినాథునికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ ఘనంగా నిర్వహిస్తారు. ఈ సేవలో భక్తులు ఎక్కువ మంది పాల్గొని బాబా అనుగ్రహానికి పాత్రులౌతారు.

మొగల్రాజపురం దుర్గాదేవి - విజయవాడ

కృష్ణాజిల్లా విజయవాడ పట్టణంలోని మొగల్రాజపురం కొండమీద శ్రీ కనకదుర్గాదేవి ఆలయం ఒకటి ఉంది. ఈ కొండపైకి వెళ్ళుటకు మెట్ల దారి ఉంది. కొండ పైకి సుమారు 500 మెట్లు ఎక్కిన తరువాత కనకదుర్గామాత ఆలయ మండపం మనకు ఎదురౌతుంది. ఈ ఆలయ మండపం వద్ద ఒక సొరంగంలో శ్రీ కనకదుర్గాదేవి మనకు దర్శనమిస్తుంది. విజయవాడలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ మొదట మొగల్రాజపురం కొండమీద వెలిసిందనీ, ఆ తరువాత ఇంద్రకీలాద్రి కొండమీద వెలసిందని కొంతమంది అభిప్రాయం. ఈ ఆలయంలో ప్రతినిత్యం పూజలతోపాటు పర్వదినాలలో కుంకుమ పూజలు అభిషేకాలు జరుగుతాయి. నిత్యం భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

గంగా పార్వతీ సమేత శ్రీ శంభులింగేశ్వరస్వామి వారి ఆలయం - విజయవాడ

కృష్ణాజిల్లా విజయవాడ పట్టణంలోని మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌కి దగ్గరలో ఈ శ్రీ గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయం ఉన్నది. ఇది పురాతన ఆలయంగా ప్రసిద్ధి. మన దేశాన్ని రెడ్డి రాజులు, చోళులు మొదలైన రాజులు పాలిస్తున్న రోజుల్లో ఢిల్లీ పీఠాన్ని మహమ్మదీయ చక్రవర్తులు ఏలేవారు. అప్పుడు గోల్కొండను పరిపాలించే నవాబుల ఆధీనంలోకి ఈ దేవాలయం వచ్చింది. విజయవాడ దగ్గరలో ఉన్న కొండపల్లి దుర్గం అప్పుడు మొగలాయిల సైన్యములున్న ప్రదేశం.

అందువలన ఆ ప్రదేశానికి మొగల్రాజపురం అనే పేరు ఏర్పడింది. ఆ ప్రదేశము ఈనాటికి కూడా అదే పేరుతో పిలువబడుతుంది. ఈ దేవాలయం పురాతనమైనదే గాక ఇక్కడి స్వామివారు చాలా మహిమ గలవారు అని భక్తులు భావిస్తారు. ఇక్కడ పర్వదినాలలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

కాశీ అన్నపూర్ణ దేవాలయం - విజయవాడ



విజయవాడ నగరంలోని శివక్షేత్రాల్లో అతి ప్రాచీనమైన దేవాలయంగా కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం ప్రసిద్ధి. 105 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎందరో భక్తులు కాశీ విశ్వేశ్వరుని అన్నపూర్ణను దర్శించుకుని సేవించారు. అప్పన వెంకట కృష్ణయ్య, అద్దెపల్లి వెంకటప్పయ్య అనే ఇద్దరు శివ భక్తులు శివనామ స్మరణతో ఆధ్యాత్మిక జీవనం చేస్తుండేవారు. ఈశ్వరుని సేవించుకునేందుకు పరమ పవిత్రక్షేత్రం అయిన కాశీకి వెళ్లారు. అక్కడ కాశీ విశ్వేశ్వరుని దర్శించుకునేందుకు వెళ్ళేముందు గంగానది తీరంలో స్నానం ఆచరిస్తుండగా వీరు మునిగి పైకితేలిన వెంటనే వారి చేతిలో శివ లింగాలు దోసిళ్ళలోకి వచ్చాయి. వీరు వీటిని పరమ పవిత్రంగా ఈశ్వరుని ఆదేశంగా భావించి నగరానికి వచ్చి చల్లపల్లి బంగ్లావద్ద గల ప్రదేశంలో 1909 మార్చి 3వ తేదీ శుద్ధ ఏకాదశి బుధవారం నాడు వీటిని ప్రతిష్టించారు. అప్పటినుండి ఆధ్యాత్మికతతో కూడిన భక్తి కార్యక్రమాలతో ఆ ప్రాంతం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిలోకి వచ్చింది. మరికొంత కాలానికి అక్కడ దేవాలయాన్ని నిర్మించి వారి వంశీకులు స్వామివారిని ఆరాధిస్తూ, అభిషేకిస్తూ గడిపారు. భక్తులు కూడా స్వామి వారిని కొలుస్తూ తమ మనోభిష్టాన్ని నెరవేర్చాలని కోరుతూ స్వామి అనుగ్రహం పొందేందుకు పూజాధికాలు నిర్వహించారు. దినదిన ప్రవర్ధమానంగా ఈ దేవాలయం ప్రసిద్ధి పొందింది. 100 సంవత్సరాలు పూర్తయిన తరువాత నుండి అప్పన వారి వంతులు వచ్చిన తరువాత పూజాధికాలు విశేషంగా జరుగుతున్నాయి. మహాకుంభాభిషేకం, సహస్రశంఖాభిషేకం, రుద్రయాగం చండి పారాయణం, మహాయజ్ఞాది క్రతువులు నిర్వహించారు. ఆరోజు నుండి భక్తుల కొరకు ఆ ఇరువురు వంశీకులు ప్రతి మాసశివరాత్రిరోజు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, శాంతి కళ్యాణం నిర్వహిస్తూ

స్వామివారికి అనుగ్రహ పాత్రులవుతున్నారు. స్వామివారికి ప్రీతికరమైన ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేస్తున్నారు. ప్రతినిత్యం భక్తులకు ఉచిత ప్రసాద పంపిణీ చేస్తున్నారు.

100 సంవత్సరాలు తరువాత నుండే దేవాలయాన్ని సుందరంగా అలంకరించి భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పనకు శ్రద్ధ తీసుకున్నారు. దేవస్థాన ధర్మకర్తలైన అప్పన సూర్యనారాయణ, మోహనరావు, వెంకట సత్యనారాయణలు ఈ విశేష పూజ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవాలయం చుట్టు ఉన్న గోడలపై స్వామి వారి ప్రతిమలను వివిధ రూపాల్లో పెయింటింగ్‌లు చేయించారు. దేవస్థానం ఆవరణలో ఫ్లోరింగ్ జనరేటర్ నిత్య ప్రసాదాలు, విశేషపూజ కార్యక్రమాలు, ధర్మ కర్తల సహాయంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవస్థానం ఆవరణలో ఉన్న కోటిలింగాల చెట్టు పుష్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ పువ్వులు పరమశివునికే అర్పితం. ఈ పువ్వులు శివార్చనకే ఉపయోగిస్తారు. ఫిబ్రవరిలో లక్ష రుద్రాక్షలపూజ, రుద్రయాగం, సర్వదేవత హోమాలు జరుగుతాయని తెలిపారు. ఈ దేవాలయంలో కాశీ విశ్వేశ్వరుడు అన్నపూర్ణమ్మ, భద్రకాళీ, నవగ్రహాలు, నాగేంద్రస్వామి, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యస్వామిలకు పూజలు ప్రతినిత్యం జరుగుతుంటాయి. ప్రతి షష్టికి సుబ్రహ్మణ్యశ్వరునికి విశేష పూజలు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 6 గంటలు నుండి 12 గంటలు వరకు అభిషేకాలు, జపాలు, హోమాలు జరుపుతారు. విశేష పవిత్రదినాల్లో కార్తీక మాసం, శివరాత్రిలో శరన్నవరాత్రులలో అమ్మవారికి త్రికాల పూజలు, మహామంత్ర అనుష్టానం, అభిషేకాలు, నిత్య అభిషేక వితరణలు జరుగుతాయి. ప్రత్యేకంగా శ్రావణ మాసంలో సుహాసినిలకు, ముత్తయిదువలతో ఉచితంగా పూజలు చేయిస్తారు. ప్రతినిత్యం లక్ష్మి గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ నిత్య హోమాలు, జపాలు ఘనంగా జరుగుతాయని ప్రధాన పురోహితులు సాధు శ్రీనివాస్ తెలిపారు.

శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం - విజయవాడ



కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో ఈ ఆలయం ఉంది. ఒకప్పుడు బెజవాడకు పొలిమేరగా చిట్టడివిగా ఉన్న ప్రాంతంలో ఉన్న మహాలక్ష్మి ఆలయం నేడు చిట్టినగర్ కొత్త అమ్మవారి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉన్నది. 1951 ఏప్రిల్ 1న మహాలక్ష్మి

అమ్మవారికి ఒక ఆలయాన్ని నగరాల కులస్తులు నిర్మించారు. గర్భాలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ఇరువైపులా గంగానమ్మ, ముత్యాలమ్మలు కొలువుదీరి ఉన్నారు. ఇచ్చట శ్రావణ శుక్రవారం, మంగళవారం ప్రత్యేక పూజలు జరుగుతాయి. అమ్మవారికి భక్తులు తమ కోర్కెలు నెరవేరుటకు ఇచ్చట 11 ప్రదక్షిణలు చేస్తారు. 1974లో నగరాలవారంతా కలసి కొత్తపేట బ్రాహ్మణవీధిలో రామాలయంతోపాటు శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి శ్రీ మరుపిళ్ళ హనుమంతరావు అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ 1996లో జీర్ణస్థితికి చేరిన మహాలక్ష్మి ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయానికి దక్షిణభాగంలో శ్రీ పద్మావతీ, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించి 2011 జూన్ 18న విగ్రహ ప్రతిష్టలు జరిపించారు. ఈ ఆలయంలో ఎత్తైన ధ్వజస్తంభం ఉంటుంది. ఆలయానికి దక్షిణ ఆగ్నేయభాగంలో 18 అడుగుల దశావ తారమూర్తి శ్రీ వేంకటేశ్వర స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయంలోని ధ్వజస్తంభం చుట్టూ అష్టదికాల్పలకులను ప్రతిష్టించారు. ఈ ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించినవారు తిరుమల తిరుపతిలో స్వామిని దర్శించిన అనుభూతి పొందుతున్నారు. చిట్టినగర్‌లోని ఈ ఆలయం చిట్టి తిరుపతిగా పిలువబడుతుంది. ఈ ఆలయంలో ధనుర్మాసంలో గోదాదేవి, వెంకటేశ్వర స్వామివార్లకు తిరుప్పావై సేవ, స్వామివారికి తోమాలసేవ, కైంకర్యాలు జరుగుతాయి. ఇచ్చట వైకుంఠ ఏకాదశికి ఉత్తరద్వార దర్శనం ఉంటుంది. నెల నెల శ్రవణా నక్షత్రంలో పంచామృత అభిషేకాలు, శృంగార హారతులు, సంధ్యవేళలో నక్షత్ర హారతులు, మధ్యాహ్న హారతులు శాస్త్రోక్తంగా సమర్పించబడుతున్నాయి. ఈ ఆలయ ప్రాంగణంలో గరుడాళ్వార్ సన్నిధి, శ్రీ దాసాంజనేయస్వామివారు, శ్రీ విష్వక్సేన భగవానుడు, నవగ్రహం మంటపం, నాగేంద్రస్వామి వారు మొదలగు దేవతామూర్తులు దర్శనమిస్తాయి. శరన్నవరాత్రులకు ఇచ్చట గొప్ప ఉత్సవం జరుగుతుంది. కార్తీకమాసంలో లక్షదీపారాధనతోపాటు, హనుమజ్జయంతి, శనిత్రయోదశి ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు.

శ్రీ అయ్యప్ప దేవాలయం - గొల్లపూడి

ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ గుడికి కొద్దిదూరంలో 9వ నెంబరు జాతీయ రహదారి పక్కన కొలువై ఉన్న ఈ అయ్యప్పస్వామి దేవాలయం విజయవాడ పట్టణంలో కొండ పల్లి వెళ్ళే దారిలో గొల్లపూడిలో కలదు. కేరళ రాష్ట్రంలోని శబరిమలై తర్వాత అంతటి ప్రాముఖ్యం కలిగిన శ్రీ అయ్యప్ప దేవాలయం 1975లో రాష్ట్రంలో మొట్ట మొదటి అయ్యప్ప దేవాలయాన్ని కేరళ శబరిమలై తపశ్వి శ్రీ స్వామి విమోచనా నంద మహరాజ్ గారిచే ఈ ప్రాంతంలో నిర్మించారు. తర్వాత అనేక ఆలయాలను



నెలకొల్పినా దీని ప్రాముఖ్యత, ప్రత్యేకత దీనిదే. ఈ అయ్యప్పస్వామి ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఇది శబరిమలైలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం ఉన్న విధంగానే ఉంటుంది. ఇక్కడ పూజలన్నీ కేరళ నంబూద్రి బ్రాహ్మణులతో, శబరిమలై ఆచార వ్యవహారాల ప్రకారం నిర్వహిస్తారు. నిత్య పూజలతో పాటు సంక్రాంతి పర్వదినాన మకర జ్యోతి దర్శనం కూడా నిర్వహిస్తారు. ఆనాడు జ్యోతి దర్శనానికి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. కృష్ణానదీ పుష్కరాలలో 12 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అన్నదానం, ప్రసాదాల పంపిణీ వంటివి కార్యక్రమాలు ఆలయ కమిటీవారు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం - వెన్నూతల

కృష్ణాజిల్లా, విజయవాడకు 25 కి.మీ., దూరంలో, ఉంగూరు మండలం, వెన్నూతల గ్రామములో శ్రీ రామలింగేశ్వరస్వామి వారిఆలయం కలదు. ఈ ఆలయం చాలా పురాతనమైనది. దాదాపు 150 సంవత్సరాల క్రితం నిర్మించబడినట్లు తెలియుచున్నది. 2006-07లో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆ సమయములో జరిగిన తవ్వకాలలో లభ్యమైన ఆధారాల ప్రకారము ఈ ఆలయమును 1880 ప్రాంతంలో నిర్మించి ఉంటారని పెద్దలు చెబుతున్నారు. ఈ ఆలయమును కప్పగంతు మరియు లొల్లా వారి కుటుంబముల వారు నిర్మించినట్లు తెలియుచున్నది. ఈ ఆలయము ముందు ఒక పెద్ద కోనేరు (చెరువు) ఉంది. ప్రతి సంవత్సరం మే నెలలో వైశాఖ పౌర్ణమి రోజున రామలింగేశ్వరస్వామి వారి కల్యాణం జరుగుతుంది. చుట్టుప్రక్కల గ్రామాలనుంచి భక్తులు స్వామివారి కళ్యాణం తిలకించి ఆనందిస్తారు. ఇక్కడ కోనేరునిఆనుకొని ఒక రామాలయం కూడా ఉన్నది.

శ్రీ విరూపాక్షస్వామి వారి ఆలయం - కొండపల్లి

కృష్ణాజిల్లా, విజయవాడకు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఇబ్రహీంపట్నం మండలంలో ఉన్న కొండపల్లికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉంది. రెడ్డిరాజుల కాలంలో నిర్మించబడిన ఖిల్లా కాలక్రమేణా విజయనగర ప్రభువు శ్రీ కృష్ణదేవరాయల ఆధీనంలోకి వచ్చింది. కొండపల్లి ఖిల్లాకి నడిచి వెళ్ళే దారిలో ప్రక్కనే కొండకు

ఆనుకొని ఉన్నది ఈ ఆలయం. శ్రీ విరూపాక్ష స్వామి ఆలయాన్ని శ్రీ కృష్ణ దేవరాయలు నిర్మించినట్లుగా పూర్వీకులు చెప్తారు. సుమారు ఐదు వందల ఏళ్ళుగా ప్రకృతి విపత్తులకు తట్టుకుని నిలబడ్డ ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్థులు, భక్తుల సహకారంతో ఇటీవలనే పునర్నిర్మాణం చేయడం జరిగింది. శిఖరం, విమానం, ఆలయ మంటపంతో పాటు ఆలయం అంతా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. శ్రీ కృష్ణదేవరాయల ఇష్టదైవము శ్రీ విరూపాక్ష స్వామి వారు. ఆనాడే కాదు. ఈనాడు కూడా గొప్ప మహిమలు గల స్వామిగా భక్తుల హృదయాలలో నెలకొని ఉన్నాడు. చుట్టుప్రక్కల గ్రామాలవారు కూడా వచ్చి ఈ స్వామి దర్శనం చేసుకొని వారి యొక్క భక్తి భావనను చాటుకుంటారు.

గంగా శ్రీ బాల త్రిపురసుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి - చినకళ్ళేపల్లి



కృష్ణాజిల్లా ఘంటశాల మండలం చినకళ్ళేపల్లిలో శ్రీ గంగాబాల త్రిపురసుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. ఈ ఆలయం ఎంతో పురాతనమైనది. ఈ ఆలయం 1899 ప్రాంతంలో నిర్మించబడినట్లు తెలుస్తుంది. ఈ ఆలయంలోని శ్రీ నాగేశ్వరస్వామి స్వయంభువుగా ప్రసిద్ధి చెందాడు. ఈ ఆల యాన్ని కంచికామకోటి పరమాచార్యులు దర్శించి పూజించారని తెలుస్తుంది. ఈ ఆలయంలో దసరా ఉత్సవాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు, కార్తీకమాస ఉత్సవాలు కూడా ఘనంగా నిర్వహిస్తారు. దసరా పర్వదినాలలో 10 రోజులూ తమిళ నాడు, కేరళలో జరిగే విధంగా సరస్వతి అలంకరణ రోజు బాల పూజలు, దుర్గాష్టమి రోజు కన్యలచే అమ్మవారికి గులాబి అర్చన, మహర్నవమి రోజు మహిషాసురమర్ధిని అలంకరణ, విజయదశమి రోజు ఘనంగా ఊరేగింపు గొప్పగా జరుగుతుంది. కార్తీకమాసంలో స్వామివారికి బ్రాహ్మీముహూర్తంలో అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఫల్గుణ పూర్ణిమనాడు స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. కార్తీక మాసం, మహాశిరాత్రి పర్వదినాల్లో ఈ ఆలయంలో స్వామిని ఆరాధిస్తే మిగిలిన దేవతల ఆశీస్సులు కూడా లభించగలవని భక్తుల నమ్మకం. పర్వదినాలలో ఆలయంలో రద్దీ అధికంగా ఉంటుంది.

గంగా పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వరాలయం - గుడ్లవల్లేరు



కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరులో గంగా పార్వతీ సమేత శ్రీ సిద్ధేశ్వరాలయం ఉన్నది. ఈ ఆలయం సుమారు 400 సంవత్సరాల క్రితం నిర్మింపబడి శిథిలావస్థకు చేరుకొనగా 1993లో నూతనంగా నిర్మించబడింది. విశాలమైన ప్రాంగణంలో నిర్మించ బడిన ఈ ఆలయంలో ముఖద్వారంపై పార్వతీ, పరమేశ్వరుల మూర్తులు దర్శనమిస్తారు. ప్రధానమండపము మధ్య మండపంలో శ్రీ సిద్ధేశ్వరస్వామి వారు దర్శనమిస్తారు. ఆయనకు ఒక ప్రక్క మందిరంలో పార్వతీ మాత చతుర్భుజాలతో దర్శనమిస్తుంది.

శ్రీ శోభనాచల వ్యాఘ్ర నరసింహస్వామి - ఆగిరిపల్లి



ఈ ఆలయం విజయవాడ నుంచి నూజి వీడుకు వెళ్ళే మార్గంలో విజయవాడ నుండి 25 కి.మీ. దూరంలో ఆగిరిపల్లి అనే గ్రామములో ఉన్నది. ఇక్కడ ఉన్న కొండను శోభనాచలం అంటారు. ఇచ్చట కొలువైన శ్రీ శోభనాచల వ్యాఘ్ర నృసింహ స్వామి స్వయంభువు. ఈయన అత్యంత మహిమగల స్వామి. ఈ ఆగిరిపల్లి దక్షిణ సింహాచలం అని ప్రసిద్ధి పొందినది. కిరి అనే మాటకు వరాహ అనే అర్థం ఉంది కనుక ఈ ప్రాంతానికి ఆకిరిపల్లి అనే పేరు వచ్చినట్టు చెబుతారు. రానురాను ఇది ఆగిరిపల్లిగా మార్పుచెందింది. తమిళ ఆళ్వార్లు కూడా ఇక్కడ కొలువుతీరి ఉన్నారు. ఆలయంలో నమ్మాళ్వార్ అధ్యయనోత్సవం ప్రతి ఏటా జరుగుతుంది. పూర్వం శుభవ్రతుడనే రాజు ఇక్కడ శివకేశవుల కోసం గొప్ప తపస్సు చేసి, వారిని ఈ కొండపై తనకు దర్శనమివ్వవలసిందిగా కోరాడు. భక్తుని కోరిక మేరకు శివుడు,శ్రీమహావిష్ణువు కొండపైవెలవగా, శుభవ్రతుడి పేర ఈ కొండ శోభనాద్రిగా పిలువబడింది. శోభనాద్రికి పశ్చిమదిశగా మహిమగలవరాహాతీర్థంఉంది.

ఈ గ్రామమునందు రెండు లక్ష్మీ నరసింహ ఆలయాలు కలవు. అందులో ఒకటి పర్వతం పైన ఉన్న గుహయందు, మరొకటి పర్వత పాదభాగము నందు కలవు. గుహయందున్న నరసింహుడు స్వయంభువుడు. ఆ కొండపైకి వెళ్ళేందుకు అత్యంత అరుదుగా కన్పించే పొడవాటి, వెడల్పయిన 750 మెట్లు కొండపైనున్న మూలవిరాట్టు వరకు ఉంటాయి. రానురాను వారికి ఆ కొండ ఎక్కడం కష్టమనిపించి భక్తులందరూ స్వామివారిని క్రిందికి దిగిరమ్మని ప్రార్థించారు. భక్తుల ప్రార్ధనలను ఆలకించిన శ్రీలక్ష్మీ నరసింహుడు అక్కడినుండి పర్వతపాద భాగానికి వచ్చి పూజ లందుకొనుచున్నాడని తెలియుచున్నది. ఇది 500 సంవత్సరాల క్రితం జరిగినదని స్థానిక పెద్దలు చెప్పే కథ. ఇక్కడ అర్చక స్వాములు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 750 మెట్లు ఎక్కి, పూజ, నివేదనలు చేసి వస్తారు. ప్రతి రోజు స్వామివారి నివేదనలో వ్యంజనంగా ఎండుమిరపకాయల తిరగ మోతతో వేసిన చింతపండు బండపచ్చడి తప్పనిసరిగా పెడతారు. గుహయందున్న ఆలయంతో పాటు పర్వత పాదభాగమందే ర్పడిన ఆలయము కూడా ఎంతో గొప్ప ప్రజాదరణ పొందినది. క్రమంగా ఈ ఆగిరిపల్లి క్రీ.శ. 1802లో నూజువీడు వెలమజమీందారుల పరిపాలనలో ఈ ఆల యాలకు వందలకొలది ఎకరాల భూమిని దానంగా ఇచ్చి ఆదరించారు. పర్వత పాదభాగమందున్న ఈ ఆలయము దక్షిణాభిముఖంగా ఉన్నది. గర్భాలయం, అంత రాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. గర్భాలయంలో శ్రీ వ్యాఘ్ర లక్ష్మీ నరసింహుడు, అంతరాలయంలో కుడివైపున రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఎడమ వైపున యోగానంద ఆంజనేయ స్వామివారు ఆ తరువాత పవళింపుసేవా మందిరము, మండపంలో వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, సీతారామచంద్రమూర్తి, లక్ష్మీనరసింహస్వామి మొదలగు దేవతామూర్తులను దర్శించుకొనవచ్చును. ప్రతి రోజు కొండమీద ఉన్న ఆలయంలో ప్రత్యేకంగా అమరిక చేసిన గూట్లో దీపాన్ని పెట్టటం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ జ్యోతి విజయవాడ వరకు కనిపించేదని చెబుతారు. కుజ దోషం ఉన్నవారు, వివాహం ఆలస్య మౌతున్నవారు ఈ స్వామివారికి కళ్యాణం చేయిస్తే వారికి వివాహం కాగలదని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఈ పవిత్ర ఆలయంనందు రోజువారీ పూజలతో పాటు అర్చనలు, ప్రత్యేకపూజలు, ఉగాది, వినాయకచవితి, దసరా, కార్తీకమాస, ధనుర్మాస పూజలు, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి తెప్పోత్సవము, కళ్యాణోత్సవములు మహావైభవముగా జరుగును. పర్వదినాలలో భక్తులు ఈ ఆలయాన్ని అధిక సంఖ్యలో దర్శించుకొందురు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం - పెనుగంచిప్రోలు



కృష్ణాజిల్లాలో హైదరాబాదు – విజయవాడ మార్గంలో విజయవాడకు 78 కి.మీ., దూరంలో, నందిగామకు దగ్గరలో జగ్గయ్యపేటకు 20 కి.మీ. దూరంలో మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామమునందు శ్రీ తిరుపతమ్మ తల్లి దేవాలయం కలదు. ఈమె ఒక సాధారణ గృహిణి. తన భర్త గోపయ్య మరణానంతరం భర్తతో పాటు సహగమనం చేసి వెంటనే పేరంటాలుగా వెలసి, దేవతగా ఆరా ధనలందు కొనుచున్న పేరంటాలు దేవత.

చరిత్ర : పెనుగంచిప్రోలు గ్రామం క్రీ.శ.1700 ప్రాంతంలో శ్రీ రాజా వాసిరెడ్డి జగ్గ భూపాలుని పరిపాలనలో ఉండేది. అప్పుడు అనిగళ్లపాడు గోగినేనిపాలెం గ్రామంలో కొల్లాశివరామయ్య, రంగమాంబ దంపతులకు తిరుపతమ్మ జన్మించింది. ఆమె బాల్యం నుండి ఎంతో గారాబంగా పెరుగుతూ, సంప్రదాయాలను పాటిస్తూ, నియమనిష్ఠలతో దైవభక్తితో గడుపుతూ ఉండేది. యుక్తవయస్సు వచ్చిన తరువాత మేనమామ కుమారుడైన కాకాని గోపయ్యతో ఆమె వివాహం జరిగినది. వివాహమైన తరువాత తిరుపతమ్మ అత్తవారింటికి పెనుగంచి ప్రోలు వచ్చినది. తిరుపతమ్మ అత్తవారింట అడుగుపెట్టగానే ఆ గ్రామమే కాకుండా ఆ చుట్టుప్రక్కల గ్రామాలు కూడా పాడిపంటలతో, సస్యశ్యామలంగా, సుభిక్షంతో కళకళలాడాయి. ఎలాంటి కరువు కాటకాలు లేకుండా ప్రజలు ఎలాంటి బాధలు పడకుండా ఆరోగ్యంతో ఐశ్వర్యాలతో జీవించారు. ఇదంతా తిరుపతమ్మ ప్రభావమని అందరూ ఆమెను ధర్మాత్మురాలుగా కీర్తించారు. ఆమె తన నడవడికతో భర్తను, అత్తమామలను, బంధుమిత్రులను గౌరవించి అందరిచేత గౌరవింపబడి, ఆ గ్రామంలోనే ఉత్తమ యిల్లాలుగా అందరి మన్ననలను పొందినది.

ఈవిధంగా కొంతకాలం జరిగిన తరువాత ఒక సంవత్సరం ఎండలు బాగా పెరిగి వర్షాలు కురవక కరువు కాటకాలు సంభవించినవి. ప్రజలు అహోలక్ష్మణా అని అల్లాడిపోయారు. పశువులు మేతలేక విలవిలలాడాయి. ఏడు దొడ్ల ఆలమందగల పశువులను మేపడం కోసం కంచికచర్లకు దగ్గరలో ఉన్న ఉత్తరారణ్యాలకు బయలుదేరి

వెళ్ళాడు గోపయ్య. వెళ్ళిన కొద్దిరోజులకే తిరుపతమ్మకు అత్త, తోడికోడల ఆరళ్ళు మొదలైనవి. ఇంట్లో అడ్డమైన చాకిరీ చేయించి సరిగా అన్నం పెట్టకుండా బాగా పీడించారు. చాలీచాలని ఆహారంతో చాకిరీ ఎక్కువై చిక్కిశల్యమై పోయింది. ఆవిధంగా తిరుపతమ్మ కుష్ఠువ్యాధి గ్రస్తురాలైంది. అత్త ఆమెను ఇంటి నుండి గొడ్ల చావిడిలోకి నెట్టివేసి అక్కడే ఉండమని ఆజ్ఞాపించింది. ఆ గొడ్ల చావిడిలో బ్రతుకు వెళ్ళబుచ్చుతున్న తిరుపతమ్మకు పాపమాంబ అనే ఒక స్త్రీ ధైర్యం చెప్పి ఆమెకు సపరియలు చేసి ఓదార్చింది. తిరుపతమ్మ ఇలాంటి స్థితిలో ఉండగా విధి వికటించి పశువులను మేపడానికి వెళ్ళిన గోపయ్యను ఒక పెద్దపులి చంపివేసింది. విషయం తెలిసిన తిరుపతమ్మ భోరున విలపించి, ఇక తను జీవించడం అనవసరమని తలచి విధివిధానం తెలుసుకుని తన అవతార సమాప్తం గురించి గ్రామాధికారులకు తెలియజేసి, తాను ఈ క్షేత్రము నందే దేవతగా వెలసి భక్తుల కోర్కెలు తీర్చెదనని, మాఘశుద్ధ పౌర్ణమినాటి అస్తమించు సూర్యునిలో గోపయ్యస్వామినీ, ఆనాడు ఉదయించు చంద్రునిలో తనను ఆచంద్రతారార్కం దర్శించి తరించగలరని వారికి తెలియజేసింది. అంతేకాకుండా గొడ్లచావిడిలో పడి ఉన్న తనకు చివరిదశలో ఎన్నో సేవలు చేసిన పుణ్యాత్మురాలైన ముదిరాజు పాపమాంబను కూడా తిరుపతమ్మ కరుణించింది. ఈనాటినుండి తన ఆలయంలో పూజలు నిర్వహించే వరం పాపమాంబ వంశీకులకే చెందుతుంది అని తిరుపతమ్మ పాపమాంబకు కూడా వరం ప్రసాదించింది. ఆనాడు సహగమనమనే సంప్రదాయం కొనసాగుతుంది. వెంటనే చితిపై ఆమె తన భర్త పాదరక్షలు తన ఎదపై పెట్టుకొని ఆమె సహగమనం చేసి తన తనువు చాలించి వెంటనే దేవిగా అవతరించి గ్రామవాసుల చేత పూజలందుకొన్నది. ఆవిధంగా వెలసిన దేవియే పుణ్యమూర్తి తిరుపతమ్మ పేరంటాలుగా ప్రసిద్ధి పొందినది.

17వ శతాబ్ధంలో గుంటూరు జిల్లా 'అమరావతి' రాజధానిగా శ్రీరాజవాసిరెడ్డి జగ్గభూపాలుడు పవిత్రమున్నేటి తీరమున పెను గంచిప్రోలు గ్రామములో శ్రీ లక్ష్మి తిరుపతమ్మకు ఒకఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో తిరుపత మ్మతో పాటు గోపయ్య విగ్రహం కూడా ప్రతిష్ఠింపబడినది. ఆ తరువాత ఆ ప్రాంగణంలోనే గ్రామ దేవత అయిన శ్రీ ఆదిశక్తి మద్ది రామమ్మ అమ్మవారిగుడి, ఉన్న ఊరు అంకమ్మ అమ్మవారి గుడి, వినుకొండ అమ్మవారి గుడి, మల్లయ్య, చంద్రమ్మ, జ్యేష్ఠాదేవి మొదలగు సహ దేవతలు ఈ ఆలయంలో నిత్యపూజలతో ఆరాధింపబడుతున్నారు. వానియన్నిం టిలో తిరుపతమ్మ అమ్మవారి గుడియే ప్రధానమైనది మరియు భక్తుల తాడికి కలది కూడా.

క్రమంగా ఈ అమ్మవారి మహిమ స్థానికులనేగాక అన్ని జిల్లాల వారిని కూడా ఆకర్షించింది. ఇప్పుడు ఇది ఒక మహా క్షేత్రం. ఈ క్షేత్రంలో ఇప్పుడు ప్రాచీన అర్చకులతో పాటు, బ్రాహ్మణార్చకులు గూడా పనిచేయుచున్నారు. తామసిక పూజలు తొలగించబడినాయి. సాత్విక పూజలే కొనసాగుతూ ఉన్నాయి. ఈ క్షేత్రంలో ప్రతి సంవత్సరం మాఘ పూర్ణిమనుండి ఐదురోజు లును, ఫాల్గుణ పూర్ణిమ నుండి ఐదు రోజులు



రెండుతిరునాళ్ళు జరపుతారు. ఇవియునుగాక ప్రతిరెండు సంవత్సరాల కొక సారిరంగుల మహోత్సవం, మరియు ప్రత్యేకోత్స వాలు మహా వైభవముగా జరుగును. తిరుమలేశుని దివ్య సంకల్ప ఫలంగా, తిరు శుభనామముతో శక్తిస్వరూపిణిగా కలియుగమున లోకకళ్యాణార్థం, అవతరించిన దివ్యదేవత శ్రీ తిరుపతమ్మ తల్లి. భక్తజనకోటి ఈ తల్లికి తిరుమల తిరుపతి పుణ్య క్షేత్రములో వలెనే తలనీలాలు, గండదీపాలు, పసుపు కుంకుమలు, పట్టు వస్త్రములు, పండిన తొలిపంటలు, గోదానం, పాలపొంగళ్ళు మొదలగునవి ఆచారంగా భక్తి శ్రద్ధలతో సమర్పించుకుంటారు. అన్నప్రాసనం, నామకరణం, కళ్యాణం, కుంకుమార్చనాది, ఎన్నో విశేష పూజలతో ప్రతినిత్యం అశేష భక్తకోటిచే పూజలందుకొనుచున్నది. ఈ మధ్యనే అమ్మవారికి వజ్రకిరీటం చేయించారు. గోపయ్య స్వామికి కూడా బంగారు తలపాగా చేయించాలని ఆలయ కమిటీవారు నిర్ణయించి, ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్రీ శంభులింగేశ్వరాలయం - పెనుగంచిప్రోలు

కృష్ణాజిల్లాలో మున్నేటినదీ తీరాన ఉన్న పెనుగంచిప్రోలు గ్రామమునందు శ్రీ శంభులింగేశ్వరాలయం కలదు. ఒకప్పుడు కొందరు జంగాలు వరంగల్ నుండి విజయవాడ పోవుచూ, కొన్నిరోజులచట ఉన్న ఒక కొలను వద్ద మజిలీ చేసారు. వారిలో ఒక శివభక్తురాలు కూడా కలదు. ఆమె ఒకనాడు కొలనులో స్నానం చేయుచుండగా, స్వయంభూ శివలింగము ఒకటి, ఆకొలను నీటిలో కన్పించినదట! ఆ విచిత్రసంఘటనకు వారందరు ఆశ్చర్యంచెంది, భక్తితో ఆ శివలింగానికి పూజలు చేసి అచట ఒక శివాలయమును కట్టించవలయునని సంకల్పించారు. వెంటనే వారందరూ విరాళాలు సేకరించి, ఒక చిన్న శివాలయము నిర్మించారు. అది దినదినాభివృద్ధి చెందుతూ శంభులింగేశ్వరాలయంగా ప్రసిద్ధి గాంచినది. ఈ శివాలయం తూర్పుముఖంగా ఉన్నది. ఇది చిన్న ఆలయమైననూ, గొప్ప మహిమలుగల ఆలయమని ప్రజల విశ్వాసము. ఈ ప్రాచీనమైన శివాలయమునకు 33 ఎకరాల భూమి కలదని తెలియు చున్నది. ఆ భూములపై వచ్చే ఆదాయము, భక్తులు ఇచ్చే కానుకలు మొదలైన

వాటిని కలుపుకొని ఈ ఆలయములో నిత్య ధూపదీప నైవేద్యాలు నిర్వహిస్తున్నారు. ఇచట నిత్యం జరిగే పూజలతోపాటు శివరాత్రి పర్వదినాన గొప్ప ఉత్సవము గూడా ఘనంగా జరుగుతుంది.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి - పెనుగంచిప్రోలు



శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయం కృష్ణాజిల్లాలో మున్నేటి నదీ తీరాన పెనుగంచిప్రోలు గ్రామమునందు కలదు. ఇది చాలా ప్రాచీన ఆలయము. ఈ ఆలయమును పూర్వము విషువనబడే ఒక యోగిప్రతిష్ఠించాడని తెలియు చున్నది. తరువాత కాకతీయులకాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగి ఉంటుందని ఆధారాలనుబట్టి తెలియుచున్నది. ఇచట మున్నేటి నదీతీరాన అయాచితుని బండ అనే ఒక ప్రదేశం ఉంది. అచట విషువను నొకవైష్ణవ భక్తుడు శ్రీ మహావిష్ణువు అవతారమైన నరసింహుని ప్రతిష్టించుకొని, తపము చేసాడని, అదే నరసింహా లయముగా తరువాత ప్రసిద్ధిచెందినదని మనకు తెలియుచున్నది. ఇది వైష్ణవాలయం. ఇచ్చట స్వామివారికి వైష్ణవ సాంప్రదాయంగా ఆరాధనలు, పూజలు జరుపుచుందురు. ఆలయమునకున్న ఇరువది ఐదు ఎకరముల భూమి మీద వచ్చే ఆదాయముతో, భక్తుల కానుకలతో అర్చనలు, ప్రత్యేక పూజలు, ఉత్సవాలు జరుపుచున్నారు.

ఏకరాతి ప్రసన్న మల్లికార్జున స్వామి - శ్రీకాకుళం



కృష్ణాజిల్లాలో శ్రీకాకుళం గ్రామమునందు ఈ ఆలయం కలదు. నిర్మాణకాలం తెలియరాలేదు. ఆలయ రూపురేఖలను బట్టి ఇది చాలా ప్రాచీనమైన ఆలయమని తెలియుచున్నది. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయం, గర్భగృహం, అంతరా లయం, మండపం అను మూడు భాగాలుగా ఉంది. గర్భగృహంలో శ్రీ మల్లికార్జున స్వామి దర్శన మీయగా మిగతా ఆలయాలలో మరికొంతమంది దేవతామూర్తులు దర్శనమిస్తారు. నిత్య అర్చనలు, ప్రత్యేక పూజలే కాక, దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక దీపోత్సవాలు, మహా శివరాత్రి ఉత్సవాలు గూడా కనులపండువుగా జరుగును.

ఆంధ్ర మహావిష్ణువు - శ్రీకాకుళం



కృష్ణాజిల్లా, విజయవాడకు సుమారు 65 కి.మీ., దూరంలో ఘంటసాల మండలంలో, దివిసీమలో కృష్ణానదీ తీరాన, శ్రీకాకుళం అనే గ్రామంలో ఆంధ్ర మహావిష్ణువు ఆలయం కలదు. ఇది చాలా ప్రాచీన ఆలయం. ఇందలి విష్ణువు ఆంధ్ర భాషా ప్రియుడని అంటారు. ఆ విష్ణువుని తొలుత బ్రహ్మయే ప్రతిష్టించి పూజించాడు. ఇచ్చట ప్రతిష్ఠింపబడిన శ్రీమహావిష్ణువు శ్రీకాకుళేశ్వరుడన్న పేరుతో ప్రఖ్యాతి గాంచాడు. ఇంకా ఈ స్వామి వారిని ఆంధ్ర విష్ణువు, ఆంధ్రనాయకుడు మొదలగు పేర్లతో పిలువబడినాడని పురాణాల ద్వారా తెలియజేయు చున్నది. శ్రీకాకుళంలో స్వామివారు స్వయంభువుగా వెలసి భక్తుల పాపాలను హరిస్తున్నా డని భక్తుల నమ్మిక.

అయిదు అంతస్తుల ఎత్తయిన రాజగోపుర స్థంభం మీదగల శాసనం ద్వారా ఈ గోపురమును చోళరాజైన అనంత దండపాలుడు శాలివాహనశకం 1081లో నిర్మించా డని తెలియుచున్నది. తరువాత శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1519లో ఇచటకు వచ్చి ఇచటగల మండపమునందు కూర్చుండి స్వామిని స్మరిస్తూ ఆముక్తమాల్యద గ్రంథాన్ని రచించాడని తెలియుచున్నది. ఆ మండపాన్ని ఆముక్తమాల్యద మండపంగా పిలుస్తు న్నారు. శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయం మూడు భాగాలుగా ఉంటుంది. రంగమంటపము, అంతరాలయం, గర్భగుడి. రంగ మంటపంలో నాలుగు స్తంభాల మధ్య నర్తకి నాట్యం చేయటానికి వీలుగా గుండ్రని వేదిక ఉంటుంది. గర్భగుడి పైనున్న విమానానికి "భద్రకోటి" విమానమని పేరు. ఆలయానికి తూర్పు, దక్షిణ గాలి గోపురాలు ఉన్నాయి. రంగమంటపంలో ఉత్తరాభిముఖంగా దక్షిణగోడలోని గూడులో భాగ్యలక్ష్మి అమ్మవారు దర్శనమిస్తారు. అమ్మవారికి ఎదురుగా ఉత్తరపుగోడలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంటుంది. స్వామివారి ఉత్తరభాగ ఉపాలయంలో భూసమేత చెన్నకేశవస్వామివారు కొలువై ఉన్నారు. ఈ ఆలయంలోని నిత్యాగ్నిహోత్రం ఒక ప్రత్యేకత. ఏనాడో వెలిగించిన హోమగుండంలోని అగ్నిహోత్రం ఈనాటికీ సంరక్షించబడటం ఆలయంలో కనిపిస్తుంది. ఈ శ్రీకాకుళ క్షేత్రం సాక్షాత్తూ బ్రహ్మదేవుని ప్రయత్నం మేరకే ఉద్భవించిందని ఒక పురాణ కథనం. చారిత్రకంగా



కూడా ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయం కాల గమనంతో దేవరకొండ (చల్లపల్లి) ప్రభువుల వశమైంది. వారి కాలమున ఈ ఆలయం ఎంతో వైభవమును అను భవించింది. శ్రీనాథుడు మొదలైన ఎందరో కవులు తమ కావ్యములతో ఈ క్షేత్రమును గురించి, ఈ స్వామియొక్క మహత్యం గురించి గొప్పగా వర్ణిస్తూ వ్రాశారు. విజయ నగర సామ్రాజ్య పతనానంతరం ఈ ప్రాంతం గోల్కొండ నవాబు పాలనలోకి వెళ్ళింది. ఆ తరువాత దేవరకొండ ప్రభువైన యార్లగడ్డ కోదండ రామన్న ఈ దేవాలయాన్ని పునరుద్ధరించాడని చరిత్ర. ఇప్పటికీ చల్లపల్లి జమీందారులైన యార్లగడ్డ వంశీయులే అనువంశిక ధర్మకర్తలుగా ఈ ఆలయాన వ్యవహరిస్తున్నారు.

వైకుంఠ ఏకాదశి నాడు శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వర స్వామిని ఉత్తరద్వార దర్శనం చేసుకుంటే పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని చెబుతారు. ప్రతీఏటా వైశాఖమాసంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ సమయంలో చుట్టుప్రక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

శ్రీ జగన్నాథస్వామి - వడాలి

కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం వడాలి గ్రామములో గుడివాడ–బంటుమిల్లి ప్రధాన రహ దారికి అతి దగ్గరలో కొలువై ఉన్న శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయం ఉన్నది. ఒరిస్సా రాష్ట్రంలోని పూరీక్షేత్రంలాగే ఈ ఆలయం నిర్మించారు. ఈ జగన్నాథ స్వామి దేవాలయం దక్షిణ పూరిగా జగత్ ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయంలో బలరామ సుభద్ర సమేత శ్రీ జగన్నాథస్వామి వార్లు కొలువై ఉన్నారు. ఆనాడు దట్టమైన అడవితో బోయలు నివశించే ఈ ప్రదేశాన్ని 'వ్యాధాళి' అనే వారని కాలక్రమేణా అదే వడాలిగా నామాంతరం చెందినట్లు ఇక్కడి వారి అభిప్రాయం. ఈ జగన్నాథస్వామికి అంతులేని భూసంపద కలదు. అశేష భక్తజనావళి సందర్శనతో స్వామి ఇష్టకామ్యార్థ సిద్ధిగా భక్తుల హృదయాలలో నెలకొన్నాడు. నేడు లక్షలాది రూపాయల వ్యయంతో జరుగుతున్న పునర్నిర్మాణ ఆలయం సాక్షాత్తూ పూరి దేవాలయాన్నే పోలి ఉండటం మహద్భాగ్యంగా భక్తులు భావిస్తున్నారు. మరో విశిష్టత ఏమంటే ఈ ఆలయానికి 1200 ఎకరాల సుక్షేత్ర భూములను హైదరాబాద్ నవాబు స్వామికి కానుకగా ఇచ్చినట్లు తెలుస్తుంది. నవాబులు కానుకగా ఇచ్చిన భూములతో ఈ ఆలయం పునర్నిర్మాణం జరిగి, నిత్య ధూపదీప నైవేద్యాలు సాగుతున్నాయి.




చరిత్ర : 400 సంవత్సరాల పూర్వం ప్రకాశం జిల్లా కర్రపాలేనికి చెందిన అవధూత అనబడే పురుషోత్తమానంద స్వామి వడాలిలోని జగన్నాథ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. వైష్ణవ భక్తుడైన ఈ అవధూత స్వామికి పూరి జగన్నాథుడు కలలో కనిపించి ఈ ప్రాంతంలో తనకు ఒక గుడికట్టించమని ఆదేశించారు. అది మహా ప్రసాదంగా భావించిన అవధూత ఆలయ నిర్మాణం కోసం వెతుకుతున్న సందర్భంలో సన్నపాడు చేరుకొని ఆ ప్రదేశం ఆలయ నిర్మాణానికి సరైందిగా భావించి స్థానికులతో అవధూత ఆ స్థలం ఎవరిదని వాకబుచేసి నిజాం నవాబులు అనుమతి కోసం బయలుదేరి వెళుతూ విజయవాడ వద్ద కృష్ణానదిలో సన్నపాడు గ్రామస్థులతో కలిసి స్నానం చేస్తున్న అవధూత ఒక్కసారిగా అదృశ్యమయ్యాడు. గ్రామస్థులు ఆశ్చర్యపోయి ఆ ప్రాంతంలో వెదికి వెదికి తిరిగి నిరాశతో గ్రామానికి వెళ్ళిపోయారు. కృష్ణానదిలో అదృశ్యమైన అవధూతస్వామి తన శక్తి ప్రభావంచే హైదరాబాద్ నిజాం నవాబు అంతఃపురంలో ప్రత్యక్షమయ్యారు. అవధూతను చూచి నవాబు ఆశ్చర్యపోయి ఎవరు నీవు? వచ్చిన కారణమేమిటని అడుగగా అప్పుడు అవధూత జగన్నాథస్వామి దేవాలయ నిర్మాణం జరపాలనుకున్నామని, అందుకు కావాల్సిన స్థలాన్ని తమరు ఇవ్వాలని కోరారు. అందుకు సమ్మతించిన నవాబుగారు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మీరు ఎంతదూరం తిరగగలిగితే అంత స్థలం దేవాలయానికి దానంగా అందిస్తానని హామీ ఇచ్చారు. అవధూత స్వామి ఆనందంతో ఇప్పుడు నిర్మించబడిన వడాలిలోని ప్రాంతంలో 1200 ఎకరాల పరిధిలో తిరిగి ఆ భూమిని నవాబుగారి ద్వారా దేవా లయానికి అప్పగించారు. వెంటనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి పూరినుంచి మూల విరాట్ విగ్రహాలను తీసుకు వచ్చి ప్రతిష్ఠించారని స్థానిక భక్తుల ద్వారా తెలుస్తుంది. ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ రామలింగేశ్వరాలయం - వీరులపాడు

కృష్ణాజిల్లా మండలకేంద్రమైన వీరులపాడు గ్రామంలో పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరాలయం ఉన్నది. ఇది ఒక చిన్న ఆలయము. 1926లో పాటిబండ్ల రామయ్యగారు దేవాలయానికి పైకప్పు వేయించినట్లు తెలుస్తుంది. ఇచట ప్రతినిత్యం పూజాది అభిషేకాలతోపాటు పర్వదినాలలో ఉత్సవాలు జరుగును.

శ్రీ రామాలయం - పామర్రు



కృష్ణాజిల్లా, పామర్రులో శ్రీరామాలయం ఉన్నది. ఇది చాలా పురాతన ఆలయమనీ, ఈ ఆలయానికి ఎన్నో ఏళ్ళ నాటి చరిత్రగలదని భక్తులు చెబుతారు. ఈ ఆలయంలో శివకేశవులను ఒకే సారి భక్తులు దర్శించుకోవచ్చు. పూర్వం ఈ క్షేత్రాన్ని బుచ్చమ్మ గారి ఆశ్రమం అని పిలిచేవారని తెలుస్తుంది. దాదాపు 50 సంవత్సరాల క్రితం బుచ్చమ్మగారు వారి గురువైన పిచమ్మగారి ఆశీర్వాచనముతో ఇక్కడ ఆలయాలు నిర్మించి విశేష కార్యక్రమములు చేయదలచి, అనేకమంది దాతల సహకారంతో ఇక్కడ శివాలయం, రామాలయం, కృష్ణాలయం, శ్రీ సువర్చలాసమేత హనుమ ఆలయం, నవగ్రహ ఆలయం, నిర్మించారని తెలుస్తుంది. 1996వ సంవత్సరంలో ఈ ఆలయాన్ని పునర్మిర్మించి ఆలయంలో సాయిబాబాను కూడా ప్రతిష్టించారు. గర్భాలయంలో సీతా లక్ష్మణ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి విరాజిల్లుతూ భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఈ ఆలయంలో సీతారాములతో పాటూ, పరమేశ్వరుడు, శ్రీకృష్ణుడు, శ్రీ షిర్డి సాయినాథుడు, శ్రీ ఆంజనేయుడు, నాగేంద్రుడు, నవగ్రహాలు, గరుత్మంతుడు కొలువై ఉన్నారు. ఆలయంలో వేంచేసియున్న ఆయా దేవతలకు నిత్యపూజలతో పాటు పండుగ పర్వదినాలలో విశేష అర్చనలు, ప్రత్యేకపూజలు, ఉత్సవాలు ఘనంగా జరుగును. శ్రీరామనవమి, హనుమజ్జయంతి, మహాశివరాత్రి వంటి పండుగ పర్వదినాలలో భక్తుల రద్దీ ఈ ఆలయంలో ఎక్కువగా ఉంటుంది.

శ్రీ అంకమ్మ తల్లి - పామర్రు

కృష్ణాజిల్లా, పామర్రు మండలం, పామర్రు గ్రామంలో ఈ అంకమ్మ తల్లి ఆలయం ఉన్నది. ఇది ఒక గ్రామ దేవత ఆలయం. ఈ అంకమ్మతల్లి గొప్ప సత్యంగల తల్లిగా కొలుస్తూ ఆలయాన్ని ప్రతిరోజూ భక్తులు అధిక సంఖ్యలో దర్శిస్తూ ఉంటారు. భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిందీ ఆలయం. ఈ ఆలయంలో నిత్య ధూపనైవేద్యాలు చాలా పెద్ద ఎత్తున నిర్వహించబడుతుంటాయి. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో ఐదు రోజులపాటు అంకమ్మ తల్లి తిరునాళ్ళు నిర్వహిస్తారు. ఆ ఉత్సవంలో మొదటి రోజున అమ్మవారిని పులి వాహనంపై, ఆమెతోబాటుగా

మహాలక్ష్మిని నక్కవాహనంపై ఊరేగిస్తారు. ఆ మర్నాడు ఓ నాలుగు చక్రాల బండిపై అమ్మవారిని ఊరేగిస్తారు. ఆమెతో బాటుగా మైదాపిండితో చేసిన వరాహాన్ని, ఓ బల్లినీ, ఓ మేకనీ కూడా ఊరేగిస్తారు. అమ్మవారి ముందు వండిన అన్నాన్ని బండిలో కుప్పగా పోస్తారు. భక్తులు కూడా తమ యిండ్లలో వండిన అన్నాన్ని వేప ఆకులతో కప్పి అమ్మవారికి సమర్పిస్తారు.

నాల్గవరోజున అమ్మవారికి బెల్లం పొంగలిని నివేదిస్తారు. ఊరేగింపు మార్గమధ్యలో ఓ గొర్రెని, మేకనూ బలి యిస్తారు. ఆ రాత్రి అమ్మవారికి అన్నం, శనగపప్పు నైవేద్యంగా సమర్పించి తలుపులు మూస్తారు. ఆ రాత్రి ఎవరైనా అమ్మవారి గుడి తలుపులు తెరిస్తే వారి తలలు పగిలిపోతాయట. ఐదవరోజు ఉదయాన్నే అమ్మవారికి ఓ పొట్టేలుని బలి ఇస్తారు. దాని వెంటే ఓ మేక చెవుల్ని కోసి అమ్మవారికి సమర్పిస్తారు. ఆ విధంగా ఐదు రోజుల ఉత్సవం ముగుస్తుంది. ఈ ఉత్సవాలలో భక్తులు లక్షల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు.

శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం - పామర్రు

విజయవాడ నుండి మచిలీపట్నం పోయే జాతీయ రహదారిలో పామర్రు గ్రామం ఉన్నది. ఇక్కడ పురాతనమైన శివాలయం ఉన్నది. ఈ శివాలయానికి దగ్గరలో ఇటీవలే నిర్మించబడిన షిరిడీసాయి బాబా మందిరం ఉన్నది. ఒక మిత్రుని ప్రోద్భలంతో శ్రీ తమ్మా వినోదరెడ్డి గారు షిరిడీ సాయి దర్శనం చేసుకొన్నారు. ఆ క్షణం నుంచే శ్రీ వినోదరెడ్డి బాబాని నమ్మడం ప్రారంభించారు. తరువాత పామర్రులో బాబా మందిరాన్ని నిర్మించాలని తలపెట్టి శ్రీ వినోదరెడ్డి శ్రీమతి కృష్ణకుమారి.

ఒక ఎకరం పది సెంట్ల భూమిని దానం చేసి, శ్రీ వినోదరెడ్డి గారి తల్లి కోటమ్మరెడ్డి గారు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల సహకారంతో బాబా ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. జైపూరులోని ప్రఖ్యాత శిల్పి భరద్వాజ అయిదు అడుగుల అయిదంగుళాల ఎత్తున పాలరాతి విగ్రహాన్ని అపురూపంగా చెక్కారు. ఆ తేజోమూర్తిని 30-5-94న ఉదయం 9.13 గంటలకు శ్రవణా నక్షత్రయుక్త కర్కాటక లగ్న పుష్కరాంశమందు శ్రీ సాయి ప్రసన్నులు, సాయిధామం సేవా శ్రమ వ్యవస్థాప కులు, గురుదేవులు, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామి సత్యవదానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. బాబా విగ్రహం శ్రీ దత్తాత్రేయస్వామి ప్రతిష్ఠ జరిగిన ఈ శుభ కార్యక్రమానికి పదివేల మంది భక్తులు హాజరయ్యారు. ఈ ఆలయంలో బాబాతో పాటు విఘ్నేశ్వరుడు, శ్రీ దత్తాత్రేయస్వామి వార్లు కూడా కొలువై ఉన్నారు. ఆనాటి నుండి ఈ మందిరానికి వచ్చే భక్తులు సంఖ్య విపరీతంగా పెరిగింది.

శ్రీ పాండురంగ స్వామి - చిలకలపూడి



కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఈ పాండురంగని ఆలయం కలదు. భక్తులకు కొంగుబంగారమై, పిలిస్తే పలికే దైవంగా పేరుపొందిన చిలకలపూడి పాండురంగ స్వామిని కొలిచి, భజించి, సేవించి, తరించిన భక్తులెందరో ఉన్నారు. స్వయంభువుగా పాండురంగ స్వామి ఇక్కడ వెలిశారు. నేరుగా భక్తులు స్వామివారి పాదాలు తాకి పూజించేందుకు ఇక్కడ అవకాశం ఉండటం ఒక విశేషం. మహారాష్ట్రలోని పండరీపురం తరువాత చిలకలపూడి అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న దేవాలయం మరొకటి లేదు. శ్రీపండరీపురంలో నరసింహుడు అనే భక్తుడు నిత్యం పాండురంగని సేవిస్తూ ఉండేవాడు. ఈ నరసింహుడు మహీపతి మహారాజు వద్ద తారకమంత్రం, విఠల్ మంత్రాలను జపిస్తూ ఉండేవాడు. అతడు 1905లో చిలకలపూడి వచ్చి అచట నివాసమేర్పరచుకొని జ్ఞానేశ్వర తుకారాం అనే ఒక మఠాన్ని స్థాపించి పాండురంగనికి భజనలు, అన్నసమారాధనలు చేస్తుండేవారు. ఒకరోజు పాండురంగస్వామి భక్త నరశింహునికి కలలో కనపడి ఈ ప్రాంతములో ఆలయం నిర్మిస్తే స్వయంభువుగా అవతరిస్తారని చెప్పాడు. స్వామి ఆదేశాల మేరకు భక్త నరశింహం ఐదు ఎకరాల ప్రాంగణంలో గర్భగుడిని అనతికాలంలోనే నిర్మించాడు.

పాండురంగ స్వామివారు స్వయంభూవుగా వెలుస్తారన్న వార్తజిల్లా అంతటా వ్యాపించింది. వేలాదిమంది ప్రజలు ఆలయం చుట్టూ గుమిగూడారు. విషయం తెలుసుకున్న బ్రిటీష్ అధికారులు గర్భాలయంకు సీలు వేశారు. పాండురంగ స్వామివారు ఆవిర్భవించకుంటే స్వామివారిలో లీనమైపోతానని ప్రతిజ్ఞ చేసి భక్త నరశింహం విఠలనామం జపించసాగాడు. వేలాదిమంది భక్తుల ఆనందోత్సాహాల మధ్య ఆలయంలో పెద్ద శబ్దం వినపడింది. వెంటనే తలుపులు తెరచుకున్నాయి. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన పాండురంగడు భక్తుల సమక్షంలో ఈ ఆలయంలో వెలిశాడు. ఆనాటినుండి ప్రతిఏటా కార్తీకశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు ఉత్సవాలు జరుపుతూనే ఉన్నారు. ఆలయం చుట్టూ అనేక ఉపాలయాలు వెలిశాయి. జ్ఞానేశ్వర్, భక్త తుకారం, మీరాబాయి, జానాబాయి, సక్కుబాయి వంటి భక్తులు ఈ చిన్నచిన్న మందిరాలలో భక్తులకు దర్శనమిస్తారు. ఆ తరువాత సాయిబాబా మందిరం,

రామమందిరాలు కూడా వెలిశాయి. ఆలయ ప్రాంగణం లోని రావిచెట్టు కింద సిద్దేశ్వర స్వామి వారి ఆలయం ఉంది. భక్తులు తాము కోరుకొన్న కోర్కెలు ఇక్కడ సిద్ధించ గలవని అందువలన ఇక్కడ ఉన్న పరమేశ్వరుని సిద్దేశ్వరునిగా కొలుస్తున్నారు. శ్రీ పాండు రంగస్వామికి పటికబెల్లం అంటే ఇష్టం. భజనలు అంటే మరీ ఇష్టం. ఇతర రాష్ట్రాల నుండి కూడా ఇక్కడికి భక్తులు వచ్చి భక్తి భావంతో భజనలు చేస్తూ స్వామి వారిని అర్చించి స్వామివారి అపార కృపకు పాత్రులవుతారు.



శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము - మచిలీపట్నం



కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీ పట్నంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము కలదు. ఇది సుమారు 500 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయంగా తెలుస్తుంది. ఇది ప్రప్రధమంగా మచిలీపట్టణంలో నిర్మించ బడిన శ్రీ వేంకటేశ్వర స్వామి వార్ల దేవాలయంగా చాలా ప్రసిద్ధి పొందింది.

చరిత్ర : పూర్వం ఈ స్వామి వారి విగ్రహము బందరు ఇంగ్లీషుపాలెం ప్రాంతంలో ఉండేది. ఇంగ్లీషుపాలెంలో ముస్లీం జనాభా ఎక్కువగా ఉండేవారు. 17వ శతాబ్దములో హిందువులకు, ముస్లింలకు తరచుగా ఘర్షణలు జరుగుచుండేవి. ఆ సందర్భములో ముస్లింలు ఈ విగ్రహమును నాశనము చేయుదురేమోనన్న భయంతో ఆ ప్రాంతము లోని హిందువులు ఒక రోజు ఈ స్వామివారి విగ్రహమును ఒక ఎడ్ల బండిలో పెట్టుకుని తీసుకొని వచ్చుచుండగా, అచ్చటి ముస్లింలు బండిని ఆపి, బండిలో ఏముంది అని ప్రశ్నించగా ఒక పెద్దాయన అనారోగ్యముతో ఉన్నాడని అతనిని వైద్యశాలకు తీసుకొని వెళ్ళుచున్నామని చెప్పగా, వెంటనే బండిలో అనారోగ్యపు మనిషి మూల్గుచున్నట్లుగా వినిపించింది. ఆ మూలుగు విని ముస్లింలు బండిని వదిలివేశారు. ఆవిధంగా బండిని తీసుకొని వచ్చుచుండగా ప్రస్తుతము ఆలయము ఉన్న ప్రదేశము చేరేసరికి బండిలోనుంచి వచ్చే మూల్గు ఆగిపోయింది. అందుచే ఆ ప్రదేశములోనే శ్రీ స్వామి వారిని ప్రతిష్టించినట్లుగా పెద్దలు చెబుతారు. ఆనాటినుండి స్వామివారు ఇచ్చట పూజలందుకొనుచున్నాడు.

ప్రతిసంవత్సరము శ్రావణశుద్ధ ద్వాదశి నాడు శ్రీ స్వామి వార్లకు లక్ష తులసి నామార్చన మరియు శాంతి కళ్యాణములు, ఆశ్వయుజ మాసములో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ అమ్మవారికి ప్రతినిత్యము కుంకుమార్చన మరియు విజయదశమినాడు శ్రీ స్వామివారికి శమీపూజ మరియు గ్రామోత్సవ కార్యక్రమములు జరుగును. ధనుర్మాసమునందు శుద్ధ ఏకాదశి రోజున ముక్కోటి ఉత్సవము అనంతరము గ్రామోత్సవము, మరియు భోగి రోజున ఉత్సవము ఘనంగా జరుగును. శ్రీ స్వామివారి కళ్యాణోత్సవములు ప్రతి సంవత్సరము చైత్ర శుద్ధ దశమి నుండి చైత్ర బహుళ పాడ్యమి వరకు, శ్రీస్వామివారి కళ్యాణము, చైత్రశుద్ధ త్రయోదశి రోజున శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్లకు కళ్యాణము కన్నులపండువగా జరుపబడును.

శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం - మచిలీపట్నం



కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఉన్నది. ఈ ఆలయం దాదాపు 110 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు తెలియుచున్నది. తూర్పు ముఖంగా నిర్మించ బడిన ఈ దేవాలయ ప్రవేశద్వారం గోపురంపైన మూడు కలశాలు ఉన్నాయి. ఆలయ ప్రవేశంలో ద్వారపాలకులైన వాసంతి, సుష్మ అనే దేవకన్యలు భక్తులకు స్వాగత మిస్తు న్నట్లు కనువిందు చేస్తారు. గర్భాలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సకల భూషణాలతో, అలంకరించ బడి మహాతేజస్సుతో భక్తులకు దర్శనమిస్తుంది. ఈ ఆలయంలో క్షేత్రపాలకుడు నగరేశ్వర రూపంలో ఉన్న పరమేశ్వరుడు. శ్రీ నగరేశ్వర స్వామివారు ఇచ్చట పంచ నాగపడగల నీడన శివలింగ రూపంలో దర్శనమిస్తాడు. ఎదురుగా అతని వాహనమైన నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. స్వామివారి ప్రక్కనే పార్వతీమాత ఆలయం ఉన్నది. పార్వతీదేవి నాలుగు చేతులతో, త్రిశూలాన్ని, ఢమరుకాన్ని ధరించి, అభయ వరద ముద్రలతో భక్తులకు కనువిందు చేస్తుంది. పసుపు పచ్చని ముఖవర్చుస్సుతో, సకల శుభంకరిగా దర్శనమిస్తుంది. ఈ నగరేశ్వరస్వామివారికి రాత్రి సమయంలో ఇచ్చే మహాహారతి వైభవంగా నిర్వహిస్తారు. ఈ మహాహారతిని ఎక్కువమంది భక్తులు దర్శిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక ఉపాలయాలు కూడా ఉన్నాయి. రజత కవచాన్ని ధరించి ఉన్న వినాయకుడు, నగరేశ్వరునికి ఎదురుగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారు, కాలభైరవుడు, ముఖమండపానికి

కుడివైపున నవగ్రహా మంటపం ఉంది. నవగ్రహా మంటపానికి ప్రక్కనే ఉన్న సహస్ర లింగేశ్వరుడు దర్శనమిస్తారు. ఒకే శివలింగాకృతిలో 1008 శివ లింగాలు కనిపిస్తాయి. సువర్చలాసహిత దాసాంజనేయ స్వామివారు, శ్రీ సూర్య నారాయణ స్వామి, శైవ వైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఇక్కడ ప్రత్యేకతలు. ఈ ఆలయానికి దక్షిణ భాగాన వైకుంఠపురం ప్రతిష్ఠితమై ఉంది. ఈ వైకుంఠపురంలో శ్రీనివాసుడు దివ్యమంగళ స్వరూపుడై భక్తులకు దర్శనమిస్తాడు. శ్రీ సంతాన వేణుగోపాలస్వామి, అనంత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, జంట నాగుల ప్రతిమలు సాయిబాబా నిలువెత్తు విగ్రహం, శ్రీ కన్యకాపరమేశ్వరి ఆత్మాహుతి చిత్రం, వంశవృక్ష వివరణ తైల చిత్రాలు కూడా ఉన్నాయి. ఇచ్చట దసరా ఉత్సవాలు, కార్తీక మాసోత్సవాలు చాలాగొప్పగా నిర్వహిస్తారు. నాముతో తయారుచేసిన 365 శివలింగా లను ప్రతిష్టించి చేసే మహాలింగార్చన ఈ ఆలయంలో మరో ప్రత్యేకతను పొందింది.

శ్రీ రాజరాజేశ్వరీ రామలింగేశ్వర ఆలయం - మచిలీపట్నం



కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శ్రీ రాజరాజేశ్వరీ రామలింగేశ్వర ఆలయం ఉన్నది. ఈ ఆలయం సుమారు 400 సంవత్సరాల క్రితం అంటే 16వ శతాబ్దంలో నిర్మించినట్లుగా స్థానికుల ద్వారా తెలుస్తుంది. తరువాత 18వ శతాబ్దంలో రాబర్ట్ సన్ అనే ఆంగ్లేయుడు ఈ ఆలయాన్ని పునరుద్ధ రించినట్లు తెలియుచున్నది. ఆలయ ముఖద్వారం రెండు అంతస్తులుగా నిర్మించబడింది. 1841లో రాబర్ట్‌సన్ ఈ ఆలయానికి ఒక గంటను బహూకరించారు. అది నేటికీ ఆలయంలో మనకు కనబడుతుంది. గర్భా లయంలో శ్రీ రామలింగేశ్వర స్వామివారు ప్రతిష్టించబడి ఉన్నారు. స్వామి వారి గర్భాలయానికి ఇరువైపులా ద్వారపాలకులు, ఎదురుగా నందీశ్వరుడు ఉన్నారు. ఈ గర్భాలయానికి సమీపంలోనే శ్రీ రాజరాజేశ్వరీ మాత కిరీటధారియై, సర్వాలంకరణలతో శ్రీ చక్ర ప్రతిష్టతో కూడి మరో మంటపంలో దర్శనమిస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో నిత్యం భక్తులచే లలితా పారాయణం, లింగాష్టకం పారాయణం చేయబడుతుంది. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మినరసింహస్వామి, శ్రీదేవీభూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి 18 మెట్లతో కూడిన అయ్యప్ప స్వామి ఆలయం దర్శనమిస్తాయి. అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామివారి విగ్రహం పంచలోహాలతో తయారుచేయబడినది.

ఈ మందిరం ముఖ మంటపంపై హరిహరుల మధ్య అయ్యప్ప విగ్రహం దర్శనమిస్తుంది. ఆలయ ప్రవేశంతోనే ధ్వజస్తంభం మనకు దర్శనమిస్తుంది. ఆలయ ప్రాంగణంలో ఇచ్చట దేవతా వృక్షాలైన రావివేప కలసి ఉన్న వృక్షం క్రింది భాగంలో ఒక పుట్ట దానికి సమీపంలో నాగ ప్రతిమ దర్శనమిస్తుంది. దీనికి సమీపంలోనే నవగ్రహ మంటపం, కళ్యాణమంటపం ఉన్నాయి. మహాశివరాత్రి, కార్తీకమాసం, దసరానవరాత్రులు, శని త్రయోదశి మొదలైన పుణ్య తిథులు ఇచ్చట అతి వైభవంగా జరుపబడతాయి. ఇచ్చట ప్రతి సంవత్సరం స్వామివారికి మూడు రోజులు కళ్యాణ మహోత్సవాలు అతి వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి ఏకాదశి రోజున రాఘవేంద్రస్వామి జయంతి, హనుమాన్ జయంతులు గొప్పగా నిర్వహించబడతాయి.

శ్రీ దత్తాశ్రమం, నగరేశ్వరాలయం - మచిలీపట్నం



కృష్ణాజిల్లా, మచిలీపట్నం నుండి 11 కి.మీ., దూరంలో, మంగినపూడి సముద్రతీరంలో శ్రీ దత్తాశ్రమ క్షేత్రం, శ్రీనగరేశ్వరాలయం నెలకొని ఉన్నది. సముద్రతీరానికి అతిచేరువలో ఈ ఆలయం ఉన్నది. ఈ ఆలయంలో దత్తాత్రేయుడు, నగరేశ్వరస్వామి కొలువై ఉన్నారు. విశాలమైన ప్రాంగణంలో ఇసుకతిన్నెలపై తూర్పు సముద్రతీరాన నిర్మించిన ఈ ఆలయం భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. భక్తులు ముందుగా సముద్రస్నానం చేసి తరువాత ఆలయ ప్రవేశం చేస్తారు. ఆలయానికి వెనుకవైపున 12 పుణ్యతీర్థాలతో బావులు నెలకొల్పారు. భక్తులు సముద్రస్నానం తరువాత ఈ పుణ్యతీర్థాలలో కూడా స్నానమాచరించి ఆతర్వాత స్వామిని దర్శిస్తారు.

పూర్వం ఈ నగరేశ్వరస్వామి వారి దేవాలయం ముఖమండపం కూడా లేకుండా చిన్న ఆలయంగా ఉండేది. ఆ తరువాతి కాలంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆలయాన్ని నిర్మించి ప్రమోద నామ సంవత్సరం మాఘ శుద్ధ చవితి నాడు స్వామీజీవారి పవిత్ర కరములచే అనఘాదేవి, దత్తాత్రేయ స్వామి వార్ల విగ్రహప్రతిష్ట జరిగినది. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ ఆలయం నేడు శ్రీ దత్తసచ్చిదానంద నగరేశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో దినదినాభివృద్ధి చెందుతుంది.

శ్రీ దత్తాలయంలో ముందుగా విఘ్నేశ్వరుడు కిరీటధారియై, సర్వాలంకారములతో దర్శనమిస్తాడు. వీరికి ఒక ప్రక్కగా శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామిజీ వారి చిత్రపటాన్ని, పాదుకలను ఉంచారు. గర్భాలయంలో షడ్భుజమూర్తి శ్రీ దత్తాత్రేయస్వామి

అభయప్రదాతయై, నిత్యపూజలు అందుకొంటున్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామివారి మందిరం ప్రక్కనే ఆంజనేయస్వామి వారు నెలకొని ఉన్నారు. ఆంజనేయస్వామి వారి ప్రక్కనే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి విగ్రహం కూడా ఉన్నది. మరో మండపంలో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి వారు కొలువై ఉన్నారు. ఆలయంలో స్వామి శివలింగరూపంలో దర్శనమిస్తారు. స్వామివారి ఆలయానికి ఎదురుగా హృషికేష్ గంగా ప్రవాహంలో స్వయంభూగా లభ్యమైన 54 శివలింగాలను ప్రతిష్టించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఇక్కడ ఉన్న 12 తీర్థాలలోని జలముతో ఈ శివలింగాలను అభిషేకించి ఆ తర్వాత స్వామివారిని దర్శిస్తారు. స్వామివారి ఎదురుగా నందీశ్వరుడు ఉన్నాడు. స్వామివారి ప్రక్కన అమ్మవారు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మహాగణపతి కొలువై ఉన్నారు. ఈ ఆలయంలో నవగ్రహ మండపం ఆంధ్రరాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా, గ్రహాధిపతులను, వారి వారి వాహనాలతో విడివిడిగా భక్తులు ప్రదక్షిణలు చేయడానికి అనువుగా నిర్మిం చారు. ఈ ఆలయాలలో నిత్యాభిషేకాలూ, అర్చనలు పూజలు జరుగుతాయి. దత్తజయంతి, కార్తీకమాసం, మహాశివరాత్రి, శ్రీగణపతి సచ్చిదానందస్వామి జయంతి వంటి పుణ్యదినాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆసమయంలో భక్తుల రద్దీ అధికం.

సువర్చలాసమేత శ్రీ ఆంజనేయస్వామివారి దేవస్థానం - మచిలీపట్నం



కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని పరాసుపేటలో సువర్చలా సమేత శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానం ఉన్నది. 1650లో ఈ ఆలయాన్ని సమర్థరామదాసుగారు స్వయంగా ప్రతిష్టించినట్లు తెలియుచున్నది. ఈ ఆలయం 2001 మాఘ మాసంలో పునఃనిర్మితమైనది. ఈ ఆలయం నిర్మితమైన ప్రాంతం హనుమంతుడు దర్శించిన పుణ్యస్థలమని చెబుతారు. హనుమంతుడు సీతాన్వేషణ సమయంలో ఈ పరాసు పేటలో కొద్దిసేపు విశ్రమించినట్లుగా చెబుతారు. గర్భాలయంలో ప్రసన్నవదనంతో, ముకుళిత హస్తాలతో ఆంజనేయ స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ప్రాకార మండపంలో దక్షిణ భాగాన హనుమంతుని తొమ్మిది రూపాలుగా చెప్పబడే స్వామివారి చిత్రపటములు భక్తులకు దర్శనమిస్తాయి. ఇచ్చట ప్రధాన ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామివార్లు ఉన్నారు. ప్రతీరోజూ ఉదయం 6 గంటలను రాత్రి 8 గంటలకు ఈ ఆలయం తెరచి ఉంటుంది.

ఆలయంలో స్మార్త సంప్రదాయం ప్రకారం పూజలు జరుగుతాయి. నిత్యాభిషేకం, గోత్రనామాలతో అభిషేకం, స్వామివారికి పంచహారతులు ఇస్తారు. ప్రతీనెలలో మూడు రోజులు ఆలయంలో అన్నదానం చేస్తారు. ఈ ఆలయంలో వైశాఖబహుళ దశమి రోజున హనుమజ్జయంతి, శ్రీరామనవమి నాడు ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా త్రయాహ్నిక దీక్ష వహించి భక్తులు స్వామివారిని దర్శించటం ఒక విశేషంగా భావిస్తారు. సర్వవ్యాధి నివారణకొరకు భక్తులు ఇచ్చట ఆలయ ప్రదక్షిణ చేస్తారు.

శ్రీ శివగంగ దేవస్థానం - శివగంగ, మచిలీపట్నం

కృష్ణాజిల్లా, ముఖ్యపట్టణం మచిలీపట్నంలోని భాగమైన శివగంగలో సుమారు ఆరు వందల సంవత్సరాల క్రితం వెలసిన అమ్మవారు శివగంగ. ఇది చల్లపల్లి జమీందారుల స్వంత దేవస్థానంగా ప్రసిద్ధి చెందింది. ఈ శివగంగ ఆలయంలోని స్వామి గొప్ప మహిమగలవారని భక్తుల నమ్మకం. పూర్వం ఇదంతా పెద్ద అరణ్యం! ఎటు చూసినా దట్టమైన చెట్లతో నిండి ఉండేది. ఆరోజుల్లో చల్లపల్లి జమీందారు అంకినీడుగారు ఇక్కడకు వేటకొచ్చి తిరిగి చల్లపల్లి వెళ్ళిపోతుండగా వెనుక ఎవరో వస్తున్నట్లు శబ్దమైంది. ఆయన వెనక్కి తిరిగి చూద్దామని అనుకోబోతుండగా 'వెనక్కి తిరిగి చూడవద్దు, అలాగే వెళ్ళిపోమని' వెనుక నుంచి మాటలు వినిపించాయి. అంకినీడు గారు సహనం వహించినా ఇక్కడ కొచ్చేసరికి మనసు ఆపుకోలేక వెనక్కి తిరిగి చూశారు. వెంటనే అమ్మవారు శిలగా మారిపోయింది. ఆ రాత్రి ఆయనకు స్వప్నంలో కనపడి తన పంచలోహ విగ్రహాల్ని చేయించి ప్రతిష్ఠించమని అమ్మవారు తెలుపగా, అప్పుడు అంకినీడుగారు పంచలోహాలతో ఆ విగ్రహాన్ని చేయించగానే శిలగా మారిన అమ్మవారి విగ్రహం భిన్నమై పోయింది. భిన్నమైపోయిన ఆ విగ్రహం ప్రవేశద్వారం దగ్గర కుడివైపున బిగించారు. ఇప్పుడు కూడా చూడవచ్చు. అంతకుముందు అమ్మవారు అక్కడే ఉండేవారు. ఆనాటినుండి రాజావారు అమ్మవార్ని 'గంగ' అని పిలిచేవారు. అమ్మవారు రాజావారితో కూర్చుని మాట్లాడేది. పిలిస్తే పలికే అమ్మవార్ని ఎవరైనా చూస్తే నెత్తురు కక్కుకొని చనిపోయేవారు. అది చూసి రాజావారు అమ్మవారితో మొరపెట్టుకుని, ఆమె ఆజ్ఞానుసారం కాశీ నుంచి స్వామివారిని తెప్పించి ఇక్కడ ప్రతిష్ఠింపజేశారు. ఈ ఆలయంలో ఒకే పీఠం మీద అమ్మవారు, అయ్యవారు ఇద్దరూ మనకు కనిపిస్తారు. అమ్మవారు మహిషాసుర మర్ధని రూపంలో దర్శనమిస్తారు. ఆలయ ప్రాంగణంలో చంద్రమౌళి, భ్రమరాంబికా దేవి, వీరభద్రస్వామి, కోదండరామస్వామి, ఆంజనేయ స్వామి వార్లు కూడా కొలువై ఉన్నారు.

ఈ ఆలయం రాజావారి కోసమే నిర్మించబడ్డది. కనుక రాజావారి కుటుంబమే దర్శించేది. కానీ ఈ దేవాలయానికి ఇటీవలనే, అంటే 1977 నుంచే బయట భక్తులను కూడా అనుమతిస్తున్నారు. అమ్మవారి దర్శనం చేసుకోనిదే రాజావారి వంశీకులు ఈ నాటికీ ఏ పనిచెయ్యరని స్థానికులు అంటారు.

శ్రీ రంగనాయకస్వామి - బొమ్మదేవరపల్లి

కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని బొమ్మదేవరపల్లిలో శ్రీరంగనాయకస్వామి వారి దేవస్థానము ఉన్నది. దీనిని 200 సంవత్సరములకు పూర్వము బొమ్మదేవరపల్లి జమిందారు నిర్మించారని తెలుస్తుంది. కృష్ణాజిల్లా కలెక్టరుగా రాబర్ట్‌సన్ అను దొరవారు పనిచేసి నప్పుడు ఈ దేవస్థాన అభివృద్ధికి కృషి చేసారు. ఈ ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి వారు కొలువై ఉన్నారు. ఈ దేవస్థానమందు వైఖానస ఆగమశాస్త్ర ప్రకారము నిత్యపూజా కార్యక్రమము జరుపబడుచున్నవి. ఈ దేవాలయములో శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుల వార్లకు ఉపాలయములు, శ్రీ స్వామివారికి కళ్యాణ మండపము కలదు. ధనుర్మాసము, ముక్కోటి ఏకాదశి, అధ్యయనోత్సవములు, గోదాకళ్యాణమునకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని సేవించెదరు. జ్యేష్ట మాసములో వార్షిక బ్రహ్మోత్సవములు జ్యేష్ఠ శుద్ధ దశమి మొదలు బహుళ తదియ వరకు పూజలు జరుగును. ఇవిగాక ఉగాది, శ్రీరామనవమి, తొలిఏకాదశి, దేవీ నవరాత్రులు, కార్తీకమాసం మొదలైన పండుగ పర్వదినాలలో వైభవముగా విశేషపూజలు జరుగును. స్వామివారి దేవస్థానములో వివాహము చేసుకొని, ఈ స్వామివారిని దర్శించుకున్న కొత్త దంపతులకు తప్పక సంతానప్రాప్తి కలుగునని భక్తుల ప్రగాఢ నమ్మకం.

మహిషాసుర మర్ధిని ఆలయం - శ్రీనగరపురి

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్టణానికి దక్షిణదిశలో శ్రీనగరిపురియందు మహిషాసుర మర్ధనీ ఆలయం ఉన్నది. ఈ ఆలయము శివగంగ ఆలయమని కూడా అంటారు. ఈ ఆలయమును 300 సంవత్సరాల క్రితం నిర్మించి, దీనికి ఆనాటి సంస్థానం వారు 75 ఎకరముల భూమిని దానంగా ఇచ్చారు. ఈమధ్య సంస్థానములు రద్దయినను, ఈ ఆలయము ఇప్పటికీ వారి ఆధీనములోనే పూజలు నిర్వహించబడుతున్నవి. పశ్చిమాభిముఖంగా ఉన్న ఈ ఆలయములో గర్భగుడిలో, ఒకేపీఠం మీద, పంచ లోహాలతో తయారుచేసిన అమ్మవారి విగ్రహము, శివమూర్తి విగ్రహము ప్రతిష్టించబడి ఉన్నాయి. ఈ ఆలయంలో అనేక దేవతా మూర్తులు కొలవుతీరి ఉన్నారు. ఈ ఆలయములో మహిషాసుర మర్దని దేవియేగాక, చంద్రమౌళీశ్వరుడు, ఎడమ భాగాన

రామాలయము, ఒక మండపము, మండపానికి కుడిభాగాన పవళింపు సేవా మందిరము ధ్వజస్థంభానికి ఎడమవైపున భక్తాంజనేయ స్వామివారు, కుడివైపున పెద్దగంట, ముఖద్వార గాలిగోపురములు కలవు. ఇచ్చట చైత్రమాసంలో అమ్మవారి కళ్యాణోత్సవము, దసరా పర్వదినాలలో తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవ సమయాలలో ఇచట పెద్ద తిరుణాళ్ళు జరుగును. ఈ తిరునాళ్ళకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివార్లను దర్శించుకొని పూజాదికాలు నిర్వహిస్తారు.

శ్రీ లక్ష్మీపతి స్వామి దేవస్థానం - పెదముక్తేవి



కృష్ణాజిల్లా దివిసీమ, మొవ్వ మండలంనందు, మచిలీపట్నంకు సుమారు 28 కి.మీ. దూరంలో పెదముక్తేవి గ్రామంలో శ్రీ లక్ష్మీపతి ఆలయం కలదు. ఇది చాలా ప్రాచీనమైన ఆలయం. ఈ ఆలయం క్రీ.శ.1620 ప్రాం తంలో నిర్మింపబడినదని చరిత్ర చెప్పుచున్నది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వెలసిన పంచలక్ష్మీ నారా యణస్వామి క్షేత్రాలలో పెదముక్తేవి ప్రధాన క్షేత్రంగా చెప్పబడుతుంది. పంచక్షేత్రాలలో మూడు క్షేత్రాలు (పెద ముక్తేవి, అవనిగడ్డ, నడికుదురు) కృష్ణాజిల్లాలో ఉండగా, మిగతా రెండు క్షేత్రాలు నల్లూరు, రాచూరు గుంటూరు జిల్లాలో ఉన్నాయి. అయిదు క్షేత్రాలను కలిపి 'పంచ వైష్ణవ ఆరామాలు'గా పిలుస్తారు. పెదముక్తేవిలో వ్యాస మహర్షి ప్రతిష్టించిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీగణపతి స్వామివారు దర్శనమిస్తారు. కృష్ణానదికి ఉపనది అయిన భీమానది ఈ క్షేత్రాన్ని పావనం చేస్తూ ఉంటుంది. వ్యాసమహర్షి తపస్సుకు మెచ్చిన శ్రీ మహావిష్ణువు ఆయన ప్రార్థన మేరకు ఇక్కడ శ్రీ లక్ష్మీపతిగా స్వయం భువుగా వెలిసినట్టు స్థలపురాణం చెబుతుంది. విశాల మైన ఆవరణ, ఆ ఆవరణచుట్టూను ప్రాకారం, ఆ ప్రాకారం మధ్యలో ఆలయం నిర్మించారు. ఇక్కడ గర్భా లయంలో ఒకేపీఠం మీద లక్ష్మీనారాయణుడు, రాజ్యలక్ష్మీ అమ్మవారు ప్రతిష్ట కావింపబడినారు. ఇచట వైష్ణవ సంప్రదాయానికి భిన్నంగా రాజ్యలక్ష్మీ అమ్మవారు, లక్ష్మీనారాయణుని ఎడమ తొడమీద కూర్చుండి యుండుట, లక్ష్మీ నారాయణుని కుడిచేతిలో ఉండవలసిన చక్రం ఎడమ చేతిలో ఉండుట, ఎడమ చేతిలో ఉండవలసిన శంఖం కుడిచేతిలో ఉండుట ఈ మూలవిరాట్టులోని ప్రత్యేకత.

ఇచ్చట క్షేత్రపాలకుడు వినాయకుడు. ఇచ్చట ప్రతిరోజు అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు, సంవత్సరాది, శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు, కృష్ణాష్టమి, దసరా, వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి, పర్వదినాలలో ఉత్సవాలు గోదాదేవి కళ్యాణోత్సవం, ధనుర్మాసోత్సవాలు అతి వైభవంగా జరుగును. ప్రతినిత్యం ఈ స్వామివారిని ఉదయం 6 గంటలనుండి 11 గంటలవరకు, సాయంత్రం 6 గంటల నుండి 8 గంటలవరకు భక్తులు దర్శించుకొంటారు.

ఈ పెదముక్తేవి గ్రామమునందే కృష్ణాశ్రమములో వైకుంఠనాథస్వామి ఆలయం కలదు. ఈ ఆశ్రమాన్ని శ్రీ సీతారామయతీంద్రులవారు ఏర్పాటు చేశారు. వారు విష్ణుభక్తులు. అందుచే ఆశ్రమంలో విష్ణ్వాలయమును కట్టించ సంకల్పించి, 1960లో ప్రారంభించారు. కాని పూర్తికాకమునుపే వారు దివంగతులయ్యారు. తరువాత వారి కుమారులు శ్రీ లక్ష్మణ యతీంద్రులవారు పూనుకొని 1975లో ఆలయమును పూర్తిచేసి, అందులో వైకుంఠనాథుని ప్రతిష్ఠించారు. తరువాత ఈ ఆలయపరిసరాలలో అనేక ఆలయాలు ఏర్పడ్డాయి. వానిలో రంగనాథ ఆలయం, వేంకటేశ్వర ఆలయం, స్వామికి ఇరుప్రక్కల ఉండగా తూర్పుభాగాన వరలక్ష్మి దేవి ఆలయం, శ్రీ అనంత భగవానుడు, పశ్చిమభాగాన యతీంద్రుల ప్రభుసన్నిధి, ఎదురుగా ఆంజనేయస్వామియు, శ్రీ సీతారామ యతీంద్రుల వారి విగ్రహము మొదలగు దేవతామూర్తులు మనకు ప్రముఖంగా దర్శనమిస్తారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి - మోపిదేవి



కృష్ణాజిల్లా దివిసీమకు చెందిన ఒక మండలము మోపిదేవి. మంచిలీపట్నం నుండి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడ ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఉన్నది. దీనికి మోహినిపురమని సర్ప క్షేత్ర మని పేరు. కాలక్రమేణా అది మోపిదేవిగా నామాంతరం చెందినది. ఇచ్చట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లింగరూపంలో ఉండుట ఈ క్షేత్రం యొక్క విశిష్టత. స్వామివారి పాన పట్టం వద్ద ఉన్న ఒక కన్నంలోనుండి సంవత్సరంలో ఒక సారి నాగుపాము బయటకు వచ్చి భక్తులకు దర్శనమిస్తుం దని ఇది ఒక విశేషముగా చెబుతారు. గర్భగుడిలో పాము చుట్టలమీద లింగం ఉంటుంది. ఇదే పానమట్టం. స్వామికి వేరే పానమట్టం ఉండదు. ఇచట లింగరూపము వృత్తాకారంలో

కాక పలకగా ఉండుట ఒక విశేషము. తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయంలో గర్భగృహము నందు శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు వారికి కుడివైపున పుట్టపూజ నాగేశ్వరుడు దర్శనమిచ్చును.

చరిత్ర : పూర్వం అగస్త్య మహర్షి ఉత్తర కాశిలో తపస్సు సాగిస్తుండగా, వింధ్యపర్వతం గర్వంతో ఎత్తు ఎదిగి పోయి సూర్యమండలాన్ని దాటిపోయింది. దానితో సూర్యగతి ఆగిపోయి ప్రకృతి స్తంభించిపోయింది. ప్రమాదాన్ని గ్రహించి బ్రహ్మాదిదేవతలు కాశీ నగరానికి వచ్చి అగస్త్యుడ్ని ప్రార్థించి ఈ ప్రమాదాన్ని తప్పించమని ప్రాధేయ పడగా, కాశీని విడిచి వెళ్ళడం అగస్త్యునికి ఇష్టం లేకపోయినా లోకశ్రేయస్సు దృష్ట్యా, శిష్యకోటి వెంటరాగా, అక్కడి నుంచి దక్షిణానికి బయలుదేరాడు. త్రోవలో వింధ్యుడు, అగస్త్యుడి రాక తెలుసుకొని ఆయన ముందు సాష్టాంగ నమస్కారం చేసి ఆయనకు త్రోవనిచ్చాడు. తను తిరిగి వచ్చే వరకు అలాగే ఉండమని శాసించి ముందుకు సాగాడు అగస్త్యుడు. అలా ప్రయాణిస్తూ ఆగస్త్యుడు కృష్ణానది తీరాన్ని సమీపించి మోపీదేవి ప్రాంతానికి వచ్చాడు. అక్కడ కృష్ణానది ఉత్తర వాహినియై ప్రవహిస్తోంది. అతనికా ప్రదేశం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించగా, అతడా ప్రదేశంలో కొంతకాలం ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఒకనాడా మహర్షికి ఆ ప్రదేశంలో ఉన్న ఒక పుట్టలో సుబ్రహ్మణ్యేశ్వరుడు దాగిఉన్నట్లు అంతర్వాణి తెలియజేయగా, అతడు ఆనందంతో అటుచూడగా ఓ పెద్ద పుట్ట రంధ్రంలోంచి వెలుగు బయటకు వస్తుంది. అదిగమనించిన మహర్షి ఆ వల్మీకంలో ఉన్నది శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అని గమనించి ఆ పుట్టను శిష్యులచే తవ్వించగా, అందులోనుంచి తళతళ మెరుస్తూ సుబ్రహ్మణ్యేశ్వరుడు కన్పించాడట. వెంటనే అగస్త్యుడు స్వామికి నమస్కరించి వారికొక ఆలయమును నిర్మింపజేసి, ఆ స్వామినందు ప్రతిష్ఠించాడని ఆనాటినుండి అచట శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనలందు కొనుచున్నాడని పురాణ పండితుల నమ్మకం. ఈ ఆలయంలోని స్వామివారికి వ్యాధులు నయం చేసే శక్తి ఉందని, మ్రొక్కిన మ్రొక్కులు నెరవేర్చే మహత్యం కలదని స్థానిక భక్తుల విశ్వాసం. ఈ ప్రాంతం వారందరూ ఎవరికైనా జబ్బుచేస్తే ఈ స్వామివారికి మ్రొక్కు కుంటే ఆ జబ్బుల నుండి విముక్తులు అవుతారని స్థానికుల మాట.



ఈ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చల్లపల్లి జమీందారి కుటుంబం యొక్క ఇలవేల్పు. క్రమంగా ఈ ఆలయం చల్లపల్లి సంస్థానా ధిపతుల ఆదరాభిమానాలను పొంది ఈనాటి రూపం ధరించింది. ఇప్పటికీ

వీరి ఆధ్వర్యంలోనే ఆలయ నిర్వహణ కొనసాగుతున్నది. నాగుల చవితి, సుబ్రహ్మణ్య షష్ఠి వంటి పర్వదినాలతో పాటు ఆదివారం, గురువారం స్వామివారిని భక్తులు అధికంగా దర్శిస్తారు. ఆలయంలో ప్రతిరోజు స్వామివారికి శాంతి కళ్యాణం జరుగుతుంది. ప్రతి నెలా కృత్తికా నక్షత్రం రోజున రాహు, కేతువు, సర్పదోష నివారణకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. మార్గశిర శుద్ధ షష్ఠికి స్వామి వారి కళ్యాణోత్సవము జరుగుతుంది.

శ్రీ సకలేశ్వరస్వామి ఆలయం - మోపిదేవి



మోపిదేవిలోని ప్రసిద్ధ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ప్రక్కనే మరో ప్రసిద్ధ ఆలయం శ్రీ సకలేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇది కూడా స్వయంభూ లింగమే సగర మహారాజు పూజించిన శివలింగం కావడంతో ఈ స్వామికి ఆ పేరు వచ్చింది. 1783లో మోపిదేవి వరదలలో కొట్టుకుపోయినప్పుడు ఈ శివలింగం బయల్పడగా, అప్పటి జమీందారైన అడుసుమిల్లి గంగుభొట్లు గారు ఈ ఆలయం నిర్మింపజేశారు. అయితే ఆ శివలింగం భూమిలో ఇంకా ఎంత లోతు వరకు విస్తరించి ఉన్నదో ఎవరికీ తెలియదు. ఈ సకలేశ్వర స్వామి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి క్షేత్రానికి క్షేత్రపాలకుడుగా వ్యవహరిస్తున్నాడు. ఈ ఆలయములో ప్రతినిత్యం జరిగే పూజలతో పాటు అర్చనలు, ప్రత్యేకపూజలు, శ్రావణమాసంలో అమ్మవారికి కుంకుమార్చనలు, దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక మాసంలో అభిషేకోత్సవాలు, ఆకాశదీపోత్సవం, లక్షపత్రి పూజలు ఘనంగా జరుగుతాయి. మాఘపూర్ణిమ నుండి 3 రోజులపాటు సకలేశ్వరస్వామి వారికి ఉత్సవాలు కన్నుల పండువగా, ఘనంగా జరుగుతాయి.

బాలపార్వతీసమేత శ్రీ జలధీశ్వరుడు - ఘంటశాల




కృష్ణాజిల్లా, మచిలీపట్నం నుండి 35 కి.మీ., దూరంలో చరిత్రాత్మకమైన ఘంటశాల గ్రామము కలదు. ఈ గ్రామము నందు బాలపార్వతీ సమేత శ్రీజలధీశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. నిర్మాణకాలం తెలియకున్ననూ, పూర్వీకులు కొంతమంది మాత్రం దీనిని అగస్త్యమహాముని ప్రతిష్ఠించారని చెప్పుచుందురు. తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయములో భారతదేశంలోనే కాకుండా




ఎక్కడా లేని విధంగా ఒకే పానమట్టంపై శ్రీ జలధీశ్వరుడు, బాలపార్వతీ దేవి మూర్తుల విగ్రహాలు ప్రతిష్ఠితులై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ పానమట్టం ఏకరాతిశిల. దీనికి నాలుగు మూలలా నాలుగు కాళ్ళుఉండి దానిపైన మట్టం నిలిచి ఉంటుంది. పానమట్టం భూమిని తాకదు. ఈ ఆలయ గోపురం గజపృష్టాకార గోపురంగా పిలువబడుతుంది. అంటే సాధారణ ఆలయ గోపురాలవలె కాక ఇది మూడు శిఖరాలను కలిగి ఉంటుంది. తంజావూరు బృహదీశ్వరాలయ గోపురం మాత్రమే ఈ విధంగా ఉంటుంది. మహామేరు శ్రీ చక్రం అమ్మవారి ముందు అర్చించబడుతోంది. ఇచ్చట నవగ్రహాలకు చెందిన దేవతామూర్తులు సతీ సమేతులై ఈ ఆలయమునందలి నవగ్రహ మండలంలో కొలువుతీరి ఉంటారు. ఈ ఆలయ ఆవరణలోనే వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రక్కగా ఉన్న మండపంలో పెద్ద నాగుపాము పుట్ట ఉన్నది. ఈ నాగుల పుట్ట భక్తులచే విశేషంగా పూజలు అందుకుంటుంది. అంతరాలయ ద్వారానికి పైన ఆదిశంకరుల విగ్రహం చెక్కబడి ఉంది. ద్వారపాలకులుగా ఎడమవైపు కాలభైరవుడు, కుడివైపు నరసింహస్వామి వారు కనిపిస్తారు. ఇక్కడ ప్రతినిత్యం పూజాదికార్యక్రమాలతో పాటు, ప్రత్యేకపూజలు, ఉత్సవములు జరుగును. వానిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక దీపోత్సవములు, స్వామివారి కళ్యాణోత్సవములు, మహాశివరాత్రి ఉత్సవములు కనులపండుగగా జరుపుదురు.

శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి - పెద్దకళ్ళేపల్లి



కృష్ణాజిల్లా, మచిలీపట్నం నుండి 35 కి.మీ. దూరంలో చల్లపల్లికి 10 కి.మీ. దూరంలో ఉన్న పెద్దకళ్ళేపల్లిలో ఈ ఆలయం ఉంది. పవిత్ర కృష్ణవేణి తీరాన కొలువైన ఈ తీర్థక్షేత్రాన్ని నాగేశ్వర క్షేత్రమనీ, కర్ణాటక క్షేత్రమనీ కూడా అంటారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో పెద్దకళ్ళేపల్లి ఒకటి. దీనికే కదలీపురమని కూడా మరో పేరు. ఈ తీర్థానికీ, కాశీ తీర్థానికి చాలా పోలికలున్నాయి. అక్కడ గంగవలె ఇక్కడి కృష్ణకూడా ఉత్తరవాహిని, అక్కడ ఉన్నట్టే ఇక్కడ కూడా కాలభైరవుడున్నాడు.

ఈ ఆల యానికి క్షేత్ర పాలకుడు మదన గోపాలస్వామి. ఈ క్షేత్రములోని లింగము కర్కోటకము అనే సర్పరూపమున స్పటిక లింగముగా దర్శనమిస్తుంది. ఇక్కడ స్వామివారు స్వయంభువు. ఈ ఆలయం క్రీ.శ. 1292వ సం॥లో సోమశివాచార్యులనే శివభక్తుడి చేత నిర్మించబడి నేటికీ నిత్యకల్యాణం పచ్చతోరణంలాగా విరాజిల్లుతోంది. క్షేత్ర మహాత్మ్యం పద్మ పురాణంలో వ్యాసుల వారిచే వర్ణించబడి ఉన్నది. ఈ క్షేత్రములోని స్వామివారు శ్రీ దుర్గ నాగేశ్వరుడు. అమ్మవారు పార్వతీదేవి. అందువలన ఈ స్వామివార్లను శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి అని అంటారు. సముద్రానికి దగ్గరగా ఉన్న ఈ పల్లె మొదట 'కడలిపల్లె' అని పిలువబడేదంటారు. అదేకాలక్రమంలో కల్లేపల్లిగా నామాంతరం చెందింది. ఈ క్షేత్ర ఆవిర్భావానికి మరొక కథనం కూడా వినిపిస్తారు స్థానికులు. ఎనిమిది మంది సర్పరాజులు విధివశాన శాపగ్రస్తులై, ఆ శాపవిముక్తికోసం ఒకవేదిక నిర్మించి నాలుగుపక్కలా కదళీ వృక్షాలు ఉంచి ఈశ్వరుని ప్రతిష్ఠించి నిత్యపూజలుచేశారనీ, వారిభక్తికి, పూజకు మెచ్చి శంకరుడు ప్రత్యక్షమై 'కదళీ వృక్షాల' మధ్యనన్ను ఆరాధించారు కనుక కదళీపురమనే నామంతో ఇక్కడొక పుణ్యక్షేత్రం ఆవిర్భవిస్తుంది అని వరము ప్రసాదించాడు. ఆ కదళీపురమే నేడు కల్లేపల్లిగా రూపాంతరం చెందిందని పెద్దల మాట. ఈ క్షేత్రమును భక్తులు దక్షిణకాశి అని కూడా పిలుస్తారు. ఆలయానికి ఈశాన్యంలో "నాగకుండం" అనే సరస్సు ఉంది. ఉత్తమ తీర్థాలన్నీ దీనిలో సంగమిం చడం వలన దీనిని పరికర్ణికా తీర్థమని అంటారు. ఈఆలయంలో దక్షిణ భాగాన రెండుమీటర్ల ఎత్తుగల శిలాస్తంభము ఒకటి కలదు. దానిని సత్యస్తంభమందురు. ఆ స్తంభంమీద "బుద్ధమ్ శరణమ్ గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణమ్ గచ్ఛామి" అని లిఖించబడి ఉన్నవి. ఈ స్తంభమూలాన క్షేత్రరూపుడగు కర్కోటకుడు ప్రతిష్ఠింపబడిఉన్నాడు. ఈ స్తంభం చుట్టూ ప్రదక్షిణం చేసి నిల్చున్న వారి నోటినుండి అసత్యవాక్కు వెలువడదని ప్రజల విశ్వాసం. ఆలయానికి వచ్చిన ప్రజలుముందుగాఈ స్తంభ మును దర్శించి తరువాత నాగేశ్వరుని దర్శించె దరు. ఆలయ గోడలమీద పంచముఖ గణపతి సింహాసనము మీద కనిపిస్తాడు. ఇది చాలా అరుదైన విగ్రహంగా చెబుతారు.


సత్యస్తంభము

ఇచట ప్రతిరోజు అర్చనలు, ప్రత్యేకపూజలు జరుగును. ఉగాదిపర్వదినాన, శ్రావణ పౌర్ణమి రోజున లక్ష కుంకుమార్చన, శ్రీకృష్ణ జన్మాష్టమి, ఆశ్వీయుజ మాసంలో అమ్మవారి ఉత్సవాలు, కార్తీక మాసంలో అఖండ దీపారాధన, ఆరుద్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున స్వామి వారి కల్యాణోత్సవం,

రథోత్సవం ఘనంగా జరుగుతాయి. ఈ చంద్రమౌళీశ్వరాలయం ఉత్తరాభిముఖంగా ఉన్నది. గర్భాలయం,అంతరాలయం,మండపంఅను మూడుభాగాలుగా ఉన్నది. గర్భాలయంలో ఓంకార సమేత శ్రీ చంద్రమౌళీశ్వరుడు దర్శనమీయగా, అంతరాలయంలో ఎడమవైపున అమ్మవారు, కుడివైపున భద్రకాళీ సమేత వీరభద్రుడు, మండపంలో నందీశ్వరుడు దర్శనమిస్తారు. ఆలయ కుడిభాగాననూతనంగానిర్మింపబడిన రామలింగేశ్వరాలయం, మల్లీశ్వరాలయము ఉండగా, ఆలయాల కెదురుగా వినాయకుడు, చిన్న ధ్వజస్తంభము మొదలగునవి భక్తులకు దర్శనమిస్తూ కనిపిస్తుంటాయి.

శ్రీ చంద్రమౌళీశ్వరాలయం - జగ్గయ్యపేట



కృష్ణాజిల్లాలోని జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట గ్రామములో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం కలదు. ఇది అతి ప్రాచీనమైన ఆలయముగా ఎంతో ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయం 400 సంవత్సరాల క్రితం కట్టబడినది చెబుతారు. ఈ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి స్వామివారు కలలో కనిపించి ముక్త్యాల వద్ద ఉత్తర వాహిని అయిన కృష్ణానదిలో తాను ఉన్నానని, తీసుకొని వచ్చి గుడికట్టించమని సెలవిచ్చారట. స్వామి చెప్పిన ప్రకారం వారు ఈ శివలింగాన్ని తీసుకొని వచ్చి ఇక్కడ గుడి కట్టించారు. దీనిని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు క్రీ.శ.1794లో దర్శించి ఆలయ నిర్వహణ కోసం కొంత భూమిని గూడా దానంగా ఇచ్చినట్లు తెలియుచున్నది. అప్పటినుండి ఈ ఆలయం గొప్ప ప్రజాదరణ పొందింది. అంతేకాక ప్రాకారము వెంట మరికొన్ని ఇతర దేవతామూర్తులను, చిన్నచిన్న మందిరాలలో చూడవచ్చును. సీతామందిరము, కళ్యాణమండపము, కంచికామాక్షీ సమేత ఏకాంబరేశ్వరుడు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, ఆదిశంకరుడు, నాగేశ్వరుడు, పంచాయతనము, అయ్యప్పస్వామి, దత్తాత్రేయుడు, కుమారస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, నవగ్రహాలు, షిర్డీసాయిబాబా, ఆంజనేయుడు, కాలభైరవ ఇంకా ఇతర మూర్తులను నెలకొల్పి ఆలయమునకు పరిపూర్ణత చేకూర్చారు. విశేష దినాలలో ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ ధనశైల సీతారామస్వామి దేవాలయం, జగ్గయ్యపేట



కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటలో ఈ ఆలయం ఉన్నది. 300 సంవత్సరాల క్రితం విజయవాడ దగ్గర ధనమ్మ బొడ్డు అనే ప్రాంతంలో తవ్వకాలలో లభించిన విగ్రహాలను జగ్గయ్యపేటలో ఒక ఆలయాన్ని నిర్మించి అందులో ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందువలననే ఈ ఆలయానికి ధనశైల సీతారామస్వామి దేవాలయం అని పేరు వచ్చింది అని తెలుస్తుంది. స్వామివారికి ప్రక్కనే సంతానవేణుగోపాలస్వామిని ప్రతిష్ఠించారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆండాళ్ళు (గోదాదేవి), ఆళ్వారులు కూడా ప్రతిష్ఠితులై ఉన్నారు. ఎదురుగా ఆంజనేయస్వామివారు ప్రతిష్ఠితులైనారు. దేవాలయం చుట్టూ గదులు, బయటవైపు విశాలమైన మంటపం ఉన్నది. ఈ మంటపంలోనే గోదాకళ్యాణం నిర్వహిస్తారు. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటూ, పండుగ పర్వదినాలలో ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు. ప్రస్తుతం ఇక్కడ ఒక పాఠశాల నిర్వహించబడుతోంది.

శ్రీ వరదరాజస్వామి దేవాలయం, జగ్గయ్యపేట



కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటలో వరద రాజస్వామి వారి దేవాలయం ఉన్నది. పూర్వము ఈ ఆలయం ఉన్న ప్రాంతములో ఎక్కువగా యాదవులు నివసించేవారు. వాళ్ళు ఇచ్చట గోవులను పెంచుతూ జీవనం సాగించేవారు. ఆ కాలంలో చిలకమర్తి గోపాలాచార్యులు అనే వ్యక్తికి స్వామి కలలో కనబడి, మీ ఇలవేల్పుని నేను, ఇక్కడ వెలిశాను, నన్ను వెతికి ప్రతిష్ఠించుకోండి. మీకు శుభాలు కలుగు తాయని చెప్పగా, తెల్లవారిన తరువాత ఆయన మరి కొందరితో కలసి ఆ ప్రాంతంలో వెతుకగా ముందుగా నాగరాజు విగ్రహం, తరువాత శంఖం, చక్రం ఆ తరువాత స్వామివారి విగ్రహం బయల్పడినవి. తరువాత ఆ ప్రాంతంలో ఆలయం నిర్మించి విగ్రహాలు ప్రతిష్ఠించారు. గర్భాలయానికి ఒక ప్రక్క మహాలక్ష్మి అమ్మవారు, మరో ప్రక్క వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆళ్వారులు కొలువుతీరి ఉన్నారు. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటూ, పండుగ పర్వదినాలలో ప్రత్యేకపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ శేషశాయి రంగనాయకస్వామి - జగ్గయ్యపేట

కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట మండలం, మున్నేటి గ్రామములో నదీతీరాన శ్రీ శేషసాయి రంగనాయకస్వామి వారి ఆలయం కలదు. ఈ ఆలయమును అమరావతీ సంస్థానాధిపతులు శ్రీరాజా, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారు కట్టించారని కొందరి వాదన. మరికొందరు ఈ రంగనాయకస్వామి వారే భక్తులకు కలలో కనిపించి ఎంతోకాలం నుండి సమీపమందున్న అనుమంచిపాలెం గ్రామ చెరువులో నిక్షిప్తమై ఉన్నానని, తన ఉనికి తెలియజేసి, వారితో నన్ను నీటినుండి పైకితీసి నాకొక ఆలయము నిర్మించవలసిందిగా చెప్పగా, ఆప్రకారం స్వామిని నదినుండి బయటకు తీసి, ఆయనకొక ఆలయమును కట్టించి, అందులో ఆ మూర్తిని ప్రతిష్ఠించారని తెలియుచున్నది. తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయం గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడుభాగాలుగా ఉన్నది. వానిలో గర్భాలయంలో రంగనాయకస్వామి వారు దర్శనమీయగా, అంతరాలయము కుడివైపున మనవాళ్ళ మహాముని, ఎడమవైపున రామానుజాచార్యులవారు గోదాదేవి, పన్నిద్దరు మంది ఆళ్వారులు దర్శనమిస్తారు. ఇచ్చట వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస పూజలు, మాఘపూర్ణిమనాడు స్వామివారి కళ్యాణోత్సవం, పూర్ణిమనాడు కృత్తికాదీపోత్సవము, లక్ష్మీతులసిపూజ, శ్రీరామనవమి ఉత్సవములను ఘనంగా జరుపుదురు.

శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దేవాలయం - తిరుమలగిరి



కృష్ణాజిల్లా, జగ్గయ్యపేటకు 8 కి.మీ. దూరంలో జాతీయ రహదారిపై చిల్లకల్లుకు కేవలం 3 కి.మీ. దూరంలో ఈ తిరుమల గిరి అనే ఊరు ఉంది. ఇక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి పొందింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు ఇక్కడ కొలువై ఉన్నారు. చుట్టుపక్కల భక్తులే కాకుండా ఎంతో దూరం నుండి వచ్చి భక్తులు ఈ ఆల యాన్ని దర్శించుకుంటారు. గ్రామానికి ఉత్తరంగా తిరుమలగిరి పర్వతం ఉంది. అంటే పవిత్రమైన కొండ అని అర్థం. పేరుకు తగ్గట్టే ఈ కొండపై ఉన్న స్వామిని దర్శించుకుంటే అనుకున్న పనులు వెంటనే నెరవేరుతాయని స్థానికులు

నమ్ముతారు. త్రేతాయుగంలో భరద్వాజ మహర్షి ఇక్కడ కృష్ణానదికి దగ్గరలో ఉన్న కొండమీద ఆశ్రమం నిర్మించుకుని గొప్ప తపస్సు చేశాడు. ఆ మహర్షి తపస్సుకు మెచ్చిన శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై "ఏం వరం కావాలో కోరుకో" అనగా అపుడాముని దేవా! నీవు ఈ కొండపై వెలసి భక్తుల కోర్కెలు తీరిస్తే చాలు" అనగా, ఆ మహర్షి కోరిక మేరకు శ్రీమహావిష్ణువు వల్మీక రూపశిలమీద తిరుమలగిరి కొండపై మహా తేజస్సుతో, వేంకటేశ్వర స్వామి స్వయంభువుగా అవతరించాడు. ఈ స్వామి నామాలు ధరించి వెలసాడు కాబట్టి నామాల వేంకటేశ్వరుడుగా ప్రసిద్ధి చెందాడు. అంతకంటే మరొక విషయం ఏమంటే వేంకటేశ్వరునికి తూర్పున స్వామివారి ఎడమకాలిపాద ఘట్టనతో కోనేరు ఏర్పడింది. ఏకశిలలోపాదం ఆకృతిలో కోనేరు వెలసింది. ఇక్కడి వెంకటేశ్వరుడు వల్మీకంనుంచే పూజలుఅందుకొనుచున్నాడు. అందుచే సూర్యాస్తమ యం తరువాత దేవాలయాన్ని మూసివేస్తే, మరలా సూర్యోదయం తరువాతనే తెరుస్తారు. అంతేకాక ఆలయం మూసిన తరువాత ఆలయ పరిసరాలలో ఎవ్వరూ సంచరించరు. స్వామి వారి ఆలయం ప్రక్కనే కుడివైపు వరాహమూర్తి కొలువుతీరి ఉన్నారు. భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామివారు ఇచ్చట క్షేత్రపాలకుడు. ఈ ఆలయానికి ఉత్తరభాగంలో ఒక బిల్వవృక్షం ఉంది. దీనిని సంతాన బిల్వ వృక్షమని అంటారు. ఈవృక్షానికి పూజ చేస్తే సంతానం లేనివారికి సంతానం కలుగగలదని భక్తుల నమ్మకం. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు పాలు, పెరుగు, నెయ్యి, కొత్తధాన్యం, కొత్త పెసరపప్పు, గుమ్మడికాయలు తెచ్చి స్వామివారికి సమర్పించుకుంటారు. ఆవులను కూడా ఇచ్చట గిరి ప్రదక్షిణం చేయిస్తారు. ఇలా చేయించటం వలన ఆవులకు కోడదూడలు పుడతాయని భక్తుల నమ్మకం.

శ్రీరాజా, వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు స్వామిని దర్శించి, ఆలయము కట్టించి, ఈ ఆలయానికి 40 ఎకరాల భూమిని గూడా దానముగా ఇచ్చారు. అప్పటి నుండి ఈ నామాల వెంకటేశ్వరస్వామి స్థానికులనే గాక, దూరప్రాంతాల భక్తులను కూడా ఆకర్షిస్తూ, పూజలందుకొనుచున్నాడు. ఇప్పుడిది ఒక దివ్యక్షేత్రంగా నిత్య పూజలతో వెలుగొందుచున్నది. ముక్కోటి, దసరా, ఉగాది, శ్రీకృష్ణ జన్మాష్టమి ఇత్యాది పండుగలు వైభవంగానిర్వహిస్తారు. చైత్ర పూర్ణమినాడు స్వామివారికళ్యాణం వైభవంగా సాగుతుంది. ఫాల్గుణ మాసం నెలరోజులు ముఖ్యంగా ఆఖరిశనివారం నాడు వేలాది మంది భక్తులు స్వామినిదర్శించి సేవిస్తారు. స్వామివారి సన్నిధిలో నామకరణోత్స వాలు, అన్నప్రాసనలు, ఉపనయనాలు, వివాహాలు,చెవులు కుట్టించు కొనుట వంటి శుభకార్యాలనువేడుకగా చేసుకొంటారు. చైత్రశుద్ధపౌర్ణమినాటికి41 రోజులుపూర్తయ్యే విధంగా వెంకటేశ్వరమాలధారణచేయటంఇక్కడొక సంప్రదాయంగా వస్తోంది.

శ్రీ జ్వాలా నారసింహ క్షేత్రం - వేదాద్రి



కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేట మండలంలో చిలకల్లుకు 10 కి.మీ. దూరంలో కృష్ణానదీ తీరాన వేదాద్రి అనే గ్రామములో పర్వత పాదభాగాన శ్రీ జ్వాలా నరసింహ క్షేత్రం కలదు. ఇది చాలా ప్రాచీన ఆలయము. ఈ ప్రదేశంలో కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహిస్తుంది. ఇచ్చట నరసింహ స్వామి పంచ రూపాత్మకుడై జ్వాలా సాలగ్రామ వీర యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారిగా సేవలందుకొనుచున్నాడు. ఈ ఆలయం 12వ శతాబ్దంలో కానీ, 13వ శతాబ్దంలోగానీ నిర్మించినట్లు చరిత్ర తెలియజేయుచున్నది.

చరిత్ర : సోమకాసురుడు అనే రాక్షసుడు వేదములను దొంగిలించి సముద్రంలో దాగగా, అతనిని సంహరించేందుకు శ్రీమహావిష్ణువు మత్స్యావ తారముఎత్తి, సోమకాసురుని సంహరించి వేదములను ఉద్ధరించాడు. అపుడా వేదములు సంతోషించి శ్రీ మహా విష్ణువుతో, దేవా! నీవు నేటినుండి మా శిరములపై నధిరోహించి, మమ్ములను తరింప జేయమని కోరాయి. అప్పుడు శ్రీమహావిష్ణువు వేదములకోరిక విని, చతుర్వేదము లారా! నేను మునుముందు ప్రహ్లాదుని రక్షణార్థం ఉగ్రనరసింహావతారమెత్తగలను. అప్పుడు మీ కోరిక నెరవేర్చెదను. అందాకా మీరు కృష్ణవేణీ నదీ గర్భాన సాలగ్రామ రూపంలో ఉన్న నామీద విశ్రమించండి అని చెప్పి, వేదములను సముదాయించాడట! ఆ ప్రకారం వేదములు శ్రీమహావిష్ణురూపమైన సాలగ్రామం మీద విశ్రాంతి తీసుకొన్నాయి. కొంతకాలం తరువాత ప్రహ్లాదుని రక్షణార్థం శ్రీమహావిష్ణువు ఉగ్రనరసింహావతారమెత్తి హిరణ్యకశిపుని సంహరించి తాను వేదములకిచ్చిన మాట ప్రకారం వేదములు ప్రతిధ్వనించు చున్న వేదాద్రి శిఖరము మీద జ్వాలారూపమున వెలసాడు. ఆ విధంగా తమ శిరము అయిన వేదాద్రి శిఖరము మీద వెలిసిన శ్రీమహావిష్ణువును చూసి వేదాలెంతో సంతోషించాయి. ఈ వేదాద్రి క్షేత్రంలో నరసింహావతారంలోని తన ఐదు అంశాలను వేద్రాది అంతటా ఆవిర్భవింపజేశాడు.

ఈ విధంగా శ్రీమహావిష్ణువు కృష్ణవేణిలో సాలగ్రామ రూపంగాను, పర్వతాగ్రము మీద శ్రీజ్వాలా నరసింహరూపునిగా, పర్వత పాదభాగాన యోగానంద శ్రీలక్ష్మీ నరసింహ రూపాలుగా, గరుడాద్రి మీద శ్రీ వీరనరసింహ రూపముతో వెలయుటచే,



ఈ క్షేత్రం పంచనారసింహ క్షేత్రముగా ప్రసిద్ధి గాంచినది. ఆ తరువాత పర్వత పాదపీఠాన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహులకు ఒక ఆలయము నిర్మించబడినది. ఆ ఆలయము శ్రీ యోగానంద లక్ష్మీనరసింహాలయముగా ప్రసిద్ధిచెంది భక్తజనావళిచే పూజలు అందుకొనుచుప్రవిర్ధితమగుచున్నది.

పశ్చిమాభిముఖంగా ఉన్న ఈ ఆలయంలో గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. మూలవిరాట్టు పడమటి ముఖంగా కృష్ణానదివైపు తిరిగి ఉంటుంది. ఆలయం గర్భగృహమునందు యోగానంద లక్ష్మీ నరసింహుడు, అంతరాలయములో ఎడమవైపున రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఆదిలక్ష్మీదేవి, కుడివైపున ఆళ్వారు సన్నిధి, మండపమునందు కుడివైపున చెంచులక్ష్మీ దేవి యొక్క పవళింపు సేవామందిరము, ఎదురుగా గరుడ ఆళ్వారు మొదలగు దేవతలు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయంలో నూతనముగా నిర్మించిన గోపురాలు మాత్రం అత్యంత సుందరంగా ఉన్నాయి. యోగనిష్టలో ఉన్న స్వామి కళ్యాణమునకు సంసిద్ధుడు కాదని భావించిన ఋష్యశృంగుడు శాంతాదేవితో కూడి లక్ష్మీనారసింహాన్ని ప్రతిష్టించి శాంతి కళ్యాణాన్ని జరిపించాడని స్థలపురాణం. అదే సాంప్రదాయంతో శ్రీ లక్ష్మీనరసింహాస్వామివారికి ప్రతి సంవత్సరం వైశాఖశుద్ధ ఏకాదశి మొదలు పంచాహ్నికంగా తిరుకల్యాణం ఘనంగా నిర్వహించబడుతుంది.

భవానీ ముక్తేశ్వరాలయం - ముక్త్యాల



కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేటకు 13 కి.మీ. దూరంలో శ్రీ భవానీ ముక్తేశ్వరా లయం ఉంది. ఇది చాలా ప్రాచీనమైన శైవక్షేత్రము. ఈ క్షేత్రంలోని స్వామి గొప్ప మహిమాన్వితుడు. కృతయుగంలో బలిచక్రవర్తి



తపస్సుకుమెచ్చి ప్రత్యక్షమైన శివుడు మరకత లింగస్వరూపుడై ముక్తేశ్వరుడిగా కృష్ణానది గర్భాన వెలిశాడు. ముక్తేశ్వర లింగంగా పిలువబడిన ఈ స్వామి ఆలయం విశ్వకర్మచే నిర్మించబడినట్లుగా చెబుతారు. సంవత్సరంలో 6 నెలల పాటు నదిలో మునిగే ఉంటుంది. అందువలన మరలా బలిచక్రవర్తి ప్రార్థన మేరకు భూమిపై స్ఫటిక లింగ రూపంలో పరమ శివుడు వెలిశాడు.

ఈ విధంగా వెలసిన లింగానికి బలిచక్రవర్తి కృష్ణానదీ తీరంలో నిర్మించిన మరో ఆలయం 'భవానీ ముక్తేశ్వరాలయం'. దీనిని చాగి పోతయరాజు పునర్నిర్మించినట్లుగా శాసనం తెలుపుతుంది. కాకతీయుల కాలం నుండి ప్రశస్తమైన ఈ గ్రామం వాసిరెడ్డి ప్రభువుల ఆధీనంలో గొప్ప ప్రఖ్యాతిగాంచినది. ఆ ప్రభువులే భవానీ ముక్తేశ్వరుల ఆలయాల నిర్వహణకు 350 ఎకరాల భూమిని దానంగా ఇచ్చియున్నారు. ఈ ఆలయం తూర్పుముఖంగా ఉండి, గర్భగృహం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. గర్భాలయంలో భవానీ ముక్తేశ్వరుడు దర్శనమీయగా, అంతరాలయంలో కుడిభాగాన భద్రకాళీ సమేత వీరభద్రుడు, ఎడమ భాగాన భవాని అమ్మవారు, మండపంలో నందీశ్వరులు భక్తులకు దర్శనమిస్తారు. ఈ భవానీ ముక్తేశ్వరస్వామికి మాఘ బహుళ చతుర్దశి మహాశివరాత్రి నాడు కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. కార్తీక మాసంలో విశేష పూజలు ఘనంగా జరుగుతాయి.

చెన్నకేశవాలయం - ముక్త్యాల

కృష్ణాజిల్లా, ముక్త్యాల గ్రామంలో చెన్నకేశవాలయం కలదు. ఈ ఆలయము ఇచట నిర్మించిన వారు ముక్త్యాల సంస్థానాధిపతులైన వాసిరెడ్డివారు. వారు ఆలయాన్ని ప్రతిష్ఠించి, ఆలయ నిర్వహణ నిమిత్తం నూటముప్పది ఎకరాల భూమిని గూడా దానంగా ఇచ్చి గౌరవించారు. ఈ ఆలయం గర్భగృహం అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. గర్భాలయమందు చెన్నకేశవుడు భక్తులకు దర్శనమిస్తాడు. అంతరాలయంలో ఆళ్వారు, మండపాన లక్ష్మీఅమ్మవారు, ఎదురుగా వాలిసుగ్రీవులు మొదలగు దేవతామూర్తులతో అలరారు చున్నది. ఈ ఆలయంనందు నిత్యపూజలతో పాటు ప్రతి శనివారం లక్ష్మీపూజ, దసరా పర్వదినాలలో ఉత్సవాలు, వైకుంఠ ఏకాదశి ఉత్సవము, ధనుర్మాసోత్సవములు మొదలగు ఉత్సవాలు ఇచ్చట ఘనంగాజరుగుతాయి.

శ్రీ వేణుగోపాల స్వామి - నెమలి



కృష్ణాజిల్లాలోని గంపలగూడెం మండలంలో ఈ నెమలి అనే గ్రామం ఉంది. ఇక్కడి ఆలయంలోని స్వామి శ్రీ వేణుగోపాలస్వామి త్రిభంగి ఆకృతిలో వ్యత్యస్త పాదారవిందుడై (ఎడమ పాదముపై నిలబడి, కుడి పాదమును ఎడమపాదముపై నుండి ముని వేళ్ళపై నిలిపి) సన్నని నడుము, విశాలమైన నేత్రాలతో, తిరునామంతో, మౌళిపై ఫించంతో, చిరునవ్వులు చిందిస్తూ వయ్యారంగా నిలిచి మురళి వాయించుచున్న భంగిమలో స్వయంభువుగా వెలసి, భక్తుల కోర్కెలు తీరుస్తూ నిత్యపూజలు అందుకొంటున్నాడు. విగ్రహం అంతా సాలగ్రామ శిల అవ్వటం వలన నీలము, నలుపు కలసిన విచిత్ర కాంతితో ప్రకాశిస్తుంటుంది.

శ్రీకృష్ణుడు ద్వాపరంలో తన అవతారం చాలిస్తూ, తన నెమలి పింఛాన్ని ఇచట వదలినాడని, అదేచోట తను విగ్రహరూపాన్ని ధరించి భూగర్భంలో ఉండగా, ఆ వేణు గోపాలస్వామిని ఎందరో మహనీయులు యోగదృష్టితో దర్శించి తరించారని ప్రతీతి. ఆ ప్రాంతాన్నే 'నెమలి' గ్రామంగా నేడు పిలుస్తున్నారు. కామస్పర్శ లేనిది నెమలి ఒక్కటే! అందుకే స్వామి నెమలిపింఛాన్ని ధరించి కామరాహిత్యాన్ని లోకానికి చాటారు. స్వయంభువు అయిన స్వామిని, నెమలి గ్రామస్తులు మట్టిగుంట త్రవ్వుతుండగా భూగర్భంలో చిరునవ్వులు చిందించే చిద్విలాసమూర్తి విగ్రహం బయటపడింది. ఈ సందర్భంలో గడ్డపార తగిలి స్వామి వారి ఒక చేతి చిటికిన వేలు, పిల్లనగ్రోవికి ఒక వైపు కొద్దిగా విరిగిపోయింది. ఆ విరిగిన భాగాలను తరువాత వెండి లోహంతో సరిచేశారు. ఉత్తరాభి ముఖంగా వెలసిన స్వామివారిని తూర్పు ముఖంగా మార్చుటకు ప్రయత్నించగా భయంకరమైన గాలివానలు వచ్చి ఆ ప్రయత్నం సాగలేదు. అందుచే స్వామివారు నేటికీ ఉత్తరాభిముఖంగా ఉంటారు. స్వామివారికి కుడివైపున ఉన్న ఉపాలయంలో శ్రీ రాజ్యలక్ష్మీదేవి, ఎడమ వైపున ఉన్న ఉపాలయంలో శ్రీ గోదాదేవి (ఆండాళ్) కొలువు తీరి ఉన్నారు. నెమలి గ్రామానికి చుట్టు ప్రక్కలనున్న అరవై గ్రామాలవారు, తమ ఇలవేల్పుగా స్వామిని అర్చిస్తూ, ఏ శుభకార్యం జరిగినా స్వామికే తొలి నివేదన సమర్పించు కుంటారు. నెమలికి ఉత్తరంగా కిలోమీటరు దూరంలో ఏరు



ప్రవహిస్తోంది. ఈ జలంతో స్వామినభిషేకించి, తీర్థం ఇస్తారు. ఈ జలం అన్నివ్యాధులను నయం చేస్తుందని భక్తుల నమ్మకం.

శ్రీ స్వామి వారికి ఉగాది పండుగనాడు పంచాంగ శ్రవణం, శ్రీరామ నవమి రోజు స్వామి అవత రించిన రోజు కావున అభిషేకము మొదలైన పూజలు, తొలిఏకాదశి రోజున ఏకాహము, శ్రీకృష్ణాష్టమి రోజున ఉట్టి కొట్టుట, గ్రామోత్స వము, విజయదశమి రోజున అమ్మవారికి కుంకుమార్చన, దసరా రోజున శమీపూజ జరుగు తాయి. భక్తులు ప్రతి సోమవారం, శుక్రవారం ఎక్కువగా ఈ స్వామిని దర్శించుకుంటారు. నెమలి వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు ప్రతీ ఏటా ఫాల్గుణ మాసంలో ఆరు రోజులపాటు అతి వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు కృష్ణా-ఖమ్మం జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు వచ్చి తమ వాహనాలకు ప్రభలు కట్టుకొని కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శిస్తారు. ఆలయ పర్యవేక్షణలో గోశాల, నిత్యాన్నదాన పథకం నడుపబడుతోంది. ఆలయం భక్తులతో నిత్యం రద్దీగా ఉటుంది.

శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవాలయం - గుడివాడ



కృష్ణాజిల్లా, మచిలీపట్నం నుండి సుమారు 40 కి.మీ., దూరంలో గుడివాడ పట్టణ నడిబొడ్డున శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవాల యం ఉన్నది. ఈ ఆలయం పురాతనమైన దని తెలియుచున్నది. ఈ ఆలయ ప్రవేశానికి తూర్పువైపు, దక్షిణవైపు రెండు ద్వారాలు ఉన్నాయి. ముఖ ద్వారం రెండు అంతస్తులుగా ఉంది. చతుర్భుజులైన ద్వారపాలకులు శంఖు, చక్ర, గదలతో ద్వారాలకు ఇరువైపులా నిలిచి ఉన్నారు. గాలిగోపురం శిల్ప కళతో నలుదిశలా ఒకేవిధంగా నిర్మించబడింది. తూర్పు ప్రాంగణం గుండా ఆల యంలోకి ప్రవేశించగానే ఎదురుగా ధ్వజ స్తంభం ఆ తర వాత చక్కని శిల్పకళతో నిర్మితమైన ప్రధాన ఆలయ మండపం దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయానికి పైన



మూడు విడివిడి రాజగోపురాలు నిర్మించబడి ఉన్నాయి. గర్భాలయ ప్రవేశానికి మూడు ద్వారాలు ఉన్నాయి. మండప ముఖద్వారం నుండి గర్భాలయానికి ప్రవేశించగానే భీమేశ్వరస్వామి లింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. స్వామివారికి ఎదురుగా నందీ శ్వరుడు కొలువై ఉన్నాడు. గర్భాలయానికి ఇరువైపులా వృషభే శ్వరుడు, కాళేశ్వరుడు ఆయుధాలు ధరించి స్వామి వారికి ద్వారపాలకులుగా ఉన్నారు. స్వామి వారికి కుడివైపున పార్వతీదేవి కొలువై ఉన్నది. వీరికి ఎడమవైపున వీరభద్ర స్వామి ద్వారపాలకుడుగా ఉన్నాడు.

గర్భాలయానికి ఒక ప్రక్కన ఉన్న ఉత్సవమంటపంలో గోడకు పరమేశ్వరుడు పార్వతీ దేవితో కలిసి ఉన్న శిల్పం ఎంతో ఆకర్షిస్తుంది. ఆలయ ముఖమండపంపైన నారదుడు, తుంబురుడు, శ్రీరాముడు, పరమేశ్వరుడు, బ్రహ్మ మొదలైన విగ్రహాలు ఉన్నాయి. ఆలయ గోడను ఆనుకొని చిన్నమందిరంలో శ్రీ చండేశ్వరస్వామి దర్శనమిస్తాడు. ఆలయ ప్రాంగణంలో రావి చెట్టు క్రింద పెద్ద పుట్ట ఉంది. ఈ వృక్షం మొదలులో శ్రీ మహా గణపతిని ఒకవైపు, దాసాంజనేయుడ్ని మరొకవైపు ప్రతిష్టించారు. కొద్ది దూరంలో నాగబంధం, తులసికోటను ప్రతిష్టించారు. నాగులచవితి, సుబ్రహ్మణ్యషష్ఠి లాంటి పర్వ దినాలలో భక్తులు సుబ్రహ్మణ్యస్వామిని ఘనంగా అర్చిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం ఉంది.

ఆలయంలో భీమేశ్వరస్వామికి నిత్యం అభిషేకాలు, పూజలు జరుగుతాయి. పండుగ పర్వదినాలలో విశేష పూజలు, మహా శివరాత్రి ఉత్సవాలు, కార్తీకమాస ఉత్సవాలు, దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయాన్ని దర్శించిన భక్తు లకు గ్రహబాధలు తొలగి, కోరిన కోరికలు సిద్ధించడం వలన ఈ ఆలయాన్ని దర్శించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం - గుడివాడ



కృష్ణాజిల్లా, విజయవాడకు 45 కి.మీ., దూరంలో ఉన్న గుడివాడలో గుడివాడ రైల్వేస్టేషను నుండి అర కిలోమీటరు దూరంలో, బస్టాండ్ నుండి 1.5 కి.మీ., దూరంలో జగన్నాథపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉన్నది. ఒకప్పుడు ఈ గుడివాడ గుడులవాడ,



గుళ్ళవాడగా ప్రసిద్ధిచెందినది. కాలక్రమేణా అదే గుడివాడగా రూపాంతరం చెందింది. ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉన్నది. ఆలయ ప్రాకారం పైన మధ్యన అలమేలు మంగ, పద్మావతి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామికి ఇరువైపులా ఒకవైపు గరుడుడు, మరొకవైపు ఆంజనేయులతో స్వామివారు దర్శన మిస్తాడు. ఆలయ ప్రాంగణంలో వైకుంఠ ఉత్తరద్వారానికి అభిముఖంగా సుమారు 33 అడుగల ఎత్తులో ధ్వజస్తంభం ప్రతిష్టించబడి ఉన్నది. ఎడమభాగాన నాగేంద్ర మందిరం ఉన్నది. ఈ వేంకటేశ్వరాలయ నిర్మాణ స్థలంలో ఒకప్పుడు ఈ ప్రదేశంలో ఒక పుట్ట ఉండేదని ఆలయ నిర్మాణ సమయంలో ఒక మహిమాన్వితమైన నాగుపాము ఇక్కడే తిరుగుతూ ఉండేదని, అందువలనే పుట్ట ఉన్నచోటనే ఈ నాగేంద్రమందిరాన్ని ఈ ప్రదేశంలోనే నిర్మించడం జరిగిందని భక్తులు చెబుతారు.

ప్రధానాలయానికి, ధ్వజస్తంభానికి నడుమ గరుడాలయం, కుడివైపున శ్రీకృష్ణుని మందిరం ఉన్నవి. ఎడమవైపున యాగశాల ఉంది. నిత్యహోమాలతో బలిహరణం ప్రతి నిత్యం జరిగే ఏకైక ఆలయంగా ఈ ఆలయం అలరారుతుంది. యాగశాల ప్రాకారాలపై మహర్షుల మూర్తులు, శ్రీరాముడు, శ్రీ మహావిష్ణువు మొదలగు మూర్తులు దర్శనమిస్తారు. ప్రధానాలయానికి ఇరుప్రక్కలా జయ, విజయులు ఉండగా, గర్భాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య అలంకార భూషితుడై సుందర మనోహరుడిగా దర్శనమిస్తారు. ఈ ఆలయంలో ఒక విశిష్టత ఉన్నది. శ్రీ విల్లిపుత్తూరులో తప్ప దర్శించని అరుదైన దర్శనం ఈ దేవాలయంలో లభించడం ఒక విశేషం. పన్నిద్దరు ఆళ్వారులతో పాటూ వేదాంతదేశికులు అయిన ఒక ఆళ్వారు అదనంగా ఆండాళ్ సమీపంలో పదమూడు మంది ఆళ్వారులను ఇక్కడ దర్శించుకోవచ్చు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పాంచ రాత్ర ఆగమశాస్త్ర ప్రకారం పూజలు జరుగుతాయి. శ్రీవారి పవళింపు సేవ అద్దాల మండపంలో జరుగుతుంది. ఆలయంలో నిత్యపూజలతో పాటు, పండుగ పర్వదినాలలో ప్రత్యేకపూజలు, బ్రహ్మోత్సవాలు, కార్తీక శుద్ధ ద్వాదశి నుండి పౌర్ణమి వరకు వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభోగంగా కన్నులపండువగా జరుగుతాయి.

శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం - గుడివాడ

కృష్ణాజిల్లా, గుడివాడ పట్టణం పాతటౌన్‌లో ప్రాచీనమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ఉన్నది. అతి పురాతనమైన ఈ దేవాలయం పూర్వం బౌద్ధులకు ఆలవాలమైన 'లంజలదిబ్బ' ప్రాంతంలో ఉండేది. కాకతీయ రాజు గణపతి దేవుడి కాలంలో మంచి ప్రాభవంలో ఉన్న ఈ ఆలయానికి ఎన్నో మాన్యాలు ఉన్నాయి. అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలో జరిగిన తురుష్కదండ యాత్రలలో ఈ దేవాలయం పూర్తిగా ధ్వంసం కాబడింది. ఆ తర్వాత జరిగిన త్రవ్వకాలలో లభించిన ఆనాటి విగ్రహం తిరిగి లభించింది. ఆ విగ్రహానికి వుండే వేణువు విరిగి ఉండటం ఇప్పుడు కూడా మనం గమనించవచ్చు.

తరువాత బ్రిటీష్ వారి పరిపాలనా కాలంలో ఓ వ్యక్తి ప్రభుత్వానికి ఎన్నోవేల రూపాయలు బకాయిపడి ఆ సొమ్ము విషయమై కోర్టులో నడుస్తున్న కేసుకు హాజరయి, ఇక్కడకు వచ్చి ఈ ఆలయంలో పడుకున్నాడు. ఆ నిద్రలో స్వామివారు అతనికి కన్పించి తను బందరులో ఓ బ్రాహ్మణుని ఇంటి ఆవరణలో కాకరపాదు క్రిందవున్నానని, తనని తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించమని ఆజ్ఞాపించాడు. ఆ తరువాత రోజు కోర్టులో కేసు అతనికి అనుకూలంగా కొట్టివేసినట్లుగా తెలిసింది. స్వామి స్వప్నంలో చెప్పినట్లుగా అతను బందరులోని వేణుగోపాలస్వామి విగ్రహాన్ని తెచ్చి, ఇక్కడ గుడి కట్టించి, ప్రతిష్ఠ చేయించాడు. ఆనాటినుంచి ధూపదీప నైవేద్యాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి.

ఈ దేవాలయానికి కొద్ది దూరంలో ఆనాడు నిర్మించబడ్డ శ్రీ వీరాంజనేయస్వామి వారి ఆలయం, ఇక్కడే శ్రీ శ్రీ శ్రీ శ్రీ చిదానంద భారతిచే స్థాపించబడిన శ్రీ గణపతి జగదాంబ విశ్వేశ్వరస్వామి ఆలయం కూడా ఉంది. పురాతనమైన ఆలయాలతో పాటు ఇటీవల నిర్మించిన శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం కూడా ఇక్కడ దర్శించవచ్చును.

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం - శింగరాయపాలెం



కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, గుడివాడ నుండి 18 కి.మీ., దూరంలో శింగరాయపాలెం అనే గ్రామములో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయం కలదు. ఇది ఈ మధ్య కాలంలో నిర్మించిన ఆలయం.

సుమారు 60 సంవత్సరాల క్రితము ఈ గ్రామంలో ఒక దేవతా సర్పరాజము శ్రీ బావాజీ మఠములో నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము తటాకములోకి వచ్చి స్నానము చేసి తిరిగి వెళ్ళుచుండగా ఇరువురు రైతు సోదరులు దానిపై రాళ్ళు విసరగా ఆ సర్పము నేలకు తలను బాదుకొని మరణించింది. గ్రామస్తులు అది చూసి దానిని దేవతాసర్పంగా భావించి, కాలువ గట్టుపై పాతిపెట్టారు. ఆ పాముపై రాళ్ళు విసిరిన పాపానికి కంటిచూపు కోల్పోయిన రైతు సోదరులు నాగేంద్రుని మనసున ధ్యానించి ఇది తెలియకచేసిన పొరపాటు మమ్ములను క్షమించమని ప్రార్థించగా చూపు తిరిగి వచ్చినది. అంతట గ్రామస్తులు నాగేంద్రుని మహిమను గుర్తించి, తమ అపరాధాన్ని మన్నించమని వేడుకుంటూ పాతిపెట్టబడిన సర్పమును వెలికితీసి, ఊరేగించి, దహనసంస్కారములు చేసిన ఆ ప్రదేశంలో 'శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి' వారికి ఆలయం నిర్మించారు. ఆనాటి నుండి ఆలయం దినదినాభి వృద్ధి చెందుతూ భక్తులను ఎంతగానో ఆకట్టుకొంటున్నది. ఆలయ ప్రాంగణంలో పాలుపోయు పుట్టకు కూడా మండపం నిర్మింపబడి ఉన్నది. గర్భాలయంలో ఐదు పడగల నాగేంద్రుని విగ్రహం భక్తులకు దర్శనమిస్తుంది.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయం - మొవ్వ



కృష్ణాజిల్లాలో దివిసీమయందుగల మొవ్వ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయం కలదు. ఇది ప్రాచీన ఆలయము. స్థల పురాణం మాత్రం ఇది మౌద్గల్య మహాముని కాలంలో నిర్మాణమైనదని తెలియుచున్నది. స్థలపురాణమును అనుసరించి ఈ ప్రాంతమంతా ఒకప్పుడు అరణ్యంగా ఉండేది. ఆ అరణ్యంలో మౌద్గల్య మహాముని తపం చేసికొనుచుండేవాడు! అతడచట తపం చేసికొనుచు, ఆ ఇసుకతో ఒక వేణుగోపాల స్వామి విగ్రహాన్ని సృజించి ఆచట ప్రతిష్ఠించి ఆరాధించుచుండేవాడు. ఆ కాలంలో ఆలయానికి దగ్గరలో ఒక బ్రాహ్మణపల్లె ఉండేది. ఆ పల్లెలో వరదయ్య అనే బ్రాహ్మణ బాలకుడొకడుండేవాడు. ఇతడు అన్నమాచార్యుల తరువాత కాలంవాడు. త్యాగరాజు మొదలైన వాగ్గేయకారులకంటే సుమారు రెండు వందల సం॥ల ముందువాడు. వరదయ్య బ్రాహ్మణ కుటుం బంలో పుట్టినా యవ్వనకాలం వరకూ అల్లరిచిల్లరగా

ఉండేవాడు. ఊరివారందరూ అతనిని తేలికగా చూచేవారు. ఒకరోజున మౌద్గల్య మహాఋషి వరదయ్యను చూసి, ఆయన వరదయ్యలో అంతర్లీనంగా గొప్ప తేజస్సు ఉందని గ్రహించి అతనికి ఒక మంత్రం ఉపదేశించాడు. ఆరోజునుంచి వరదయ్యలో గొప్పమార్పు వచ్చింది. కొద్ది కాలంలోనే గొప్ప వాగ్గేయకారుడయ్యాడు. మువ్వ గోపాలుడు మీద అనేక శృంగార పదకవితలువ్రాసి, స్వామికి అంకితం చేశాడు. కొంతకాలం ఆయన మొవ్వ విడిచి ఒక్కొక్క పుణ్యక్షేత్రం దర్శించుకుంటూ దేశమంతా పర్యటించాడు. అందువల్ల ఆయనకు క్షేత్రయ్య అనే బిరుదు ఏర్పడి, అదే ఆయన పేరుగా మారిపోయింది. ఆయన ఏ క్షేత్రం వెళ్ళినా అక్కడ ఉన్న ఏ దేవతామూర్తిని స్తుతిస్తూ కీర్తన వ్రాసినా అది తన స్వగ్రామంలో ఉన్న తన ఇష్టదైవం వేణుగోపాలుని ధ్యానిస్తూనే వ్రాశాడు. అందువల్ల ఆయన ప్రతీ కీర్తనలోనూ మొవ్వ గోపాలా అనే మకుటం ఉంటుంది. ఆ కీర్తనలు, మొవ్వ గోపాల పదములు అనే పేరుతో ఆంధ్రదేశంలో మాత్రమే గాక, దక్షిణ భారతదేశమంతటా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఈ గర్భాలయంనందు శ్రీ మువ్వ వేణుగోపాలస్వామి కొలువై ఉండగా, గర్భాలయంనకు ఇరువైపుల శ్రీ రాజ్యలక్ష్మీదేవి, గోదాదేవి ఆలయాలున్నాయి. వాయువ్యంవైపున శ్రీ ఖడ్గాంజనేయస్వామి ఆలయం కలదు. ప్రధానాలయంనకు వెనుకభాగాన ఒక మండపం కలదు. నిరంతర భక్తుల దర్శనార్థమై శ్రీ ఖడ్గాంజనేయస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి, శ్రీ మువ్వ వేణుగోపాలస్వామి, శ్రీ విఖనస మహర్షి శ్రీ భక్తాంజనేయ మూర్తులను మనము దర్శించుకొనవచ్చును. ఆలయదర్శనం 7 నుండి11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 గంటలనుండి రాత్రి 8 గంటలు వరకు దర్శించుకోవచ్చు. మాఘ మాసం నందు మూడురోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

భీమేశ్వరాలయము - మొవ్వ

కృష్ణాజిల్లా, మొవ్వ గ్రామంలో ఈ భీమేశ్వరాలయం కలదు. ఇది ప్రాచీనమైన ఆలయం. దీనిని మౌద్గల్య మహర్షి ప్రతిష్ఠించాడని పురాణకథ. ఈఆలయం గర్భాలయం, అంతరాలయం, మండపం అనుమూడుభాగాలుగాఉన్నది. గర్భాలయంలో భీమేశ్వరుడు, అంతరాలయములో నందీశ్వరుడు, ఆ నందీశ్వరునకు ఎడమ భాగాన వినాయకుడు, మండపమునందు ఎడమ భాగానబాలా త్రిపురసుందరీ అమ్మవారు, కుడిభాగాన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రుడు కొలువై ఉన్నారు. ఇచట ఆలయంనందు నిత్యపూజలే గాక, ప్రత్యేక పూజలు, దేవీ నవరాత్రి పర్వదినాలలో ఉత్సవాలు శివరాత్రి ఉత్సవాలు, వంటి ఉత్సవాలు ఎంతో వైభవముగాజరుగును.


శ్రీ భావన్నారాయణస్వామి - భావదేవరపల్లి



కృష్ణాజిల్లా నాగాయలంక మండ లంనకు 7 కి.మీ. దూరంలో భావ దేవరపల్లి అనే గ్రామము ఉన్నది. ఈ గ్రామంలో పంచ భావన్నారా యణ క్షేత్రాలలోఒకటైన శ్రీ భావన్నారాయణస్వామి వారి ఆలయం ఉన్నది. పంచారామాలుఅనే అయిదు శైవక్షేత్రములు ఉన్నట్లే, శ్రీ మహావిష్ణువుకు ఆంధ్రప్రదేశ్‌లో అయిదుచోట్ల శ్రీ భావన్నారాయణస్వామి వారి క్షేత్రాలు ఉన్నాయి. కాకినాడ నగరం లోనే ఒక భాగంగా ఉన్న సర్పవరంలో ఒకటి, గుంటూరు జిల్లాలోని పొన్నూరులో ఒకటి, ప్రకాశం జిల్లాలోని పెదగంజాంలో ఒకటి, పశ్చిమగోదావరి జిల్లా పట్టిసంలో ఒకటి, ఈ భావదేవరపల్లిలో ఒకటి చొప్పున మొత్తం ఐదు క్షేత్రాలు ఉన్నాయి. ఆలయంలోని భావన్నారాయణ స్వామివారు స్వయంభువుడు. మూడు అడుగుల ఎత్తులో ఉన్న స్వామివారి అలంకరణచాలాఆకర్షణీయముగా ఉంటుంది. ఈ స్వామివారికి పెద్ద పెద్ద మీసములు వెండితో చేసినవి ఉండటం ఒక ప్రత్యేకత. స్వామివారి మూర్తికి రెండు వైపులా శ్రీదేవి, భూదేవిల విగ్రహమూర్తులు ఉన్నాయి. ఈ భావన్నారాయణ స్వామి ఎవరెవరు ఏ భావంతో కొలిస్తే ఆ భావానికి అనుకూలంగా కరుణిస్తాడని స్థలపురాణం వివరిస్తుంది. ఈ ఆలయాన్ని మొదట చోళరాజులలో ఒకరు నిర్మించారని ఈ ఆలయంలో లభ్యమైన శాసనాల ద్వారా తెలుస్తుంది. ఆ తరువాత గోల్కొండను పరిపాలించిన తానీషా ప్రభువు ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఆలయం ముందున్న గాలి గోపురం మాత్రం చోళుల కాలంనాటిదని తెలుస్తుంది. తానీషా దగ్గర మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్నలు ఈ స్వామికి నిత్య ధూపదీప నైవేద్యాల కొరకు 41 ఎకరముల భూమి కానుకగా ఇచ్చారని స్థానికుల మాట.

స్వామివారి ఆలయానికి ఇరువైపులా రాజ్యలక్ష్మి అమ్మవారు, ఆంజనేయస్వామి వార్లకు చిన్న ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయంలో సంవత్సరంలో అన్నిరోజులు (366) రోజులు వెలుగుతూ ఉండే అఖండ దీపారాధన సేవ ఒక ప్రత్యేకత. చాలా మంది భక్తులు ప్రత్యేకించి ఈ అఖండ దీపారాధన కోసం ఈ ఆలయాన్ని దర్శిస్తుంటారు. ఈ స్వామివారిని నిత్యం ఉదయం 6 గంటల నుండి 11 గంటలవరకు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు దర్శించవచ్చును. ఇచ్చట వైశాఖమాసములో 5 రోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

సంగమేశ్వర ఆలయం - నాగాయలంక



కృష్ణాజిల్లా, నాగాయలంక మండలం, భావదేవర పల్లికి 10 కి.మీ., దూరంలో సమీపంలోని సంగమేశ్వర గ్రామంలో శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇది చాలా పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. అయితే ఈ పురాతన ఆలయాన్ని ఎప్పుడు ఎవరు నిర్మించారు అనే వివరాలు తెలియరాలేదు. ఈ ఆలయంలోని సంగమేశ్వరస్వామికి సూర్యకిరణ పూజకు పెట్టింది పేరు. ఏటా మహాశివరాత్రి అనంతరం దాదాపు 15 రోజుల పాటు ఈ ఆలయంలోని మూలవిరాట్టు అయిన సంగమేశ్వర స్వామికి ఉషోదయంపు తొలి సూర్యకిరణాలు అభిషేకిస్తాయి. ఈ అద్భుతమైన విధానం దేశంలోని ఒక కోణార్క్ సూర్యదేవాలయంలోనే జరుగుతుంది. ఆ తర్వాత సూర్యకిరణ పూజ జరిగేది ఈ సంగమేశ్వరంలోనే. అరసవెల్లి సూర్య దేవాలయంలోనూ ఇలాంటి పూజ జరిగినా అది కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే పరిమితం. నాగాయలంకలోని సంగమేశ్వరంలో శివరాత్రి పర్వదినాలలో 15 రోజులపాటు ప్రతి ఉదయం ఈ అద్భుతాన్ని భక్తులు ఇచ్చట వీక్షిస్తారు. ఈ సమయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తే గ్రహదోషాలు తొలగి సుఖ శాంతులు లభించగలవన్న నమ్మకం భక్తులలో ప్రగాఢంగా ఉన్నది.

శ్రీ యోగానంద లక్ష్మీనరసింహాలయం - జుజ్జూరు

కృష్ణాజిల్లాలో చరిత్రాత్మకమైన జుజ్జూరు గ్రామము నందు యోగానంద లక్ష్మి నరసింహాలయం కలదు. ఈ జుజ్జూరు గ్రామమునందు రెండు యోగానంద లక్ష్మీనరసింహాలయాలు కలవు. అందులో ఒకటి కొండపైనున్న గుహాలో ఉన్నది. మరొకటి వెలమ జమీందారులు సూరానేని వెంకట నారాయణరావు గారు తమ కోటకు తూర్పు భాగాన కట్టించిన ఆలయము. వీనిలో గుహయందు స్వయంభువు రూపంలో ఉన్న నరసింహుడు భక్తులకు దర్శనమిస్తాడు.

చరిత్ర : పూర్వం కొందరు మునులు నాగుల రూపంలో శ్రీమహావిష్ణువు గురించి తపస్సు చేయగా, వారికోరిక మీద అచట శ్రీమహావిష్ణువు యోగానంద లక్ష్మీనరసింహా రూపమున స్వయంభువుగా వెలసినాడు. ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు అచట



విహరించుచున్న నాగులను జూచి, అవి నిజమైన నాగులని భ్రమించి, వానిని సంహరించాడు. అందుచే ఆ పాపం వానిని పట్టిపీడించసాగింది. వెంటనే అతడు రాజ్యభ్రష్టుడైనాడు. ఈ దుస్థితికి కారణమేమిటా? అని రాజు ఆలోచించి, నేను నాగులను చంపిన తరువాతనే నాకీ గతి పట్టినదని గ్రహించి, పర్వతము మీదకి వచ్చి అచట వెలిసియున్న నరసింహరూపం కనిపించగా, తెలియక చేశాను, క్షమించమని వేడుకొని పశ్చాత్తాపము పొందాడు. ఎరుగక చేసిన పాపమును నరసింహ స్వామి క్షమించాడు. ఆ తరువాత రాజు మరల రాజ్యం పొందాడు. అప్పటి నుండి ఈ ఆలయం చాలా ప్రజాదరణ పొందింది. శ్రీ యోగానంద లక్ష్మీనరసింహనామంతో భక్తుల అభీష్టాలు నెరవేరుస్తూ వారి హృదయాలలో నిలిచిపోయాడు. గుహలో ఉన్న ఈ నరసింహునకు గుహయే ప్రధాన ఆలయము. ఆ ఆలయమునందు ఒక మండపం మాత్రం కలదు. రెండవ ఆలయం మాత్రం పశ్చిమాభిముఖంగా ఉన్నది. ఈ ఆలయము గర్భాలయం నందు యోగానంద లక్ష్మీనరసింహస్వామి, అంతరాలయమునందు కుడివైపున చెంచులక్ష్మి అమ్మవారు, ఎడమవైపున రాజ్యలక్ష్మి అమ్మవారు ప్రతిష్టామూర్తులై ఉన్నారు. ఇచ్చట నిత్యపూజలతో పాటు, పండుగ పర్వదినాలలో విశేష పూజలు, ఉత్సవాలు వైభవంగా జరుగును. పండుగ, పర్వదినాలలో ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ సోమేశ్వరాలయం - జుజ్జూరు

కృష్ణాజిల్లా, వీరులపాడు మండలం వీరులపాడు గ్రామానికి 8 కి.మీ. దూరంలో జుజ్జూరు గ్రామం కలదు. ఈ గ్రామములో శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. ఇది ప్రాచీన ఆలయం. ఈ ఆలయాన్ని కొన్ని సంవత్సరాల క్రితం అల్లంశెట్టి వెంకన్నగారు కట్టించి అందులో సోమేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించి ఆరాధించారు. ఆ ఈశ్వరుడే సోమేశ్వరుడుగా ప్రఖ్యాతి గాంచి, సోమేశ్వరాలయముగా ప్రజాదరణ పొందినది. కలవకొలను ఇంటి పేరుగల జమీందారుగారు ఈ ఆలయానికి కొంతభూమిని విరాళంగా ఇచ్చి, ఆలయాన్ని ఆదరించారు. వారి ఆదరణలో ఈ ఆలయము ఉన్నత స్థాయిని పొంది, మహావైభవముతో వెలుగొందినది.

తూర్పుముఖముగా ఉన్న ఈ ఆలయము నందు గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలు ఉన్నవి. గర్భాలయంలో పార్వతీసమేత శ్రీ సోమే

శ్వరుడు, అంతరాలయములో ఎడమప్రక్కన పార్వతీ అమ్మవారు, కుడివైపున వినాయకుడును, భద్రకాళీ సమేత వీరభద్రుడు మొదలగు దేవతామూర్తుల ప్రతిష్టలు ఉన్నవి. ఆవరణలో ఉత్తరభాగాన నాగప్రతిమగల శాసన శిల, ఆ శిలకు తూర్పుగా స్వామివారి కళ్యాణ మండపము కలదు. నిత్యపూజలతో పాటు దసరా ఉత్సవాలు, కార్తీక దీపోత్సవాలు, మహా శివరాత్రి ఉత్సవాలు మహావైభవముగా జరుగును. ఈ ఉత్సవాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

అగస్త్యేశ్వర ఆలయం - కపిలేశ్వరపురం



కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం లోని మంటాడ జాతీయ రహదారికి 5 కి.మీ. దూరంలో కపిళేశ్వరపురంలో శ్రీ అగస్త్యేశ్వర ఆలయం కలదు. ఇది చాలా పురాతనమైనదిగా చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం అగస్త్యేశ్వర మహాముని ఈ ఆలయాన్ని నిర్మించి కైలాసనాథుడ్ని ప్రతిష్టించినట్లు, అగస్త్యేశ్వర మహాముని ప్రతిష్టించిన కారణంగా ఈ ఆలయం అగస్త్యేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో స్వామి వారి ఉత్తర ద్వారానికి అభిముఖంగా, మారేడు చెట్ల మధ్య ఒక శివలింగము, నందీశ్వరుడు కనిపిస్తారు. ఆలయానికి అభిముఖంగా కొద్దిగా ఆగ్నేయంగా పడమరకు తిరిగిన శ్రీ రఘునాథ స్వామివారి ఆలయం ఉంది. సుమారు 200 సంవత్సరాలకు పూర్వం పెడనకు చెందిన బసవన్న అనే శివభక్తుడు రుద్రమాలికను చదువగా ఎన్నో రోజులుగా కురవని వర్షం ఆనాడు కురిసినట్లు ప్రతీతి. అందువలననే ఈ ఆలయంలో రుద్రమాలిక శిలాక్షరాలుగా గోడ లపై చెక్కించారు. ఇప్పటికి అవి చెక్కుచెదరక అలానే ఉన్నాయి. ఈ ఆలయానికి అప్పుడప్పుడు దేవతాసర్పం కూడా వస్తుండేదని స్థానికులు చెప్తారు. అందువలన భక్తులు నాగులచవితి నాడు విశేషంగా దేవాలయాన్ని సందర్శిస్తారు. మొగల్తూరు జమిందారులు ఈ దేవాలయాన్ని అభివృద్ధి పర్చినట్లు చరిత్ర తెలియజేస్తోంది. ఈ ఆలయ ప్రాంగణంలో అగస్త్యేశ్వరుడు, వీరభద్రుడు, గంగాపార్వతి దేవాలయాలు కూడా ఉన్నాయి. ఆలయ సమీపంలోని ఉపాలయంలో దేవసేనా వల్లీ సమేత సుబ్రహ్మణ్యే శ్వర స్వామివారు కొలువై ఉన్నారు. ప్రతినిత్యం పూజలతో పాటు, విశేషపూజలు, శివరాత్రి, ముక్కోటి ఏకాదశి మొదలగు పర్వదినాలలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం - మైలవరం



కృష్ణాజిల్లా, మైలవరం నుండి విజయవాడవెళ్ళే ప్రధానమార్గం ప్రక్కనే మైలవరంలో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం ఉన్నది. ఈ ఆలయంలో గల సాయిబాబా పిలిస్తే పలికేదైవంగా ప్రతీతి. రెండు దశాబ్దాల క్రితం నిర్మింప బడిన ఈ ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మొదట ధ్యానమందిరంగా ఉన్న ఈ మందిరం దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. 1995వ సంవత్సరంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. సువిశాల ప్రాంగణంలో ఉన్న ఈ ఆలయం ముఖమంటపంపై పలు దేవతామూర్తుల ఆకృతులు ఉన్నాయి. గర్భాలయంలో సాయిబాబా రజిత సింహాసనాసీనుడై, సర్వాలంకార భూషితుడై భక్తులకు దర్శనమిస్తాడు. ఆలయ ప్రాంగణంలో ధుని, ధ్యానమందిరం ఉన్నాయి. ఈ ఆలయంలో నిత్యపూజలు, అభిషేకాలు, హారతులే కాకుండా ప్రతి గురువారం, పండుగ పర్వదినాలలో విశేషపూజలు జరుగుతాయి. షిరిడిలో జరిగేవిధంగా ఈ ఆలయంలో కూడా పూజాదికాలు నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని దర్శించడానికి ఇతర జిల్లాల నుండి కూడా వస్తుంటారు.

రాజరాజేశ్వరీ సమేత శ్రీ రాజశేఖరస్వామి - అవనిగడ్డ

కృష్ణాజిల్లా దివిసీమ అవనిగడ్డ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ రాజశేఖర స్వామి వారి ఆలయం ఉన్నది. ఇది ప్రాచీన ఆలయము. ఈ ఆలయమును చోళరాజులు కట్టించారని అభిప్రాయం. తూర్పుముఖం కలిగియున్న ఈ ఆలయం నందు గర్భాలయంలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత రాజశేఖరుడు, వారికి ఎడమవైపున రాజరాజేశ్వరీ అమ్మవారు, కుడివైపున భద్రకాళీ సమేత వీరభద్రుడు, లక్ష్మిగణపతి, నాగరాజ ప్రతిమ మొదలగు స్వామివార్లు మనకు దర్శనమిస్తారు. ఈ ఆలయంలో ప్రతినిత్యము అర్చనలు, ప్రత్యేక పూజలే గాక, వైశాఖ మాసంలో స్వామివారి కల్యాణోత్సవము, దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక దీపోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలు మహావైభవముగా జరుగును. ఈ ఉత్సవాలలో ఎక్కువమంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించి తరిస్తారు.

భూనీలారాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మినారాయణ స్వామి - అవనిగడ్డ

కృష్ణాజిల్లా, దివసీమలో కృష్ణానదీ తీరాన ఉన్న అవనిగడ్డ గ్రామంలో ఈ ఆలయం కలదు. ఈ ఆలయం చాలా ప్రాచీనమైనది. క్రీ.శ.12వ శతాబ్దంలో చోళరాజులు ఒకరు ఈ ఆలయాన్ని కట్టించారని తెలియుచున్నది. ఈ ఆలయం పల్లమందుండుటచే నీళ్ళతో నిండుటచే ప్రజలందరు పూనుకొని 14వ శతాబ్దంలో దీనిని పునరుద్ధరించారని తెలియుచున్నది. ఈ ఆలయమిపుడు శిథిలదశకు రాగా, దేవాదాయశాఖవారు పూనుకొని పునరుద్ధరిస్తున్నారు. శ్రీ మహావిష్ణువు లక్ష్మీనారాయణుడుగా వెలిసిన ఈ ఆలయం ఉత్తరాభిముఖంగా ఉన్నది. ఈ ఆలయంలో గర్భాలయమునందు భూనీలా, రాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మినారాయణుడు వారికి కుడివైపున సువర్చలాసమేత శ్రీ ఆంజనేయస్వామి వారు మనకు దర్శనమిస్తారు. ఇచట ప్రతినిత్యం జరిగే అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు, వైశాఖ పూర్ణిమనాడు నరసింహజయంతి, బ్రహ్మోత్సవాలు, విజయదశమి ఉత్సవాలు, కార్తీక శుద్ధ ఏకాదశినాడు లక్ష్మీతులసి అర్చనలు, వైకుంఠ ఏకాదశి ఉత్సవం, పుష్యశుద్ధ పూర్ణిమనాడు సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవం మొదలగు ఉత్సవాలను గూడా జరుపుచుందురు.

అద్దంకి నాంచారమ్మ - విశ్వనాథపల్లి



కృష్ణాజిల్లా, దివిసీమ, అవనిగడ్డకు 10కి.మీ. దూరంలో కృష్ణానదీ తీరాన విశ్వనాథపల్లి గ్రామంలో నాంచారమ్మ తల్లి కొలువై ఉన్నారు. ఈ అమ్మవారి దివ్య కథ సుమారు 300 ఏళ్ళనాటిది. కృష్ణా తీర ప్రాంతంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న సమయంలో కొండవీటి రామన్న అనే ఒక రైతు దివిసీమ విశ్వనాథపల్లెలో నివసించేవాడు. (18వ శతాబ్దం వరకు ఆ గ్రామాన్ని విశ్వనాథునిపల్లి అనేవాళ్ళు) కరువు వచ్చాక తింటానికి మనుషులకు తిండి, పశు వులకు మేత కరువైపోవడంతో దివిసీమను వదలి అద్దంకికి తరలి పోయాడు. అద్దంకిలో ఒకయోగి ఇచ్చిన శాపం కారణంగా నాంచారమ్మ తల్లి మానవ రూపంలో అద్దంకిలో సంచరిస్తోంది. ఆమె కొండవీటి రామన్నని కరుణించి నిజరూపంతో దర్శనం ఇచ్చి ఈ కరవు బారినుంచి రక్షించి మళ్ళీ జన్మస్థలం విశ్వనాథపల్లి వెళ్ళేలా చేస్తాననీ,

తనని భక్తితో పూజించాలనీ ఆదేశించింది నాంచారమ్మ. అది మొదలు మనసులో ఎలాంటి సంశయాలు అనుమానాలూ పెట్టుకోకుండా నిజమైన భక్తితో నాంచారమ్మని కొలిచాడు కొండవీటి రామన్న. కరువు నెమ్మదించింది. ఆవిధంగా రామన్న కోల్పోయిన తన సంపదనంతా కొద్దికాలంలోనే తిరిగి పొందాడు. నాంచారమ్మ తల్లి కిచ్చిన మాట ప్రకారం, విశ్వనాథపల్లి చేరి, గ్రామం వెలుపల తన శక్తి కొలది చిన్న గుడిని నిర్మించి, అందులో నాంచారమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టింపచేశాడు రామన్న. ఆనాటినుండి నాంచారమ్మని భక్తితో కొలిచిన వారి కోరికలు నెరవేరు తుండటంతో ఆమె ప్రశస్తి దివిసీమ మొత్తం వ్యాపించసాగింది. అద్దంకి నుంచి వచ్చిన దేవత కాబట్టి ఆమెను అద్దంకి నాంచారమ్మగా భక్తులు పిలుచుకోసాగారు. పెద్దప్రోలు, పిట్టల్లంక గ్రామాల్లో కూడా అద్దంకి నాంచారమ్మకి గుడులున్నాయి. జాతరలు కూడా సాగుతున్నాయి. ఈ అమ్మవారి జాతరల సమయంలో గాజులు రవికల గుడ్డలు, పసుపు కుంకుమ అమ్మవారికి సమర్పించుకొంటారు. జంతుబలులు తక్కువ అని స్థానికులు చెబుతారు.

ఫాల్గుణమాసం శుద్ధ విదియ నుంచి పౌర్ణమి దాకా పధ్నాలుగు రోజుల పాటు అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర నిర్వహిస్తారు. పూర్వం మొదటిరోజు అమ్మవారి విగ్రహాన్ని బయటకు తెచ్చి ఊరేగించడం ప్రారంభించి, పధ్నాలుగవ రోజున మాత్రమే గుడికి చేరుస్తారు. మొదటిరోజు కాపువీధిలోనూ, రెండవరోజు అగ్నికుల క్షత్రియుల వీధుల్లోనూ, మూడవరోజు కుమ్మరిపాలెంలోను, నాల్గవరోజు కొత్తపాలెంలోనూ, అయిదు ఆరు రోజుల్లో పొరుగున ఉన్న సాలెపాలెంలోనూ, ఏడవరోజు గౌడవీధిలోనూ, అక్కడనుంచి నాయీ బ్రాహ్మణ వీధి, రజకవీధి, దొమ్మరి వీధుల్లోనూ, ఒకరోజు కరణంగారి ఇంటిదగ్గర, పౌర్ణమి రోజున బ్రాహ్మణ అగ్రహారంలోనూ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తారు. జాతర మహోత్సవానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చి అమ్మవారికి తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. కృష్ణా పుష్కరాల సందర్భంగా వేలాదిమంది భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి నాంచారమ్మ అమ్మవారిని భక్తితో దర్శించుకొంటారు.

శ్రీ వేణుగోపాలస్వామి - హంసలదీవి

కృష్ణాజిల్లా కోడూరు మండలం, అవనిగడ్డకు 20 కి.మీ. దూరంలో ఈ హంసలదీవి అనే గ్రామము కలదు. ఈ గ్రామ ములో శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయం ఉన్నది. శ్రీ మహావిష్ణువు అంశతో జన్మించిన కృష్ణానది ఈ హంసలదీవికి 7 కి.మీ. దూరంలో సాగర సంగమం చేస్తుంది. ఇది దేవతలు నిర్మించిన ప్రాచీన ఆలయంగా భక్తుల నమ్మకం. ఈ ప్రదేశం చాలా మహిమగల ప్రదేశమని కొన్ని కథల ద్వారా తెలియు చున్నది. వానిలో ఒక కథ, పూర్వం జరాసంధుడనే రాజు ఒకడు ఉండేవాడు.

అతడెన్నో దురాగతాలు చేసి దుష్టుడని పేరుగాంచాడని, ఆ దుష్టత్వంతో అతడు కాకి రూపం ధరించి తిరుగుచు ఒకసారి ఈ ప్రదేశానికి వచ్చి ఇచటగల సాగర సంగమంలో అనుకోకుండా మునిగిలేవగానే, కాకిరూపం పోయి అతనికి హంసరూపం వచ్చినదని, ఆవిధంగా అచట వెలసిన గ్రామం హంసలదీవిగా ప్రసిద్ధమైనదని ఒక కథ. పూర్వం ఒకపుడు పావన గంగానది ఎందువల్లనో మలినమైనదట! అందుకామె విచారిస్తుండగా త్రిలోకసంచారియైన నారదుడు ఆమె వద్దకు వచ్చి, అమ్మా, ఎందుకు విచారించెదవు. నీవు వెళ్లి, కృష్ణాసాగర సంగమంలో స్నానమాచరించినచో నీ మలినం తొలగిపోగలదు అనగా, ఆ మాటలు విని గంగాదేవి అచటకు వెళ్ళి స్నానం చేయగా, ఆమె మలినం తొలగిపోయి హంసవలె తెల్లగా పవిత్రంగా మారినది. అందువలన అచట వెలసిన గ్రామం హంసలదీవిగా మారింది అని మరో కథ.

దేవతలకు ఇలాంటి గొప్ప మహత్యం గల ఈ స్థలములో ఆలయాన్ని నిర్మింపవలెనన్న ఒక సంకల్పం కలిగినదట. ఆ సంకల్పంతో వారొక రాత్రివేళ అచటకు అదృశ్యంగా వచ్చి, ఆలయమును నిర్మించి, అందులో వేణుగోపాలుని ప్రతిష్టించారు. తరువాత ద్వారగోపురమును కట్టనారంభించారు. ఇంతలో వారికి కోడికూత వినిపించినది. తెల్లవారవచ్చినది. జనం సంచరిస్తారని వారికి కనపడకూడదని తాము కట్టుచున్న గోపురాన్ని, కట్టుచున్నట్లే వదలివేసి బాధతో వెళ్ళిపోయారని, అందుచేతనే అది అసంపూర్ణంగా ఉండిపోయిందని మరొక కథ.

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయానికి ఐదు అంతస్థుల గాలిగోపురం నిర్మించారు. ముఖమండపం, అంతరాలయం, గర్భాలయం



కలిగిన ప్రధానాలయం కలదు. గర్భాలయం నందలి శ్రీ వేణుగోపాలస్వామి ప్రతిష్ట విగ్రహంతోపాటు స్వయంభూమూర్తిని కూడా చూడ గలము. మూలవిరాట్టుకు ఎడమవైపున గోవును, రుక్మిణి–సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులు, చక్రత్తాళ్వారు స్వామిని దర్శించగలము. ముఖమండపంనందు శ్రీలక్ష్మి నరసింహ స్వామి మరియు శ్రీ జనా ర్థన స్వామి వారు కొలువై ఉన్నారు. ఈ ఆలయానికి సమీపం లోనే బాలాత్రిపుర సుందరి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం కూడా ఉన్నది. ఈ ఆల యంలో వివాహం చేసుకొని సాగర సంగమ



ప్రదేశంలో సరిగంగస్నానంచేసిన జంటలు నూరేళ్ళుసుఖంగా జీవి స్తారనేది భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో నిద్రచేస్తే సంతానభాగ్యం లేని వారికి సంతానం కలుగు తుందని నమ్మకం. మాఘపౌర్ణమికిస్వామివారి కళ్యాణోత్సవం, కృష్ణాష్టమి, ధనుర్మాసంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. కార్తీకమాసంలోసముద్ర స్నానం చేసిన వేలాదిభక్తులు ఇచ్చటి స్వామివారిని తప్పక దర్శిస్తారు.


శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం - వేమవరం



కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరంలో శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవ స్థానం ఉన్నది. స్థానికుల కథనం ప్రకారం 35 సంవత్సరాల క్రితం వేమవరం గ్రామం దగ్గరలో మచిలీపట్నం నుండి గుడివాడ వెళ్ళు రహదారి ప్రక్కన కాలువకు రివిట్‌మెంట్ కట్టుటకు కొండరాళ్ళు తీసుకొనిరాగా, వాటిలో ఒక రాయి అమ్మవారిని పోలినట్లుగా ఉండగా ఆ రాయిని ప్రక్కన పెట్టారు. తదుపరి ఆ రాయిని రోడ్డు ప్రక్కన నిలబెట్టి పసుపు, కుంకుమలు పెడుతూ భక్తులు పూజించుకో సాగారు. ఆ రాయిప్రక్కనే బాతులు పెంచుకునే ఒకతను కుటీరము ఏర్పాటు చేసుకొని, బాతులు పెంచుకొనేవాడు. అమ్మవారి విగ్రహము ప్రక్కనే ఉండుట వలన ఆ బాతులు సమృద్ధిగా గుడ్లు పెట్టడంతో ఆ బాతు యజమానికి మంచి లాభాలు వచ్చాయి. కొంతకాలానికి ఆ యజమాని గుంటూరు వలస వెళ్ళడంతో తనతో పాటు ఆ అమ్మవారి విగ్రహాన్ని కూడా తీసుకువెళ్ళాడు. అయితే గుంటూరు చేరిన వెంటనే బాతులను, అమ్మవారి విగ్రహాన్ని లారీ నుంచి కిందకి దించగా బాతులు వెంటనే చనిపోయాయి. అతడు పశ్చాత్తాపపడి వెంటనే అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి యధాస్థానంలో (ఇప్పుడు అమ్మవారు ఉన్న స్థానంలో) ఉంచాడు. నాటి నుండి అమ్మవారి మహత్యం నలువైపులా ప్రాకింది. అమ్మవారిని దర్శించు కొనుటకు భక్తులు తండోపతండాలుగా ఇచ్చటకు వచ్చి పాలంగళ్ళు మ్రొక్కుబడులు

తీర్చుకోసాగారు. దేవాలయంలో ప్రతిరోజూ నిత్యపూజలే కాక, ప్రతి ఆదివారం అమ్మవారికి ప్రత్యేకపూజలుజరుగును. ప్రతీసంవత్సరం దసరానవరాత్రి మహోత్స వాలు ఎంతో ఘనంగా జరుగుతాయి. వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొం టారు. స్వామి వారి ఊరేగింపు మహోత్సవం కూడా వైభవంగా నిర్వహింపబడుతుంది.

శ్రీ రామలింగేశ్వర ఆలయం - బలివే




కృష్ణా-పశ్చిమగోదావరి జిల్లాలో సరిహద్దు తమ్మిలేరు ప్రక్కన బలివే గ్రామంలో శ్రీ రామలింగేశ్వర ఆలయం ఉన్నది. ఇది చాలా పురాతనమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందినది. విజయవాడ నుండి బలివే 80 కి.మీ., కాగా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు నుండి 25 కి.మీ., దూరంలో ఉంటుంది. పశ్చిమాభి ముఖంగా అలరారుతున్న దివ్యక్షేత్రం ఇది.

శ్రీరాముడు రావణ సంహారం తరువాత బ్రహ్మహత్యాదోషం నివారణార్థం మహా పుణ్య స్థలాలను ఎంచుకుని పరమేశ్వరుని లింగరూపంలో ప్రతిష్ఠలు చేసుకుంటూ అయోధ్య చేరడానికి ముందు బలివే గ్రామంలో బలేరామస్వామి శ్రీరామలింగేశ్వరస్వామి లింగ ప్రతిష్ఠ చేశాడు. ఈ గ్రామం పూర్వం బలి చక్రవర్తి పరిపాలించిన పట్టణంగా ప్రతీతి. ఈ రెండు కారణాల వల్ల రామలింగేశ్వరస్వామిని బలేరామస్వామి అనే పేరుతో కూడా భక్తులు పిలుస్తుంటారు. ఈ గ్రామ పరిసర ప్రాంతాల్లో పూర్వం 101 శివలింగాలు ప్రతిష్టించి ఉండేవని తెలుస్తుంది. కాలక్రమేణా అవి శిథిలము కాగా, కొన్ని మాత్రమే మిగిలాయి. వాటిలో మృత్యుమల్లేశ్వరస్వామి దేవాలయం ముఖ్యమైనది. దీనిని తాతయ్యగుడిగా పిలుస్తారు. శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణం అనంతరం రథోత్సవంతో తాతయ్య దర్శనానికి వెళ్లడంతో కల్యాణఘట్టం పూర్తవుతుంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో బలివే ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు చుట్టుప్రక్కల జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారు.

శ్రీ రామేశ్వరస్వామి - ఐలూరు

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, మేడూరుకు 10 కి.మీ., దూరంలో ఐలూరు అనే గ్రామము కలదు. ఈ గ్రామములో శ్రీరామలింగేశ్వర ఆలయం ఉన్నది. మహిమగల ఈ ఆలయం దక్షిణకాశీగా పేరుపొందింది. రావణసంహారం తరువాత శ్రీరాముడు అయోధ్యకు పుష్పకవిమానంపై వెళ్తూ రైభ్యుడు అను ముని తప ప్రభావం చేత ఈశ్వరుని కోరిక నెరవేర్చుటకు విమానం కృష్ణానదీ ప్రాంతంలో ఆగిపోగా



అక్కడ మునులు చెప్పిన మాట ప్రకారం సైకతలింగాన్ని సరైన ముహూర్తానికి చిలుకూరులో ప్రతిష్ఠించాడు. ఆ తరువాత ఆంజనేయస్వామి తెచ్చిన శివలింగానికి ముహూర్తం దాటిపోవడంతో దానిని శ్రీ రాముడు ఈ ఐలూరులో ప్రతిష్టించాడు. అంతట పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఇది దక్షిణ కాశీగా, ఉభయ రామేశ్వరక్షేత్రంగా ప్రసిద్ధి చెందగలదనీ, ఆశీర్వదించాడు. ఇక్కడ కృష్ణానదిలో స్నానమాచరించి శివుని దర్శించేవారికి కాశీ వెళ్లి గంగలో స్నానం చేసినంత ఫలితం కలుగుతుందని స్థలపురాణం తెలియజేస్తుంది.

శ్రీరామునిచే శివలింగం ప్రతిష్ట జరగడంతో ఇక్కడే శ్రీరఘునాయకస్వామి పేరుతో భక్తుల అభీష్టాలు నెర వేరుస్తానని శ్రీరాముడు అభయమిచ్చాడు. ఉభయరామక్షేత్రంగా ఈ పవిత్ర ఐలూరు క్షేత్రం కీర్తికెక్కింది. పూర్వం ఈ గ్రామంలో అయ్యలు నివసించే వారు. కావున ఈ గ్రామమునకు అయ్యలూరు అని పేరుండెడిది. కాలక్రమంలో అయ్యలూరు పేరు ఐలూరుగా మార్పుచెందింది. నందీశ్వరుడు, అమ్మవారు లేని ఆలయం ఈ ఐలూరు ఆలయం. గర్భాలయంలో ఉన్న శివలింగానికన్నా అతి పెద్ద శివలింగం అంతరాలయంలో కనిపిస్తుంది. ఈ ఆలయం పడమర ముఖంగా ఉంటుంది. కానీ పానమట్టం ఉత్తరం వైపుకు అనగా స్వామి వారికి కుడివైపున ఉంటుంది. జీవనదివైపు పానమట్టం ఉంటుందని తెలుస్తుంది. ఈ ఆలయంలో పార్వతీదేవి విగ్రహం లేనందున శివుణ్ణి యోగశివునిగా పిలుస్తారు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన స్వామివారి కళ్యాణం జరుగుతుంది. లక్షలాదిమంది భక్తులు ఐలూరు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు.

వీరభద్రస్వామి - పాలంక



దట్టమైన నల్లమల అడవుల్లో కృష్ణానది ఒడ్డున వెలసిన పాలంక క్షేత్రంలో వీరభద్ర స్వామి విజయనగర రాజుల ఆరాధ్య దైవంగా పూజింపపడ్డాడు. ఆనాటి జనపదులు ఈ స్వామివారిని పర్వాతాల మల్లయ్య, పాలక వీరయ్య, పాలక స్వామి అనే పేర్లతో పిలుచుకుని పూజించేవారు. కృష్ణానది ఒడ్డున సహజసిద్ధంగా ఏర్పడి, ఆదిశేషుని రూపంలో ఉండే కొండచరియ కింద

ఉన్న గుహల్లో వీరభద్ర స్వామిని ప్రతిష్టించారు. వీరభద్రస్వామితో పాటు వినాయకుడు, భద్రకాళీ, మహి షాసురమర్ధిని, అరుదైన పంచముఖ బ్రహ్మ దేవాలయాలు, స్నానాల ఘటిక, సంతానగద్దె, నాగులపుట్ట వంటి విశేషాలు ఈ క్షేత్రంలో ఉన్నాయి. పూర్వపు ఆచారాల ప్రకారం నేటికీ ఏడాదికి ఒక్కరోజే పూజలు చేయడం, గిరిజన చెంచులే పూజారులుగా ఉండటం ఇక్కడి విశేషాలు. ఈ క్షేత్రానికి నేటికీ ప్రతి ఏడాది తొలి ఏకాదశి రోజు వేలాదిమంది కాలినడకన వెళ్ళి మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ పది అడుగుల ఎత్తు ఉండే పుట్టలో నాగేంద్రుడు కొలువై ఉన్నాడని, ఆ స్వామి ప్రతిరోజు స్వామివారిని పూజిస్తాడని భక్తుల నమ్మకం.


శ్రీ వీర హనుమాన్ ఆలయం - పరిటాల



కృష్ణాజిల్లా, కంచికచర్ల మండలం, పరిటాల గ్రామంలో ఈ ఆలయం ఉన్నది. విజయవాడ –హైదరాబాద్ జాతీయ రహదారిలో విజయవాడకు 28 కిలోమీటర్ల దూరంలో పరిటాల గ్రామం ఉన్నది. ఈ ఆలయంలో 135 అడుగుల ఎత్తుగల ఆంజనేయస్వామి వారి విగ్రహం ఒక ప్రత్యేకత. ఈ విగ్రహాన్ని ప్రపంచంలోనే ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహంగా చెబుతారు. కుడిచేతితో అభయముద్ర, ఎడమ చేతిని గదాయుధంపై నిలిపి మీకు నేను ఉన్నాననే అభయముద్ర ఇస్తూ, ఆశ్రిత జనరక్షకుడిగా వెలసిన ఈ ఆంజనే యుడు భక్తజన మందారుడై ఎందరో యాత్రికుల పూజలను అందు కొనుచున్నాడు. ఈ ఆలయ ప్రాంగణంలోనే రేణుకాదేవికి, సీతా లక్ష్మణ హనుమత్ సమేత రామ చంద్రునికి ఉపాలయాలు ఉన్నాయి. ఈ దేవాలయం ఉన్న ప్రాంతాన్ని సాయిబాబా భక్తుడైన బొమిడిపాటి వెంకటేశ్వరరావుగారు విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆలయ ప్రాంగణంలో మలయ స్వామి వేద పాఠశాల నిర్వహింపబడు చున్నది. 15 అడుగుల వేదిక పైన నిర్మించిన 135 అడుగులుగల ఆంజనేయస్వామి విగ్రహాన్ని 22.06.2003న శ్రీ శివానంద మూర్తి గారు ఆవిష్కరించారు. కోటిన్నర రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ విగ్రహాన్ని పూర్తిగా చూడాలంటే తలను పూర్తిగా వెనక్కు వంచి చూడాల్సిందే. మే 28, 2000న ప్రారంభమైన చాలీసా పారాయణం ఒక్క క్షణం కూడా ఆగకుండా 1,35,000 సార్లు హనుమాన్ చాలీసా భక్తులచేత


పఠించబడింది. అంటే ఒక్కొక్క అడుగు నిర్మాణానికి వెయ్యి చొప్పున హనుమాన్ పారాయణం జరిగినది. ఈ దేవాలయ నిర్మాణానికి అమెరికాలో ఉన్న ప్రముఖ తెలుగువారైన కోమటి జయరామ్ గారు పది లక్షల రూపాలయను విరాళంగా ఇచ్చారు. ఈ ఆలయ సందర్శనమువలన యాత్రికులకు మార్గాయాసం ఉపశమించడమే కాక, దుష్టశక్తుల నుండి రక్షణ కలిగి మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెబుతారు.

శివసాయి క్షేత్రం, కంచికచర్ల




కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట–విజయవాడ రోడ్డు మార్గంలో నంది గామ దాటిన తరువాత విజయవాడ బైపాస్ రోడ్డులో ఈ శివసాయి క్షేత్రం ఉన్నది. ఇచ్చట శివుడి పేరు శ్రీ అష్టోత్తర శత మహాలింగేశ్వరస్వామివారు. స్వామి వారికి కుడివైపు మహాగణపతి, ఎడమ వైపు శ్రీ పార్వతీదేవి కొలువై ఉన్నారు. ఈ దేవాలయానికి వెనుకవైపు వరుసగా సాయిబాబా, రమా సహిత శ్రీసత్యనారాయణ స్వామి, వీరభద్రస్వామి, కుమారస్వామి, జ్ఞాన సరస్వతి, పంచముఖ ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి వారు, నవగ్రహ దేవాలయం మొదలైన ఆలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోనే ఉన్న జంట నాగుల విగ్రహం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ ఆలయంలోని సాయినాథుని విగ్రహం తలపాగా ధరించిన చాలా ఆకర్షణీయంగా, విశేషంగా కనిపిస్తుంది. ఇచ్చట నిత్యం జరిగే పూజలతోపాటు పండుగ, పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, మహాశివరాత్రికి స్వామివారి కళ్యాణం, గురుపౌర్ణమికి బాబా వారికి విశేషపూజలు ఎంతో వేడుకగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

పెద్దింట్లమ్మవారి దేవాలయం - కొల్లేటికోట




కృష్ణాజిల్లా, కైకలూరు మండలం, కొల్లేటికోట గ్రామములో పెద్దింట్ల మ్మవారి దేవాలయం ఉన్నది. ఈ అమ్మవారిని స్థానిక మత్స్యకారులు తమ కులదైవముగా భావించి పూజిస్తారు. తొమ్మిది అడుగుల ఎత్తు కలిగి, విశాల నేత్రాలతో, పద్మాసన భంగిమలో, ఢమరుకం, త్రిశూలం మొదలైన ఆయుధాలతో, నాగాభరణం, సూర్య చంద్రాది భూషణాలతో, నిండైన రూపంతో



ఈ తల్లి దర్శనమిస్తుంది. ఈ పెద్దింట్లమ్మ వారు పార్వతీదేవి ప్రతిరూపంగా స్థానికులు భావిస్తారు. ఈమెను కొల్లేరు పార్వతమ్మ అని కూడా కొంతమంది పిలుస్తారు. ఈ తల్లి గొప్పమహిమ గలతల్లిగా ఈ ప్రాంతం వారు నమ్ముతారు. అమ్మవారికి ఎడమవైపు జల దుర్గామాత అభయముద్రతో, పద్మాసన భంగిమలో ఆసీనురాలై ఉన్నది.

101 మంది గ్రామదేవతలలో ఈమె పెద్దది కావున ఈమెను పెద్దింటమ్మ అని పిలుస్తారు. ఈ ఆలయం 11వ శతాబ్దం నాటిదిగా స్థానికులు చెప్తారు. వేంగీ చాళుక్య రాజు పాలనలో ఈ ప్రాంతాన్ని కొలనుపురం, కొలనువీడుగా వ్యవహరించేవారని తెలుస్తోంది. పార్వతీదేవి అవతారమైన (జలదుర్గ పెద్దింట్లమ్మ)ను పెద్దమ్మగా కొలిచిన చక్రవర్తి ఈయనే. పిఠాపురం శాసనాన్ని బట్టి అగస్త్యుడు కొల్లేరు మధ్యలో ఎత్తయిన ఒక పెద్ద దుర్గాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ కోట చుట్టూ 150 రాజహస్తాల వెడల్పు, ఏడు నిలువుల లోతు, మూడు కోశాల చుట్టుకొలత గల అద్భుత అగడ్త ఉండేది. దీనినే ప్రస్తుతం కొల్లేటికోటలంకగా పిలుస్తున్నారు. కాలక్రమంలో సౌధాలు, మేడలు, మిద్దెలు కాలగర్భంలో కలసిపోగా అమ్మవారి ఆలయం మాత్రం ఆటుపోటులకు తట్టుకొని నిలబడింది. విజయనగర రాజులకు మహ మ్మదీయులకు జరిగిన పోరులో విజయనగర సామ్రాజ్య సైన్యాధ్యక్షుడు విజయాన్ని ఆకాంక్షిస్తూ, తన కన్న కూతురును కొల్లేటి ఒడ్డున బలి యిచ్చి విజయాన్ని పొందాడని, అప్పటి నుంచి ఆ ఒడ్డుకు "పేరంటాల కనుమ" అని పేరు వచ్చిందని ఇతిహాసము. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమి వరకు అమ్మవారి (తీర్థం) జాతర మహోత్సవాలు ఇచ్చట ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవంలో భాగంగా ఇక్కడికి 2 కి.మీ. దూరంలో ఉన్న గోకర్ణేశ్వర స్వామివారిని మేళ తాళాలతో గ్రామోత్సవం చేస్తూ ఇక్కడకు తీసుకొని వచ్చి జలదుర్గా గోకర్ణేశ్వరస్వామివారి కళ్యాణాన్ని భక్తులు వైభవంగా నిర్వహిస్తారు. కళ్యాణం తరువాత జరిగే రథోత్సవం కన్నులపండువగా, ఘనంగా నిర్వహించబడుతుంది.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం - రాపర్ల



కృష్ణాజిల్లా, పామర్రుకు అతి సమీపంలో ఉన్న రాపర్లలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ఉన్నది. ఈ ఆలయం చాలా పురాతనమైనది. ఈ ఆలయంలో ఒకేసారి శివకేశవులను దర్శించవచ్చును. గర్భాలయానికి ముందు ద్వార పాలకు

లైన జయ విజయులు ఇరుప్రక్కలా ఉండగా, గర్భాలయంలో శ్రీ వెంకటేశ్వరస్వామి సర్వాభరణభూషితుడై భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో శ్రీ మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో స్వామి శివలింగరూపంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ స్వామి వారి శివలింగం 150 సంవత్సరాల క్రితం నాటిదిగా భక్తులు చెబుతారు.

పంచముఖేశ్వర శివలింగం - కాండ్రపాడు



కృష్ణాజిల్లా, చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామంలో శ్రీ పంచముఖేశ్వర శివలింగ ఆలయము ఉన్నది. ఈ ఆలయంలో నాలుగున్నర అడుగుల ఎత్తు, మూడున్నర అడుగుల చుట్టుకొలత గల నల్లని శివలింగానికి అగ్రభాగాన అయిదు ముఖాలు కలిగిన ఒక అపురూప శివలింగం ఉన్నది. ఈ శివలింగమూర్తి పాటిమన్ను త్రవ్వకాలలో 1937 ఈశ్వర నామ సంవత్సరం చైత్రశుద్ధ పంచమి రోహిణీ నక్షత్రం గురువారం ఉదయం 10 గం.లకు లభించిందని పెద్దలు చెబుతున్నారు. ఈ శివలింగం లభించిన ప్రాంతంలోనే మరికొన్ని చిన్న విగ్రహాలు కూడా లభించాయి. అయితే ప్రధాన శివలింగానికి పానవట్టం లేదు. అందుచేత గ్రామస్తులు స్థానికంగా దొరికే రాతినే పానవట్టంగా చెక్కించి, ప్రతిష్టించి పూజాదికాలను నిర్వహించారు. తరువాత జరిగిన జీర్ణోద్ధరణ కార్యక్రమాలలో భాగంగా ఈ ఆలయాన్ని పునర్నిర్మించి ఎత్తైన పానవట్టంమీద స్వామివారిని ప్రతిష్టించి, ఆనాడు లభించిన నాలుగు శివలింగాలను ఆలయానికి నాలుగువైపులా ప్రతిష్టించారు. తూర్పువైపున ఉన్న స్వామివారిపై సంధ్యా కిరణాలు పడే విధంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. పంచముఖేశ్వర స్వామికి కుడివైపు ఉన్న ఉపాలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఎడమవైపున ఉన్న ఉపాలయంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి ప్రతిష్టితులై ఉన్నారు. ఇచ్చట నిత్యపూజలతో పాటూ, కార్తీకమాసంలో దీపోత్సవం, మహాశివరాత్రికి కళ్యాణం చాలా గొప్పగా నిర్వహిస్తారు.


శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం - ఉండ్రపూడి

కృష్ణాజిల్లా పామర్రు మండలంలోని ఉండ్రపూడిలో శ్రీవీరాంజనేయస్వామివారి ఆలయం ఉంది. 30 సంవత్సరాల క్రితం సువర్చలాసహిత శ్రీవీరాంజనేయస్వామి వారిని ఈ ఆలయంలో ప్రతిష్టించారు. ఈ ఆలయాన్ని కుటుంబరావు అనే భక్తుడు (భజన గురువు) చేత స్థాపించబడినట్లు తెలుస్తుంది. ఈయన ఉండ్రపూడి పోలవరం గ్రామస్తులను చేరదీసి వారికి భజనలు నేర్పుతూ, వారిని ప్రస్తుత ఆలయం



సమీపంలోని మర్రిచెట్టువద్ద ఈ భజన బృందాన్ని చేరదీస్తూ ఉండేవారు. అప్పుడు కుటుంబరావుగారికి మనసులో ఇచ్చట ఆలయం నిర్మిస్తే భక్తులకు ఎంతో ఆనందంగా ఉంటుందని ఆయన అభిప్రాయం తెలియజేయగా, ఆ తలంపుతోనే ఈ ఆలయం నిర్మించబడిందని చెబుతారు. ఆలయ నిర్మాణం తరువాత దాతలు, చుట్టుప్రక్కల గ్రామాలవారి సహాయ సహకారంతో వారు చేసిన ఆర్థిక సహాయ సలహాలతో ఈ ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందింది. ఈ వీరాంజనేయ స్వామివారి ఆలయంలో స్వామివారికి నిత్యం అభిషేకం, అర్చనలు జరుగుతాయి. హనుమజ్జయంతి, శ్రీరామనవమి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు తమలపాకులతో, సింధూరంతో పూజలు చేసి భక్తులు స్వామివారి అనుగ్రహాన్ని పొందుతారు. స్వామివారికి మంగళవారం రోజున పూజ ఘనంగా జరుగుతుంది. ఆ రోజున భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు.

శ్రీ రామలింగేశ్వరస్వామి - యనమలకుదురు



శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయం కృష్ణానది ఒడ్డునే యనమలకుదురు అనే గ్రామములో "మునిగిరి" అని పిలువబడే 612 అడుగుల ఎత్తైన పర్వతంపై స్వయంభువుగా వెలసినది. త్రేతా యుగంలోని శ్రీరామచంద్రమూర్తి సీతా సమేతుడుగా ఈ స్వామి వారిని దర్శించినట్లు స్థలపురాణం చెబుతుంది. విజయవాడ బెంజిసర్కిల్ నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. పడమట సెంటరు నుండి యనమలకుదురుకు రోడ్డు సౌకర్యం కలదు. ఇది విజయవాడలో పేరు గాంచిన శివాలయములలో ప్రముఖమైనది.

స్థలపురాణం : పరశురాముడు దక్షిణ భారతదేశంలో అరాచకములు చేయురాజులను శిక్షించి, వారిని సంహరించి, తాను చేసిన దోషములనుండి



ప్రాయశ్చిత్తముకొరకు యావత్ భారతావని లోని అనేక నదీ ప్రదేశములను సందర్శిస్తూ, ఆ నేపథ్యంలో కృష్ణానదీ పరివాహక ప్రాంత ములో ఉన్న మునిగిరి చేరాడు. అప్పుడు మునిగిరిపై అనేక మంది మునులు తపస్సు చేయుచున్నారు. వారికి ఎటువంటి తపో భంగమూ కలుగకుండా పరశురాముడు రక్షిస్తూ, స్వయంభూవై వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామిని పునఃప్రతిష్ట చేసి పూజించాడు. తరువాత కొండపై నుండి నదీ ప్రవాహము వరకు 101 శివలింగాలను ప్రతిష్టించినట్లుగా, ఆ శివలింగములు ఇప్పుడు కాల గర్భములో కలిసిపోయినట్లు తెలియుచున్నది.

ఇంద్రకీలాద్రి, మునిగిరి, ఋష్యశృంగం, గరుడాద్రి, వేదాద్రి మొదలగు పర్వత శ్రేణులు కృష్ణమ్మ ప్రవాహముచే విడివడి కృష్ణానదికి దక్షిణాన ఈ మునిగిరి పర్వతం వచ్చి చేరినది. అప్పుడు ఈ మునిగిరిపై శ్రీ రామలింగే శ్వరస్వామివారు వాయులింగ రూపంలో ఉద్భవించినారు. ఈ వాయులింగాకారమునే పరశురాముడు పునఃప్రతిష్టచేసినట్లు తెలియుచున్నది. శ్రీరామచంద్రమూర్తి సీతాసమేతుడై దక్షిణదేశ సంచారము చేయుచూ ఈ స్వామిని దర్శించినారని ప్రతీతి. చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర ప్రభువులు ఇంకా ఎందరో మహానుభావులు మహర్షులు, మునులు ఈ మునిగిరిపై స్వామిని దర్శించి తరించారని ప్రతీతి. వేయిమంది మునులు తపస్సు చేసిన స్థలము కనుక వెయిమునులకుదురని పిలిచెడివారు. అది రూపాంతరం చెంది యనమలకుదురుగా పిలువబడుచున్నది. శ్రీ రామలింగేశ్వరుడు వాయులింగాకారంలో అష్టముఖ పానవట్టం మీద దర్శనమిచ్చుట ఒక ప్రత్యేకతగా చెప్పబడుతోంది. స్వామివారికి ఎడమవైపున ఉన్న ఉపాలయంలో శ్రీ పార్వతీదేవి కొలువుతీరి ఉన్నది. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలలో విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ అంతర్భాగమంతా వివిధ దేవతామూర్తులతో ప్రశాం తమైన చక్కటి వాతావరణంతో అలరారుతుంది. 1983వ సం.లో ఆనాటి ధర్మకర్తలైన ధనేకుల శివన్నారాయణగారి ఆధ్వర్యంలో శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు భారతీతీర్థ స్వామివారి పవిత్ర హస్తాలతో శ్రీ స్వామివారి ఆలయ శిఖర ప్రతిష్ట జరిగినది. ఈ ఆలయ ప్రాంగణంలో దేవతా వృక్షాలు లక్ష్మీ నారాయణ స్వరూపులుగా వేప, రావి వృక్షాలు కలసి పెరిగిన వేదిక ఉన్నది. ఈ వేదికపై నాగశిలలు దర్శనమిస్తాయి. సంతానార్థులైన సుమంగళులు తమ మొక్కులను ఇచ్చట తీర్చుకుంటారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున మహన్యాస పూర్వక కుంభాభిషేకం నిర్వహిస్తారు.

ఆ రోజు అన్నదానం కూడా జరుగుతుంది. మహాశివరాత్రి పర్వదినాన ఘనంగా స్వామి వారి ఉత్సవాలు జరుగుతాయి. ఇక్కడ మహాశివరాత్రి రోజున పెద్ద జాతర జరుగుతుంది. ఈ ఉత్సవాల సందర్భంగా కళ్ళుమిరుమిట్లు గొలిపే విధంగా విద్యుత్ ప్రభలను తయారుచేసి వీధులలో నిలుపుతారు. ఈ విద్యుత్ ప్రభలు ఇచ్చట ఒక ప్రత్యేక ఆకర్షణ. ఈ జాత రను చూడడానికి చుట్టుప్రక్కల గ్రామల నుండే గాక రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వస్తారు. నిత్య పూజలతో పాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు మహాశివరాత్రి రోజున పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల కళ్యాణం అంగరంగవైభవంగా జరుగును. శివరాత్రి మహోత్సవాలతో పాటు బ్రహ్మోత్స వాలు, కళ్యాణోత్సవం, వసంతోత్సవం, ప్రభోత్సవం, గ్రామోత్సవం ఇక్కడ వైభవంగా జరుగుతాయి. ధ్వజ అవరోహణ కాలమందు స్వామి వారికి నివేదించిన నందిముద్దలు అత్యంత మహిమాన్వితమైనవని చెబుతారు. సంతానప్రాప్తికై భక్తులు ఉపవాసముండి సాయంత్రము స్వామివారికి నివేదించిన నందిముద్దలు అర్చకస్వాములు ధ్వజస్తంభము వద్ద ఎగుర వేయగా ఆ ముద్ద ఎవరి కొంగునపడితే వారికి సంతాన ప్రాప్తి కలుగునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ స్వామివారిని దర్శించుకొనుటకు కొండపైకి మెట్లమార్గం ఉండగా, ఈ మధ్యనే భక్తుల సౌకర్యార్థం రోడ్డుమార్గం కూడా నిర్మించారు. ఘాట్‌రోడ్డు ప్రారంభంలో తోరణ ద్వారం భక్తులను ఆహ్వానిస్తూ కనిపిస్తుంది. ఘాట్ రోడ్ చివరలో అంజనీ సుతుడైన ఆంజనేయుడు భక్తులను అనుగ్రహిస్తూ కనిపిస్తాడు. పండుగ రోజులలో ఆలయం రద్దీగా ఉంటుంది.

శ్రీ అష్టలక్ష్మీదేవాలయం - చినఎరుకపాడు



కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, బిళ్ళపాడు సరిహద్దులోని చినఎరుకపాడులో శ్రీ అష్టలక్ష్మి దేవాలయం ఉన్నది. గుడివాడ నుండి పామర్రుకు వెళ్ళు రోడుమార్గం ప్రక్కన ఈ ఆలయం నిర్మితమై ఉన్నది. దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారు ఈ క్షేత్రంలో దత్త పాదుకలను ప్రతిష్టించి, గురుదత్త పాదుకా క్షేత్రంగా దీనికి పిలిచారు. ఆ తరువాత ఇటీవల కాలంలో స్వామీజీ వారి పవిత్ర హస్తలతో, అష్టలక్ష్మి ప్రతిష్ట, యంత్రస్థాపన, ధ్వజస్తంభస్థాపన, సిద్ధిబుద్ధి సమేత గణపతి ప్రతిష్ట, అనఘాదేవి, దత్తాత్రేయ ప్రతిష్టలు జరిగాయి. అమ్మవారి ఆలయ ప్రవేశద్వారం వినూత్నంగా నిర్మింపబడి ఉంది. రెండువైపులా ఆలయ ప్రవేశపు పడికట్లు లోహపు

కడ్డీలతో అమర్చిన పార్శ్వభాగాలతో అందంగా ఉంటాయి. ఈ ప్రవేశద్వారానికి ఎడమవైపు విఘ్నేశ్వరుడు, కుడివైపు శ్రీ వల్లీదేవసేనాసమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కొలువై ఉన్నారు. గర్భాలయంలో శ్రీమహాలక్ష్మీదేవి చరణపద్మాలు, అభయ, వరద ముద్రలతో భక్తులకు దర్శనమిస్తాయి. విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఉత్సవమూర్తులు, శ్రీచక్రయంత్రం, సుమేరువు అమ్మవారికి దిగువభాగంలో నెలకొని ఉన్నాయి. ఈ ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ప్రధాన ఆలయానికి అనుబంధంగా అష్టగణపతుల మందిరం, శ్రీ శ్రీ అనఘాదేవి సమేత విష్ణుదత్తస్వామి, శ్రీమతి జయలక్ష్మీ మాత, గురుదత్తపీఠం మొదలైనవి ఉన్నవి. స్వామివారి మాతృమూర్తి శ్రీమతి విజయలక్ష్మీమాత ఈ ఆలయానికి రక్షణదేవతగా సుందరవిగ్రహ రూపంలో ఇచ్చట దర్శనమిస్తుంది.

ప్రతిరోజూ అమ్మవారికి సహస్రనామ, అష్టోత్తర పూజలు జరుగుతాయి. ఇంతే కాక శ్రావణమాసంలో శ్రీచక్రార్చన, పౌర్ణమికి హోమం, పంచామృతాభిషేకాలతో అభిషేకాలు ఘనంగా జరుగుతాయి. అష్టలక్ష్ములలో శక్తికి ప్రతిరూపమైన గజలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకంగా ఈ ఆలయంలో పూజాదికాలు ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం - కైకలూరు



కృష్ణాజిల్లా కైకలూరులో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఉన్నది. 1972, మే 22న ఈ ఆలయానికి శంకుస్థాపన జరిగి, తరువాత 1974 మే3న ఈ ఆలయంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఈ ఆల యంలోని ప్రధానదైవం శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి. కైకలూరులోని ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న ఈ ఆలయ స్వాగత తోరంణంపై దుర్గాదేవి మూర్తి నెలకొని ఉన్నారు. మరో వైపు ఆలయ ప్రాకారంపై అర్జుననికి గీతాబోధ చేస్తున్న పార్థసారథి విగ్రహం ఉన్నది. ఈ ఆలయంలో ప్రధానంగా మూడు గోపురాలు ఉన్నాయి. ఆలయ శిఖరాలపై అనేక దేవతామూర్తుల ప్రతిమలు ఉన్నాయి. ప్రధానంగా దేవీతత్త్వాని బోధించే పలు శిల్పాలు ఈ ఆలయ శిఖరాలపై కనిపిస్తాయి. ఈ ఆలయంలో లోహ కవచం తాపడం చేసిన ధ్వజస్తంభం ఉన్నది. ఈ ధ్వజ స్తంబాన్ని ఆనుకొనే బలిపీఠం ఉంటుంది. భక్తులు ఈ ధ్వజస్తంభానికి ప్రదక్షిణ చేసే సమయంలో ఈ బలిపీఠంకు నమస్కరిస్తారు. గర్భాలయానికి రెండు వైపులా ద్వారపాలకులు దర్శనమిస్తారు. గర్భాలయంలో శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరీదేవి దివ్యమంగళ రూపం



దివ్యకాంతులతో భక్తులకు దర్శనమిస్తుంది. పాలరాతితో చేయబడిన విగ్రహం నిలబడి ఉన్న భంగిమలో, నాలుగు హస్తాలతో, పై చేతులలో శంఖువు, చిలుక, క్రింది చేతులతో అభయ, వరద ముద్రలను కలిగి పట్టు వస్త్రములతో, పూలమాలతో విరాజిల్లుతుంటుంది. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక ఉపాలయాలు ఉన్నాయి. కన్యకా దేవికి కుడివైపున బాలత్రిపుర సుందరీదేవి, ఎడమవైపున మహిషాసుర మర్దిని అమ్మవారు, కాలభైరస్వామి, ప్రవేశ ద్వారానికి కుడివైపున శ్రీ దాసాంజనేయ స్వామివారు కొలువై ఉన్నారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే శ్రీ నగరేశ్వరస్వామివారి సన్నిధికూడా ఉన్నది. ఈ ఆలయ మంటపం పైభాగాన భక్తమార్గండేయుని మూర్తి, నగరేశ్వరస్వామివారికి ఎదురు నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి సన్నిధి, సర్పాకృతిలో స్వామి ఇచ్చట మనకు కనిపిస్తారు. ఈ ఆలయ వెనుక భాగంలో సిద్ధిబుద్ధి సమేత శ్రీ వినాయకస్వామివారి ఆలయం ప్రత్యేకంగా ఉన్నది. శ్రీఅయ్యప్ప స్వామి వారి ఆలయం, నవగ్రహ మంటపం మొదలగు దేవతామూర్తుల ఆలయాలతో అలరారుచున్నది. ఈ ఆలయంలో దేవీశరన్నవ రాత్రులలో అమ్మవారిని అనేక రూపాలతో అలంకరిస్తారు. ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శుద్ధనవమి, ఏకాదశులలో అమ్మవారి జన్మదినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహిస్తారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు, వ్రతాలు, నిత్య పూజలతో సందడిగా ఉంటుంది. పండుగ పర్వదినాలలో రజత సింహాసనంపై కొలువుతీరి ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముఖమండపంపై ఉంచి ఆ దివ్య స్వరూపాన్ని భక్తులకు దర్శించుకొనే భాగ్యాన్ని కల్పిస్తారు.


శ్రీ శ్యామలాంబా ఆలయ సముదాయం - కైకలూరు



కృష్ణాజిల్లా, విజయవాడకు సమీపంలో, గుడివాడ–భీమవరం రైలుమార్గంలో ఉన్న కైకలూరులో కైకలూరు బస్టాండ్‌కు సుమారు 1 కి.మీ., దూరంలో కైకలూరు నగరం నడిబొడ్డున శ్రీ శ్యామలాంబా అమ్మవారి ఆలయ సముదాయం ఉన్నది. పూర్వం ఈ కైకలూరును కైంకర్యపురి అని పిలిచేవారు. అదే కాలక్రమేణా

కైకలూరుగా రూపాంతరం చెందినట్లు తెలియుచున్నది. ఈ ఆలయం సుమారు 400 సంవత్సరాలని పిలిచేవారు. అదే పురాతనమైన ఈ ఆలయాన్ని 2008లో నూతనంగా పునర్నిర్మింపచేశారు. ఈ ఆలయంలోని అమ్మవారు మహిమాన్వితమైన దేవతగా పూర్వం నుండి కైకలూరు గ్రామవాసులు ఇలవేల్పుగా, బంధావారి ఆడపడుచుగా అమ్మవారు పూజలందు కొంటున్నారు.

పురాణకథ : ఈ ఆలయ ప్రాంతంలో మొదట శ్రీ రామేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు ఉండేవి. గ్రామచావిడి, చావిడిలో వేదపండిత చర్చలు జరుగు తుండేవట. కనకన్నయ్య అనే బ్రాహ్మణేతరుడు ఒకనాడు చర్చలో తలదూర్చగా, పండితులు అతనిని పరిహసించారు. కనకన్నయ్య తన నాలుక తెగకోసుకొని చెరవులో పడవేసి, శివాలయంలో హఠముద్ర వేసుకొని మంత్రోచ్చారణలు చేయగా, గ్రామంలో ఉత్పాతాలు జరుగసాగాయట. కనకన్నయ్య తేజోపుంజాన్ని చివరకు ఒక ఉపాసకుడు శ్యామలా మంత్రంతో భంగపరచి, తలపై కొబ్బరికాయ కొట్టడంతో దేహం చాలించిన కనకన్నయ్య సమాధిగతుడైయ్యాడట. కొన్నాళ్ళకు ఆ సమాధి దిబ్బపై కూర్చున్న పశువుల కాపరికి నిధులు లభిస్తాయని వినపడగా అతను త్రవ్వగా కనకన్నయ్య శ్యామలాంబా సహితంగా గ్రామంలో ఆవేశంగా వీరంగం చేయసాగాడట. గ్రామస్తులు వారిని శాంతపరిచే మార్గం కోరగా ధూపధీప నైవేద్యాలతో, నిత్యపూజలతో తమకు ఆలయ నిర్మాణం చేయమని ఆదేశించారని తెలియుచున్నది.



శ్రీ శ్యామలాంబా అమ్మవారి ఆలయ సముదాయంలో మూడు శివాలయాలు ఉండటం గొప్ప విశేషం. ఎత్తైన, రాజగోపురం, నాలుగు ప్రధాన ఆలయాలకు అంతరాలయాలు, గర్భాలయాలు, నాలుగు ధ్వజస్తంభాలతో ఆలయ సముదాయం విరాజిల్లుతుంది. రాజగోపురం 5 అంతస్తులతో, సప్తకలశాలతో దర్శనమిస్తుంది. రాజ గోపురద్వారానికి ఇరువైపులా తెల్లటి గజరాజులు గజమాలతో దర్శనమిస్తాయి. ఆలయ మంటప, ప్రాకార మంటపాల పైభాగాన శివపార్వతులు భక్తులకు దర్శనమిస్తున్నారు. అభయహస్తంతో ఉన్న ఆదిదంపతుల కిరువైపులా వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు ఉన్నారు. ఇక్కడే శివపార్వతుల మూర్తులకు కుడిఎడమల సప్తరుషులు కూడా దర్శనమిస్తారు. ప్రధాన గర్భాలయంలో శ్యామలాంబాదేవి సర్వాలంకార భూషితయై భక్తులకు దర్శనమిస్తారు. శ్యామలాంబ ఎదురుగా ఆమె వాహనమైన సింహమూర్తి ఉన్నది. ఎడమ వైపున శ్రీ రామ లింగేశ్వరస్వామి ఆలయం, శ్రీరామేశ్వర స్వామి ఆలయం, శ్రీ కనక లింగేశ్వరస్వామి

ఆలయాలు ఉన్నవి. ఆలయ ప్రాంగణంలో వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక మండపాలు కలవు. ఆలయంలో నిత్య పూజలతోపాటు, సహస్ర నామార్చనలు, అష్టోత్తరాలు, కుంకుమార్చనలే కాకుండా శ్రావణ మాసంలో శుక్రవారాలు విశేష పూజలు జరుగుతాయి. రెండవ శుక్రవారం జరిగే వరలక్ష్మీవ్రతం, దసరా నవరాత్రులలో అమ్మవారికి ప్రత్యేకమైన పూజలతో ఉత్సవాలు నిర్వహిస్తారు.

శ్రీ చెన్న మల్లిఖార్జున స్వామి ఆలయం - తోట్లవల్లూరు



కృష్ణాజిల్లా, కృష్ణానదీ తీరాన ఉన్న తోట్లవల్లూరులో భ్రమరాంబా చెన్న మల్లిఖార్జున స్వామి వారి దేవాలయం ఉన్నది. స్వామి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా చెబుతారు. ఈ స్వామివారి ఆల యానికి ఎదురుగా ఉన్న నందిని జీవనంది అని అంటారు. పూర్వకాలంలో ఈ నంది రాత్రిపూట పరిసర ప్రాంతాలలో ఉన్న పొలాల్లోకి వెళ్ళి పంటలు పాడుచేస్తూ ఉండేదట. అప్పుడు వీరయ్య అనే పండితుడు తపస్సుచేసి దిగ్బంధన చేసిన ఒక కడియం నందికి వేయడం జరిగింది. ఆ విధంగా ఆ జీవనందిని కట్టడి చేశారు. ఇప్పటికీ కూడా ఈ కడియం ఉన్నది. ఈ కడియానికి ఎక్కడా అతుకువేయకుండా నందీశ్వరుని కాలుకు ఆ కడియం వేశారని చెబుతారు.

సంగమేశ్వరాలయం - వైరా

కృష్ణాజిల్లా వీరులపాడు గ్రామానికి పశ్చిమంగా దాములూరు గ్రామానికి ఆగ్నేయంగా, ఉన్న కట్లేలేరు–వైరాసంగమప్రదేశంలో శ్రీ సంగమేశ్వరాలయం కలదు. ఈ ఆలయమును సుమారు 200 సంవత్సరాలక్రితం శ్రీ రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు నిర్మించి నట్లు తెలియుచున్నది. ఆయన కట్టించిన 108 శివాలయాలలో ఈ ఆలయము ఒకటి. వీరు ఈ ఆలయానికి 80 ఎకరముల భూమిని విరాళంగా ఇచ్చారు. వివిధ గోపురాలతో అలరారే ఈ ఆలయం గర్భాలయం అంతరాలయం, మండపం, అను మూడు భాగాలుగా ఉన్నది. గర్భాలయంలో శ్రీ సంగమేశ్వరుడు, అంతరాలయము నందు ఇతర దేవతామూర్తులు మనకు దర్శన మిస్తారు. ఇది ప్రధానంగా శివాలయం. ఈ శివాలయం ఆవరణలో ఒక విష్ణ్వాలయం చెన్నకేశవస్వామి ఉండడం ఒక విశేషం.


ఇది శైవ, వైష్ణవ సంప్రదాయ సామరస్యమును ప్రబోధించుచున్నది. ఈ రెండు ఆల యాలకు వేరువేరుగా భూములు కలవు. వేరువేరుగా అర్చకులు కలరు. పూజా విధానములు కూడా వేరుగానే జరుగును. ఈ ఆలయ సముదాయమందు ప్రతిరోజు నిర్వహించు పూజలతోపాటు ప్రత్యేకార్చనలు జరుగును.

శ్రీ పృథ్వీశ్వరాలయం - నడకుదురు




కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నడ కుదురు ప్రాంతంలో కృష్ణానది తీరాన పృథ్వీశ్వరాలయం కలదు. ద్వాపర యుగం నాటికే ఈ ప్రాంతంలో పర మేశ్వరుడు పృథ్వీశ్వరుడిగా వెలిశాడు. నరకాసురుడు ఇక్కడ ద్విముఖుడు అనే బ్రాహ్మణుణ్ణి సంహరించగా, ఆ పాప పరిహార్థం ఈ పృథ్వీశ్వరుడికి పూజలు చేశాడట. ఒకప్పుడు ఈ ఆలయం ఎంతో ఎత్తులో ఉండేదట. కాలగర్భంలో మార్పుల కారణంగా కొంత భూమిలోకి దిగిపోయింది. ఇది మిగతా ఆలయాల్లా కాకుండా పశ్చిమాభిముఖంగా ఉంటుంది. నదితీర గ్రామమైన నడకుదురు ఆనాడు నరకోత్తారక క్షేత్రంగా విలసిల్లింది. నరకాసుర సంహారం అనంతరం శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై ఇక్కడ వెలిసిన శ్రీలక్ష్మీనారాయణులను పాటలీ పుష్పాలతో పూజించారని పురాణ కథ. ఆ తరువాత శ్రీకృష్ణుడు దేవవనం నుంచి పాటలీ వృక్షాలను తెచ్చి నడకుదురులో నాటాడట. శ్రీకృష్ణుడు పూజించినట్లు చెప్పే శ్రీలక్ష్మీ నారాయణ విగ్రహాలు ఇక్కడి కార్తీక వనంలోని ఓ గుడిలో ఉన్నాయి. నరకోత్తారక క్షేత్రంగా విలసిల్లిన ఈ ప్రాంతం తర్వాతికాలంలో నరకొత్తూరు, నడకదూరు, నడకుదురుగా రూపాంతరం చెందింది. ఈ పృథ్వీశ్వరుణ్ణి పూజిస్తే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం - మంటాడ



కృష్ణాజిల్లా, మంటాడలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. ఈ ఆలయంలో కొలువైన శ్రీ వేంకటేశ్వర స్వామిని భక్తులు కళ్యాణ వేంకటేశ్వర స్వామిగా పిలుస్తారు. ఈ ఆలయం అతి మహిమా న్వితమైనదిగా భక్తులు చెబుతారు.



ఒకే ప్రాంగణంలో గల రెండు దేవాలయాలలో ఒకే భగవంతుని విగ్రహం కలిగి ఉండటం ఈ ఆలయం యొక్క విశిష్టత. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులకు ముందుగా ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. గర్భాలయం ముందు ద్వారపాలకులైన జయవిజయులమూర్తులు దర్శన మిస్తారు. గర్భాలయంలో అలమేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి సర్వాలంకార భూషితుడై భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఆలయంలో వేంచేసియున్న స్వామివార్లకు నిత్యపూజలతో పాటూ, అష్టోత్తరం, సహస్ర నామార్చాన, అభిషేకాలు, నిత్యకళ్యాణం, ప్రత్యేక పూజలు, పండుగ పర్వదినాలలో విశేష అరాధనలు, ఉత్సవాలు జరుగును. ఈ ఆలయంలోని స్వామికి 3 శుక్రవారాలు క్షీరాభిషేకం చేసిన భక్తులకు తమ కోరికలు నేరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో వేంచేసి యున్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారికి కూడా నిత్యపూజలతో పాటూ శరన్నవరాత్రులలో ప్రత్యేకమైన అలంకరణలతో పూజిస్తారు. పెళ్ళికాని వారు దర్శిస్తే పెళ్ళి అవుతుందని ప్రతీతి. చుట్టుప్రక్కల గ్రామాల నుండి, మరియు విజయవాడ నగరం నుండి భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు నిర్వహించి తరిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో నాగేంద్రస్వామిపుట్ట ఉంది. సంతానం లేనివారు ఇక్కడికి వచ్చి ఈ నాగేంద్రస్వామికి పూజలు జరుపుతారు. నాగులచవితి, నాగులపంచమికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.

సువర్చలా సహిత శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం - ఉయ్యూరు

కృష్ణాజిల్లాలో ఉయ్యూరు మండలంలోని ఉయ్యూరు గ్రామంలో రావిచెట్టు బజారు చివర పుల్లేరు కాలువకు సమీపంలో సువర్చలా సహిత శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఉన్నది. సువర్చలతో కూడిన ఆంజనేయస్వామి దేవాలయాలు చాలా అరుదు. అలాంటి అరుదైన దేవాలయం ఇది. ఈ ఆలయంలో వెలిసిన స్వామి కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారు. ఈ ఆలయాన్ని గబ్బిట దుర్గా ప్రసాద్‌గారి తండ్రిగారైన గబ్బిట మృత్యుంజయశాస్త్రి గారి మాతామహులు గుండు లక్ష్మీ నరసింహావధానులు గారు సుమారు 200 సంవత్సరాల క్రితం తన స్వంతధనంతో నిర్మించి, ఆలయంలో ఉత్సవ మూర్తులను, ధ్వజస్తంభమును ప్రతిష్టించి, ధూప ధీప నైవేద్యాలను కొనసాగించినట్లు తెలియుచున్నది. 23-6-1988వ సంవత్సరంలో శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్‌గారి ఆధ్వర్యంలో వైఖానస ఆగమవిధానాలతో స్వామి వారిని పునఃప్రతిష్టించారు. 13-06-1993న ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఆలయంలో స్వామివార్లకు నిత్యపూజలతో పాటు అభిషేకాలు, హోమాలు,

సహస్రనామార్చలు, పండుగ పర్వదినాలలో విశేష అర్చనలు, తమలపాకుల పూజ, పండ్లతో పూజ, గంధశింధూరంతో అర్చనాదులు, హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు, లలితా పారాయణ, సామూహిక కుంకుమపూజ, ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. వైశాఖ బహుళ దశమి నాడు ఆంజనేయస్వామి జన్మదినం. ఆ రోజున శ్రీ హనుమజ్జయంతిని సువర్చలాంజనేయ కళ్యాణాన్ని చాలా వైభవంగా జరుపుతారు. భోగినాడు శాంతికల్యాణం, ఊరేగింపు జరుగుతుంది. ఈ సందర్భంగా ఒంటె వాహనం మీద జరిగే ఊరేగింపు, లడ్డులతో ప్రత్యేకపూజ, కాయగూరలతో విశేష అర్చనలు చూడముచ్చటగా ఉంటుంది. ఈ ఆలయాన్ని దర్శించడానికి నిత్యం ఎంతో మంది భక్తులు తరలివస్తుంటారు.

శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం - వెంట్రప్రగడ



కృష్ణాజిల్లా, విజయవాడకు సమీపంలో ఉన్న వెంట్రప్రగడ గ్రామంలో ప్రధాన రహదారి ప్రక్కనే శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం ఉన్నది. ఈ ఆలయం మరో షిరిడిగా ప్రసిద్ధి చెందినది. ఈ ఆల యానికి గల ప్రత్యేకతలలో ఒకటి తొలితరం షిరిడి సాయిబాబా మందిరం, మరొకటి ధ్వజస్తంభం ఉన్న ఈనాటి షిరిడి సాయిబాబా ఆలయం. 1941వ సంవత్సరంలో నవంబరు 16వ తేదీన ఈ మందిరంలో సాయి విగ్రహాన్ని ప్రతిష్టించారు. 1952వ సంవత్సరంలో ఇప్పుడు మంది రంలో వెలిసిన పాలరాతి మూర్తిని నెలకొల్పారు. నాగభైరవ వెంకటరత్నం దంపతుల కుమార్తె సాయివరప్రసాదిని అనేకమంది భక్తుల సహాకారంతో ఈ మందిరాన్ని నిర్మింపజేశారు.



ప్రధాన మందిర గోపురం పై పంచలోహ విమానం నెలకొని ఉన్నది. ప్రధాన మందిర ప్రవేశ ద్వారంలో బాబా విగ్రహం ఉంటుంది. లోపల ప్రధానమందిరంలో శ్రీ షిరిడిసాయిబాబా విగ్రహానికి పైన ప్రత్యేకంగా పాలరాతి మూర్తులైన శ్రీ సీతారామలక్ష్మణ మూర్తులు నెలకొని ఉన్నాయి. బంగారు కిరీటంతో సర్వాలంకార భూషణాలతో సాయినాథుడు సుందరరూపంతో భక్తులకు దర్శనమిస్తున్నాడు. సీతారామలక్ష్మణులను, సాయిబాబాను ఏకీకృతం చేస్తూ

మకరతోరణం ఉన్నది. సాయివిగ్రహానికి కుడివైపున ఆంజనేయుడు, ఎడమవైపున గణపతి పాలరాతి విగ్రహాలు ఉన్నాయి. ఈ మందిరంలో రమా సహిత శ్రీ సత్యన్నారాయణస్వామి వారు, మరొకవైపు సాయిదత్త గణేశపీఠం ప్రత్యేకంగా నెలకొని ఉన్నది. సీతారాములతో పాటూ, రమా సహిత సత్యన్నారాయణస్వామి సాయినాథుడు ఒకే లోగిలిలో నెలకొని ఉండటం వలన దీనిని విష్ణు దత్త సాయి గణేశ సన్నిధిగా చెబుతారు. ప్రధానమందిరానికి ఎడమవైపున ప్రత్యేక పీఠంపై దత్తాత్రేయ స్వామి వారు కొలువై ఉన్నారు. ఈ మందిర ప్రాంగణంలో ధుని ప్రత్యేకంగా అమరి ఉంటుంది. ఆలయంలో ప్రతిరోజూ నిత్య పూజలు, హారతులు, అభిషేకాలు, ప్రత్యేక ఆరాధనలు ఘనంగా జరుగుతాయి. ప్రతి గురువారం విశేషపూజలు ఇచ్చట ప్రత్యేకంగా చేస్తారు. దీపావళికి, శ్రీరామనవమికి, దసరాకు ప్రత్యేక ఆరాధనలు భక్తుల సమక్షంలో అతి గొప్పగా నిర్వహిస్తారు.

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం - తోట్లవల్లూరు



కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ప్రాచీనమైన ఈ ఆలయాన్ని మహిమాన్వితమైన ఆలయంగా చెబుతారు. ఈ ఆలయాన్ని 1802 వ సంవత్సరలో బొమ్మదేవర నాగన్న నాయుడు నిర్మించినట్లు తెలుస్తుంది. సుమారు 90 అడుగుల ఎత్తుగల గాలిగోపురం ఈ ఆలయం యొక్క ప్రత్యేకత. గతంలో స్వామివారి ఉత్సవాలు ఇచ్చట ఘనంగా నిర్వహించబడేవని స్థానికులు చెబుతారు. ఇచ్చట నిత్యం జరిగే పూజలతో పాటు పండుగ, పర్వదినాలలో ప్రత్యేక ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు. అప్పుడు దేవాలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ శంభులింగేశ్వర, సీతారామాంజనేయ ఆలయాలు - గోళ్ళమూడి



కృష్ణాజిల్లా, నందిగామ మండలం, గోళ్ళమూడి గ్రామంలో శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ సీతారామాంజనేయస్వామి వార్ల ఆలయాలు ఉన్నవి. శివకేశవ సన్నిధులను భక్తులు ఒకేసారి ఇక్కడ దర్శించుకోవచ్చు. సువిశాలమైన లోగిలిలో ఉన్న ఈ ఆలయాలు 19వ



శతాబ్ధంలో రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు గారి విరాళంతో నిర్మించి నట్లు తెలియుచున్నది. ఆలయంలో గల గంగాపార్వతీ సమేత శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయానికి ఘనమైన చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. పురాతన శిథిలమైన ఈ ఆలయాన్ని 2006వ సంవత్సరంలో పునరుద్ధరించారు. గర్భాలయంలో పానవట్టంపై భారీ లింగాకృతిగా శ్రీ శంభులింగేశ్వరుడు దర్శన మిస్తాడు. శంభులింగేశ్వరునికి నిత్యాభిషేకాలు, అభిషేకాలు పూర్తి అయిన తరువాత పంచలోహాలతో రూపొందించిన శివవదన స్వరూపాన్ని లింగాకృతిపై అలంకరిస్తారు. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక ఉపాలయాలు కూడా ఉన్నాయి. ఇచ్చట పార్వతీదేవి సన్నిధి ప్రత్యేకంగా నెలకొని ఉన్నది. ఇచ్చట అమ్మవారు నల్లరాతి అర్చావతార మూర్తిగా దర్శనమిస్తుంది. మరోవైపు వినాయక, సుబ్రహ్మణ్యస్వామివారి సన్నిధులు ఉన్నాయి. ఇచ్చటనే గర్భాలయంలో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామివారు అభీష్ట వరసిద్ధి ప్రదాతగా దర్శనమిస్తారు. ఆంజనేయస్వామివారికి మంగళవారం మరియు విశేష పర్వదిన ములలో ఆకుపూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తారు.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామాంజనేయస్వామివారి ఆలయం జీర్ణోద్ధరణ కావింపబడి 2013వ సంవత్సరంలో నూతనంగా నిర్మింపబడింది. గర్భాలయంలో శ్రీరాముడు సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతంగా కొలువై ఉన్నాడు. శ్రీ సీతారామంజనేయ స్వామి వార్లతో పాటు జీవ ధ్వజస్తంభాలు, శిఖరకలశాలు, బలిపీఠం, ద్వార పాలకులను పాంచరాత్ర ఆగమ రీతిలో వేదవిదులు, పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఈ ప్రతిష్టాపనా వేడుకలు జరిగాయి.

శ్రీ వేంకటాచలస్వామి దేవాలయం - గూడూరు

కృష్ణాజిల్లా, గూడురు గ్రామంలో శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటాచల స్వామి దేవాలయం ఉన్నది. ఈ ఆలయం అతి పురాతనమైనది. ఇచ్చట శ్రీ వేంకటాచల స్వామి స్వయంభువుగా వెలిశారని భక్తులు చెబుతారు. ఈ ఆలయాన్ని 1800 సంవత్సరంలో తిమ్మరాజు వంశస్థులు నిర్మించినట్లు తెలియుచున్నది. ఈ ప్రాంతంలోని భక్తులు తిరుపతికి వెళ్ళేముందు ముందుగా ఈ ఆలయాన్ని దర్శించి ఆ తరు వాత తిరుపతికి వెళ్ళే ఆనవాయితీ ఉండట. గర్భాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ



వేంకటాచల స్వామి కొలువై ఉన్నారు. ఆలయ ప్రాంగణంలోరాజ్యలక్ష్మీ అమ్మవారు, అభయాంజనేయ స్వామి కొలువై ఉన్నారు. ఇచ్చట నిత్యపూజలతో పాటు, పండుగ పర్వదినాలలో విశేష అరాధనలు, స్వామి వారి కళ్యాణోత్సవాలు అతి వైభవంగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో అంగరంగ వైభవంగా జరిగే ఈ కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి చుట్టుప్రక్కల జిల్లాల నుండి కూడా భక్తులు రావడంతో దేవాలయం కిటకటలాడుతుంది.

శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి వారి ఆలయం - మేడూరు

కృష్ణాజిల్లా, కపిలేశ్వరపురం నుంచి 5 కిలోమీటర్లు దూరంలో మేడూరు గ్రామం ఉంది. పమిడిముక్కల మండలంలో ఉన్న ఈ మేడూరులోని పురాతన దేవాలయాల్లో శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి వారి ఆలయం ఒకటి. ఎన్నో వందల సంవత్సరాలకు పూర్వం ఈ స్వామి ఇక్కడ స్వయంభువై వెలిసాడని స్థానికులు చెప్తారు. సుమారు మూడు వందల సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మించబడిందని ఆలయ నిర్మాణ రీతిని బట్టి గజపతుల పరిపాలనా కాలానికి చెందినదిగా భావించబడుతుంది. గర్భాలయంలో స్వామివారి లింగం చాలా లోతుగా, మూడు అడుగుల దిగువన ప్రతిష్టించబడి ఉంది. ఈ ఆలయంలో ఇదో ప్రత్యేకత. ఇంత లోతుగా, స్వయంభువై స్వామివారు వెలిసింది ఇక్కడ ఒక్కచోటే అని చెప్పవచ్చు.

ఈ ఆలయంలోని దేవేరి దుర్గామాత గొప్పమహిమగల తల్లిగా భక్తులు భావిస్తారు. దుర్గ అమ్మవారికి మొక్కుకుంటే తప్పనిసరిగా తీరుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే చుట్టుప్రక్కల గ్రామాలనుంచి కూడా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని, అమ్మవారికి మొక్కుకుంటారు. మేడూరు గ్రామానికి వచ్చిన వారెవరైనా స్వామివారిని దర్శించుకుని వెళ్ళడం ఆనవాయితీగా చెబుతారు స్థానికులు. ఇక్కడ దసరా ఉత్సవాలు వైభవోపేతంగా జరుపుతారు. కార్తీకమాసంలో రోజువారీ పూజలు ఎంతో గొప్పగా జరుగుతాయి.

శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం - మేడూరు

కృష్ణాజిల్లా, మేడూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం ఉన్నది. గజపతుల కాలంలో ఈ ప్రాంతమంతా అరణ్యమై ఉండేదని అప్పట్లోనే మేడూరులో శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయాన్ని గజపతులే నిర్మించారని తెలుస్తుంది. ఈ ఆలయ నిర్మాణాన్ని చూస్తే పురాతనమైనదిగానే భావించవచ్చును. ఈ ఆలయంపై

తురుష్కుల ప్రభావం కూడా ఉన్నట్లుగా తెలుస్తుంది. ఇక్కడి శ్రీవేణుగోపాల స్వామివారి మహిమలని గురించి స్థానికులు చాలా గొప్పగా చెప్పుకుంటుంటారు. ధనుర్మాసం, వైశాఖ పౌర్ణమిలో బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

శ్రీ రంగనాయకస్వామి వారి ఆలయం - శ్రీరంగపురం

కృష్ణాజిల్లా, పమిడి ముక్కల మండలం, ఐలూరుకి ఆరు కిలోమీటర్ల దూరంలో శ్రీరంగపురం ఉన్నది. ఈ గ్రామంలో పవిత్ర పుణ్యక్షేత్రంగా శ్రీ రంగనాయకస్వామివారి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ గ్రామానికి చిన్న శ్రీరంగపురం అనే పేరు కూడా ఉంది. శ్రీ రంగనాయకస్వామి వెలసిన ప్రసిద్ధ క్షేత్రాలు దక్షిణ భారతావనిలో అయిదు ఉన్నాయి. మొదటి క్షేత్రం తమిళనాడులోని శ్రీరంగం. రెండు కర్ణాటకలోని శ్రీరంగపట్నం. మూడు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో శ్రీరంగనాయకస్వామి, నాలుగు గుంటూరుజిల్లాలోని పెద్ద శ్రీరంగపురం. అయిదో క్షేత్రం కృష్ణాజిల్లాలోని శ్రీరంగపురం. ఇవన్నీ శ్రీకృష్ణదేవరాయల వారి కాలంలో నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ క్షేత్రానికి కొద్దిదూరంలో వున్న కన్యకల మడుగు అనే పుష్కరిణి ఉన్నది. పూర్వం దేవతా స్త్రీలు జలక్రీడలకై నిత్యం ఇక్కడకు వచ్చేవారు. ఒకనాడు అలావచ్చి స్నానమాడుతున్న దేవతా స్త్రీలను జాలర్లు చూడటంతో వారు శిలలైపోయారని ఓ గాథ ఇక్కడ వాడుకలో వుంది. 15వ శతాబ్దంలో తురుష్కుల దండయాత్రకు భయపడి ఆలయం అర్చకులు శ్రీ స్వామి వారిని తీసుకెళ్ళి ఊరి బయట వున్న కన్యకల మడుగులో దాచారు. కొన్ని సంవత్సరాల తరువాత కన్యకల మడుగులో స్వామివారి విగ్రహం కోసం గాలించి, త్రవ్వినప్పుడు పలుగుపోటుకి స్వామివారి నాసిక భాగం విరిగిపోయింది. ఆ విగ్రహాన్ని ఇప్పుడు కూడా ఆలయం ఆవరణలో చూడవచ్చు. అందువల్ల తిరిగి ప్రస్తుతం శేషతల్పసాయిగా వున్న శ్రీరంగనాయక స్వామివార్ని ప్రతిష్ఠించడం జరిగింది. 1992లో ఈ దేవాలయం ధర్మాదాయ శాఖ వారి ఆధీనంలోకి వచ్చినది. ఇక్కడ వైశాఖ మాసంలో అయిదు రోజులపాటు ఉదయవరుల ఉత్సవాలు జరుగుతాయి. ధనుర్మాసంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ప్రత్యేకంగా జరుగుతాయి. స్వామివారి మహిమల గురించి ఇక్కడి భక్తులు ఎంతో గొప్పగా చెబుతారు.

శ్రీ జంబుకేశ్వరస్వామి వారి ఆలయం - శ్రీరంగపురం

కృష్ణాజిల్లా, శ్రీరంగపురంలో శ్రీ జంబుకేశ్వరస్వామి వారి ఆలయం ఉంది. శ్రీ రంగనాయకస్వామి ఆలయానికి కొద్ది దూరంలో ఈ జంబుకేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఈ స్వామి వారి ఆలయం కేశవాలయం ప్రక్కనో, ఆ గ్రామంలో ఎక్కడో ఒకచోట ఉండి తీరాలి గనుక సమీపంలో ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది. శ్రీ

జంబుకేశ్వరస్వామిని ముందుగా శ్రీరంగంలోనూ, తరువాత చిన శ్రీరంగపురంలోనూ ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. శ్రీరంగనాయకస్వామిని దర్శించినవారు ఈ స్వామిని కూడా దర్శించుకోవడం తప్పనిసరి అని స్థానికులు చెప్తారు.

శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయం - చినకర అగ్రహారం

కృష్ణాజిల్లా, చిలకలపూడికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో చినకర అగ్రహారం ఉన్నది. ఇక్కడ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినది. కొన్ని సంవత్సరాల క్రితం మంగినపూడి రేవు (హార్బరు) లేదు. అప్పుడు ఈ చినకర అగ్రహారమే రేవుగా ఉండేది. ఈ ఆలయం సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ దేవాలయం. ఈ రేవుకి వచ్చే వాణిజ్యవేత్తలతో, ప్రయాణీకులతో నిత్యం సేవించబడుతూ ఉండే ఈ కోదండరామస్వామి ఎంతో మహిమగల స్వామిగా భక్తుల హృదయాలలో నిలిచిపోయారు.

1918 ప్రాంతంలో పెద్ద తుఫాను వచ్చి శ్రీ కోదండరామస్వామి దేవాలయంతో పాటు ఇసుకలో పూర్తిగా కప్పబడిపోయి, పై శిఖరం మాత్రం పైకి కన్పించేది. ఆ తుఫాను వల్ల ఆ రేవు అక్కడ మాయమై, మంగినపూడిలో రేవు ఏర్పడింది. ఆనాటినుండి ఈ దేవాలయం మరుగున పడిపోయింది. ఎంతోమంది భక్తుల పూజలు అందుకున్న శ్రీ కోదండరామస్వామి ఆ ఇసుక తిన్నెల్లో కప్పబడిపోయి, 55 సంవత్సరాలు అలాగే వుండిపోయారు. కొంతకాలం తరువాత హిందూ ప్రెస్ సుబ్బారావు గారు ఆ దేవాలయాన్ని బయటకు తీసుకురావాలనే సంకల్పంతో 1973లో భారత స్కౌట్సు అండ్ గైడ్స్ వారి చేత ఇసుక మేటలను త్రవ్వించి దేవాలయాన్ని శుభ్రం చేయించి, భక్తుల దర్శనానికి వీలుగా వుండేట్లు చేశారు. ఆనాటి నుంచి స్వామివారికి ప్రతి నిత్యం ధూప దీప నైవేద్యాలు యథావిధిగా జరుగుతున్నాయి.

ఈ దేవాలయానికి కొద్దిదూరంలో ఒక శివాలయం ఉన్నది. రెండు వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతమంతా పెద్ద భయంకర తుఫానుకి లోనయి, పెదకర అగ్రహారం, చినకర అగ్రహారాల్లోని ప్రజలంతా చనిపోయారు. తర్వాత ఇసుక గుట్టల్లోంచి ఒక శివలింగం స్వయంభువై వెలవడం, తరువాత ఈ దేవాలయం నిర్మాణం జరిగింది. ఆనాడు ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న నవాబుగారు 1600 ఎకరాల భూమిని ఈ దేవాలయానికి మాన్యంగా ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఈ ఆలయం దీనావస్థ స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది.

శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి ఆలయం - మానికొండ

విజయవాడకు దగ్గరలో కంకిపాడు నుంచి ఆరుకిలోమీటర్ల దూరంలో, ఉంగుటూరు మండలంలో ఉన్న మానికొండ గ్రామంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి ఆలయం ఉన్నది. గుడివాడ నుంచి ఇరవై కిలోమీటర్లు, ఉయ్యూరు నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం ఉంటుంది. విజయవాడ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో మానికొండ గ్రామం ఉంది. సుమారు రెండువందల సంవత్సరాల క్రితం గన్నవరం జమిందారు వారి ఆధ్వర్యంలో నిర్మాణమైన ఈ దేవాలయానికి తూర్పున అయిదంతస్థుల గాలి గోపురం అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. ఆనాటి నుండి ఈ రోజు వరకూ ఎన్నో విపత్తులను ఎదుర్కొని ఎలాంటి మరమ్మత్తులూ లేకుండా అద్భుతంగా నిలిచింది. ఎంత దూరంలో ఉన్నవారికైనా ఈ గాలిగోపురం కనిపిస్తుంది. సుమారు వంద సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించబడిన ధ్వజస్తంభము శిథిలం కావడంతో, నాలుగు సంవత్సరాల క్రితం ధ్వజ స్తంభాన్ని పునఃప్రతిష్ఠించడం జరిగింది. ఈ ఆలయంలోని స్వామి స్వయంభువో, ప్రతిష్టమూర్తో స్పష్టంగా తెలియజేసే ఆధారాలు లభ్యం కాలేదు. ఆలయ నిర్మాణం జరిగిన రోజుల్లో స్వామివారిని ఏం కోరుకున్నా తప్పక జరిగేదనీ, అందుకే స్వామి వారిలో శ్రీశైలం మల్లన్న యొక్క అంశ ఉండేదని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ఆలయ ప్రాంగణంలో నూతనంగా విఘ్నేశ్వరస్వామి, ద్వారపాలకులు, నందీశ్వరుడు, వీరభద్రస్వామితో పాటు నవగ్రహాలు కూడా నిర్మించబడ్డాయి. ఇచ్చట వైశాఖ పౌర్ణమికి స్వామి వారి కళ్యాణం, కార్తీకమాసం నెలరోజులు తీర్థపుబిందె, ఆకాశదీపారాధనలు, పౌర్ణమిరోజు జ్వాలాతోరణం, దసరా నవరాత్రి ఉత్సవాలు తొమ్మిదిరోజులు స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ఆనందేశ్వరస్వామి వారి ఆలయం - బేతవోలు

కృష్ణాజిల్లా, మానికొండ నుంచి గుడివాడ వెళ్ళే దారిలో గుడివాడకి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న బేతవోలు గ్రామంలో శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ ఆనందేశ్వరస్వామి వారు కొలువై ఉన్నారు. ఇది చాలా పురాతనమైన ఆలయం. క్రీ.పూ.రెండువేల సంవత్సరాలకు ముందే ఈ ఆలయం నిర్మించబడిందని ఇక్కడ లభించిన పురాతన శాసనాలను బట్టి తెలుస్తోంది. ఈ ఆలయంలో అమ్మవారు లింగాకారంలో ఉండటం ప్రత్యేకత. స్వామివారు అర్ధనారీశ్వర రూపంలో దర్శనమిస్తారు. ఈ ఆలయం శిథిలమై పోవడంతో చాలాకాలం పాటు స్వామి వారి జాడ తెలియరాలేదు. పూర్వము ఈ దేవాలయ నిర్మాణానికి ముందు ఇక్కడ సున్నంగానుగ వుండేది. ఆ గానుగకి

కావలసిన నీటికోసం ఓ బావిని త్రవ్వడానికి ప్రయత్నించగా, ఆ త్రవ్వకంలో ఈ ఆనందేశ్వర స్వామి శివలింగం బయటపడింది. చార్మహల్ ఎస్టేట్ జమీందారు శ్రీకమదన శోభనాద్రి రాయనంగారు ఈ ఆలయాన్ని నిర్మించి శివలింగాన్ని తిరిగి ప్రతిష్ఠ చేశారు. స్వామికి కుడివైపున కుమారస్వామి, ఎడమవైపున వినాయకుడు కొలువై ఉండటం ప్రత్యేకత. స్వామివారి దర్శనార్థం భక్తులు చాలా దూరప్రాంతాల నుంచి వచ్చి, తమ కోర్కెలు నెరవేర్చిన స్వామిగా భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకుంటుంటారు.

శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయం - కౌతవరం

కృష్ణాజిల్లా, గుడివాడ నుంచి గుడ్లవల్లేరు వెళ్ళే దారిలో 21 కిలోమీటర్ల దూరం గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరం గ్రామం. ఇక్కడ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయం ఉన్నది. ఇది చాలా పురాతనమైన ఆలయం. ఈ ఆలయం నిర్మాణం జరిగి సుమారు రెండువేల సంవత్సరాలు పైనే అయిందని తెలియుచున్నది. ప్రస్తుత ఆలయ అర్చకులు 29వ తరం వారని తెలుస్తోంది.

ఈ ఆలయంలోని శ్రీ చెన్నకేశవస్వామి స్వయంభువై వెలిసి, భక్తులను పాలిస్తున్నారు. ఈ ఆలయాన్ని వేంగీదేశపు మహారాజు అయిన శ్రీ రాజరాజనరేంద్రుని తాతగారు నిర్మించినట్లు ఇక్కడ లభించిన శాసనాలను బట్టి తెలుస్తోంది. ఇక్కడ స్వామి మహిమకు నిదర్శనంగా ఓ ఉదంతం చెబుతారు. మంగినపూడిలోని ఓ జాలరి తుఫానులో సముద్రం మీద వేటకు వెళ్లి, తిరిగి రాలేదు. దానితో అతని కుటుంబీకులు స్వామివార్ని దర్శించి తమ కుమారుడు క్షేమంగా తిరిగి వస్తే నూటొక్క కొబ్బరికాయలు కొడతామని మొక్కు కోవడం, అంత తుఫానులోనూ ఆ జాలరి తెల్లవారకముందే క్షేమంగా తీరం చేరుకో వడం జరిగింది. అంత మహిమగల స్వామి ఈ చెన్న కేశవస్వామి.

శ్రీ పార్వతీ సమేత గౌతమేశ్వరస్వామి వారి ఆలయం - కౌతవరం

కౌతవరం గ్రామంలో వున్న మరో పురాతనమైన ఆలయం – శ్రీ పార్వతీ సమేత గౌతమేశ్వర స్వామి వారి ఆలయం. ఇది చాలా పురాతన ఆలయంగా ప్రసిద్ధి. స్వామి వారిని ప్రతిష్ఠ చేసింది గౌతమ మహాముని అని పురాణాలు చెబుతున్నాయి. త్రేతాయుగంలో దక్షిణావనికి ప్రయాణమై వచ్చిన గౌతమమహర్షి తన నిత్యపూజ నిమిత్తమై ఓ బాణ లింగాన్ని తయారుచేసి ఇక్కడ ప్రతిష్ఠ చేసినట్లుగా తెలుస్తోంది. అందుకే స్వామివారిని గౌతమేశ్వర స్వామిగా పిలుస్తారు. ఈ దేవాలయాన్ని సుమారు ఆరువందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లుగా అక్కడ లభ్యమైన చారిత్రక ఆధారాలు, శాసనాలను బట్టి తెలుస్తోంది. చెన్నకేశవస్వామిని దర్శించిన భక్తులు గౌతమేశ్వరస్వామిని దర్శించడం కూడా ఆనవాయితీగా వస్తుంది.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి వారి ఆలయం - విన్నకోట

కృష్ణాజిల్లా, గుడివాడ నుంచి కైకలూరు పోయే దారిలో గుడ్లవల్లేరుకి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో గుడ్లవల్లేరు మండలంలోని విన్నకోట గ్రామం ఉన్నది. ఇక్కడ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయం ఉన్నది. ఇది చాలా పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ప్రాచీనమైన దేవాలయాల్లో శ్రీ జనార్ధనస్వామి ఆలయం ఒకటి. సుమారు అయిదు వందల సంవత్సరాల క్రితం వేంగీ నగరాన్ని రెడ్డిరాజులు పరిపాలిస్తున్న రోజుల్లో ఇక్కడ స్వామి వారిని ప్రతిష్టించినట్లుగా స్థానికుల ద్వారా తెలియుచున్నది.

ఇక్కడే శ్రీ భోగేశ్వరస్వామి వారి ఆలయం కూడా సుమారుగా అదే కాలంలో నిర్మించినట్లుగా తెలియుచున్నది. శ్రీ జనార్ధనస్వామి వారి ఆలయంలోనే శ్రీ ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించడం విశేషం! మహాశివరాత్రి ఉత్సవాలు అతి వైభవంగా జరిపిస్తారు. ముక్కోటి ఏకాదశి, హనుమత్ జయంతి ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామిని దర్శించి తమ మొక్కుబడులను చెల్లించుకుంటారు.

శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం - అమరావతి



గుంటూరుజిల్లాలో కృష్ణానదీ తీరాన గల అమరావతి గ్రామము నందు ఈ అమరేశ్వరుని ఆలయం కలదు. ఇది చాలా ప్రాచీనమైన ఆలయము. నాల్గువైపుల మహోన్నతమైన గోపురాలతో విరాజిల్లే ఆలయం శ్రీ అమరేశ్వర స్వామి వారి నిలయం. చారిత్రాత్మక ప్రసిద్ధ పౌరాణిక పుణ్యస్థలం ఈ అమరావతి. కృష్ణవేణీ నదీ తీరమున త్రినేత్రుడైన స్వామి వారు మూడు గొప్ప ప్రాకారములతో నిర్మించిన మహాక్షేత్రంలో కొలువుదీరి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమరేశ్వరుడుగా కొలువై ఉన్నాడు. ఈ ఆలయానికి నాలుగువైపుల నాలుగు గాలిగోపురములు కలవు. తూర్పు వైపు గాలిగోపురం నుండి ఇరవై గజముల

దూరంలో కృష్ణా ప్రవాహము వద్దకు పోవుటకు దారి కలదు. దక్షిణవైపు గాలిగోపురం ద్వారానే ఎవ్వరైననూ ఆలయం లోపలకు ప్రవేశించవలయును. ఈ ప్రధాన గోపురం ఎదురుగా పెద్దవీధి (రాజమార్గం) ఉన్నది. కృష్ణా నదిలో స్నానమాచరించి శుభ్రమైన వస్త్రం ధరించి అమరేశ్వరమూర్తికి చేతులెత్తి నమస్కారంచేసి, దక్షిణదిక్కు గాలిగోపురం నుండి ప్రదక్షిణ రీతిలో బయలుదేరినచో వరుసగా మనకు ప్రణవేశ్వరుడు, శంకరాచార్యులు, కాశీ విశ్వేశ్వరుడు, ఉమా మహేశ్వరుడు, దత్తాత్రేయుడు, రుద్రపాదములు, జ్వాలాముఖీదేవీ, అగస్త్యేశ్వరుడు, పార్థివేశ్వరుడు, సోమేశ్వరుడు, నాగేశ్వరుడు, మహిషాసురమర్థిని దేవి, కోసలేశ్వరుడు, వీరభద్రుడు మొదలగు దేవతామూర్తుల సాక్షాత్కారం కల్గును.

స్థలపురాణం: పూర్వం తారకుడనే రాక్షసుడొకడుండేవాడు. అతడు శివభక్తుడు. ఆ భక్తితో అతడు శివుని మెప్పించి, వరముగా ఆత్మలింగమును పొందాడు. ఆ ఆత్మ లింగమును ధరించి అతడు బలగర్వితుడై మానవులనేగాక, దేవతలను గూడా హింసించసాగాడు. ఆ హింసలను భరించలేక వారు శివుని వద్దకు వెళ్ళి తమను రక్షించమని కోరారు. వారి ప్రార్థనలను ఆలకించి శివుడు వెంటనే తన కుమారుడైన కుమారస్వామిని పిలిచి నీవు వెళ్ళి తారకాసురుని వధించి, దేవతలను కాపాడమని ఆజ్ఞాపించాడు. తండ్రి ఆజ్ఞానుసారం కుమారస్వామి వెళ్ళి తారకాసురుని ఎదిరించాడు. వారిరువురి మధ్య ఘోర యుద్ధము జరిగింది. ఆ యుద్ధంలో కుమారస్వామి తారకా సురుని మీద ప్రయోగించిన అస్త్రము లన్నియు విఫలమగుచుండగా, కారణమేమిటా యని ఆలోచించాడు. అతనికి ఆత్మలింగం మహిమ వ్యక్తమైనది. వెంటనే అతడు శివుని ప్రార్థించి ఒక దివ్యాస్త్రమును సంధించి తారకాసురుని మీద ప్రయో గించాడు. ఆ అస్త్రము తారకాసురుడు ధరించిన ఆత్మలింగమును అయిదు ముక్కలుగా ఛేదించి, తరువాత వానిని వధించినది. ఆ ఐదు ముక్కలు చెదిరి శివలింగములై అయిదుచోట్ల పడినవి. ఆ శివలింగములు పడినచోట్లు ఆరామాలుగా పేరు గాంచాయి. అందొక ఆరామం అమరావతి. అమరావతి ఆరామమందు పడిన శివలింగమును ఇంద్రుడు తన పాప పరిహారార్థం పూజించి, అచటనే ప్రతిష్ఠించి అచటనొక ఆలయమును కట్టించాడని అది అమరేశ్వరాలయముగా ప్రసిద్ధి గాంచినదని ఆ కథ మనకు తెలియజేయుచున్నది. కొండవీటి రెడ్డి రాజులపై విజయానంతరం 1517లో చారిత్రక ప్రాంతం కృష్ణాతీరమైన అమరావతిని దర్శించిన కృష్ణదేవరాయలు ఇక్కడి అమరేశ్వరునికి నైవేద్య మహాపూజలు నిర్వహించినట్టు, పెదమద్దూరు గ్రామ పంటభూముల్ని ఆలయానికి దానమిచ్చినట్లుగా ఇక్కడ ఉన్న రాజ శాసనం ద్వారా తెలుస్తుంది. ఇక్కడ శ్రీ కృష్ణదేవరాయలు తులాభారం తూగారు. తన బరువుతో సరిసమానమైన బంగారాన్ని పేదలకు పంచిపెట్టినట్టుగా ఆ శాసనంలో ఉంది. అందుకు గుర్తుగా శ్రీ రాయలవారు

నిర్మించిన తులాభారం అనే పేరుగల మండపం, దానిముందు వేయించిన శాసనం నేటికీ ఇక్కడ చెక్కు చెదరకుండా కనిపిస్తాయి. ఆలయంలోని దక్షిణ రెండో ప్రాకారంలో ఈ మండపం ఉంది. కాల క్రమేణా ఇది అమరావతి సంస్థానాధిపతులు శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారి పరిపాలనలోకి వచ్చినది. ఆ సంస్థానాధిపతి పాలనలో ఈ ఆలయము నేటి రూపం వహించి ప్రఖ్యాతి గాంచినది.

ఈ ఆలయం మూడు ప్రాకారాలు కలిగి ఉన్నది. వానిలో 1–2 ప్రాకారాల మధ్య మహిషాసురమర్ధిని, కౌసలేశ్వరస్వామి, వీరభద్రేశ్వరుడు, కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ అమ్మవారు, ప్రణవేశ్వరుడు, దత్తాత్రేయుడు, అమరేశ్వరుడు, జ్వాలాముఖి అమ్మవారు, అగస్త్యేశ్వరుడు, పార్థికేశ్వరుడు, సోమేశ్వరుడు, మొదలైన దేవతామూర్తులుండగా 2–3 ప్రాకారాల మధ్య విఘ్నేశ్వరుడు, కృష్ణదేవరాయల తులాభారమండపము, నాగమండపము, కాలభైరవుడు, కుమారస్వామి, ఆంజనేయస్వామి, యాగశాల, నవ గ్రహాలు మొదలగునవి మనము దర్శించవచ్చును. ఇక మూడవ ప్రాకారము మధ్య భాగంలో అమరేశ్వరాలయం కలదు. తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయం గర్భగృహం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. వానిలో గర్భాలయము నందు అమరేశ్వరస్వామివారు దర్శనమీయగా, మండపంలో స్వామివారికి ఎదురుగా, రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారి కాంస్య విగ్రహము, మండపం ఎడమభాగాన బాలచాముండేశ్వరీ అమ్మవారు, కుడి భాగాన కాళహస్తీశ్వరుడు, ముందుభాగాన సూర్యభగవానుడు దర్శనమిస్తారు. అదేవిధంగా ఆవరణలో నైరుతిమూల శ్రీమల్లేశ్వర స్వామి, వాయువ్యమూల శ్రీకాశీ విశ్వేశ్వరుడు, ఈశాన్యమూల వేణు గోపాలస్వామి చండీశ్వరుడు దక్షిణభాగాన కాళహస్తీశ్వరుడు దర్శనమిస్తారు.



అమరావతి ఆలయంలో శివలింగం చాలా పొడవుగా ఉంటుంది. దీనికి ప్రాచుర్యంలో ఉన్న కథనం ప్రకారం ఈ శివలింగం పెరుగుతూ ఉండేదట. అందువలన ఎప్పటికప్పుడు గుడిని పెంచవలసి వస్తుండేది. చివరకు విసుగు చెందిన అర్చకులలో వొకరు స్వామిపై ఒక మేకు కొట్టారు. అంతటితో శివలింగం పెరుగుదల ఆగిపోయినది. ఈ కథనానికి నిదర్శనంగా తెల్లని శివ లింగంపై ఎర్రని (నెత్తుటి) చారికలను కూడా చూపిస్తారు. అవి మేకు కొట్టిన పుడు కారిన నెత్తుటి చారికలన్నమాట. ఈ లింగం 3 అడుగుల చుట్టుకొలత 60 అడుగుల ఎత్తు ఉంటుంది. ప్రస్తుతం పై అంతస్తులో శివలింగ భాగాన్ని మాత్రమే భక్తులు దర్శించుకోవటానికి అనుమతిస్తారు.

శ్రీ పానకాల నరసింహస్వామి - మంగళగిరి



గుంటూరు జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాలలో మంగళగిరి శ్రీ పానకాల నరసింహ స్వామివారి దేవాలయం ఒకటి. ఇది విజయవాడ శ్రీ కనకదుర్గ క్షేత్రమునకు 8 కి.మీ. దూరంలో, గుంటూరు–విజయవాడ జాతీయ రహదారిపై గుంటూరుకు 20 కి.మీ. దూరంలో ఉన్నది.

ఇక్కడ ఉన్న కొండపైన శ్రీ పానకాల నరసింహస్వామి వేంచేసియున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే భక్తాగ్రేసరుడుగా శ్రీ నరసింహ స్వరూపంలో సేవలందుకొనుచున్న ఈ నారాయణునకు పానకమంటే ఎంతోప్రీతి. సరాసరి తన నోటిలో పానకంలో సగపాలు ఈ స్వామి ప్రసాద చిహ్నంగా భక్తులకు అనుగ్రహిస్తూ ఉంటారు. స్వామి త్రాగుచున్నట్లు "గుట గుట" శబ్దం వినిపిస్తుంది. ఈ శబ్దం ఆగేసరికి పానకం వెలికి చిమ్ముతుంది. ఈ అద్భుతం రోజుకు ఎప్పుడో ఒకసారి మాత్రమే కాదు, పానకం సమర్పించిన ప్రతీ భక్తునికి జరుగుతూనే ఉంటుంది. ప్రతి నిత్యం బిందెల కొలది పానకం సమర్పించినా ఒక్క చీమ అయినా దరిదాపులలో ఎక్కడా కనిపించదు. ఈవిశేషంవల్లనేఈదైవం "పానకాల స్వామి"గా ప్రసిద్ధుడయ్యాడు. ఈ క్షేత్ర చరిత్ర బ్రహ్మవైవర్త పురాణంలో ఉన్నది. "మంగళగిరి" అంటే "శుభప్రదమైన కొండ" అని అర్థం. ఇది తూర్పు కనుమల పర్వతపంక్తుల వరుసలోదే. దూరానికి ఈ కొండ పడుకొని ఉన్న ఏనుగు ఆకారంలో కనబడుతుంది. ఈ స్వామికి కృతయుగంలో తేనె, త్రేతాయుగంలో నెయ్యి, ద్వాపర యుగంలో పాలు, కలియుగంలో పానకం నైవేద్యంగా సమర్పిస్తున్నారు. ఇప్పటికీ శంఖంతో పానకం స్వామి నోటిలో పోస్తారు. అందులో సగము స్వీకరించి సగము భక్తులకు ప్రసాదముగా అనుగ్రహిస్తాడు. ఈకొండ ఏనుగు ఆకారంలో ఉంటుంది కనుక ఈ గుడి సరిగా ఆ ఏనుగు నోరువలె ఉంటుంది. ఈ పానకం నోటిలో పోయటమూ, గుటగుట అనే శబ్దము రావడం విశేషం. పానకాల నరసింహస్వామిముఖంమాత్రం అదే కొండలోనే చెక్కబడి ఉండటం మరీ విచిత్రం. ఇంకొక కథనం ప్రకారం త్రేతాయుగంలో శ్రీరామచంద్ర మూర్తి ఈ కొండను సందర్శించాడట. అందువల్ల దీనికి 'తోతాద్రి' అని పేరు కూడా ఉన్నట్లు చెబుతారు.

కృతయుగంలో పాలసముద్రం చిలికినప్పుడు అందులో నుండి శ్రీ మహాలక్ష్మి దేవి అవతరించింది. దేవతలు అన్ని పుణ్యనదుల తీర్థములు తెచ్చి ఒక పుష్కరిణిని నిర్మించారు. శ్రీమహాలక్ష్మి ఆ పుష్కరిణిలో మునిగి శ్రీమన్నారాయణునికి తనను సమర్పించుకున్నది. ఈ పుష్కరిణి మంగళగిరిలో ఉన్నదంటారు. నేటికీ దానిని "లక్ష్మి పుష్కరిణి" అనే పిలుస్తున్నారు. కొండ దిగువన మరొక దేవాలయం ఉన్నది. అది యుధిష్ఠిరునిచే ప్రతిష్టించబడింది అంటారు. పైన ఉన్న లక్ష్మి నరసింహస్వామి వారినే కొండ దిగువున యుధిష్ఠరుడు ప్రతిష్టించాడు. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి. శ్రీరామచంద్రునితో వైకుంఠానికి బయలుదేరిన ఆంజనేయస్వామిని లోక కళ్యాణార్థమై మంగళగిరిలో ఉండమని ఆయన ఆదేశించాడుట! శ్రీ చైతన్య మహా ప్రభువు (క్రీ.శ.1312)లో ఈ ఆలయాన్ని దర్శించినట్లు చెబుతారు. అందుకు నిదర్శనంగా ఆయన పాదచిహ్నాలు, ఆయనపై చెప్పబడిన శ్లోకము నేడు కూడా ఈ ఆలయంలో కానవస్తాయి. శ్రీకృష్ణదేవరాయల శాసనం ఒకటి ఉంది. ఈ శాసనం ద్వారా శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని దర్శించినట్టు మనకు తెలుస్తుంది.

ఆలయానికి తూర్పున బ్రహ్మాండమైన గాలిగోపురం ఉన్నది. దానిని 1807-09 కాలంలో అమరావతి ప్రభువు శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారు కట్టించారు. ఈ గాలిగోపురం రాష్ట్రంలోనే అత్యంత ఎత్తయినది. ఇది 11 అంతస్తులతో 157 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఆ ప్రక్కనే ప్రాచీనమైన ఒక రథం ఉంది. భారత భాగవత రామాయణ గాథలు దానిమీద అద్భుతమైన దారుశిల్పంలో ఉన్నాయి. ఫాల్గుణమాసంలో యిచ్చట 12 రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగును. వైకుంఠఏకాదశి, శ్రీరామ నవమి, హనుమజ్జయంతి, నరసింహజ్జయంతి మొదలగు పుణ్యతిథులలో ప్రత్యేక పూజలు అభిషేకాలు ఇచ్చట జరుగును. పౌరాణికంగా, చారిత్రకంగా ప్రసిద్ధమైన మంగళగిరి ఆంధ్రదేశంలోని ప్రసిద్ధ దివ్యక్షేత్రాలలో ఒకటిగా ఘనంగా వెలుగొందుతుంది.

ఈ క్షేత్రము గురించి తెలిపే కథ ఈ విధంగా ఉంది. పూర్వం సముచియనే రాక్షసుడొక డుండేవాడట. అతడు బ్రహ్మను గురించి తపం చేసి ఎన్నో వరములు పొందాడు. ఆ వరాల గర్వంతో అతడు భక్తులను, ఋషులను పీడించుచుండగా ఇంద్రుడు కోపించి తన చక్రమును ప్రయోగించగా, అతడు మంగళగిరి గుహలో దాగియుండి చక్రాఘాతమునుండి తప్పించుకొన్నాడు. అందుచేత దేవతలందరు, తమను కాపాడ మని శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. వారి ప్రార్థనలను విని విష్ణువు ఉగ్రరూపుడై చక్రం ధరించి, గుహలో దాగియున్న సముచిని సంహరించాడట! తరువాత ఆ ఉగ్రరూపంతోనే విష్ణువు ఆ గుహ యందు అర్చారూపం ధరించియుండగా, దేవతలు ఆయనకు అమృతము ఇచ్చి శాంతింపజేయగా, శ్రీమహావిష్ణువు తనకు దేవతలు ఇచ్చిన



అమృతములో కొంత త్రాగి, మిగిలిన దానిని బ్రహ్మాది దేవతలకు ఇచ్చినాడని చెప్పుచుం దురు. ఈ విధముగా కృతయుగంలో అమృతము త్రాగిన విష్ణువు త్రేతా యుగములో ఆవునేతిని, ద్వాపర యుగములో ఆవుపాలను త్రాగి సంతోషించి, ఇప్పుడు కలియుగ మున భక్తులు సమర్పించే బెల్లం పానకమును త్రాగుచు సంతృప్తి చెందుచున్నాడని అందు కొంత పానకమును తిరిగి భక్తులకు ఇచ్చుచున్నాడని ఈ విధంగా పానకం త్రాగుచుండుటచే ఆ విష్ణువు కలియుగాన పానకాల లక్ష్మీనరసింహు డన్న పేరుతో ప్రసిద్ధి గాంచాడని ఈ కథ మనకు తెలియజేస్తుంది.

రెండవ ఆలయం పర్వతపాద భాగమందున్న ఆలయము తూర్పు ముఖము కలిగియున్నది. ఆ ఆలయం గర్భాలయం, అంతరాలయం మండపం అను మూడు భాగాలు కలిగి ఉన్నది. వానిలో గర్భగృహమందు రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మి నరసింహస్వామియు, అంతరాలయమున స్వామివారి ఊయల, ఉత్సవమూర్తులు దర్శనమీయుచుందురు. తూర్పుదిశయందు జగద్విఖ్యాతమైన గాలిగోపురం కలదు. ఈ ప్రాకారము అంటుకొని చిన్నపెద్ద కట్టడములెన్నియో ఉన్నాయి. వానిలో దక్షిణ ప్రాకారము ఆనుకొని వంటశాల, శ్రీరామక్రతు స్ధంభము, రామాలయం, అద్దాల మహలు మొదలగునవి ఉండగా, పడమర ప్రాకారము ఆనుకొని కొఠాయి మండ పము, మడిమండపము కలవు. అదేవిధముగా ఉత్తర ప్రాకారమంటుకొని యాగశాల ఉన్నది. ఈ ఆలయమునందు గర్భగుడిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఎడమ తొడమీద కూర్చొన్న రాజ్యలక్ష్మీ అమ్మవారు కనిపిస్తారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేకముగా దేవాలయ ఆవరణలో ఉత్తరభాగాన ఒక చిన్న ఆలయం కలదు. అచట రాజ్యలక్ష్మీ అమ్మవారిని భక్తులు ప్రత్యేకముగా భక్తిశ్రద్ధలతో ఆరాధించుచుందురు.

గంగా భ్రమరాంబికా సమేత శ్రీ మల్లేశ్వరాలయం - మంగళగిరి

ఇది గుంటూరుజిల్లాలోని మంగళగిరిలో కలదు. ఇది ప్రాచీనమైన ఆలయం. తూర్పు ముఖముగా ఉన్న ఈ ఆలయమందు గర్భగృహంలో మల్లేశ్వరుడు భక్తులకు దర్శన మిస్తుంటాడు. ఇంకా ఈ ఆలయంలో పార్వతీదేవి బాలసుబ్రహ్మణ్యేశ్వరుడు, బాల గణపతి, ఆంజనేయస్వామి మొదలగు దేవతామూర్తులు ఉన్నారు. ఈ ఆలయంలో నవగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. ఈ ఆలయమునందు ప్రతిరోజు అర్చనలు, ప్రత్యేక పూజలతో పాటు, ఆరుద్రనక్షత్ర పూజ, దసరా ఉత్సవాలు, వైకుంఠఏకాదశి ఉత్సవము, సంక్రాంతినాడు జరిపే పారువేట ఉత్సవము, బ్రహ్మోత్సవాలు మొదలగునవి అత్యంత వైభవముగా, అంగరంగ వైభోగముగా, కన్నులపండువగా జరుగును.

శ్రీ త్రికూటేశ్వరస్వామి -కోటప్పకొండ



గుంటూరుజిల్లా నరసరావుపేటకు 10 కి.మీ. దూరంలో త్రికూటాద్రి పర్వతం కలదు. దీనిని కోటప్పకొండ అనీ, 'త్రికూటాద్రి' అని కూడా అంటారు. ఈ త్రికూటా చలమును ఏ దిశలో చూసినను మూడు శిఖరములు స్పష్ట ముగా కనిపించును. ఈ పర్వతముపై గల స్వామివారిపేరు త్రికూటేశ్వరుడు. దీని చుట్టుకొలత సుమారు 9 కి.మీ. 'అడుగు తక్కువ–ఆమడ' అను వాడుక గలదు. బ్రహ్మశిఖరము, విష్ణుశిఖరము, రుద్రశిఖరము అను మూడు పర్వత శిఖరములు ఉండుట వలన దీనిని త్రికూటాద్రి అని పిలువబడినది. కోటేశ్వరస్వామి ఆలయము విష్ణుశిఖరముపై నున్నది. ఆలయ మునకు దగ్గర 'పాపవినాశనం' అను తటాకము కలదు. ఈ కొండకు దక్షిణముగా 'ఓగేరు' నది ప్రవహించుచున్నది. ఈ కొండ దిగువభాగాన 'బొచ్చుకోటయ్య'గుడి కలదు. భక్తులు ఇక్కడనే తలనీలాలు సమర్పిస్తారు. శివరాత్రి పర్వదినాన భక్తులు తమ తమ పిల్లలను అక్కడ ఉన్న ఎత్తైన ధ్వజస్తంభమునకు కట్టి వారివారి మ్రొక్కులు తీర్చుకొంటారు. త్రికూటపర్వతంపై త్రికూటేశ్వరుని దేవాలయ శిఖరము మూడు భాగాలుగా ఉండేది. ఈ క్షేత్రం మొదటి కొండపై ముసలికోటయ్య గారి గుడి ఉంటుంది. ప్రస్తుతం ఇది శిధిలావస్థలో ఉంది. రెండవ కొండపై శ్రీ త్రికోటేశ్వరస్వామి

వారి దేవాలయము కలదు. ఇక్కడ ఒక పెద్దపుట్ట, నవగ్రహ మండపము, ధ్యాన మందిరము ఉన్నాయి. మూడవ భాగమైన కొండ క్రింద బొచ్చుకోటయ్య గారి మందిరము మరియు కళ్యాణకట్ట, సిద్ధి వినాయక మందిరములు కలవు. కొండపైన ఉన్న స్వామి త్రికూటేశ్వరుడు. కొండ క్రిందిభాగంలో నీలకంఠేశ్వర ప్రసన్న కోటేశ్వర ఆలయము కలదు. దక్షయజ్ఞంలో సతీదేవి మరణానంతరం వియోగబాధలో ఉండగా ఇచట వెలిసినారు ఇక్కడి స్వామివారు.


1584 అడుగుల ఎత్తులో ఉన్న కోటప్ప కొండ శైవ క్షేత్రంగా కీర్తి పొందింది. ఇక్కడ 687 అడుగుల ఎత్తున లింగ ఆకారంలో కోటేశ్వర నామంతో శివుని గుడి ఉంది. కొండపై నుండి దేవాలయానికి చేరుకోవటానికి 703 మెట్లు గల మార్గం కలదు. ఈ మెట్లమార్గాన్ని క్రీ.శ.1761లో ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న శ్రీ రాజామల్‌రాజు గుండారాయుల గారిచే నిర్మించబడింది. ఈ దేవాలయానికి చేరుకోవడానికి 4.5 కి.మీ. పొడవు గల ఘాట్‌రోడ్ ఉంది. దీనిని 1998-2000 సంవత్సరంలో నిర్మించారు. ఈ ప్రధాన మండపంలో స్వామికి ఎదురుగా నందీశ్వరుడు ఒక ప్రక్క, వినాయకుడు మరొక ప్రక్క కుమారస్వామి, మధ్యలో మేధా దక్షిణామూర్తి, ఎడమప్రక్క పద్మాసనం మీద ధ్యానములో నిమగ్నమై ఉన్న శివుడి విగ్రహంగల "ధ్యానమందిరం" అనే మందిరం ఉంది.

స్థలపురాణం : సతీవియోగం తర్వాత పరమేశ్వరుడు పిచ్చివాడై ముల్లోకాలు తిరుగుతుండగా ఆ శివుడ్ని ఆకర్షించి, ఆశ్రయమిచ్చి, ధ్యాననిమగ్నుడ్ని గావించిన పర్వతమే ఈ త్రికూటపర్వతం. ఈ క్షేత్రం మీద శివుడు తపస్సు చేస్తుండగా శాలంకయ్య అనే రైతు తన పశువులను మేపుతూ కొండపైకి శివుడు తపస్సు చేసే ప్రాంతానికి రావటంతో అతనికి యోగి రూపంలో ఉన్న శివుడు కనిపించాడు. శివుడికి భక్తితో నమస్కరించి తన దగ్గర ఉన్న పండ్లను స్వామికి సమర్పించాడు. ఒకనాడు శాలంకయ్య శివుని వద్దకు వచ్చి "తన యింటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించమని" వేడుకున్నాడు. అప్పుడు స్వామి "అలాగే వస్తాను" అని మాట ఇచ్చారు.

కోటప్పకొండకు దిగువన దక్షిణమువైపు 'కొండకావూరు' అను ఒక చిన్న గ్రామము కలదు. అచ్చట నంద, కుందారి అను యాదవ దంపతులు నివసిస్తూ ఉండేవారు. వారికి 'ఆనందవల్లి' అను ఒక కుమార్తె కలదు. ఆమె గొప్ప శివభక్తురాలు. ఒకసారి గొల్లభామ శివుడ్ని సేవించడానికి పాలను తీసుకెళ్తూ అలుపు వల్ల తట్టను, పాల కుండలను ఒక గట్టు మీద ఉంచి సమీపంలో ఉన్న చెట్టు పూలను కోస్తూ ఉండగా ఒక కాకి వచ్చి పాలకుండలపై వ్రాలి పాలను ఒలకపోయటంతో అది చూచి గొల్లభామ కోపంతో "ఈ ప్రాం తంలో కాకులు ఉండ కూడదు" అని శపించింది. ఆనాటి నుండి ఈ కొండపైకి కాకులురావు. ప్రతిరోజు తన స్నేహితులతో కలసి రుద్ర శిఖరము పైకి వెళ్ళి స్వామి వారికి అర్చన చేసి వచ్చేది. పరమేశ్వరుడు ఆ

గొల్లభామ భక్తిని పరీక్షించుటకు యోగశక్తిచే ఆమెను గర్భవతిగా చేసాడు. అయిననూ ప్రతిరోజూ శిఖరముపైకి వెళ్ళి పూజ చేయుట మానలేదు. గర్భవతియైన ఆనందవల్లి అనే ఆ గొల్లభామ “కొండకు రాలేకపోతున్నాను తండ్రీ, నీవే క్రిందకు రా!” అని శివుడ్ని వేడుకొనగా, ఆమె మొర విని శివుడు గొల్లభామతో “అమ్మా నేను క్రిందకు దిగునంతవరకు నీవు వెనుతిరిగి చూడరాదు” అని అనగా “సరే” అంటూ ఆ గొల్లభామ ముందుకు నడుచుకుంటూ పోతూ ఉండగా, స్వామి ఆమెను అనుసరించాడు. స్వామి పదఘాటికి కొండలు పగిలి భయానకం కలిగించగా, ఆ గొల్లభామ వెనుకకు తిరిగి చూచినది. ఆమెను చూడగానే పరమశివుడు “లింగరూపంగా మారాడు. ఆ గొల్లభామ “శిల” రూపంగా మారినది. ఆ సమయంలో శాలంకయ్య “స్వామి ఆతిథ్యానికి” ఇంకా రాలేదని కొండమీదకు రాగా ఈ దృశ్యం కనపడింది. శాలంకయ్య ఆశ్చర్యపోయి చూస్తూ విలపిస్తుండగా, శివలింగం నుండి ఈ కొండ క్రిందకు కోటి ప్రభలు ఎపుడు తరలి వస్తాయో, అపుడు నేను కొండదిగి వస్తాను” అనే మాటలు వినిపించాయి. స్వామివారి మాటలు విన్న శాలంకయ్య తన గ్రామం అయిన యలమందకు వచ్చి భక్తి శ్రద్ధలతో తను ఒక ప్రభను తయారుచేసి, దాని గురించి ప్రజలకు కూడా వివరించి, “మీరూ ప్రభలు కట్టుకొని స్వామి దగ్గరకు రమ్మని” చెప్పెను. అప్పటి నుండి ప్రభలు కట్టుకొని ఆ ప్రభతోపాటే కొండకు భక్తులు వచ్చే ఆచారం ఇచ్చట ప్రారంభమైనది.

గొల్లభామ ఆనందవల్లికి కూడా ఆలయం ఉన్నది. ఈ ఆలయము, స్వామి వారి ఆలయము ఈ రెండూ శాలంకయ్య నిర్మించారు. శాలంకయ్య అమ్మవారి ఆలయం కట్టించాలని అనుకున్నాడు కాని స్వామివారు శాలంకయ్య కలలోకి వచ్చి “సతీదేవి వియోగంలో ఉన్నవాడిని, ఆమెకు గుడి కట్టించవద్దు” అని చెప్పుట వలన అమ్మవారి గుడి కట్టించలేదు. అందువలన కోటప్పకొండపై స్వామివారికి కళ్యాణోత్సవాలు జరుగవు.



ఈ త్రికూటేశ్వరుడు బ్రహ్మచారి. అందుచే అతడొక్కడే ఇచట ఆరాధనలందుకొనుచున్నాడు. ఈ పరమేశ్వరుడు బ్రహ్మచారి కనుక ఇతనిని అర్చించువారు కూడా బ్రహ్మచారులుగానే ఉండ వలయునన్న నియమం ఇచ్చట కలదు. కనుక ఆ అర్చకులు వరుస ప్రకారం స్వామిని ఆరాధించు కాలంలో బ్రహ్మచారులుగా వ్యవహరిస్తారు. ఈ స్వామివారికి ఇచట నిత్యపూజలతోపాటు ప్రత్యేక పూజలేకాక, అనేక ఉత్సవాలు జరుపుచుందురు. వానిలో మహాశివరాత్రి ఉత్సవము చాలా ముఖ్యమైనది. ఆ రోజు కోటప్ప కొండ తిరునాళ్ళు చాలా వైభవంగా జరుగును. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రముఖంగా జరిగే జాతర. విద్యుత్ బల్బులతో అలంకరించిన ప్రభలు దూర ప్రాంతాలనుండి ఇచ్చటకు వచ్చి త్రికూటేశ్వర స్వామివారి ఆశీస్సులు తీసుకొంటాయి.

శ్రీ సాయిబాబా మందిరం - కోటప్పకొండ



గుంటూరుజిల్లా, కోటప్పకొండలో శ్రీ సాయిబాబా మందిరం ఉన్నది. ఇది కోటప్పకొండ స్వామి కొండప్రాంతాన, 2 ఎకరాల స్థలంలో నిర్మించబడినది. 25 సంవత్సరాలుగా కోటప్పకొండలోనూ, పరిసర గ్రామాలలోనూ ఊరూరా తిరిగి యోగవిద్యను నేర్పుతూ, మానవతా విలువలను, ఆరోగ్య సూత్రాలను, పవిత్రజీవనాన్ని ప్రబోధిస్తున్న శివకేశవగురువు భక్తుల సహకారంతో, షిరిడిసాయి సంకల్పబలంతో 2008, మార్చి 22న ఆలయంలో సాయినాథుని విగ్రహ ప్రతిష్టాపన జరిపించారు. స్వల్పకాలంలో ఆలయం వైభవాన్ని సంతరించుకొంది. సాయిచిత్రపటం ప్రతిష్టించేందుకు చీరాల నుండి బస్సులో తెస్తూ, పటాన్ని బస్సులోనే మరిచిపోయినా, హైదరాబాద్‌లో ఒక ఐ.ఏ.యస్ అధికారి కుమార్ ఐ.స్నిగ్ధ కలలో కనబడి బాబావారి ఆదేశం మేరకు అక్కడి నుండి పటం తరలిరావడం ఈ ఆలయం యొక్క తొలి లీలా విశేషంగా చెబుతారు. 1100 కి.మీ. పాదయాత్ర చేసి ధుని నెలకొల్పిన పుణ్యస్థలంగా ప్రసిద్ధిచెందింది.



రహదారి స్వాగతద్వారం పైభాగాన మధ్యలో అభయహస్తంతో ఆసీనుడైన పరమేశ్వరుడు, కుడి, ఎడమలవైపున సాయి, దత్తాత్రేయ మూర్తులు దర్శనమిస్తాయి. ఆలయ ప్రవేశ ద్వారం పైన మధ్యలో ఆసీనుడైన సాయి బాబామూర్తి దర్శనమిస్తుంది. ఆలయంలోపల ముందుగా నందీశ్వరుడు దర్శనమిస్తాడు. మందిరంలో సాయిబాబా ప్రసన్నవదనంతో దర్శనమిస్తాడు. ఈ విగ్రహం ముందు సాయిబాబా ఉత్సవ విగ్రహం ఉన్నది. సాయిబాబా విగ్రహానికి ఇరువైపులా వినాయ కుడు, దత్తాత్రేయుల పాలరాతిమూర్తులు నెలకొని ఉన్నారు. ఈ ప్రాంగణంలో హను మత్ సమేత సీతారామలక్ష్మణులు, పరమేశ్వరుడు, శ్రీ వేణుగోపాలస్వామి, సరస్వతీదేవి సన్నిధానాలు, ద్వారకామాయి ఉన్నాయి. ఈ ఆలయంలో ప్రతినిత్యం హారతులు, అభిషేకాలు, భజనలు, పూజాది కార్యక్రమాలు, ప్రతి గురువారం, పండుగ పర్వ దినాలలో పూజలు, యజ్ఞయాగాదులు జరుగుతాయి.


శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం - కాకుమాను




గుంటూరుజిల్లా, కాకుమాను మండలం,కాకుమాను గ్రామం నడిబొడ్డున శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఉన్నది. ఈఆలయంఅతిప్రాచీనమైనదిగా ఎంతో ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయాన్ని చోళుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తుంది. పురాతన దేవాలయం శిధిలమ వటంతో ఈ ఆలయాన్ని 2005వ సంవత్సరంలో 3వసారి పునర్నిర్మించారు. ఈ ఆలయంలో గల చెన్నకేశవ స్వామి భక్తులకోరికలను తీర్చే దైవంగా ప్రసిద్ధిచెందాడు. గర్భాలయంలో శ్రీశ్రీదేవీ, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి సర్వాలంకార భూషితుడై భక్తులకు దర్శనమిస్తాడు. ఆలయ ప్రాంగణంలో కుడివైపు శ్రీ వేంకటేశ్వరస్వామి, ఎడమవైపు శ్రీవేణుగోపాలస్వామివారు, ఎదురుగా గరుడాళ్వార్‌లు భక్తులకు దర్శనమిస్తారు. ఉపాలయాలుగా శ్రీసువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి శ్రీసాయినాథుడు, శ్రీలక్ష్మీగణపతి, రాహువుకేతువు సమేత నాగబల దేవతలు భక్తులకు దర్శనమిస్తారు. ఈఆలయంలో వైఖానస సాంప్రదాయఆగమనంప్రకారం నిత్యపూజలతో పాటూ, ప్రతి గురువారం, శుక్రవారం, శనివారం ప్రత్యేక పూజలు, పండుగ పర్వదినాలలో విశేష పూజలు, ప్రతీసంవత్సరం వైశాఖ ఆశ్వీయుజ మాసములందు పౌర్ణమియందు స్వామివారికి రెండు తిరుకళ్యాణములు, బ్రహ్మోత్సవాలు, హనుమజ్జయంతి, సాయి పుణ్యతిథి, వినాయకచవితి మొదలగు ఉత్సవాలు అతి వైభవంగా నిర్వహిస్తారు.

శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి - పెదకాకాని

ఈ ఆలయం గుంటూరునకు 8 కి.మీ. దూరంలో, విజయ వాడ–గుంటూరు ఐదవ నంబరు రహదారిలో ప్రధాన రహదారికి అతి చేరువగా ఉన్నది. ఈ మహా పుణ్యక్షేత్రంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి




వార్లు కొలువుదీరి ఉన్నారు. ఈఆలయంను చిట్టెరసు మంత్రి కట్టించారని చెప్పుచుందురు. ఈ క్షేత్రములో బారసాల, నామకరణము, అన్నప్రాసన, పుట్టువెంట్రు కలు, చెవులుకుట్టుటవంటి బాల్యసంస్కార ప్రక్రియలకు ప్రసిద్ధి పొందినది. శివాలయ మైనను వివాహ,ఉపనయనము మొదలైన శుభకార్యములను కూడా ఇచ్చట చేసుకొంటారు. కొత్త దంపతులు కొంగుముడి వేసుకొని స్వామివారిని దర్శించుకొని దేవాలయ ఆవరణలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని, శ్రీ వినాయకుని సేవించుకొంటారు. నాగదేవతలకు, నవగ్రహాలకు కూడా పూజ చేస్తారు. ఆ సమయంలో కొత్త దంపతుల మనసులో ఉన్న మధురమైన కోరిక ఏమిటో ఆమల్లేశ్వరునకు, ఇద్దరు బిడ్డల ముద్దుల తల్లి అయిన ఆ భ్రమరాంబాదేవికి తెలుసు. అందుకే ఆ నవదంపతులు అమ్మానాన్నలై, తమ పాపలతో మల్లన్న దర్శనానికివచ్చి ఈస్వామి సమక్షంలోనే తమ బిడ్డలకు నామ సంస్కరణాది కార్యాలు చేస్తారు. ఇదీ ఈ క్షేత్ర మహిమగా భక్తులు నమ్ముతారు. శ్రీకృష్ణదేవరాయలు ఈస్వామిని దర్శించుకొని, సేవించిన అనుగ్రహంతోనే సంతానవంతు డయ్యాడని, అందువల్లనే తన కుమారునకు "సదాశివరాయలు" అని పేరు పెట్టుకున్నాడని స్థలపురాణంలో రాయబడి ఉంది.

ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మహాత్యం కూడా ఎన్నదగినదని అగస్త్య మహర్షి గుర్తించాడు. ఈ ఆలయంలో ప్రధాన ఆలయంతో పాటు గణపతి, భద్రకాళి, వీరభద్రుడు, నందీశ్వరుడు, ముఖమండపంలోని పెద్ద నందీశ్వరుడు పూజలందుకుంటు న్నారు. దక్షిణ భాగంలో మహిషాసురమర్దని, ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులైన నందికేశుడు మహాకాలుల విగ్ర హాలు ఉన్నాయి. కాకానికి సిద్ధయోగ సమాజమనే పేరు కూడా ఉంది. పరమేశ్వరుడు ఒకసారి సంచారం చేస్తూ మంగళగిరికి, గుంటూరుకు మధ్యగల సుందరవనాన్ని చూసి పరవశించి ఆ వనంలో కొంతకాలం నివసించాలన్న కోరికతో అక్కడే ఉండిపోయాడు. మహర్షుల సేవలందుకుంటూ, భక్తులను కాపాడుతూ ఉన్నాడు. ఎంతోమంది సిద్ధయోగులు పరమేశ్వరుని సేవించి తపస్సు చేత బిల్వార్చన చేత, నృత్య గీతాలతోను స్వామివారిని ఆనందింపచేసి స్వామి కృపను పొందారు. అందువల్ల సిద్ధయోగ సమాజమన్న పేరు వచ్చింది. దానిని రుజువు చేస్తూ నేటికీ స్వామివారికి ప్రభలు కట్టి, మేళతాళాలతో, నృత్య గీతాలతో స్వామివారిని ప్రసన్నం చేసుకుంటారు. పరమేశ్వరుడీ విధంగా ఇక్కడే ఉండిపోవడంతో భ్రమరాంబ మల్లి కార్జునుని జాడను కనుక్కుని రమ్మని తన చెలికత్తెలయిన జయ విజయులను పంపింది. వారు ఇక్కడకు చేరుకుని శివునకు ఈ సంగతి తెలిపారు. మల్లికార్జునుడు వెంటనే శ్రీశైలం చేరుకున్నాడు. కానీ కాకానిపైగల ప్రీతితో స్వయంభువుగా అక్కడ వెలిశాడు.



ప్రాచీనమైన ఈ ఆలయం ఉత్తరముఖంగా మూడు భాగాలుగాఉంది. ఈ ఆలయము నందు గర్భాలయంలో శ్రీమల్లేశ్వరస్వామి, ఆయనకు ఎడమభాగాన భ్రమరాంబ అమ్మవారు, కుడిభాగాన భద్రకాళీ సమేత శ్రీవీరభద్రేశ్వరుడు, మండపంలో నందీశ్వరుడు మనకు దర్శనమిస్తారు. ఈ ఆలయము ఆవరణలో వెనుకవైపున రావిచెట్టు, సర్పదేవతలు, మొదలగు దేవతలు, ముందు వైపున అయిదు అంతస్తులుగల ముఖద్వార గాలిగోపురము మనకు కన్పిస్తాయి. ఇచట గల శ్రీమల్లేశ్వరునకు సాంబశివుడు అనే మరొక పేరు కలదు. దేవాలయ తూర్పు భాగాన భరద్వాజ మహామునిచే నిర్మింపబడిన బావి ఒకటి కలదు. మహర్షి పుంగవులు సమస్త తీర్థాల నుండి పవిత్ర జలాన్ని సేకరించి ఈ బావిలో ఉంచారు. భరద్వాజ ముని యజ్ఞద్రవ్యాన్ని ఈ బావిలో వదలినందున దీనికి యజ్ఞాలబావి అని పేరు వచ్చినట్టుగా చెప్పుదురు.

స్థలపురాణం : శ్రీ భరద్వాజ మహాముని ఒకప్పుడు భూప్రదక్షిణ చేస్తూ సర్వతీర్థంబుల లోని జలం సేకరిస్తూ ఉన్న సమయంలో ఒకనాడు ఈ కాకాని మహాక్షేత్రమునకు వచ్చాడు. ఇచ్చట ఉన్న శివలింగమును చూచి మహిమాన్వితమైందిగా గుర్తించి ఆ మహేశ్వరుని ఆరాధించాడు. ఆ మహర్షికి శివానుగ్రహం వలన ఒక యజ్ఞము చేయాలని సంకల్పము కలిగినది. వెంటనే ఆయన యజ్ఞమునకు కావలసిన వాటిని సమకూర్చుకొని, యజ్ఞశాలను నిర్మింపజేసి, అందులో వేదికలను ఏర్పాటు చేసి, కొంతమంది ఋషిపుంగవులను పిలిపించి ఒక శుభముహూర్తంలో యజ్ఞసంకల్పము చేసి, సర్వాలంకృతమైన యజ్ఞశాలలో అగ్ని ప్రజ్వలనం చేసి దేవతలకు యజ్ఞ ఆహుతులనిస్తున్న సమయంలో అక్కడికొక కాకి వచ్చి దేవతలకు సమర్పిస్తున్న ఆహుతులను తాను తినటం మొదలు పెట్టింది. యజ్ఞం అపవిత్రమైపోతున్నదన్న ఆవేదనతో భరద్వాజ మహర్షి ఆ కాకిని వారించబోయారు. అప్పుడు కాకి మనుష్యభాషలో "ఓ మహర్షీ! నేను కాకాసురుడనే రాక్షసుడను, సకల సృష్టికర్తయగు బ్రహ్మను గూర్చి మహాతపస్సు చేసి ఆయనను మెప్పించి ఒక వరాన్ని పొందాను. దానివల్ల దేవతలకిచ్చేటటువంటి హవిర్భాగాలన న్నిటినీ నేను భక్షించవచ్చు. ఆవిధంగా నేను బ్రహ్మావరం పొంది హవిస్సులను తింటున్న నన్ను నీవు వారించుచున్నావు. నీవు తలపెట్టిన యజ్ఞము వలన నాకు శాపవిమోచనం కాబోతుంది. నీవు సంపాదించిన సమస్త నదీ జలములతో ఈ మల్లేశ్వరస్వామి వారిని అభిషేకించి ఆ జలం నామీద సంప్రోక్షణం చేస్తే నాకు శాపవిమోచనం కలుగుతుంది" అని ఆ కాకి చెప్పింది.

యజ్ఞం పూర్తయిన పిమ్మట శ్రీ గంగా భ్రమరాంబసమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు సమస్త నదుల తీర్థములన్నింటిని సేకరించి తెచ్చిన జలంతో శ్రీ స్వామివారికి అభిషేకించి ఆ జలాన్ని కాకిమీద చల్లగా వెంటనే ఆ కాకి తన నల్లని రూపమును వీడి తెల్లని వర్ణము పొందింది. భరద్వాజ మహర్షికి ధన్యవాదాలు తెలిపింది. సాంబశివలింగాన్ని తెల్లని మల్లెలతో పూజించింది. మానస సరోవరమునకు వెళ్ళి పోయింది. ఆ దృశ్యం తిలకించిన మహర్షులందరూ ఎంతో సంతోషించారు. ఈ భరద్వాజ మహాముని ఇచటనే కొంతకాలం ఉండి ఈ మహిమాన్వితమైన శివలింగమును మల్లెపుష్పములతో పూజించాడు. అందువలన స్వామి మల్లేశ్వరుడుగా ప్రసిద్ధి చెందాడు. మరియు కాకాసురుడు తన శాపవిమోచనం పొందిన పవిత్రస్థలం కాబట్టి ఈ పుణ్యక్షేత్రానికి కాకాని అని పేరు వచ్చింది. ఇచ్చట ప్రతినిత్యం రోజువారీ పూజలతో పాటు ప్రత్యేక పూజలు కూడా జరుపుదురు. పండుగ పర్వదినాలలో జరిపే ప్రత్యేక పూజలే కాక దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక దీపోత్సవాలు, మహాశివరాత్రినాడు జరిగే ఉత్సవాలు ఎంతో వైభవముగా జరుపుదురు.

శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం - మాచర్ల



గుంటూరు జిల్లా, పల్నాడు సీమ, మాచర్ల మండలం, మాచర్ల పట్టణంలో చంద్రవంక నదీతీరాన ఈ చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. పల్నాటి ప్రజల కొంగుబంగారమైన మాచెర్ల చెన్నకేశవుని ఆలయ నిర్మాణ కాలం ఎప్పుడు జరిగింది అనే సంధిగ్ధత ఉంది. క్రీ.శ.1113లో కార్తవీర్యార్జునుడు అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించాడు. హైహయ వంశీకుల్లో ఒకరైన సాగిపేట అనుగురాజు దీనిని పునర్నిర్మించాడు. తర్వాత 13వ శతాబ్ధంలో మలిదేవభూపతి మంత్రి బ్రహ్మనాయుడు ఆలయానికి మరమ్మత్తులు చేయించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. మొదట్లో ఇది శైవ సంబంధమైన ఆదిత్యేశ్వరాలయంగా ఉండేదనే గాధ కూడా ప్రచారంలో ఉంది. క్రీ.శ.1132 ప్రాంతంలో బ్రహ్మనాయుడు వైష్ణవ ఆలయంగా మార్పుచేసి చెన్నకేశవ స్వామిని ప్రతిష్ఠించినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. గర్భాలయంలో శ్రీ చెన్నకేశవస్వామి వేదిక శైవాలయపు చిహ్నమైన పానపట్టాన్ని



పోలి ఉండడం విశేషం. ఈ ఆలయంలోని చెన్నకేశవ స్వామి వారి రూపం చాలా అందంగా మలచబడిన శిలారూపం. ఆలయం ఎదురుగా ఉన్న రంగమంటపం నాలుగు స్థంభాలపై రామాయణ, భారత, భాగవతాంశాలను రమణీయ శిల్పాలుగా మలిచారు. దక్షిణంగా ఆదిత్యేశ్వరాలయం, దాని కెదురుగా చారిత్రకమైన నాగస్థంభ శిలాశాసనం ఉన్నాయి. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ఈ ఆలయ ప్రాంగణం నందు శివ-కేశవులకు ఆలయాలు ఉండి మత సామరస్యమునకు నిదర్శనంగా ఉన్నారు.

విశాలమైన ఆవరణ, ఆ ఆవరణ చుట్టూ కోటగోడవలె కన్పించే ఉన్నతమైన ప్రాకారము, ఆ ప్రాకారం లోపల ఆవరణలో మధ్య ఒక అడ్డుగోడ, ఆ గోడకు ఉత్తర భాగమునందు లక్ష్మీ సమేత చెన్నకేశవాలయం, దక్షిణ భాగమునందు వీరభద్రేశ్వరాలయం మొదలగు ఆలయాలు కలవు. ఉత్తర భాగమందున్న చెన్నకేశవాలయము గర్భగుడి, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉంది. వానిలో గర్భగుడి యందు చెన్న కేశవుడు, అంతరాలయమున లక్ష్మీ (తాయారు) అమ్మవారు, మండపంలో మరికొందరు దేవతామూర్తులు మనకు దర్శనమిస్తారు. ఆలయ ముఖద్వారముగుండా లోపలకు వెళ్ళగానే ఒక చిన్న ధ్వజస్థంభం, ఆ ధ్వజస్థంభమునకు ఇరువైపులా గరుత్మంతుడు, ఆంజనేయడు విగ్రహాలు కనిపిస్తాయి. తరువాత ఒక మండపం, ఆ మండపము నందే రంగవేదికయను పేరుతో ఒక నృత్యవేదిక కలదు. ఆ వేదిక చుట్టూ రమణీయమైన నాలుగు స్తంభములు, ఆ వేదిక చుట్టూ పెద్దలు కూర్చుండుటకు వీలుగా శిలా సింహాసనములు కలవు. ఈ ఆలయం ముందు అత్యున్నతమైన ప్రవేశ ద్వారం గాలిగోపురం, ఆ గోపురం వెలుపల 17వ శతాబ్దంలో ప్రతిష్ఠింపబడిన రాతి ధ్వజస్థంభము కలదు. ప్రతి సంవత్సరం చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు చైత్రశుద్ధ పౌర్ణమి నుండి 16 రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ తిరునాళ్ళకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. కార్తీక పౌర్ణమి నుండి 5 రోజుల పాటు వీరారాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ రంగనాయక ఆలయం - మాచర్ల



మాచర్లకు దగ్గరలో గల ఎత్తిపోతల ప్రదేశములో శ్రీరంగనాయక ఆలయం కలదు. ఎత్తిపోతల అనేది ఒక జలపాత ప్రదేశం. ఆ జలపాతం చంద్రవంక నది జల ప్రవాహంతో ఏర్పడినది. ఇది ఒక అద్భుత రమణీయ ప్రదేశం. ఇక్కడ ప్రవహించే జలపాత

ప్రవాహానికి అటు ఇటు రెండు పర్వత పంక్తులు కలవు. ఆ పర్వత పంక్తియందు ఎడమ వైపున ఉన్న పర్వతపంక్తిలో మూడు నాలుగు గుహాలయాలు కలవు. అందులో ఒకటి రంగనాయక ఆలయం. రెండవది మధుమతి ఆలయం. మూడవది దత్తాత్రేయ మందిరం. ఇవి ప్రాచీనమైన గుహాలయాలు. ఈ ఆలయాలలో రంగనాయక ఆలయం, మధుమతి ఆలయం పర్వత పాదభాగాన కలవు. ఈ ఆలయగుహలు కొంచెం ఎత్తుగా ఉండి రాకపోకలకు సౌకర్యంగా ఉంటాయి. ఈ గుహాలయాలలో రంగనాయకుడు, మధుమతీదేవి మనకు దర్శనమిస్తారు. ఈ రెండు ఆలయాలలో అర్చకులు ఒక్కరే. ఇది ప్రకృతి రమణీయ ప్రదేశం. ఇచ్చటకు ప్రతి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వచ్చి ఈ రమణీయ దృశ్యంను తిలకించి, స్వామివార్లను దర్శించి తరిస్తారు.

శ్రీ ఆంజనేయస్వామి - సీతానగరం



ప్రకాశం బ్యారేజి ప్రక్కన ఆవలివైపున గల గుంటూరుజిల్లాలోని సీతానగరంలో కృష్ణానదీ తీరాన గల శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయం అత్యంత పురాతనమైనది. ఇక్కడ ఆంజనేయస్వామి స్వయంభువు. ఇక్కడే కోదండస్వామి వారిని ప్రతిష్ఠించారు. ఈ ఆలయానికి ఎగువున శ్రీ సోమేశ్వరస్వామి రాజేశ్వరీ మాతలు ప్రతిష్ఠింపబడ్డారు. విజయవాడ అనగానే అందరికీ గుర్తుకువచ్చేది బెజవాడ కనుకదుర్గమ్మ. కృష్ణానది ఓవైపు కనుకదుర్గమ్మ, మరోవైపు శ్రీరామసమేతుడైన ఆంజనేయుడు భక్తులను తమ చల్లని చూపులతో కటాక్షిస్తుంటారు. గుంటూరుజిల్లా ముఖద్వారంగా పేర్కొనే సీతానగరాన్ని వేకువఝామునే సందర్శిస్తే కృష్ణాతీరాన శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి శిష్యబృందం పఠించే వేదమంత్రాలఘోష, నది ఒడ్డునే ఉన్న శ్రీమద్ వీరాంజనేయ సమేత కోదండరాముని ఆలయంలో జేగంటల నాదాలు, సోమేశ్వర, రాజరాజేశ్వర, అయ్యప్ప దేవాలయాల నుంచి వినవచ్చే సుప్రభాతాలు, భక్తిగీతాలు భక్తుల హృదయాలకు దివ్యానుభూతిని కలిగిస్తాయి. సీతానగరం నిజానికి పూర్వం పండితుల అగ్రహారంగా ఉండేది. రావణాసురుడు సీతమ్మ తల్లిని అపహరించు కొనిపోతుండగా, ఓ నగజారి ఇక్కడ పడిందనీ, సీతాన్వేషణలో లంకా నగరంనుండి తిరిగొస్తూ ఆంజనేయస్వామి ఇక్కడ విశ్రాంతికై ఆగినపుడు ఆ ఆభరణం కనిపించిందని అంటారు. అందుకే ఈ ప్రాంతానికి సీతానగరం అనే పేరు వచ్చిందని స్థలచరిత్ర చెబుతుంది. ఈ దేవాలయ నిర్మాణకర్త శ్రీ తమ్మిన అంకమ్మ శ్రేష్టి గారు.

ఒకరోజు అంకమ్మ శ్రేష్ఠిగారు ఓ చెట్ట క్రింద కూర్చొని సేదతీర్చుకొనుచుండగా, శ్రీ ఆంజనేయస్వామి కలలోకి వచ్చి "ఈ ప్రాంతంలో నేను ఉన్నాను. నన్ను దర్శించుటకు వచ్చే భక్తులకు ఒక మార్గం ఏర్పాటు చేయవలసిందిగా కలలో చెప్పారు. శ్రేష్ఠిగారు ఈ విషయం భక్తులకు తెలియజేయగా వారందరూ ఆ ప్రాంతములో పరిశోధించగా అక్కడ స్వయంభువైన ఆంజనేయుని విగ్రహం దేదీప్యమానంగా వెలుగుతూ వారికి కనిపించిందట. అంకమ్మ శ్రేష్ఠి తల్లి పనిచేస్తున్న ఇంటిషావుకారు అచ్చుటగట ముళ్ళపొదలు అన్ని శుభ్రం చేయించి ఒక చక్కని రహదారి ఏర్పాటు చేశారట. 1919లో శ్రీ కోదండ రామాలయ ప్రతిష్ఠ జరిగింది. ఈ దేవాలయం రోజురోజుకు దినదినాభివృద్ధి చెంది గొప్ప ఆలయంగా పేరుపొందగా, వీరాంజనేయస్వామి భక్తుల కోర్కెలు తీర్చే అభయాంజనేయునిగా ఇచ్చట నెలకొని భక్తులను తన అభయహస్తంతో ఆదుకొనుచున్నారు.

శ్రీ సాక్షి భావన్నారాయణస్వామి - పొన్నూరు



గుంటూరు-చీరాల రోడ్డు మార్గములో గుంటూరుకు సుమారు 30 కి.మీ. దూరంలో పొన్నూరు పట్టణము కలదు. ఈ పొన్నూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయం కలదు. ఈయనను సాక్షి భావన్నారాయణు డని అంటారు. పూర్వం గోష్ఠివనం, చక్రతీర్థం, స్వర్ణపురి, సుదర్శనక్షేత్రం అనే పేర్లుతో ఈ పొన్నూరు క్షేత్రాన్ని పిలిచేవారు. ఈ స్వామివారు స్వయంభూమూర్తి. ఈయన చతుర్భుజుడు. శంకు, చక్ర, అభయ, కటి హస్తాలను కలిగి, కిరీటము, తిరునామములతో భక్తులకు దర్శనమిస్తాడు. ఈ ఆలయ ప్రాంగణమున శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, శ్రీ కాశీ విశ్వేశ్వరాలయము, శ్రీ విశాలాక్షి అమ్మవారి ఆలయాలు కూడా మనకు దర్శనమిస్తాయి. ప్రధాన ఆలయం నందు శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ విఖనసా చార్యులు, శ్రీ లక్ష్మి నరసింహస్వామి, గరుడాళ్వారు, ఆళ్వార్లు సన్నిధులున్నాయి. ఇది ప్రాచీన ఆలయము క్రీ.శ.1109లో కుళోత్తుంగ చోళదేవుడు అనే రాజు శ్రీ కాశీవిశ్వేశ్వరుని ప్రతిష్టించి ఈ ఆలయానికి 35 గ్రామాలు దానమిచ్చినట్లు శాసనాలు తెలియజేయుచున్నాయి. ఇచ్చట శివ-కేశవులకు ఆలయాలు ఉన్నాయి.

చరిత్ర : పూర్వం ఈ ప్రాంతమంతయు అరణ్యంగా ఉండేదట! ఆ అరణ్యంలో బ్రహ్మ శ్రీహరిని గురించి తపస్సు చేయగా, శ్రీహరి మెచ్చి, అతనికి ప్రత్యక్షమై,

గోష్ఠి జరిపాడని అందుచే ఆ వనానికి గోష్ఠి వనమన్న పేరు వచ్చినదని చెప్పుచుందురు. తరువాత ఎందరో మహర్షులు ఆ గోష్ఠివనమునకు రాగా, మహర్షులను సంతోష పరచేందుకు శ్రీమహావిష్ణువు భావన్నారాయణుడై అచట వెలిశాడు. మహర్షులత్యంత భక్తితో ఆ స్వామిని ఆరాధించసాగారు. క్రమంగా ఆ స్వామి అచటి ప్రజలను గూడా ఆకర్షించాడు. వారిలో గూనిగోవిందుడు, అతని భార్య అక్కలక్ష్మి మహాభక్తులు. వారనుదినం ఈ అరణ్యానికి వచ్చి భావనారాయణుని ఆరాధించుచుండేవారు. ఆవిధంగా కొంతకాలం గడచినది. వారు వృద్ధులయ్యారు. ప్రతిరోజు ఆ అరణ్యానికి రాలేకపోవుచున్నారు. అందుచే వారు స్వామిని ప్రార్థించి, అక్కడ నుండి మైదానానికి రావలసినది కోరారు. వారికోరికను అంగీక రించాడు భావన్నారాయణుడు. ఆయన ఆ వృద్ధ దంపతులతో సరే మీరు ముందు పదండి, నేను మీ వెంట వచ్చెదను కాని మీరు వెనుదిరిగి చూడకూడదు. చూచినచో నేను అక్కడనే ఆగిపోతాను అన్నాడట. స్వామివారి అభిప్రాయము అంగీకరించి, వారు ముందుకు నడవసాగారు. వెనుక స్వామి నడుచుచున్నాడు. వారావిధముగా నడచి ఇప్పుడు పొన్నూరు ఉన్న ప్రదేశానికి వచ్చారు. అక్కడ వారికి అకస్మాత్తుగా ఒక వింత ధ్వని వినిపించింది. ఆ ధ్వనికి ఆ దంపతులు ఉలిక్కిపడి, వెనుదిరిగి చూచారు. అందుచే తానన్నమాట ప్రకారం భావనారాయణు డక్కడనే ఆగిపోయాడు. ఆవిధంగా ఆ ప్రదేశం భావన్నారాయణుల వారి నిలయమైనది. అనంతరం అచటకు రాచపుండుతో బాధపడే ఆ ప్రాంతపు రాజు, నంధ్యాల నారాయణుడు వచ్చి, స్వామిని దర్శించి ఆరోగ్యవంతుడై మహదానందం పొందాడు. వెంటనే ఆ స్వామికి అచట ఆలయము కట్టించాడు. ఆ ఆలయము భావన్నారాయణ స్వామి వారి ఆలయముగా ప్రసిద్ధి చెందినది. తరువాత ఆ ప్రదేశమే పొన్నూరుగా ప్రసిద్ధి చెందినది.

తరువాత ఈ ఆలయం కాలక్రమేణా అనేకమంది రాజుల కాలములో ఆదరణ పొంది చివరకు శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారి పాలనలోకి వచ్చింది. వారి పాలనలోనే ఈ ఆలయం నేడున్న రూపమును పొందినదని, అప్పటినుండి నిత్యధూపదీప నైవేద్యాలతో విశేషాదరణ పొందుచున్నదని చెబుతారు.

ఈ ఆలయము తూర్పుముఖంగా ఉన్నది. గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. గర్భాలయంలో శ్రీ భావన్నారాయణుడు, నైరుతి భాగాన, మరొక గుడిలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు, ఉత్తర దిశయందు కాశీవిశ్వేశ్వ రుడు, వాయువ్యభాగాన అన్నపూర్ణ విశాలాక్షి అమ్మవారు, మనకు దర్శనమిస్తారు. ఈ ఆలయము ఆవరణ చుట్టూ పెద్ద ప్రాకారము కలదు. ఆ ప్రాకారమునకు దక్షిణం వైపు ప్రవేశద్వార గాలి గోపురము, తూర్పుదిశయందు ప్రవేశద్వార గాలిగోపురము ఉన్నవి. సహస్ర లింగేశ్వరాలయంలో 24 అడుగుల ఎత్తున ఉన్న గరుత్మంతుని

విగ్రహము, ఆంజనేయస్వామి విగ్రహము చూపరులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆ దేవాలయమునకు ఒకవైపున శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారి విగ్రహము కూడా కలదు. మండపము, మరొకవైపున భరద్వాజ నిలయము, దానికి తూర్పుగా బ్రహ్మ సరోవరము ఆ సరోవరానికి ఉత్తరముగా గ్రంథాలయ భవనము కలదు. ఇచట భావన్నారాయణుడు ప్రధాన ఆదిదైవము. కాశీవిశ్వేశ్వరుడు గూడా ఇచట ఉండుటచే శివ, కేశవ సమైక్యభావమును భక్తులలో ఈ ఆలయం పెంపొందింప చేయుచున్నది.

ఈ ఆలయము పంచ భావనారాయణస్వాముల వారి ఆలయాలలో ఒక ప్రముఖమైన ఆలయం. ఈ ఆలయంలో నిత్యం జరిగే పూజలతోపాటు పండుగపర్వదినాలలో ప్రత్యేకపూజలు, ఉత్సవాలతో పాటు ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి నుండి 9 రోజులపాటు బ్రహ్మోత్సవాలు అతివైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలలో భాగంగా పౌర్ణమినాడు రథోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం - పొన్నూరు



ఇది గుంటూరుజిల్లాలో ప్రసిద్ధమైన పొన్నూరు పట్టణము నందు కలదు. పొన్నూరు పట్టణము పుణ్యక్షేత్రములకు నిలయం. ఇచట ఎన్నో ప్రాచీన, ఆలయాలు కలవు. వానిలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ఒకటి. ఇది పొన్నూరు ఆర్యవైశ్యులచే క్రీ.శ.1899లో నిర్మింపబడినది. ఈ విధంగా ప్రత్యేకంగా పొన్నూరు ఆర్యవైశ్యులే ఈ ఆలయమునెందుకు నిర్మింపజేశారు ? అనే విషయాన్ని తెలుసుకునే ముందు ఈ వాసవీ కన్య గురించి ముందు మనం తెలుసుకోవాలి.

పశ్చిమగోదావరి జిల్లాలో పెనుగొండ అనే గ్రామం కలదు. ఆ గ్రామంలో కుసుమ శ్రేష్ఠి కౌసుంభి అనే వైశ్య దంపతులుండేవారు. ఆ దంపతులకు వాసవీ అనే కన్య జన్మించినది. ఆమె ఎంతో గుణవంతురాలు. అపురూప సౌందర్యవతి. విష్ణువర్ధనుడను రాజు చూచి మోహితుడై ఆమెను వివాహమాడదలచాడు. తన కోరిక వాసవి తల్లిదండ్రులకు తెలియజేశాడు. మా కులమువారు అందరూ అంగీకరించినచో, ఆమెను తమకిచ్చుటకే అభ్యంతరమూ లేదని వారు రాజునకు తెలియజేశారు. కాని

వైశ్యకులస్తులు ఎవ్వరూ అంగీకరించలేదు. అందుచే రాజుకు కోపమువచ్చి తన సైన్యంతో వారందరిపై దండెత్తి వచ్చాడు. రాజు నెదిరించి పోరాడలేని వైశ్యులందరు కుసుమశ్రేష్ఠితో కలసి అగ్నికి ఆహుతియై తమ ప్రాణాల్ని వదిలారు. వాసవీకన్య తన నిరసనను రాజుకు తెలియజేసి, అగ్నికాహుతియైనది. ఆమెయే తరువాత పరమేశ్వరిగా అవతరించినది. ఆ పరమేశ్వరిని మిలిగిన వైశ్యులు తమ కుల దేవతగా భావించి ఆరాధించసాగారు. తరువాత వైశ్యులు అధికంగా ఉన్న ప్రతిచోటా ఆమె ఆలయాలు నిర్మించారు. ఈ విధంగా ఏర్పడిన ఆలయాలలో పొన్నూరులో ఏర్పడిన ఈ ఆలయము కూడా ఒకటి.

ఈ ఆలయం పశ్చిమాభిముఖంగా ఉండి, గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలతో ఉన్నది. ఈ ఆలయంలో గర్భగృహమునందు వాసవీ కన్యకా పరమేశ్వరితో పాటు ఈశాన్యదిశయందు వినాయక విగ్రహము కలదు. ఈ ఆలయమునకు దక్షిణ దిశయందు, ఒకే ఆవరణలో నాగేశ్వరాలయము, రామాలయము, వేంకటేశ్వరాలయములు కూడా కలవు. నిత్యం జరిగే పూజలతో పాటు పండుగ పర్వ దినాలలో జరిపే ప్రత్యేక పూజలు, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజున గొప్ప ఉత్సవాలు జరుగును.

శ్రీ సహస్ర లింగేశ్వరాలయం - పొన్నూరు



ఇది గుంటూరు జిల్లాలో పొన్నూరు గ్రామమందు కలదు. ఇది నూతనంగా నిర్మించిన ఆలయం. బ్రహ్మశ్రీ సద్గురు జగన్నాథ దాసుగారు, ఈ ఆలయమును 1955లో నిర్మిం చారు. ఈ ఆలయం ఆవరణలో మరో నాలుగు ఆలయములు కూడా కలవు. అందులో ఒకటి ఏకశిలా నిర్మిత ఆంజనేయస్వామి వారి ఆలయము. రెండవది ఏకశిలా నిర్మిత గరుత్మంతుల వారి ఆలయము. మూడవది దశావతారాల ఆలయము. నాలుగవది కాలభైరవస్వామి ఆలయము. ఈ విధంగా ఇది అనేక ఆలయాల సంగమ ప్రదేశంగా ప్రఖ్యాతి గాంచినది. ఈ ఆలయాలలో సహస్రలింగేశ్వరాలయము తూర్పుముఖంగా ఉన్నది. ఈ ఆలయము మూలవిరాట్టు శివవిగ్రహమూ, ఆయనకు ఉత్తర, దక్షిణ పడమర దిశలయందు చిన్న చిన్న శివలింగములు పదకొండు వేలకు

పైగా కనిపించుచుండును. అందువల్లనే ఇది సహస్రలింగేశ్వరరాలయముగా ప్రసిద్ధి చెందినది. ఆలయంలోని శివునకు ఎదురు నందీశ్వరుడు, ఆ నందీశ్వరునకు ముందు నాగరూప దేవతామూర్తి, విఘ్నేశ్వరుడు, ఎడమ భాగాన పార్వతీ అమ్మవారు, కుడి భాగాన శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళి, విశాలమైన మండపములో పెద్దనంది ఆ నందికి ఎడమ భాగాన నవగ్రహములు, కుడివైపున షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మొదలగు దేవతామూర్తులు మనకు దర్శనమిస్తారు. రెండవ ఆలయము ఏకశిలానిర్మిత ఆంజనేయస్వామి వారి ఆలయం. ఇది సహస్ర లింగేశ్వరాలయానికి ఉత్తర దిశలో తూర్పు ముఖంగా ఉన్నది. ఈ ఆలయమునందు 24 అడుగుల ఎత్తు 12 అడుగుల వెడల్పు గల ఏకశిలా నిర్మిత ఆంజనేయ స్వామి వారి విగ్రహము కలదు. మూడవ ఆలయము గరుత్మంతులవారి ఆలయము. ఇది ఆంజనేయాలయానికి ఎదురుగా పశ్చిమముఖంగా ఉన్నది. ఈ ఆలయములో 30 అడుగుల ఎత్తు 15 అడుగుల వెడల్పు గల ఏకశిలానిర్మిత గరుత్మంతులవారు ప్రతిష్టితులై ఉన్నారు.

నాల్గవ ఆలయము దశావతార ఆలయము. ఈ ఆలయంలో దశావతారాలు ప్రతిష్టింపబడినవి. అయిదవ ఆలయము కాలభైరవ ఆలయము. ఇది దక్షిణ దిశలో, ఉత్తరాభిముఖమై ఉన్న ఆలయము. ఈ ఆలయమునందు కాలభైరవస్వామి వారు ప్రతిష్టింపబడినారు. ఈ పై ఐదు దేవాలయములలో ప్రతి ఆలయములోను ఒక ధ్వజస్తంభము, అఖండజ్యోతి మందిరములు మనకు కనువిందు చేస్తాయి.

దేవాలయాల సమూహం - తాడికొండ

గుంటూరు జిల్లా మంగళగిరి తాలూకాలో సుమారు 18 కి.మీ. దూరంలో తాడికొండ గ్రామం కలదు. ఈ తాడికొండ గ్రామం దేవాలయాలకు నిలయం. ఇక్కడ క్రీ.శ.14వ శతాబ్దంనకు ముందే ఈ ఆలయాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ గ్రామానికి ఆది శంకరాచార్యులు వచ్చినట్లు ఇక్కడ లభించిన ఆధారాలను బట్టి తెలుస్తుంది. ఆయన ఈ గ్రామంలో “నవలింగాలను” ప్రతిష్టించారు. అవి 1.శ్రీకొండ మల్లిఖార్జునస్వామి. 2.శ్రీ చెన్నకేశవాలయం. 3.శ్రీ గిరీశ్వరస్వామి. 4.శ్రీ కొండ మూలశ్వేరస్వామి. 5. శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి. 6.శ్రీ రంగేశ్వరస్వామి 7.శ్రీ భవానీ శంకర స్వామి. 8.శ్రీ పేరేచర్ల మల్లిఖార్జునస్వామి. 9.శ్రీ కేదారేశ్వర స్వామి అనే తొమ్మిది శివాలయాలున్నాయి. కానీ కాలక్రమేణా ఇందులోని కొన్ని ఆలయాలు శిధిలమయ్యాయి.

పూర్వం ఈ గ్రామాన్ని “తాళాద్రి” అని పిలిచేవారు. అనగా తాడిచెట్లు మయమైన కొండ అని అర్థం. అందువలన ఇది తాడికొండ అని పిలువబడింది. దీనిని పూర్వం తంత్రికొండ అని కూడా పిలిచేవారు. దీనికి కారణం ధరణికోటను పాలించే రాజులు


యుద్ధ సమయాల్లో ఇక్కడ ఉన్న ఎత్తైన కొండ మీద నుంచి సూచనలు, సమాచార మార్పిడి, సిగ్నల్ వ్యవస్థగా ఉపయోగించుకునేవారు. ఈ గ్రామంలో పూర్వం "యోగులు" ఉండేవారు. జనసంచారం వలన పగటివేళ వారు శ్రీరంగా-భ్రమరాంబ సమేత కొండ మల్లిఖార్జున స్వామిని సేవించుకునేవారు. రాత్రివేళ గ్రామంలో ఉన్న ఆలయాలను దర్శించుకునేవారు. కొండపైన గంగ తనకు తానుగా వచ్చినట్లుగా "మల్లెలదోన", "ఏనుగుల దోన" అనే కోనేరులు ఉన్నాయి. ఈ కోనేరులలో సంవత్సరం అంతా నీరు ఉంటుంది. కొండ మల్లిఖార్జున స్వామిని మల్లెలతో అభిషేకించిన తర్వాత ఆ మల్లెలను జనులు తొక్కకుండా ఈ మల్లెలదోనలో వేసేవారు. కొండపైకి సుమారు 400 మెట్లు ఉన్నాయి. కొండపైన హనుమంతుని పాదంగా చెప్పబడే "పాదముద్ర" ఉన్నది. పండుగ పర్వదినాలలో ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి.

శ్రీ భీమేశ్వరాలయం - చేబ్రోలు



గుంటూరుజిల్లా గుంటూరు-చీరాల రోడ్డు మార్గంలో పొన్నూరు దగ్గరలో చేబ్రోలు అనే గ్రామమున ఈ ఆలయం కలదు. ఇది అత్యంత ప్రాచీనమైన ఆలయం. ఈ ఆలయమును చాళుక్యభీముడు అనే రాజు (892 లో) కట్టించి నాడు. కాబట్టి ఈ ఆలయం భీమేశ్వరాలయమని పిలువబడుచున్నది. అంతకు పూర్వం ఇచట ఒక బౌద్ధచైతన్యం ఉండేదని ఆ చైతన్యాన్ని చాళుక్య భీమరాజు ఈశ్వరాలయముగా మార్చినాడని చరిత్రకారుల అభిప్రాయం. విశాలమైన ఆవరణ, ఆవరణ చుట్టూ ప్రాకారము, ఆవరణ మధ్యలో ఈ భీమేశ్వరాల యము నిర్మాణము కావింపబడినది. ఈ ఆలయం ఒకే ఒక గర్భగృహం కలిగి ఉన్నది. ఆ గర్భగృహానికి ఈశాన్యంగా ఒక చిన్నగుడిలో బాలా త్రిపురసుందరీ అమ్మవారు ప్రతిష్టించబడి ఉన్నారు. ఈ రెండు ఆలయాలను కలుపుతూ పెద్ద మండపం కలదు. ఈ ఆలయాలకు చుట్టూ ప్రదక్షిణ మార్గం కలదు. పెద్ద మండపంలో నందీశ్వరుడు, ఆ మండపం దాటిన తరువాత ఒక వేదిక ఉన్నది. ఆ వేదికకు దిగువభాగాన మరొక నంది విగ్రహం కూడా కలదు. ఆ నంది విగ్రహం సమీపంలో 1930వ సంవత్సరంలో చేబ్రోలు గ్రామనివాసులు కారుమంచి కిష్టయ్య సోదరులచే ఒక ధ్వజస్తంభం ప్రతిష్టింపబడినది. ఈ ఆలయం మీద ఉన్న గోపురం చాళుక్యకాలం నాటి శిల్పకళతో, ఎంతో రమణీయంగా తీర్చిదిద్దబడినది. ఇచ్చట రోజువారీ పూజలతో పాటు, పండుగ పర్వదినాలలో విశేష పూజలు, ఉత్సవాలు కూడా జరుగును.

శ్రీ చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వరాలయం - చేబ్రోలు



గుంటూరుజిల్లా, చేబ్రోలు మండలం, చేబ్రోలు గ్రామము నందు కోనేటిలో చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వరాలయం కలదు. స్థలపురాణం ప్రకారం అమరావతి ప్రాంతాన్ని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పాలించే కాలంలో దోపిడీ దొంగల తాకిడితో ప్రజలు అల్లాడిపోసాగారు. ఆ దొంగలు చెడుమార్గాన్ని వీడి తనకు లొంగిపోతే వారికెలాంటి కీడూ తలపెట్టనని ఆయన అన్నం మీద ఒట్టువేసి ప్రమాణం చేశాడు. ఆయన మాటలు నమ్మిన దొంగలు లొంగిపోయారు. కానీ, రాజు తన మాట నిలబెట్టుకోక వారిని వధించాడు. ఆ తర్వాత నుంచీ ఆయన భోజనం చేసేటప్పుడు అన్నం అంతా రక్తం ఓడుతూ కనిపించడం మొదలైంది. దీంతో రాజావారు భయపడి వేద పండితులను సంప్రదించాడు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం, అలాంటి అన్నంమీద ఒట్టేసి అపరాధం చేశారు. దోషపరిహారార్థం బ్రహ్మదేవాలయం కట్టించాలి" అని పండితులు సూచించారు. అయితే ఇక్కడే వారికో చిక్కొచ్చిపడింది. శివుడి శాపప్రకారం బ్రహ్మదేవుడికి ఆలయాలేవీ ఉండటానికి వీల్లేదు. వారు శాస్త్రాలు తిరగేసి బ్రహ్మతో కలిపి శివుణ్ణి ఒకేమూర్తిగా ప్రతిష్టించితే ఎలాంటి దోషమూ ఉండదని చెప్పగా, అలా నిర్మితమైనదే ఈ ఆలయం.బ్రహ్మదేవుడు కమలగర్భుడు కనుక ఒక కమలంలో ఓ సృష్టికర్త నాలుగు ముఖాలు ఉండి పైన శివలింగాకృతి వచ్చే విధంగా ఏర్పాటుచేసి ఆ మూర్తిని కోనేరులో ప్రతిష్టించారు. దానికి ఓ కథ చెబుతారు. అదేంటంటే ఆగమాల ప్రకారం శివాలయానికి ఎదురుగా, విష్ణుమూర్తి గుడికి వెనుకభాగంలోనూ అమ్మవారికి ఆలయాలకు పక్కభాగంలోనూ ఏ నిర్మాణమూ ఉండకూడదు. మరి బ్రహ్మ ఆలయం గురించి ఏ ఆగమంలోనూ లేదు. దాంతో ఏ దోషమూ అంటకుండా ఇలా కోనేటి నడిమధ్యలో నిర్మించారు. ఇంకా తృప్తిచెందక తూర్పున చంద్ర మౌళీశ్వర స్వామి, పడమట సహస్రలింగేశ్వరస్వామి, ఉత్తరాన వేణుగోపాలస్వామి, దక్షిణాన రంగనాథస్వామి దేవాలయాలు, నాలుగు దిక్కుల అమ్మవారి శక్తిపీఠాలూ ఏర్పరచి అష్టదిగ్బంధనం గావించారు. పురాణాల ప్రకారం బ్రహ్మకు అర్చనార్హత లేదు కనుక పరోక్షంగా ఈశ్వరునికి అభిషేకం చేసి అది బ్రహ్మకు చెందేలా రూపొందించబడినది ఈ ఆలయం. ఇదియే ఈ ఆలయ ప్రత్యేకత.

ఈ ఆలయం ఒక కోనేరు మధ్యయందున్నది. అచటకు వెళ్ళేందుకు వీలుగా ఒక వంతెన నిర్మించారు. ఆ వంతెన మీదుగా వెళ్ళి, భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ఇచట బ్రహ్మ తనకుగల నాలుగు ముఖాలతో నలువైపులా చూచుచున్నట్లు ప్రతిష్టించబడినది. ఆ నాలుగు దిశలలో తూర్పు పడమరయందు శివాలయాలు, ఉత్తర దక్షిణదిశలయందు విష్ణు ఆలయాలు కలవు. అదేవిధంగా నాలుగు మూలలయందు నాలుగు దేవీ మూర్తులు ప్రతిష్టింపబడి ఉన్నారు. ఇచ్చట నిత్యపూజలతో పాటు, పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు.

గంగా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వరాలయం - చేబ్రోలు



ఈ ఆలయం గుంటూరు జిల్లా పొన్నూరుకు పోవు బస్సుమార్గములో చేబ్రోలు గ్రామము నందు కలదు. ఈ ఆలయం నందు గంగా పార్వతి సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారు కొలువై ఉన్నారు. పూర్వం ఈ గ్రామం 'తామ్రపురి'గా పిలువబడినది. క్రీ.శ.1213లో కాకతీయ గణపతి మహా రాజు ఈ తామ్రపురిని జయసేనాపతికి దానంచేసినట్లు ఒక శాసనం ద్వారా తెలియుచున్నది. ఇచ్చట పల్లవ రాజల ద్వారా శైవం బాగా బలపడినట్లు తెలియుచున్నది. తూర్పు చాళుక్య భీముడు పొన్నూరులో శ్రీ భీమేశ్వరాలయమును నిర్మించి శైవానికి విశిష్టతను చేకూర్చాడు. క్రీ.శ.14వ శతాబ్దంలో ఈ ఊరి గ్రామ పెద్దలుగా ఉన్న మూర్తన్న, కంటెన్న అనే అన్నదమ్ములు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఈ ఆలయంలో ఉన్న ఒక శాసనం ద్వారా తెలుస్తుంది.

ఈ ఆలయ ప్రాంగణమందున్న అయిదు అంతస్తుల గాలిగోపురం ఈ చుట్టుప్రక్కల ప్రాంతంలో ఉన్న అనేక ఆలయ గోపురాలన్నిటిలోకి ఎత్తయినదిగా కనబడుతుంది. ఈ ఆలయము తూర్పు ముఖంగా ఉండి, గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా నిర్మించబడి ఉన్నది. గర్భాలయము నందు శ్రీ నాగేశ్వరుడు, ప్రతిష్ట కావించబడి ఉన్నాడు. అంతరాలయము ఎడమభాగాన పార్వతీదేవి,

కుడిభాగాన గంగామల్లేశ్వరుడు, మండపమునందు నందీశ్వరుడు ప్రతిష్టించబడి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఆలయ ప్రాంగణంలోనే ఒక మండపంలో నవగ్రహ మూర్తులు కొలువై ఉన్నారు. ఈ నాగేశ్వరాలయానికి బయట, రాజగోపురానికి కుడివైపున ఉన్న ఒక మంటపంలో సుమారు అయిదు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల పొడవు ఉన్న నందీశ్వరుని విగ్రహం ఉంది. ఈ మంటపం మొత్తమూ ఎర్ర ఇసుక రాతి నిర్మాణం. మంటపంలో ఉన్న నందివిగ్రహం కూడా ఎర్రరాతితో చెక్కిన ఏకశిలా శిల్పమే. ఈ నందీశ్వరుని విగ్రహం వీపు మీద, మెడ దగ్గర, నుదుటిమీద చూడముచ్చటగా ఉండే నగిషీలు, జాలరి పనులు అద్భుతంగా చెక్కబడినాయి. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు.

శ్రీ ఆదికేశవాలయం - చేబ్రోలు



ఇది గుంటూరుజిల్లాలో పొన్నూరుకు పోవు బస్సు మార్గంలో చరిత్రాత్మకమైన చేబ్రోలు గ్రామము నందు కలదు. ఇచట శ్రీ ఆదికేశవ ఆలయం కలదు. ఇది ప్రాచీన ఆలయం. ఈ ఆలయం క్రీ.శ. 12వ శతాబ్దంలో నిర్మింపబడినదని తెలియుచున్నది. ఈ ఆలయము నందలి శిల్ప కళ పల్లవ చాళుక్య కాలమును తలపింపజేయుచున్నది. ఈ ఆలయంనందు గల శ్రీమహా విష్ణువునకు గల మరొకపేరు ఆదికేశవులు. ఈ ఆలయం, విశాలమైన ఆవరణ కలిగి, ఆ ఆవరణలో ఉత్తర దిశయందు ప్రసన్న ఆంజనేయ స్వామి వారి ఆలయం, ఈశాన్య భాగములో కళ్యాణమండపం, తూర్పు దిశయందు గాలిగోపురము కలవు. ఈ ఆవరణలోనే పడమర దిక్కున తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయం, గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా నిర్మించ బడినది. గర్భాలయంలో ఆదికేశవస్వామి ప్రతిష్ట కావించబడిఉన్నాడు. మండపమునందు కుడివైపున అంతరాలయమును ఆనుకొని ఉన్న చిన్న గుడియందు శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారు, మరియు ఆలయమునకు ఎదురుగా ధ్వజస్తంభం కలదు. ఇచట నిత్యపూజలతోపాటు పర్వదినాలలో ప్రత్యేక పూజలు జరుపబడును.

శ్రీభావన్నారాయణ స్వామి - బాపట్ల



గుంటూరుజిల్లా బాపట్ల మండలం, బాపట్లలోని శ్రీ భావన్నారాయణ స్వామి వారి దేవాలయం ఉన్నది. ఇది అతి ప్రాచీనమైన వైష్ణవ క్షేత్రాలలో ఒకటి. బాపట్ల రైల్వేస్టేషన్‌కు అరకిలోమీటరు, బస్టాండ్‌కు కి.మీ. దూరంలో ఈ భావన్నారాయణస్వామి వారి దేవాలయం ఉంది. ఇది సుమారు 1400 సంవత్సరాలకు పూర్వము చోళులచే నిర్మించబడినట్లు తెలియుచున్నది. శైవమునకు పంచారామక్షేత్రాలు ఉన్నట్టుగానే వైష్ణవమునకు కూడా పంచ భావ న్నారాయణ క్షేత్రాలు కలవు. ఈ అయిదు క్షేత్రాలలో ప్రధానమై నది బాపట్ల. ఈ ఆలయంలో ఉన్న భావన్నారాయణ స్వామి పేరిట ఈ ఊరిని భావపురి అనే పేరుతో కూడా పిలిచేవారు. కాలాంతరాన ఆ పేరు రూపాంతరం చెంది భావపట్లగా, బాపట్లగా మారింది. ఈ దేవాలయంలో భావన్నారాయణుడు స్వయంభూవుగా అవతరించాడు. తన పరివార దేవతలయిన శాంత కేశవస్వామి, జ్వాలా నరసింహ స్వామి, శ్రీరాముడు, అమ్మవార్లు, ఆళ్వారులతో కొలువైఉండి భక్తుల కోరికలు తీరుస్తూ భక్తులకు ఇష్టదైవంగా వెలుగొందుతున్నాడు. శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవస్థానాన్ని సందర్శించినట్టుగా ఆధారాలున్నాయి. ఆలయంలోని ప్రతి రాతిపైనా స్థలపురాణం, ఆలయచరిత్ర ఇత్యాది విషయాలు వ్రాయబడిఉన్నాయి. ప్రతి ఏటా వేసవికాలంలో వైభవంగా జరిగే తిరునాళ్ల (బ్రహ్మోత్సవాలు)కు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి చేరతారు.

ఈ ఆలయం క్రీ.శ 594లో క్రిమికంఠ చోళునిచే నిర్మించబడింది. ఈ ఆలయం శాలివాహన శకం 515లో (క్రీ.శ.594లో) ప్రమాదీ నామసంవత్సర ఫాల్గుణ శుద్ధ పూర్ణిమనాడు ప్రతిష్ఠింపబడినదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ గ్రామము నందు 8 దిక్కులలో వళ్ళాలమ్మ, కుంచలమ్మ, శంకరమ్మ, శింగారమ్మ, ధనకొండలమ్మ, మూలకారమ్మ, నాగభూషణమ్మ, బొబ్బలమ్మ అనే ఎనిమిది మంది గ్రామ శక్తులను కూడా ఎనిమిది దిక్కులలో ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది. 106 స్తంభాలతో అలరారు ఈ ఆలయములో గర్భగృహంలో భావన్నారాయణ స్వామివారు, రాజ్యలక్ష్మి అమ్మవారు దర్శనమిస్తుంటారు. మండపం పరిసరాలలో మిగతా దేవతా మూర్తులు కేశవస్వామి, రంగనాథస్వామి, ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, గోవిందరాజస్వామి, కోదండ రామస్వామి, జ్వాలా

నరసింహస్వామి, భాష్యకారులు మొదలైనవారు మనకు ఆలయంలో దర్శనమిస్తారు.

స్థలపురాణం ప్రకారం : కృత, త్రేతా, ద్వాపర యుగాలలో ఇచట బ్రహ్మర్షులు సమావేశమగుచుండేవారని, వారు అచట ఒకయాగకుండమును ఏర్పాటు చేసి శ్రీమన్నారాయణుని స్మరిస్తూ హోమం చేయుచుండేవారని అపుడు నారాయణుడు ఆయా యుగ ధర్మమును అనుసరించి, వేర్వేరు రూపాలతో వారికి దర్శనమిచ్చేవాడనీ, ఆ ప్రకారం నారాయణుడు ద్వాపరయుగంలో క్షీరవృక్షంలో శేషరూపం ధరించి, వారిని ఆశీర్వదించాడని, తరువాత వచ్చిన కలియుగంలో ఎవరును క్షీరవృక్షంలో ఉన్న నారాయణుని కనుగొనలేకపోయారని చెప్పుచు కలియుగంలో కుళోత్తుంగచోళదేవుడు దిగ్విజయ యాత్ర చేయుచు ఆ ప్రాంతానికి వచ్చాడని అపుడు వారి ఏనుగులు స్వేచ్ఛగా తిరుగుచు క్షీరవృక్షము ఆకులు తినబోగా, వాని తొండములాచెట్టుకు అంటుకొనిపోయి రాలేదని, రాజు ఆవార్తవిని ఆశ్చర్యంతో ఆ ప్రదేశానికి వచ్చి ఆ చెట్టును, ఆ చెట్టునంటుకొని పోయి నిల్చుండియున్న ఏనుగులను చూచి అది దైవమహిమయని గుర్తించి ఆ దైవాన్ని ప్రార్థించగా, స్వామి ఇరువురు బ్రాహ్మణుల ద్వారా మీ ఏనుగులు చేసిన పొరపాటుకు పరిహారంగా మీరిచట ఒక ఆలయము కట్టించి అందులో స్వామిని భావన్నారాయణుడన్న పేరుతో ప్రతిష్టించి పూజలు నిర్వహించమని చెప్పగా, ఆరాజు ఆవిధంగానే ఆరా ధించాడని అప్పటినుండి ఈ ఆలయము భావన్నారాయణ ఆలయముగా ప్రసిద్ధిగాంచినదని తెలియుచున్నది.

మరో కథనం ప్రకారం ఇపుడు బాపట్ల అని పిలువబడే గ్రామాన్ని ఆనాడు భావ పట్టణము అని పిలిచేవారు. ఈ పట్టణ సమీపంలో కొండపాటూరు అనే గ్రామం కలదు. ఆ గ్రామంలోని ఒక ధాన్యపు పాతరలో రాజ్యలక్ష్మీదేవి ప్రత్యక్షమై గ్రామవాసులతో, నేను భావన్నారాయణులవారి ధర్మపత్నిని. మీరు రాజుగారికీ విషయమును తెలియజేసి, ఆ భావన్నారాయణుని చెంత, వాయువ్య దిశలో ప్రతిష్టింపజేయించండి అని చెప్పినదట! ఆ మాటలు విని, వారందరూ ఆశ్చర్యపోయి రాజ్యలక్ష్మీ దేవి అమ్మవారు తమ గ్రామ ముద్దుబిడ్డగా అవతరించడం, తమ భాగ్యమని తలచి, వారు రాజుగారికా విషయమంతయు వివరించగా రాజుగారు ఆమె కోరిక ప్రకారం ఆలయ ఆవరణలో వాయువ్య దిశలో ఒక గుడి కట్టించి ఆమెను అందులో ప్రతిష్టించాడని చెప్పుచుందురు. అప్పటి నుండి కొండపాటూరు గ్రామవాసులే రాజ్యలక్ష్మీ అమ్మవారిని తమ బిడ్డగా తలచి, ప్రతి సంవత్సరం జరిగే రాజ్యలక్ష్మీ భావన్నారాయణుల వివాహ సమయంలో కావలసిన అన్ని మంగళకర వస్తువులను సమర్పిస్తారు.

ఇచ్చట నిత్యపూజలతో పాటు వైశాఖమాసంలో శుద్ధ సప్తమి నుండి పూర్ణిమ వరకు బ్రహ్మోత్సవాలు, పౌర్ణమి నాడు రథోత్సవం చాలా వైభవంగా నిర్వహిస్తారు, తరువాత ఫాల్గుణ పౌర్ణమి నాడు ఈ స్వామికి వర్ష ఉద్ధనోత్సవం జరుపుతారు. ఈ

సందర్భంగా శాంతి కళ్యాణం జరుపుతారు. చైత్రశుద్ధ నవమికి శ్రీ కోదండరామస్వామి కళ్యా ణోత్సవం, శ్రావణపౌర్ణమికి తిరునక్షత్రోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో దేవీ నవరాత్రులు, కార్తీకమాసంలో చిలుకే కాదశి రోజున గరుడోత్సవం, వైకుంఠ ఏకాదశికి ఉత్తర ద్వారదర్శనం మొదలగునవి కనుల పండువుగా జరుగును.

శ్రీ సాయిబాబా మందిరం - బాపట్ల



గుంటూరుజిల్లా, బాపట్లలో బాపట్ల రైల్వేస్టేషనుకు 1 కి.మీ., దూరంలో శ్రీ సాయి బాబా మందిరం ఉన్నది. గుంటూరు, బాపట్ల, చీరాల మార్గం జీబీసీ రోడ్డులో ఈ ఆలయం ఉంది. ఈ మందిరంలోని సాయిబాబాను బాపట్లబాబా అని భక్తులు పిలుస్తారు. ఆలయం లోని బాబా భక్తులపాలిట ప్రత్యక్షదైవంగా విరాజిల్లుతున్నాడు. ఈ ఆలయం 6,480 చదరపు అడుగుల విస్తీర్ణంలో విలసిల్లుతు న్నది. గర్భాలయంలోని బాబాకు ఎదురుగా పాలరాతి నంది విగ్రహం ఉన్నది. బాబాకు ఎదురుగా నందీశ్వరుడు ఉండగా, ఆయన వెనుక శ్రీ సాయిబాబా పాదాలు భక్తులకు దర్శనమిస్తాయి. ఆలయ ప్రధాన మందిరంలో బంగారు సింహాసనంలో 5 అడుగుల 6 అంగుళాల ఎత్తులో సాయి బాబా పాలరాతిమూర్తి భక్తులకు దర్శనమిస్తారు. మూలవిగ్రహం పాదాలవద్ద దత్తాత్రేయస్వామి వారి చిన్న విగ్రహమూర్తి ఉన్నారు.

శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ ప్రవేశద్వారానికి ఎడమవైపున ద్వారకామాయి, ధుని ఉన్నాయి. ఇక్కడ గల ఒక మండపంలో ఆదిశేషువు నీడన బాబా ఆసీనుడై ఉన్నారు. ఈ ఆలయంలో మొట్టమొదట చిన్నగుడిలో సాయి పటం పెట్టి భక్తులు భజనలు చేయడం ప్రారంభించారు. నంబూరి పిచ్చయ్య ఇతర భక్తులు శ్రీ షిరిడీ సాయిబాబా సత్సంగంతో సాయి భక్తులుగా మారి, ఆలయ నిర్మాణానికి పూను కున్నారు. 1992 మార్చి 11న శంకుస్థాపన చేసి, శ్రీ షిరిడీ సాయిబాబా సేవాసమితి 1995లో ఆలయ కమిటీగా ఏర్పడింది. 1997 ఫిబ్రవరి 19న వడ్లూరి మల్లిఖార్జున దీక్షితులు గారిచే ఆలయంలో శ్రీ సాయినాథుని విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. నిత్యం బాబాకు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు, హారతులు, భజనలు, ప్రతి గురువారం విశేష పూజలు, పల్లకీ ఉత్సవాలు, పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, వార్షికోత్సవాలు, గురుపౌర్ణమి, శ్రీరామనవమి, విజయదశమి, గణపతినవరాత్రులు మొదలగునవి ఈ మందిరంలో వైభవంగా నిర్వహిస్తారు.

శ్రీ కపోతేశ్వరస్వామి ఆలయం - చేజెర్ల



గుంటూరుజిల్లా నకరికల్లు మండలంలో చేజెర్ల అనే గ్రామము కలదు. ఇది నరసరావుపేటకు సుమారు 30 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ పురాతన మైన కపోతేశ్వరస్వామి దేవాలయం ఉంది. దానశీలుడైన శిబిచక్రవర్తి లింగ రూపంలో వెలసిన క్షేత్రంగా చేజెర్ల కపోతేశ్వరాలయము ప్రతీతి. పూర్వం చేరుంజర్ల, చేంజర్ల, చేజెర్లగా పిలువబడుతున్న ఈ చారిత్రక గ్రామానికి దాదాపు 2 శతాబ్దాల చరిత్ర ఉన్నది.


స్థలపురాణం ప్రకారం కాశ్మీరును పరిపాలించే శిబిచక్రవర్తి పెద్ద తమ్ముడు మేఘా డంబరుడు, రెండో తమ్ముడు జీమూతవాహనుడు తీర్ధయాత్రలు చేస్తూ గుంటూరుజిల్లా, చేరుంజర్ల ప్రాంతానికి వచ్చారు. ఇక్కడి పర్వతగుహలో తపస్సు ఆచరిస్తూ వారు దేహత్యాగంచేసి, లింగాకారులై వెలిశారట. అది తెలుసుకున్న శిబి తానూ సోదరుల్లాగా ముక్తిపొందాలని ఇక్కడికి చేరుకుని నూరుయాగాలు తలపెట్టాడు. అప్పుడు దేవతలు శిబి దానశీలతను పరీక్షించదలచి ఓ పథకం వేసి పావురం, కిరాత రూపధారులై వచ్చారట. కిరాతుడు వేసిన బాణానికి కాలు విరిగిన పావురం కుంటుకుంటూ శిబిని శరణు వేడుకుంది. దాన్ని తనకిమ్మని కిరాతుడు శిబిని అడగ్గా అందుకు ఆయన అంగీకరించలేదు. బదులుగా ఆ పావురం ఎత్తు మాంసాన్ని తన దేహం నుంచి ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. త్రాసులో ఒకవైపు పావురాన్ని ఉంచి రెండోవైపు తన శరీరం నుంచి ఎంత మాంసం వేసినా అది పావురం బరువుతో సరితూగలేదు. చివరకు శిబి తన శిరస్సును నరక్కునే ప్రయత్నం చేయడంతో దేవతలు ప్రత్యక్షమైనారు. అతని దాన శీలతకు మెచ్చి, ఏదైనా వరం కోరుకోమని అనగా అందుకాయన తనకు శివైక్య సంధానం కలిగించాలని కోరాడు. అలా కపోతాన్ని రక్షించి, శిబి లింగాకృతి దాల్చి నందువల్ల ఆ లింగానికి కపోతేశ్వర లింగమని పేరొచ్చింది. స్థలపురాణానికి నిదర్శ నంగా చేజెర్ల కపోతేశ్వర లింగంపై గంట్లు కనిపిస్తాయి. శిబి దేహం నుంచి తీసిన మాంసానికి ఈ గంట్లే గుర్తు అని భక్తులు విశ్వసిస్తారు. ఈ లింగానికి కుడిఎడమల రెండు బిలాలు ఉంటాయి. కుడిబిలంలో ఒక బిందెనీరు పడుతుంది. ఎడమ బిలంలో ఎంతనీరు పోసినా నిండనే నిండదు. సాధారణానికి భిన్నంగా ఈ ఆలయంలోని నందీశ్వరుడు కపోతేశ్వరుడిని కుడి



కంటితో వీక్షించడం మరో విశేషం. గ్రామానికి వాయువ్య దిశగా ఉన్న ఈ కపోతేశ్వరాలయం తూర్పు ముఖంగా ఉన్నది. ఆలయము చతుర్భుజాకారంతో విశాలమైన ఆవరణలో ఉన్నది. ఈ ఆవరణ చుట్టు రెండు ప్రాకారాలు ఉన్నాయి. ఆలయమున కన్ని వైపుల దేవతా మూర్తులుగల చిన్నచిన్న మందిరములు తొమ్మిది అడుగుల ఎత్తుగల సహస్ర లింగాకార మూర్తి, మల్లికా పుష్కరిణి, నైరుతి భాగాన సప్త మాతృకల విగ్రహాలు ఉన్నాయి.ప్రదేశ గోపురానికి ఎదురుగా ఒక చిన్న మండపము, ధ్వజస్తంభము ఉన్నాయి. రెండురాతి పలకాల మీద ఒక్కొక్కదానిమీద వెయ్యి చొప్పున శివలింగాలుఉన్నాయి.ఒకపాలరాతి ఫలకంపైన పద్మహస్తుడైన సూర్యుని శిల్పంఉంది. గర్భగృహం ఇరువైపులా ఉన్నమూడేసి స్తంభాల మీద రాతిదూలాల కప్పు ఉంది. చదరపు వేదిక పైన ఉన్న కపోతేశ్వర లింగంతలలేని శరీరాకృతిలో అనిపిస్తుంది. కృష్ణరాయలు చేచెర్ల కపోతేశ్వర స్వామి ఆలయంలో రెండు శాసనాలు వేయించారు. కొండవీరు సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్న తరువాత క్రీ.శ.1517లో ఆలయ అభివృద్ధి, నిత్య నైవేద్యం కోసం దాదాపు 360 ఎకరాల భూములను దానం ఇచ్చినట్లు తెలుస్తోంది. చేజర్ల, బిట్టపుర, కపోతపుర గ్రామాలతో పాటు తన ప్రధానులు సాలువ తిమ్మరుసయ్య, రాయసం కొండమరుసయ్య పేర్లమీదుగా చేజర్లలో తిమ్మసముద్రం, కొండ సముద్రం అనే రెండు చెరువులను త్రవ్వించాడు. కపోతేశ్వరుడని పిలువబడే ఈ శివలింగం పైన గుంటలు కన్పించు చుండును. అవి శిబి తన శరీర కండరాలను కోసి ఇచ్చినపుడేర్పడినవని చెప్పుచుందురు. ప్రతిరోజు ఇచ్చట ప్రత్యేక పూజలు, అర్చనలే కాక, సంవత్సరాది తొలి ఏకాదశి, దసరా, కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు, జ్వాలాతోరణోత్సవము, సంక్రాంతి సమయంలో స్వామి వారికి గ్రామోత్సవము, మహాశివరాత్రి ఉత్సవము వంటి ఉత్సవము లెన్నో అతి వైభవముగా జరుగును.



ఉభయ రామలింగేశ్వర క్షేత్రం - భట్టిప్రోలు



గుంటూరుజిల్లా, గుంటూరుకు 58 కి.మీ., దూరంలో భట్టి ప్రోలు సమీపంలో చిలుమూరు వద్ద ఉభయరామలింగేశ్వర క్షేత్రం (సైకతలింగం అని పేరు) ఉన్నది. భట్టిప్రోలులో శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రసిద్ధి. ఈ ఆలయంలో క్రీ.శ.1684లో శివలింగ ప్రతిష్ట జరిగింది. భృగుమహర్షి సంతతి వారైన పద్మశాలీయుల చేనేత సంఘం ఆధ్వర్యంలో దేవాలయం వ్యవహారాలు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ఫాల్గుణ శుద్ధ ఏకాదశి మొదలు బహుళ విదియ వరకు ఏడు రోజుల పాటు ఇచ్చట గొప్పగా ఉత్సవాలు జరుగుతాయి. 1914 నుంచి రథోత్సవం వైభవంగా, కన్నుల పండువగా జరుగుతుంది. ఈ రథోత్సవాన్ని సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

శ్రీ చెన్నకేశవాలయం - కారంపూడి



గుంటూరుజిల్లాలో పల్నాటి సీమలోని కారంపూడి గ్రామమునందు శ్రీ చెన్న కేశవస్వామి ఆలయం కలదు. ఇది ప్రాచీన ఆలయము. దీనిని కుల మత రహిత వ్యవస్థకు నిరంతరం పాటుపడిన చాపకూడు సిద్ధాంతము అమలుచేసిన మహానీయుడు పలనాటి బ్రహ్మనాయుడు కట్టించాడని స్థానికులు చెప్పుదురు. ఈ ఆలయము పశ్చిమాభిముఖంగా ఉన్నది. గర్భగృహం అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఉన్నది. ఈ ఆలయంలో గర్భాలయం నందు చెన్నకేశవుడు, రాజ్యలక్ష్మి అమ్మవారు, మండపంలో చెన్నకేశవుని గ్రహనము, గరుత్మంతుడు దర్శనమిస్తారు. ఇచ్చట బ్రహ్మనాయుడు ధరించిన కోణతం అనే ఆయుధము, కన్నమదాసు ధరించిన భైరవ ఖడ్గమును, బాలచంద్రుడు ధరించిన సామంత సద్భక్త మొదలగు ఆయుధములను కూడా మనము ఆలయములో చూడ వచ్చును. పల్నాటియద్ధము కారంపూడిలో జరిగింది. ఆ యుద్ధ చిహ్నాలు మహా వీరులు ధరించిన ఆయుధాలు ఇచట స్వామివారితో సహా ఆరాధింపబడుచుండుట ఆ పల్నాటి వీరత్వానికి నిదర్శనముగా ఉన్నది. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటు పండుగ పర్వదినాలలో ఉత్సవాలు కూడా జరుగును.

గంగా పర్వతవర్ధనీ సమేత శ్రీ రామేశ్వరస్వామి - తెనాలి

గుంటూరుజిల్లాలో తెనాలి పట్టణమందు గంగానమ్మపేటలో గంగా పర్వతవర్ధనీ సమేత శ్రీ రామేశ్వర స్వామి ఆలయం కలదు. ఇది త్రేతాయుగం నాటి ప్రాచీనమైన ఆలయము. ఈ ఆలయములోని దేవతామూర్తిని పరశురాముడు ప్రతిష్టించాడని స్థలపురాణం చెప్పుచున్నది. తరువాత 1966లో పునరుద్ధరణ కార్యక్రమ సమయంలో ఇచట జరిగిన త్రవ్వకాలలో ప్రాచీన బౌద్ధ విగ్రహము అష్టభుజ దుర్గాదేవి బయల్పడినవి.


ఈ ఆలయం పడమరముఖంగా ఉన్నది. దేవతల చేతగానీ, మహనీయుల చేతగానీ ప్రతిష్ఠించబడిన ఆలయాలు ఎక్కువగా పడమరముఖంగా ఉంటాయని పండితుల అభిప్రాయం. ఇది పరశురాముడు ప్రతిష్ఠించిన ఆలయము కనుక పడమర ముఖంగా ఉన్నదని ఇక్కడి అర్చకులు చెప్తున్నారు. ఈ ఆలయంలో గర్భగృహంనందు గోధుమ రంగు శివలింగాకృతిలో శ్రీ రామేశ్వరుడు, ఆయనకు ఎడమ ప్రక్కన గల చిన్నగుడిలో గంగా పర్వతవర్ధని, కుడిప్రక్కన మరొక గుడిలో రత్నగర్భ గణపతి, పరిసరాలలో నవగ్రహములు, అయ్యప్పస్వామి, నాగేశ్వర మొదలగు దేవతామూర్తులు దర్శనమిస్తారు. ఈ ఆలయం ప్రాకారము మీద జ్యోతిర్లింగ చిత్రాలు ఉన్నాయి. ఇచట వంశపరంపరంగా వచ్చుచున్న అర్చకులు రామేశ్వర స్వామివారిని భక్తిప్రపత్తులతో అర్చించుచుందురు. ఈ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, దసరా సందర్భంగా జరిగే ఉత్సవాలు, కార్తీక దీపోత్సవములు, ఆరుద్ర నక్షత్ర ఉత్సవము, శివరాత్రి ఉత్సవము మొదలగు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో అతి వైభవముగా జరుపుదురు.

శ్రీ గోవర్ధనస్వామి వారి దేవాలయం - తెనాలి

నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయానికి ఎదురుగా ఈ ఆలయం ఉంది. ఈ ఆలయంలో శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తుతున్నట్లు మూర్తి కనిపిస్తుంది. దక్షిణ భారతదేశంలో గోవర్ధన స్వామికి ఉన్న ఏకైక దేవాలయంగా దీన్ని చెప్పుకుంటారు. శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు చరిత్ర పుస్తకాలలో ఉంది.

వైకుంఠపురం - తెనాలి


గుంటూరు జిల్లా తెనాలి పట్టణములో రైల్వే బ్రిడ్జి సమీపంలో నిర్మించబడ్డ శ్రీ వైకుంఠపురం వేంకటేశ్వర దేవాలయం ఆంధ్రదేశంలోని దివ్య క్షేత్రములలో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. ఇది నూతనముగా నిర్మించిన ఆలయం. నిత్యకళ్యాణం పచ్చతోరణం తో విలసిల్లే కలియుగ దైవం, శ్రీ వేంకటేశ్వ రుడు లక్ష్మీపద్మావతీ సమేతముగా ఈ దేవాలయంలో కొలువుతీరి ఉన్నాడు.



స్థలపురాణం : పూర్వం ఈ ఆలయం ఉన్న ప్రాంతం ఊరుపేరులేని ఒక ప్రాంతం. ఆ ప్రాంతంలో ఒక పుట్ట ఉండేది. ఆ పుట్ట మామూలు పుట్టగానే చాలాకాలం ఉండిపోయినది. తరువాత ఒకనాడు తుళ్ళూరు బాల నరసింహ గౌడ్ అనే భక్తుడికి కలలో నాగేశ్వరుడు కన్పించి, తానొక పుట్టలో దాగి ఉన్నానని, ఆ పుట్ట ఫలానాచోట ఉన్నదని, నీవు నన్ను వెలికి తీసి ఆరాధించిన క్షేమం కలుగుతుందని చెప్పి, అంతర్థానమైనాడట! అతడు తనకు వచ్చిన కల సంగతి తన మిత్రుడైన బెల్లంకొండ స్వామి వారికి తెలియజేసి, వారిని కూడా తీసికొని, ఆ పుట్ట వద్దకు వెళ్ళి, పరిశీలించగా, వారికాపుట్టలో దేవతామూర్తులున్నట్లు గమనించి వెంటనే వారామూర్తులను వెలికిదీసి నాగేశ్వరుడన్న పేరుతో అచట ప్రతిష్టించి ఆరాధించారు. ఇది 1966లో జరిగినది. ఈ విషయం కొంతకాలానికి కంచికామకోటి పీఠాధిపతులవారికి తెలిసినది. వారచటకు వచ్చి,పుట్ట నాగేశ్వరులవారిని ఆరాధించుటయేగాక,అచట లక్ష్మీపద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరమూర్తిని ప్రతిష్టించి, ఆలయ నిర్మాణానికి పునాదులు వేసి, ఆప్రాంతాన్ని వైకుంఠపురమని ప్రశంసించారు. ఇది 1972లో జరిగినది. క్రమంగా ఈ వైకుంఠపురం జగద్విఖ్యాతమైనది. స్థానికులే గాక ఇచటకు దూరదూర ప్రాంతాలనుండి భక్తులు వేలసంఖ్యలో రాసాగారు. ఇప్పుడీ యాలయ ఆవరణ అనేక కట్టడాలతో 7 ఎకరాలతో విస్తరించి యున్నది.

ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉన్నది. గర్భగృహం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగల ఈ ఆలయంలో గర్భాలయంలో లక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరలవారు కొలువై ఉన్నారు. వారికెదురుగా పుట్టనాగేశ్వరుడు, గరుత్మంతుడు మొదలగు వారు కొలువై ఉన్నారు. ఉత్తరపు దిశయందు కేశఖండనశాల, తూర్పు దిశయందు శ్రీనివాససదన్, పొంగలిషెడ్ మొదలైన కట్టడాలు కూడా నిర్మించారు.

ఇచట సర్వదేవతయైన నాగేశ్వరుని శ్రీ మహా విష్ణువు మరొక రూపమైన శ్రీ వేంకటేశ్వరుని ఆరాధిస్తూ, నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు, ఉత్సవాలను గూడ జరుపుతారు. ఇచ్చట జరిపే ఉత్సవాలలో వైకుంఠ ఏకాదశి, తెప్పోత్సవం, బ్రహ్మో త్సవం చాలా ముఖ్యమైనవి. వీటిలో వివాహ ఉత్స వాలు కూడా జరుగుచుండును. ఈ ఆలయాన్ని నిత్యం వేలసంఖ్యలో భక్తులు దర్శించుకొని వారి వారి మ్రొక్కులు తీర్చుకొంటారు. ఈ స్వామివారి సన్నిధిలో ఎక్కువగా కళ్యాణాలు జరుగుట విశేషము.



శ్రీ కాళీమాత ఆలయం - తెనాలి

గుంటూరుజిల్లా తెనాలి పట్టణంలో కృష్ణానదీ తీరాన శ్రీ కాళీమాత ఆలయం అనే ప్రాచీన ఆలయం ఉన్నది. ఒకప్పుడు ఈ ఆలయం దట్టమైన అరణ్యం మధ్యలో ఉండేది. కాని ఇప్పుడు ఈ ప్రాంతమంతా తెనాలి పట్టణంలో విస్తరించి ఉంది. ఈ ఆలయం విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిదని చరిత్ర తెలుపుతుంది.

స్థలపురాణం : విజయనగర రాజ్య ఆస్థానంలోని అష్టదిగ్గజాలని పేరు పొందిన కవుల్లోని ఒకరు తెనాలి రామకృష్ణ కవి ఈ ప్రాంతంలో జన్మించాడు. చిన్నతనం నుంచే కవిత్వాన్ని చెప్తూ ఉండే రామకృష్ణుని 'వికటకవి' అని ఈ ప్రాంతం ప్రజలు పిలిచేవారు. అయితే తెనాలి రామకృష్ణ కవిలో పాండిత్య ప్రతిభను గుర్తించిన ఓ సాధువు అతన్ని అడవిలోని కాళీమాత ఆలయానికి తీసుకెళ్ళి కాళీమాత మంత్రాన్ని ఉపదేశించాడు.

రామకృష్ణ కవి ధ్యానముద్రలో కాళీమాతని నిత్యం జపిస్తూ ఉండగా నిశ్చలమైన భక్తితో తనని కొలుస్తున్న రామకృష్ణుని భక్తికి మెచ్చి కాళీమాత అతనికి ప్రత్యక్షమైంది. అతనికి రెండు పాత్రల్లో ఉన్న పాలు, పెరుగులని చూపిస్తూ ఏదో ఒక పాత్రని తీసుకొని పాలని కానీ, పెరుగు కానీ సేవించమంది. పాలు సేవిస్తే పాండిత్యం, పెరుగుని సేవిస్తే దారిద్ర విముక్తి లభిస్తాయని చెప్పింది. రామకృష్ణుడు కాళీమాత మాటను ప్రక్కనపెట్టి రెండు పాత్రల్లోని పాలు పెరగులను కలిపి ఓ గుక్కలో సేవించాడట. దాంతో కాళీ మాతకు కోపం వచ్చి ఎందుకలా చేసావని గట్టిగా అడగగా, అప్పుడు రామకృష్ణుడు 'తల్లీ! దారిద్రం తీరని పాండిత్యం ఏవిధంగా ఉపయోగపడుతుంది' అని ప్రశ్నించాడట ? అందుకు మాత సంతోషించి రామకృష్ణుని ఆశీర్వదించి వెళ్ళిందట. ఆ తర్వాత రామకృష్ణ కవి విజయనగరాన్ని చేరాడు. ఈ కాళీమాత ఆలయాన్ని భక్తులు అధికసంఖ్యలో దర్శిస్తూంటారు. ప్రతిరోజు పూజలతో పాటు పర్వదినాలలో ప్రత్యేకపూజలు ప్రతీ ఏటా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

ఉభయ రామేశ్వరం - చిలుమూరు



గుంటూరు జిల్లా తెనాలి తాలూకాలో చిలుమూరు అనే గ్రామములో ఈ ఆలయం ఉంది. కృష్ణ తీరాలలో వెలసిన ఉభయ రామేశ్వర ఆలయం, ప్రాచీన దేవాలయ క్షేత్రం. పుష్పక విమానంలో ప్రయాణం చేస్తున్న సీతారాములు ఈ ప్రాంత రమణీ

యతకు పరవశించి ఈ ప్రాంతమున దిగారట. అర్చన చేసుకోవడానికి ఆలయమేదీ లేని కారణాన సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తే ఇక్కడి ఉభయ తీరాలలోనూ శివలింగ ప్రతిష్టలు కావించి, కొద్దిరోజులు ఇక్కడే నివసించినట్లు స్థానికుల, భక్తుల విశ్వాసం. ఒక శివలింగం చిలుమూరులోనూ, మరొకటి నది ఆవలి ఒడ్డునున్న అయిలూరులోనూ ప్రతిష్టించి రెండింటినీ కలిపి ఉభయ రామేశ్వరమని సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రమూర్తే నామకరణం చేసినట్లు పెద్దల అభిప్రాయం. తర్వాత ఆలయ ప్రాంగణంలోనే పక్కనే ఒక వేణుగోపాలస్వామి వారి ఆలయం కూడా ఉన్నది. నిత్యపూజలతో పాటు చైత్ర పౌర్ణమినాడు ఇక్కడ తిరునాళ్ల ఉత్సవం జరుపుతారు.

శ్రీ అగస్త్యేశ్వరాలయం - నందివెలుగు



గుంటూరుజిల్లా, తెనాలి మండలం, తెనాలి పట్టణమునకు దగ్గరలో నందివెలుగు అనే ఊరులో ఈ అగస్త్యేశ్వరాలయం ఉంది. అగస్త్య మహర్షి కాశీ విశ్వేశ్వరుని వదలి వచ్చిన తరువాత ఆంధ్రదేశంలో అనేక చోట్ల శివలింగ ప్రతిష్టలు చేశాడు. అలా ఆయన ప్రతిష్టించిన క్షేత్రాలలో ఒకటి తెనాలి దగ్గరి నందివెలుగు. ఈ గ్రామం తెనాలిలోని భాగమే అని కూడా భావించవచ్చు. ఈ నందివెలుగు గ్రామం అత్యంత పురాతన, చారిత్రక ప్రాముఖ్యతగల గొప్ప శైవక్షేత్రం. ఆనాడు అగస్త్య మహర్షి ప్రతిష్టించిన ఈ శివలింగం, దేవాలయం కాలగతిలో దట్టమైన అడవులు పెరగడంతో మానవ సంచారం లేనిదై మరుగున పడిపోయింది. చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో శివభక్తుడైన విష్ణువర్ధన మహారాజు ఒకసారి ఈ అరణ్య ప్రాంతానికి రాగా అక్కడవారికి ఈ దేవాలయం కనపడింది. మహాశివ భక్తుడైన విష్ణువర్ధనుడు ఈ అగస్త్యేశ్వరస్వామిని దర్శించి, ఆ స్వామివారికి నిత్యార్చన జరగాలని భావించి, అమూల్యమైన రత్నాలను వినాయకుని బొజ్జలోనూ, నందీశ్వరుని కొమ్ములలోనూ నిక్షిప్తం చేయించారు. వినాయకుడి బొజ్జలోని రత్నాల నుంచీ వెలువడే తేజఃపుంజాలు నంది కొమ్ములోని రత్నాలపైన పడి పరావర్తనం చెంది మూలవిరాట్టు పాదాలపైపడి నిత్యార్చన చేసేలా అతి గొప్పగా నిర్మాణం చేశారు ఆనాటి శిల్పులు. నంది కొమ్ములలోంచి వెలుగు రేఖలు రావటంవలన ఆ గ్రామం పేరే నందివెలుగుగా మారి పోయింది. ఆలయ విగ్రహాలలో రత్నాలు పొదిగిన విషయం తెలుసుకొన్న కొంత మంది దుండగులు గణపతి విగ్రహాన్ని, నందికొమ్ములను ధ్వంసం చేయడంతో ఆ

పూర్వ వైభవం కాలగర్భంలో కలిసిపోయింది. ఈ ఆలయంలోని మూలవిరాట్టు శ్రీ అగస్త్యేశ్వరస్వామివారు. వారికి ఒకవైపు పార్వతీ అమ్మవారు, ఎదురుగా జ్యోతిర్నంది, ఓ పక్క జ్యోతిర్గణపతి, మరోవైపు శ్రీ ఆంజనేయస్వామివారు ఉన్నారు. శ్రీ కనకదుర్గాదేవి రమాసహిత శ్రీ సత్యనారాయణస్వామివారు నటరాజస్వామి, చండీశ్వరుడు, కాలభైరవుడు, నవగ్రహాధిపతులు, జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య, శ్రీ కంఠశివాచార్యుల వారు కూడా ఈ క్షేత్రమునందు ప్రతిష్టితులై ఉన్నారు. ఇక్కడ నిత్యపూజలతోపాటు పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు కూడా జరుగును.

శ్రీ జలపాలేశ్వర స్వామి - వేములూరిపాడు



ఈ దేవాలయం గుంటూరు నుండి 18 కి.మీ. దూరంలో నరసరావుపేట వెళ్ళే మార్గంలో వేమూలూరిపాడు అనే గ్రామంలో శ్రీ జలపాలేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ దేవాలయం చాలా ప్రాచీనమైన దేవాలయం. చోళరాజులు తమ రాజ్యభాగాలను పరిశీలించడానికి సైన్యంతో బయలుదేరి ఆనాడు యాబలురిపాడుగా పిలువబడుతున్న నేటి వేములూరిపాడు గ్రామానికి వచ్చేసరికి అర్థరాత్రి సమయం అయింది. అపుడు ఈ ప్రాంతంలో దట్టమైన అడవులు ఉండేవి. ప్రయాణానికి సమయం కాదని గ్రహించిన రాజు ఇక్కడే గుడారాలను నిర్మించుకొని రాత్రి బసచేసాడు. అయితే వారికి చుక్క నీరు కూడా లభించలేదు. త్రాగునీటి కోసం సైన్యంతో ఇక్కడ బావిని త్రవ్వించాడు. అయినా నీటి చెమ్మ కూడా బావిలో దొరకలేదు. అపుడు రాజు తమ ఇష్టదైవమైన పరమేశ్వరుని ప్రార్థించగా వెంటనే స్వచ్ఛ మైన నీటితో బావి నిండిపోయింది. ఈ ప్రదేశంలో ఒక శివలింగమును ప్రతిష్టించి ఆస్వామికి జలపాలేశ్వర స్వామి అనే పేరుపెట్టి అచటనే పార్వతీదేవి విగ్రహాన్ని కూడా ప్రతిష్ట చేశాడు. ఆవిధంగా జలము శిరస్సున దాల్చి శ్రీ జలపాలేశ్వరస్వామిగా ఇచట భక్తులకు స్వామి దర్శనమిస్తారు. 1875 సంవత్సరము జ్యేష్ఠ శుద్ధ సోమవారం శ్రీ కుండినపురం గ్రామం లోని శ్రీ వత్స రాఘవశర్మచే ఈ దేవాలయం పునర్నిర్మాణ ప్రతిష్ట చేశారని ఇచ్చటగల శాసనం వలన తెలియుచున్నది.

గంగా పార్వతీ సమేత శ్రీ చౌడేశ్వరస్వామి - నిడుబ్రోలు



ఇది గుంటూరుజిల్లాలో పొన్నూరు వెళ్ళే దారిలో నిడుబ్రోలు గ్రామమునందు కలదు. ఇక్కడ గంగా పార్వతి సమేత శ్రీ చౌడేశ్వర స్వామి వారి దేవాలయం ఉన్నది. ఇది అతి ప్రాచీనమైన ఆలయం. ఈ ఆలయము చోళరాజులో రాజేంద్రచోళుని మనుమడు త్రిభువన చక్రవర్తి అనే రాజు క్రీ.శ. 1054లో నిర్మించాడని తెలియుచున్నది. ఈ ఆలయము తూర్పు ముఖంగా ఉండి, గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా నిర్మించ బడినది. గర్భాలయంలో చౌడేశ్వరుడు, అంతరాలయంలో కుడిభాగాన పార్వతీ అమ్మవారు, ఎడమభాగాన వీరభద్రుడు, భద్రకాళి, మండపంలో కుడిభాగాన కుమారస్వామి, ఎడమ వైపు వినాయకుడు, మధ్యభాగంలో నందీశ్వరుడు ఎదు రుగా ధ్వజస్తంభము మొదలగు ప్రతిష్టలు కలవు. ఈ ఆలయ ఆవరణలో మరొక ఆలయం కలదు. ఈ ఆలయము రాజ్యలక్ష్మి సమేత శ్రీ కేశవాలయమని పిలువబడుచున్నది. ఈ దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు, మండపంలో గరుడాళ్వారు దర్శనమిచ్చుచున్నారు. ఈ ఆలయమున కెదురుగా ధ్వజస్తంభముతో పాటు ఆంజనేయుడు కూడా ప్రతిష్టించబడి భక్తులచే పూజలందుకొనుచున్నాడు. ఈ విధంగా ఒకే ఆవరణలో శివ, కేశవాలయాలు ఉండి ప్రజలకు శివకేశవ అభేదతత్వమును బోధిం చుచుండును. ఈ ఆలయాలలో చౌడీశ్వరాలయ గోపుర శిఖరం చాలా ప్రసిద్ధమైనది. తంజావూరులోని బృహదీశ్వరాలయము తరువాత ఇంత గురుత్వంగల శిఖరము ఇచట తప్ప మరెచటాలేదని చెప్పుచుందురు.

ప్రతినిత్యం ఈ ఆలయంలో జరిగే అర్చనలు, ప్రత్యేక పూజలే కాకుండా శ్రీరామ నవమి ఉత్సవములు, దసరా ఉత్సవములు, కార్తీక దీపోత్సవము, ధనుర్మాసోత్సవము, శివరాత్రి ఉత్సవములతోపాటు, ప్రతిరోజూ సంకీర్తనం, గీతా పారాయణం విష్ణు సహస్ర నామపఠనం మొదలగునవి భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుతారు.

శ్రీ సాయిబాబా మందిరం - పేరేచర్ల

గుంటూరుజిల్లా, గుంటూరు పట్టణానికి సుమారు 10 కి.మీ., దూరంలో, గుంటూరు నుండి నరసరావుపేటకు వెళ్ళే దారిలో పేరేచర్లలలో శ్రీ సాయిబాబా మందిరం ఉన్నది. ఈ ఆలయంలో ఎప్పుడూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. 1990లో తొలిసారి షిరిడికి వెళ్ళి వచ్చిన ధర్మకర్తలు, ఛైర్మన్ ఇతర భక్తులు కొందరు



తమకు వ్యాపారంలో వచ్చిన లాభాలతో కేవలం 11 నెలల వ్యవధిలో ఆలయ నిర్మాణం చేసి, 2006, ఫిబ్రవరిలో సాయినాథుని ప్రతిష్ఠించారు.

ఆలయం ఎత్తైన గోపురంతో, ప్రాకారాలపైన సాయిబాబా విగ్రహమూర్తులు నెలకొని ఉన్నాయి. ప్రధానద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులుగా గదాధరులైన దేవతామూర్తులు ఉన్నారు. ప్రధాన మందిరంలో సింహాసనాధీశుడైన బాబా పాలరాతి విగ్రహం సర్వాలంకారాలతో దర్శనమిస్తున్నాడు. సాయినాథుని ఎదురుగా నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. ఇక్కడ భక్తులు స్వయంగా అభిషేకం చేసుకొనే అవకాశం కలదు. ఆలయంలో ప్రతి నిత్యం హారతులు, అభిషేకాలు, పూజాది కార్యక్రమాలతో పాటు ప్రతి గురువారం ప్రత్యేకపూజలు, విశేష అర్చనలు జరుగుతాయి.



కైలాసగిరి క్షేత్రం - పేరేచర్ల



ఈ దేవాలయం గుంటూరు నుండి 11 కి.మీ. దూరంలో పేరేచర్ల అనే గ్రామము వద్ద 64 ఎకరాలు విస్తీర్ణం గల ఉరవకొండ పైన ఉంది. దీనిని శ్రీకారుమూరి వీరరాఘవరావు గుప్త 1972 సం॥లో నిర్మించారు. కొండపైకి కొంతదూరం మెట్లు కూడా కట్టించారు. ఘాట్ రోడ్ కూడా దాతల సహకారంతో వేయించారు. భక్తులు నెలనెలా ఇచ్చే విరాళాలతో స్వామివారికి ధూప దీప నైవేద్యములు చేయుచున్నారు. నాగేంద్రస్వామి పుట్ట, నవగ్రహాల గుడి, కన్యకాపరమేశ్వరి గుడి, వినాయకుడి విగ్రహం, కుమారస్వామి విగ్రహం ఉన్నవి. ఈ ఆలయంలో 30 అడుగుల రాతి ధ్వజస్థంభం ఉన్నది. శివరాత్రి నాడు లక్షలాది భక్తులు భక్తి ప్రపత్తులతో స్వామి దర్శనం చేసుకుంటారు. నిత్యంజరిగే పూజలతో పాటు కార్తీకమాసం, తొలి ఏకాదశికి మహాశివరాత్రి మొదలగు పర్వదినాలలో భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడకి వచ్చి పూజలు నిర్వహించి తరిస్తారు.

శ్రీ ఉమా మహేశ్వరస్వామి దేవస్థానం - గుంటూరు

గుంటూరు జిల్లా, గుంటూరు పట్టణం, కొత్తపేటలో శ్రీ ఉమా మహేశ్వరస్వామి వారి దేవాలయం ఉన్నది. 1896 సంవత్సరములో ఈ దేవాలయం నిర్మించబడింది. ఈ ఆలయానికి స్థలంను ఇచ్చి, ఆలయ నిర్మాణం చేసినవారు గుంటూరు వాస్తవ్యులు శ్రీ నడింపల్లి రామయ్యగారు. ఈ దేవాలయంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి, బాలా త్రిపురసుందరి దేవి కొలువై ఉన్నారు. మహా గణాధిపతి, కుమారస్వామి, సత్యనారాయణ స్వామి, చండీశ్వర స్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, సూర్యదేవాలయం మరియు శంకరాచార్య దేవాలయం మొదలైన ఉపాలయాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయం నవగ్రహాల పూజలకు ప్రసిద్ధి చెందింది. ప్రతి శనివారం సుమారు 500 మంది భక్తులు ఇక్కడ నవగ్రహములకు భక్తిప్రపత్తులతో పూజలు చేసుకుంటారు. చతుర్ధశి రోజు ఇక్కడ కళ్యాణం, పౌర్ణమిరోజు పూర్ణాహుతి మరియు అన్నదానం జరుగును. ప్రతిరోజు నిత్యపూజలతో పాటు విజయదశమి 10 రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాలతో అలంకరిస్తారు. ఇక్కడ నాగేంద్రస్వామి పుట్ట, రావిచెట్టు, వేపచెట్టు కలిసి ఉన్నాయి. దీనిని అశ్వర్ధనాగరీ వృక్షం అంటారు.

శ్రీ బాలకోటేశ్వరస్వామి - క్వారీ



ఈ దేవాలయం గుంటూరు నుండి తెనాలి వెళ్ళే మార్గంలో గుంటూరుకు 14 కి.మీ. దూరంలో శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి వారు బాల కోటేశ్వరస్వామిగా కొలవ బడుచున్నారు. ఇది చాలా ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం. ఇక్కడ శివలింగం చోళుల కాలం నాటిది. కాలక్రమేణా కాలగర్భంలో మరుగున పడింది. ఆ తర్వాత కాలంలో ఇక్కడ జరిగిన క్వారీ త్రవ్వకాలలో బయట పడినది. ఇక్కడ ఉన్న శివలింగం మహిమాన్వితమని భక్తుల నమ్మకం. ఇక్కడ కార్తీక మాసంలో పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించ బడతాయి. మహాశివరాత్రికి చుట్టుప్రక్కల గ్రామాలనుండి ప్రభలుకట్టి భక్తులు వస్తారు. భక్తులు శివనామ స్మరణతో జాగారంచేసి తరిస్తారు.

శ్రీ ఆంజనేయస్వామి ఆలయం - గుంటూరు



గుంటూరుజిల్లా గుంటూరు లోని కొత్తపేట యందు ఈ ఆంజనేయ స్వామి వారి ఆలయం కలదు. పూర్వం ఈ కొత్తపేట ప్రాంతాన శ్యామలాదాసు బావాజీ అనే భక్తుడు మూడు ఆలయాలను నిర్మించాడని స్థానికులు చెప్పుదురు. అందులో ఒకటి శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయం కాగా, రెండవది శ్రీ జగన్నాథస్వామి వారి ఆలయం. ఈ ఆలయం ఆంజనేయస్వామి వారి ఆలయం సమీపములోనే కలదు. మూడవది శ్రీ వేంకటేశ్వరాలయం. ఈ ఆలయం కూడా ఆంజనేయ స్వామివారి ఆలయానికి కొంచెం దూరంలో ఉన్నది. ఆనాడు ఈ మూడు ఆలయాలు కూడా శ్యామలదాసు బావాజీవారి ఆధీనంలోనే నడుచుచుండేవి. అందువల్లనే వానిని బావాజీ ఆలయాలు అని పిలిచెడివారు. తరువాత ఆ ప్రాంత ములో తోటలు పెంపొందాయి. అందుచే ఆ ఆలయాలను కొంతకాలం తోటల ఆలయాలు అని ప్రసిద్ధి పొందాయి. ఈనాడు క్రమక్రమంగా ఆ తోటలు జనా వాసాలుగా మారాయి. ఆ ప్రాంతమంతా కలిసి కొత్తపేటగా రూపొందింది. అందుచే ఇప్పుడు ఆ ఆలయాలు కొత్త పేట ఆలయాలుగా ప్రసిద్ధిచెందాయి.

ఈ ఆలయం ఉత్తరాభిముఖంగా ఉన్నది. గర్భాలయంలో ఆంజనేయస్వామి వారు మనకు దర్శనమిస్తాడు. ఈ ఆలయంలో ప్రతిష్టింపబడి ఉన్న ఆంజనేయుడు అత్యంత మహిమాన్వితుడని, ఆయనను ఆరాధించినచో పిశాచబాధలు, ఈతిబాధలు తొలగిపోవునని, మంచి ఆరోగ్యం, సంపదలు లభించగలవని, శాంతి, సౌఖ్యాలు చేకూరునని భక్తుల విశ్వాసం. ప్రతి సంవత్సరము ఈ దేవాలయంలో ధనుర్మాసములో తిరుప్పావై ఉత్సవము ఘనముగా నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతి నిత్యం తిరుప్పావై ప్రవచనములు ప్రవచించెదరు. మరియు సామూహిక ఆకుపూజలు నిర్వహించెదరు. ప్రతి సంవత్సరము ఉగాది, శ్రీరామనవమి, హనుమజయంతి, దేవీ నవరాత్రులు, దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి మరియు సంక్రాంతి పండుగలు అతి వైభవంగా జరుగుతాయి. ప్రతి సంవత్సరము మాఘమాసమునందు స్వామివారికి లక్ష ఆకుపూజ జరుపబడును.

గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి-గుంటూరు



ఈ దేవాలయం గుంటూరు పట్టణంలో ఎ.టి. అగ్రహారంలో రామనామక్షేత్రానికి సమీపాన కలదు. ఇది నూతనంగా నిర్మించిన క్షేత్రము. ఈ క్షేత్రమిచట ఏర్పడుటకు సమీపమందున్న రామనామ క్షేత్రమే ప్రేరకమని చెప్పవచ్చును. ఆవిధంగా ఇచట ఈ క్షేత్రం 1960 ఏప్రిల్ 28వ తేదీన శృంగేరీ పీఠాధిపతులు విద్యానంద భారతీస్వాములవారిచే ప్రతిష్టింపబడినది. ఈ ఆలయంలో గంగాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారు కొలువై ఉన్నారు. ఈ క్షేత్రం శివక్షేత్రమైనను, సామరస్యభావ సూచకంగా ఇచట కోదండ రామస్వామి వారి ఆలయం, ఆంజనేయస్వామి వారి ఆలయం, శారదా అమ్మవారి ఆల యాలు కూడా నిర్మించారు. ప్రతిరోజూ అర్చనలు, ప్రత్యేక పూజలే కాక లక్ష్మీ, బిల్వ పత్రార్చన, ఆరుద్ర ఉత్సవము, శివరాత్రి ఉత్సవము, ఫాల్గుణ పూర్ణిమ నాడు శివకల్యాణోత్సవము అత్యంత వైభవముగా జరుపుచుందురు. ఈ ఉత్సవ సమయాలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చి శివ, కేశవ స్వామి వార్లను దర్శించి స్వామివార్ల కృపకు పాత్రులవుతారు.

గుంటూరు తిరుపతి - గుంటూరు



గుంటూరు బృందావన గార్డెన్స్ ఐదో లైనులోని శ్రీ కంచికామకోటి పీఠ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం సుమారు పన్నెండు సంవత్సరాల క్రితం నిర్మించారు. పాలకమండలి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి గుంటూరు పట్టణానికే గర్వకారణంగా నిలిచేలా ఈ ఆలయాన్ని తీర్చిదిద్దారు. శ్రీ కంచి కామకోటి పీఠానికి దత్తత ఇచ్చారు. కంచిపీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆశీస్సులతో ఇక్కడ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ ఆలయంలో జరిగే పూజాది కాలు, ఉత్సవాలు అన్నీ దాదాపు తిరుమలలో జరిగే ఉత్సవాలను పోలి ఉండటంతో ఈ ఆలయానికి గుంటూరు తిరుపతి అనే పేరును భక్తులు నిర్ధా

రించుకున్నారు. సంవత్సరం పొడుగునా జరిగే ఉత్సవాల తీరు తిరుమల ఉత్సవాలను పోలి ఉండేలా ఆలయ పాలకమండలి ఒక పథకం ప్రకారం నిర్వహిస్తున్నారు. నిత్యం వేలాదిమంది భక్తులు ఈ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ స్వామివారి నిలువెత్తు దివ్యమంగళ స్వరూపం చూచి తీరవలసినదేగానీ, చెప్పనలవికాదు.

కాలే మస్తాన్ షా వలియా దర్గా - గుంటూరు



గుంటూరులో సుమారు 119 సంవత్సరాల క్రిందట ఓ అవధూత లాంటి వ్యక్తి పురవీధులలో సంచరించేవాడు. ఆయన భుజాన ఒక కావడి. అందులో ఓ వైపున గులక రాళ్లు, మరోవైపున చింపిరి గుడ్డలు, వెంట నడిచివచ్చే మేక, కుక్క, కోడి. ఇదీ ఆయన గురించి తెలిసినవారు చేసే వర్ణన. అది నల్ల మస్తానయ్య అవతార విశేషమని భక్తుల భావన. ఒకసారి ఈయన వెంట ఉన్న మేక, కుక్క, కోడి వీనిలో ఒకరు కోడిని దొంగిలించి కోసి కూర వండుచుండగా, విషయం తెలుసుకొని కోడిని పేరుపెట్టి పిలువగా కొక్కరోకో అని కూర చట్టి నుండి పరుగు పరుగున ఆయనకు సమీపించినదట. ఈ మహిమను చూసి ఆయనన అందరూ అవధూతగా భావించి పూజించారు. తాత్విక, ఆధ్యాత్మిక చింతనతో మెలిగే ఆయనను ప్రార్థిస్తే నమ్మినవారికి కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీరుస్తాడన్నది వారి విశ్వాసం. అన్ని మతాల వారూ ఆయనను పూజిస్తుంటారు. అందుకే గుంటూరు పరిసరప్రాంతాల్లో మస్తానయ్య, మస్తానమ్మ అనే పేర్లు అన్ని కులాల, మతాల వారిలోనూ కనిపిస్తుంటాయి. సాధారణంగా దర్గా నిర్వహణ కార్యకలాపాలు ముస్లిముల ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. అయితే కాలే మస్తాన్ షావలీయ దర్గాకు అనువంశిక ధర్మకర్తలు హిందువులే. ఉరుసు ఉత్సవాలకు పొరుగుజిల్లాల నుంచీ కూడా భక్తులు వస్తారు. ఉత్సవంలో సందల్ గుర్రం పేరిట ఓ ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో గంధం ఉన్న పెద్ద పాత్రతో ధర్మకర్త ముందు నడుస్తారు. వేడుక ముగిశాక ఆ చందనాన్ని అందరికీ పంచుతారు. ఉరుసులో ఊరేగించే అశ్వాన్ని మస్తానయ్య ఆవహిస్తాడని భక్తుల విశ్వాసం. మస్తానయ్య ఉపయోగించిన కన్నావారితోటలోని కుర్చీ నుంచి మొదలై సంగడిగుంటలో ఆయన పడుకున్న మంచం వరకూ ఊరేగింపు సాగుతుంది. నల్ల మస్తానయ్య కోరుకునేది తీపిబూందీ మాత్రమేనట. అందుకే ఆ బూందీనే ఇచ్చుట ప్రసాదంగా పంచుతారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం - గుంటూరు



గుంటూరుజిల్లా, గుంటూరు పాతబస్టాండ్ వద్ద లాలా పేటలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో నడుస్తుంది. కొత్తబస్టాండు నుంచి దేవస్థానానికి దాదాపు కిలోమీటరు దూరం ఉంటుంది. సుమారు 400 సంవత్సరాల క్రిందట ఈ ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి విగ్రహం వెలిసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. తొలినాళ్లలో అయోధ్య ముకుందదాసు బావాజీ ఆధీనంలో ఇక్కడి దేవస్థానం నిర్వహణ జరిగేది. కాలక్రమేణా శ్రీనివాసా సేవాసమితి ట్రస్టు ఆధీనంలో దేవస్థానం నిర్వహణ జరిగింది. 1965 సంవత్సరంలో శ్రీ వేంకటే శ్వరస్వామి దేవస్థానాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకుంది. ప్రతినిత్యం, అష్టోత్తర, సహస్రనామ పూజలతో పాటు ప్రతి శనివారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తుంటారు. అప్పుడు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ సాయినాథ సన్నిధానం - గుంటూరు

గుంటూరుజిల్లా, గుంటూరులోని విద్యానగర్‌లో 3వ లైనులో శ్రీ సాయినాథ సన్నిధానం ఉన్నది. 2007వ సంవత్సరం, ఏప్రిల్ 29వ తేదీన స్థానిక సాయి భక్తులతో, శ్రీ సద్గురు సాయిబాబా సర్వమత సేవాసమితి ఆధ్వర్యంలో ఈ సన్నిధానం నిర్మించారు. ప్రధాన మందిర ప్రవేశద్వారంపై సర్వమత చిహ్నాలతో కూడిన సాయినాథుని దివ్య ప్రతిమ మందిరం వెలుపల గోడలపై విష్ణువు, శివుడు, దత్తాత్రేయుడు, లక్ష్మీ సరస్వతి, జగన్మాత ఆకృతులు ఉన్నాయి. ప్రధాన మందిర గోపురం వివిధ నగిషీ ఆకృతులతో ఆలయ మందిరం తలుపులపై ఒక వైపు దత్తాత్రేయస్వామి, మరోవైపు గణపతి స్వరూపాలు దర్శనమిస్తాయి. గర్భాలయంలో సాయినాథుడు ప్రత్యేకపీఠంపై, సింహాసనాసీనుడై, సర్వాలంకారాలతో దర్శనమిస్తాడు. ప్రధాన మందిరం దిగువనే నేల మాళిగలో సాయిధ్యానమందిరం ఉంది. దీనిని ద్వారకామాయిగా వ్యవహరిస్తాయి.

ప్రతి గురువారం మరియు పర్వదినాలలో ఈ సాయి సన్నిధానం భక్తులతో కిటకిటలాడుతుంది. ప్రతినిత్యం బాబాకు హారతులు, అభిషేకాలు, నిత్యార్చనలు జరుగుతాయి. శ్రీరామనవమి, దత్తజయంతి, గురుపూర్ణిమ వంటి పర్వదినాలలో విశేష పూజలు ఘనంగా జరుగుతాయి. ఈ రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

శ్రీ వీరభద్రస్వామి ఆలయం - మాచర్ల



గుంటూరు నుండి హైదరాబాద్‌కు వెళ్ళే మార్గంలో, మాచర్ల వద్ద శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయం ఉన్నది. ఇది పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో శ్రీ వీరభద్రస్వామి కొలువై ఉన్నాడు. ఈ ఆలయం సుమారు 12వ శతాబ్ధంలో నిర్మించబడినట్లు తెలియుచున్నది. శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో మూలవిరాట్టు అత్యంత అద్భుతంగా, అందంగా మనకు దర్శనమిస్తాడు. ఈ ఆలయ ప్రాంగణంలో ఎడమ వైపు శ్రీ సుబ్రహ్మణ్యస్వామిగా ఎత్తైన నాగశిల్పం, కుడివైపున కాలభైరవ విగ్రహాలు ఇచ్చట పూజలందుకొనుచున్నవి. ఇదే ప్రాంగణములో శ్రీ ఇష్ట కామేశ్వరాలయం ఉంది.

గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయం - గుంటూరు



గుంటూరు జిల్లా, గుంటూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయం ఉన్నది. ఈ ఆలయం ఎంతో పురాతనమైనదిగా ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయంలోని స్వామిని అగస్త్యుడు స్వయంగా ప్రతిష్టించినట్లు తెలియుచున్నది. చాళుక్య చక్రవర్తులకు సామంతరాజులైన పరిచ్ఛేద వంశస్తులు గుంటూరును రాజధానిగా చేసుకొని పాలించేవారు. క్రీ.శ. 12వ శతాబ్దంలో పరచ్ఛేది పండయరాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనాలను బట్టి తెలియుచున్నది. అంతకుముందు వేల సంవత్సరాల క్రితం దక్షిణ దేశయాత్రలో భాగంగా ధార్మికోద్ధరణ కోసం అగస్త్య మహాముని పలు ప్రాంతాలలో శివలింగాలను ప్రతిష్టించారు. నేటి గుంటూరు ప్రాంతంలోని ఓగేరు సమీపంలో శివలింగాన్ని ప్రతిష్టించారు. ఆ ముని పేరిటే ఇక్కడ ఈశ్వరుడు అగస్త్యేశ్వరుడుగా పిలువబడుచున్నాడు. స్వాగత ద్వారంపైన శివపార్వతులు, గణపతి, కుమారస్వామి విగ్రహాలు ఉన్నాయి. ప్రధాన ఆలయ గోపురంపై వివిధ భంగిమలలో శివస్వరూపాలు ఉన్నాయి. ఆలయ మండప



పైభాగంలో శివపార్వతుల కళ్యాణఘట్టానికి సంబంధించిన శిల్పాలు ఉన్నాయి. ప్రధాన ఆలయం ముంగిట ఉన్న ధ్వజస్తంభం పద్మాకారంలో నెలకొని ఉన్నది. గర్భాలయ ముఖమంటపానికి ఎదురుగా గల ప్రత్యేక మండపంలో నందీశ్వరుడు కొలువైఉన్నాడు. గర్భాలయ ముఖమంటపం చాళుక్యుల కాలంనాటి శిల్పకళా ప్రాభవానికి సాక్ష్యాలుగా భాసిల్లుతాయి. గర్భాలయ ముఖమంటపంలో కుడివైపు వినాయకుడు, ఎడమవైపున కుమారస్వామి, మరోప్రక్క గంగా పార్వతీ సమేత శ్రీఅగస్త్యేశ్వరస్వామి వారి పంచలోహ విగ్రహాలు ఉన్నాయి. గర్భాలయంలో మహాతేజంతో శ్రీ అగస్త్యేశ్వరస్వామి శివలింగరూపంలో దర్శనమిస్తాడు.

ఈ ఆలయ ప్రాంగణంలో పార్వతీదేవికి ప్రత్యేక మందిరం ఉన్నది. గర్భాలయంలో అమ్మవారు సర్వాలంకార భూషితయై, కొలువై ఉన్నది. అగస్త్యేశ్వరస్వామి వారికి ప్రతినిత్యం పూజాది అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి సోమవారం, మాసశివరాత్రి సందర్భంలో పంచమృతఅభిషేకాలు కన్నుల పండువుగా జరుగుతాయి. అమ్మవారికి ప్రతినిత్యం అర్చనాదులతో పాటూ శుక్రవారంనాడు విశేషంగా కుంకుమార్చనలు జరుగుతాయి.


ఈ ఆలయంలో శ్రీ స్వామివారి కళ్యాణమండపం ఉన్నది. క్రీ.శ.1779లో చెవిడి కొంట్ల రాములు అనే శివభక్తుడు ఈ కళ్యాణమండపాన్ని నిర్మించినట్లు ఇక్కడ శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రినాడు శివపార్వతుల కళ్యాణమహోత్సవాన్ని ఈ మండపంలో వైభవంగా నిర్వహిస్తారు. ఈ మండపానికి చేరువలోనే గల నాగశిలా శాసనాన్ని బట్టే ఈ ఆలయ పూర్వ వైభవం ప్రపంచానికి వెల్లడైంది. పరిచ్ఛేద వంశానికి చెందిన పండయరాజు ఈ శిలాశాసనాన్ని వేయించారు. ఈ శివాలయంలో మరొక శివాలయం ఉండుట ఒక విశేషం. కళ్యాణమంటపానికి సమీపంలో ఏకాంబరేశ్వరస్వామివారి సన్నిధి ఉన్నది. పానపట్టంపై ఉన్న శివలింగం పంచఫణితో, మకరతోరణ యుక్తంగా నెలకొని ఉంటుంది. అగస్త్యేశ్వరస్వామి వారితో పాటూ ఏకాంబరేశ్వరస్వామి వారికి కూడా నిత్య పూజాదికాలు జరుగుతాయి. ఏకాంబరేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో కామాక్షి అమ్మవారి సన్నిధి ఉన్నది. సర్వాలంకార భూషితయైన అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీ వీరభద్రస్వామి, శ్రీ ఆదిశంకరాచార్యులు, నవగ్రహ మండపం, అయ్యప్ప స్వామి సన్నిధి మొదలగు వారు ఇచ్చట ఉన్నారు. అయ్యప్ప సన్నిధికి ప్రక్కనే జమ్మిచెట్టు ఉన్నది. ఈవృక్షం క్రింద ఉన్న నాగప్రతిమల్ని భక్తులు దర్శించి పూజిస్తారు.

గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం - గుంటూరు



గుంటూరుజిల్లా, గుంటూరులోని రామచంద్ర అగ్రహారంలో గంగా భ్రమరాంబసమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇది గుంటూరులోని నల్లచెరువు సమీపంలో, కోనేరు చెంతనే గుంటూరు నడిబొడ్డున ఉన్నది. ఈ ఆలయం ప్రాచీనమైనది. ఈ ఆలయంలో శివకేశవులు ఇద్దరూ కొలువై ఉన్నారు. ఈ ఆలయాన్ని 1762లో పన్నాల పరదేశి సోమయాజిగారు ప్రతిష్ఠించారని తెలియుచున్నది. ఈ ఆలయం విశాల ప్రాంగణంలో ఉండి, స్థూపకార రాజగోపురంతో నిర్మించబడింది. ఈ తరహా రాజగోపురాలు అత్యంత అరుదుగా ఉంటాయి. 5 అంతస్తులలో పూర్తి స్థూపాకారంలో ఉన్న ఈ గోపురం విలక్షణమైన నగిషీలతో, అందంగా నిర్మించబడింది. ఈ గోపురం ద్వారా భక్తులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశిస్తారు. ఆలయ గోపురంపై శిలాశాసనాలు, శిల్పాలు ఉన్నాయి. ప్రధాన ఆలయ గోపురం బంగారు వర్ణంతో మెరుస్తూ ఉంటుంది. ఇక్కడి ధ్వజస్తంభానికి ఎంతో ప్రత్యేకత, ప్రాధాన్యత ఉంది. సంపూర్ణ కవచాలంకృతంగా విలసిల్లే ఈ ధ్వజ స్తంభంపై శివ పార్వతులు ఆనందతాండవం చేస్తుండగా, విష్ణువు, బ్రహ్మ వాయిద్యాలు మ్రోగించే ఆకృతులు, సప్తఋషులు, నవగ్రహాలు, అష్టదిక్పాలకులు, పంచపాలకులు, శివగణాలతో ఈ ధ్వజస్తంభం దర్శనమిస్తుంది. ఆసియా ఖండంలోని హైందవ దేవాలయాలలో ఈ తరహా ధ్వజస్తంభం ఇంక ఎక్కడా లేదని పురావస్తు శాఖ ప్రకటించడాన్ని ఈ ధ్వజ స్తంభం విశిష్టత తెలుస్తుంది.

ఆలయ ముఖమంటపంపై, భక్తకన్నప్ప, శివపార్వతులు, మార్కండేయవృత్తాంత శిల్పాకృతులు ఉన్నాయి. గర్భాలయంలో పానవట్టంపై మల్లేశ్వరస్వామి లింగాకారంలో దర్శనమిస్తాడు. ఈ ఆలయానికి సంబంధించిన ఒక కథ ప్రచారంలో ఉంది. పన్నాల పరదేశి సోమయాజి అనే శివభక్తుడు గొప్ప మంత్ర శాస్త్రవేత్త. యాత్రల నిమిత్తం కీకారణ్యంలో ప్రయాణం చేస్తుండగా ఒక పులి ఆయనపై దాడిచేయగా, తన మంత్ర బలంతో, భుజబలంతో సోమయాజి పులిని వధించాడు. జంతు హత్యాపాతకం నుండి బయటపడ్డానికి పులిని వధించిన ప్రాంతంలోనే యజ్ఞయాగాదులను నిర్వహించి, శివలింగాన్ని, నందీశ్వరుడ్ని ప్రతిష్ఠించాడని అదే ఇప్పటి మల్లేశ్వరస్వామి వారి



ఆలయంగా వెలుగొందుతుందని తెలుస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలోనే భద్రకాళి సమేత వీరభద్రస్వామి సన్నిధి, గణేశ మందిరం, మరోవైపు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలు ఉన్నాయి. ఈ మందిరానికి సమీపంలోనే వల్మీకం అనగా కృత్రిమమైన పుట్ట, మరోవైపున భారీ ఏకశిలతో తీర్చిదిద్దిన సర్పాకృతి దర్శనమిస్తుంది. ఈ ఆకృతిని సుబ్రహ్మణ్యస్వామికి సంకేతంగా భక్తులు పూజిస్తారు. ఈ సన్నిధిలో కోదండరామస్వామి ఆలయం ఉన్నది. ఇక్కడ ఉన్న అర్చామూర్తులను అయోధ్యలో రూపొందింపచేసి, అక్కడినుండి పాదయాత్రగా ఈ ఆలయానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. గర్భాలయంలో శ్రీరాముడు సీతా, లక్ష్మణ సమేతంగా కొలువై ఉన్నాడు. ప్రసన్నాంజనేయస్వామి మంది రం, నటరాజ స్వామి, ఆదిశంకరాచార్యులవారి మందిరం, నవగ్రహ మంటపం ఉన్నాయి. ఈ ఆలయంలో ప్రతినిత్యం పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు పండుగ పర్వదినాలలో విశేషపూజలు నిర్వహిస్తారు. నాగులచవితి, నాగపంచమి, సీతారాముల కళ్యాణం, వైశాఖమాసంలో శుద్ధషష్టి నుండి బహుళ షష్ఠి వరకు 16 రోజులపాటూ బ్రహ్మోత్సవాలు, శ్రీదేవి శరన్నవరాత్రులు, మహాశివరాత్రి, హనుమజ్జయంతి, శంకర జయంతి మొదలగు ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయి.

శ్రీరామనామక్షేత్రం - గుంటూరు



గుంటూరుజిల్లాలో జిల్లా కేంద్రమైన గుంటూరులో రామచంద్రాపురం అగ్రహారమందు శ్రీరామనామక్షేత్రం కలదు. ఈ క్షేత్రంలోని రామాలయం రాగం ఆంజనేయుల వారి ఆధ్వర్యంలో ఏర్పడిన నగర సంకీర్తనా సంఘము వారిచే 1936 ఏప్రిల్ 19న నిర్మించబడినది. ఈ క్షేత్రంలో శ్రీరామచంద్రాలయం తూర్పు ముఖంగా ఉన్నది. ఈ ఆలయం ముందు విశాలమైన పెద్ద మండపం కలదు. ఆ ఆలయ పరిసరాలలో పవిత్రమైన కొలను, జ్ఞానమందిరాలు, పవళింపు సేవా మందిరం, గీతా మందిరం, యజ్ఞశాల, రామకోటి స్థూపం, స్వర్ణోత్సవ భవనం, కళ్యాణ సదనం, ప్రసన్న మందిరం

మొదలైనవిఉన్నాయి.ప్రధాన ఆలయానికి ముందు మండపంలో చుట్టూ రామాయణం లోని ఘట్టాలను తెలియజేయు అనేక ప్రతిమలు ఎంతో ఆకర్షణగా తీర్చిదిద్దబడ్డాయి. ఈ విధంగా ఈ ఆలయం సర్వాంగ సుందరమై నిరంతరం 366 రోజులు 24 గంటలు రామనామ సంకీర్తనలతో భక్తులను ఆకర్షిస్తూ, వారిని భక్తి పరవశులను చేయుచున్నది. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో రామకోటి ఉత్సవాలు ఘనంగా జరుపుతారు. ఆ సందర్భంగా సీతారాముల కళ్యాణము, అంబారి ఉత్సవము, తెప్పోత్సవంతోపాటుఇంకా అనేకఉత్సవాలు ఎంతోఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం - రాయపూడి



శ్రీ గంగా–పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవాలయం మరియు వీరభద్ర స్వామి దేవాలయం (వీరేశ్వరస్వామి) చాలా పురాతనమైన దేవాలయాలు. సోమే శ్వరస్వామి దేవాలయం రాయల కాలం లోనే నిర్మించబడినదని స్థానికుల అభి ప్రాయం. వీరభద్రస్వామి దేవాలయం కాకతీయుల కాలం నాటిదని తెలుస్తుంది. ఈ ఆలయం వద్ద కాకతీయుల కాలం నాటికి చెందిన ధ్వజస్థంభం, శిలా శాసనం కూడా ఉన్నవి. శ్రీకృష్ణదేవరాయలు పేరు మీదే ఈ గ్రామానికి "రాయపూడి" అనే పేరు వచ్చినది. శిధిలావస్థకు చేరిన ఈ దేవాలయాలను స్థానికులు పెద్దలు, భక్తుల సహాయ సహకారంతో అభివృద్ధి పరిచారు. శ్రీసోమేశ్వరస్వామి దేవాలయాన్ని శైవక్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శివస్వామి చేతుల మీదుగా పునఃప్రతిష్ట జరుపబడింది. ఆనాటినుండి ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేకపూజలు ఉత్సవాలు కూడా జరుగుతున్నాయి.

స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి - నల్లపాడు



గుంటూరు నుండి నరసరావుపేట రోడ్‌లో 10 కి.మీ. దూరంలో నల్లపాడు గ్రామము కలదు. దీనికి సుమారు 2 కి.మీ. దూరంలో కొండ పైన స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఉన్నది. అందువలన ఈ గ్రామమును 'నరసింహపురం' అని కూడా అంటారు. ఇక్కడ

అనేక పురాతన దేవాలయాలు కలవు. ఈ ఆలయంలో ధ్వజస్తంభము మరియు పంచఫణుల నాగశిల్పం, భృగుల బొమ్మలు నైపుణ్యంతో చెక్కబడి ఉన్నవి. ఇచ్చట పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు కూడా జరుగుతాయి.

శ్రీ వీరభద్రస్వామి దేవాలయం - యనమదల



గుంటూరు నుండి చిలకలూరిపేట వెళ్ళే (యన్.హెచ్-5) మార్గంలో యనమదల గ్రామము నందు శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం కలదు. ఈ ఆలయం క్రీ.శ.14వ శతాబ్దంనకు చెందిన దిగా భావిస్తారు. పూర్వం దీనిని చోళరాజులు నిర్మిం చినదిగా ప్రతీతి. శ్రీ మల్లయాచార్యుల వారు శ్రీ వీరభద్రస్వామి విగ్రహం, నందీశ్వర విగ్రహములు తయారు చేయించుకొని వేరే గ్రామంలో ప్రతిష్టించుటకు బండిలో తీసుకు వెళ్తూ దారిలో యనమదల గ్రామానికి చేరుకో గానే చీకటి పడినది. ప్రక్కనే ఉన్న మర్రిచెట్టు వద్ద విశ్రాంతి తీసుకొనదలచి, ఆ చెట్టుక్రింద పడుకున్నాడు. అప్పుడు ఈ స్వామివారు మల్లయాచార్యులకు కలలో కనిపించి, “నేను ఇక్కడే వెలుస్తాను. ఈ విగ్రహాన్ని ఇక్కడే ప్రతిష్టించాలి” అని స్వామి చెప్పారు. అప్పుడు మల్లయాచార్యులు “ఈ విగ్రహాలను ప్రతిష్టించటానికి నాకు ధనం, ధాన్యం లేవు స్వామీ” అని చెప్పగా అప్పుడు స్వామి “మల్లయాచార్య! ఉదయాన్నే నీ బండికి కట్టిన దున్నపోతులను నీళ్ళు త్రాగటానికి వదులు, నీకు ప్రత్యామ్నాయం చూపిస్తా” అని చెప్పగా, మల్లయాచార్యులు ఉదయమునే దున్నపోతులను వదలగా అవి దగ్గరలో ఉన్న చెరువులో నీళ్ళు త్రాగి, స్నానం చేసి, బయటకు వచ్చేటపుడు కొమ్ములకు లంకెబిందెలు తగిలించుకొని వచ్చాయి. ఆ ధనంతో మల్లయాచార్యులు వారు యనమదలలో శ్రీ వీరభద్రస్వామి విగ్రహాన్ని, నందీశ్వరుడ్ని అతి వైభవంగా ప్రతిష్ఠించారు. ఆ తర్వాత వచ్చిన రాజులు ఇక్కడ ముఖమండపాన్ని కట్టించి, వీర భద్రుని శాంతికోసం అమ్మవారిని కూడా ఆలయ ప్రాంగణంలోనే ప్రతిష్టించారు. ఇచ్చట నిత్య ధూపదీప నైవేద్యాలతో పాటు పండుగ మరియు పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు ఘనంగా జరుపుతారు.

శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం - యనమదల



గుంటూరు నుండి చిలకలూరిపేట వెళ్ళే (యన్. హెచ్–5) మార్గంలో యనమదల అను గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం కలదు. ఈ దేవాలయం క్రీ.శ.1286 సం.లో నిర్మించినట్లు తెలుస్తున్నది. ఈ ఆలయాన్ని కాకతీయ రాజైన గణపతి దేవునికుమార్తె గణపాంబిక నిర్మించినదనిస్థానికుల అభిప్రాయం. గణపాంబికను ధరణికోటపాలకుడు అయిన బేతరాజుకు ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయిన కొన్నాళ్ళకే బేతరాజు మరణించటంతో ఈమె రాజ్యపాలన చేసినది. భర్త పేరు మీద ఈమె అనేక దానధర్మాలు చేసినది. అంతేకాక ఈమె ఎన్నో "విష్ణు" ఆలయాలను నిర్మింపచేసింది. అందులో భాగంగా యనమదల గ్రామంలో కూడా శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయాన్ని కట్టించి, విగ్రహం ప్రతిష్ఠించి, అంగరంగ వైభవంగా స్వామి వారికి ఉత్సవాలు కూడా చేసినది. స్వామివారి ధూప, దీప నైవేద్యాలకు అనేక భూములు, ఇతర అవసరమైన వసతులు అనగా బావులు, పూలతోటలు మొదలైనవి వాటికి కూడా ఏర్పాట్లు చేసినది. ఇచ్చట ప్రతిరోజు జరిగే పూజలతో పాటు, కృష్ణాష్టమి, దసరా, ముక్కోటి, సంక్రాంతి, కళ్యాణోత్సవం మొదలైన ఉత్సవాలు వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుగుతాయి. ఈ ఆలయంలో కొంతమంది రాజుల శాసనాలు కూడా ఉన్నాయి.

శ్రీ సీతారామస్వామి దేవాలయం - యనమదల

ఈ దేవాలయం గుంటూరు నుండి చిలకలూరిపేట వెళ్ళే మార్గంలో యనమదల అను గ్రామంలో కలదు. ఈ దేవాలయం చాలా పురాతన దేవాలయం. శిథిలావస్థలో ఉన్న ఆలయం పునర్నిర్మాణం చేయబడింది. ఈ ఆలయాన్ని భక్తులు రెండవ భద్రాదిగా భావిస్తారు. ఇక్కడ గాలిగోపురం 4 అంతస్తులను కలిగి ఉంది. ఈ ఆలయంలో పెద్ద రథం ఉన్నది. రథచక్రం ఎత్తు సుమారు 5 అడుగులు ఉంటుంది. ఈ రామాలయం నిర్మాణం తర్వాత దేవస్థానానికి సంబంధించిన కోనేరు తవ్వుతుండగా ఆ కోనేరులో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం లభించింది. అప్పుడు స్వామి వారు ఒక భక్తుని వంటి మీదకు వచ్చి "సీతారామస్వామి దేవస్థానంలోనే నన్ను కూడా ప్రతిష్ఠించాలని చెప్పగా, ఆ ప్రకారం లక్ష్మీ నరసింహస్వామిని ఈ దేవాలయంలో ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తుంది. ఇక్కడ నిత్యపూజలతో పాటు పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఉత్సవాలు కూడా జరుగుతాయి.

శ్రీ సంగమేశ్వర దేవాలయం - సంగం జాగర్లమూడి



గుంటూరుజిల్లాలో తెనాలికి దగ్గరలో సుప్రసిద్ధమైన సంగం జాగర్లమూడి గ్రామంలో ఈ ఆలయం కలదు. ఇది చాలా ప్రాచీన ఆలయము. సంగమేశ్వర దేవాలయం చుట్టూ సువిశాలమైన ఆవరణ ఉంది. పూర్వం అత్రి మహాముని ఈ ప్రాంతానికి వచ్చి, ఇచట సంగమేశ్వరుని ప్రతిష్టించి ఆలయమును కట్టించాడని స్థలపురాణం చెప్పుచున్నది. కాని చరిత్ర మాత్రం క్రీ.శ. 17వ శతాబ్దాంతమున ఈ ప్రాంతమును పాలించిన వెలమ రాజులు శ్రీ సంగ మేశ్వరస్వామిని ప్రతిష్టించి, వారే ఈ ఆలయానికి కొంత భూమిని దానముగా ఇచ్చారని తెలియుచున్నది. విశాలమైన ఆవరణ, ఆ ఆవరణ చుట్టూ ఉన్నతమైన ప్రాకారము, ఆ ప్రాకారం లోపల తూర్పు ముఖమై ఉన్న ఈ ఆలయములో గర్భగృహమునందు శ్రీ సంగమేశ్వరుడు, అంతరాలయ మున కుడివైపున వినాయకుడు, ఎడమవైపున కాశీవిశ్వేశ్వరుడు మండపమున నందీశ్వరుడు మొదలగు ప్రతిష్టలు కలవు. ఉత్తర దిశయందు ప్రాకా రము వద్ద కొన్ని వృక్షాలు, నాగ ప్రతిమలు, కాలభైరవుడు, వంటశాల, యజ్ఞశాల మొదలగునవి ఉన్నాయి. దక్షిణ దిశయందు కళ్యాణ మండపము, వీరభద్రేశ్వరాలయము పార్వతీమాత ఆలయము, పాప వినాశకేశ్వరాలయము, నవగ్రహ మండపము ఉండగా, తూర్పు దిశయందు ప్రాకార సమీపంలో ఒక పెద్ద సత్రము కలదు. ఇచ్చట ప్రతిరోజు అర్చనలు, ప్రత్యేకపూజలే కాక, సంవత్సరాది నాడు జరిగే ఉత్సవము, దసరా ఉత్సవము, కార్తీక మాస ఉత్సవము, శివరాత్రి ఉత్సవము మరియు బ్రహ్మోత్సవములు కూడా భక్తిశ్రద్ధలతో అతివైభవంగా జరుగును.

శ్రీ పాత పాటేశ్వరీ దేవి - గురజాల



గుంటూరు జిల్లా గురజాల గ్రామములో శ్రీ పాతపాటేశ్వరీదేవి ఆలయం కలదు. ఇది ప్రాచీనమైన ఆలయం. ఈ పాటేశ్వరీ దేవి గ్రామదేవత అని కొంత మంది స్థానికుల అభిప్రాయం. ఈ ఆల యంలో ఉన్న శిలాఫలకము మీద వ్రాసి ఉన్న శాసనాన్ని బట్టి ఈ ఆలయము శాలివాహన శకం 1688లో కార్తీక బహుళ

తదియనాడు నిర్మించబడినదని తెలియుచున్నది. ఈశ్వరి అనే గ్రామ దేవత ఇచట చాలాకాలం నుండి పూజలందుకొనుచున్నట్లు, ఆమెయే దేవీ రూపాన్ని ధరించి వెలిసినట్లు అందువలన ఈమెను పాత పాటేశ్వరీదేవిగా పూజలందుకొనుచున్నది. తరువాత క్రీ.శ. 1823వ సంవత్సర ప్రాంతంలో జిల్లా కలెక్టరుగారు ఈ ఆలయాన్ని సందర్శించి, పూజా కార్యక్రమాల నిమిత్తం కొంత భూమిని విరాళంగా ఇచ్చారని స్థానికుల ద్వారా తెలియుచున్నది. అప్పటి నుంచి ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుంది. ఈ అమ్మవారికి నిత్యపూజలతో పాటు, పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి.


శ్రీ వీరభద్రేశ్వరాలయం - గురజాల

గుంటూరుజిల్లా, గుంటూరు నుండి 90 కి.మీ. దూరంలో గురజాల గ్రామము ఉన్నది. ఇక్కడ ప్రాచీనమైన శ్రీ వీరభద్రేశ్వరాలయం కలదు. క్రీ.శ. 4–5 శతాబ్ధముల మధ్యకాలంలో పల్లవులచే నిర్మించిబడినట్లు చరిత్ర గల శ్రీ వీరభద్రాలయం కాకతీయుల కాలంలో హైహయ వంశీయులచే పునర్నిర్మించినట్లు శైలి తెలుపుతుంది. క్రీ.శ.1129లో గురజాల పాలకుడు చేతభూతి ఆలయంలో ఆకర్షణీయమైన నాగస్తంభాన్ని ప్రతిష్టించాడు. ఈ ఆలయము ఆనాటి రాజుల కోటకు సమీపములో ఉండుటచే అలనాడు ఎంతో ఆదరణ పొందిన ఆలయమని మనకు తెలుస్తుంది. తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయములో గర్భగుడిలో వీరభద్రేశ్వరుడు, వారి దేవేరి భద్రకాళీ అమ్మవారు మనకు దర్శనమిస్తారు. 6 అడుగుల ఎత్తులో, చతుర్భుజాలతో, స్థానకమూర్తిగా స్వామి కనిపిస్తాడు. మీసాలపై కొంతవరకు నాసిక ఉంటుంది. శ్రీ వేంకటేశ్వరునివలే స్వామి కర్ణపత్రాలను కలిగి ఉండుట విశేషం. పల్నాటివీరులు యుద్ధంలో ఉపయోగించే 'ఖ' ఆకారంలో ఆయుధం ఈయన ధరించినట్లు శిల్పంలో ఉండుట విశేషం. ఈ ఆలయం ఆవరణ ఈశాన్య భాగములో నాగస్థంభము ఉన్నది. ఈ స్తంభముపై ఒక వైపున నాగదేవతలు రెండవవైపున శాసనము వ్రాయబడి ఉండుట ఒక విశేషము. ఆ నాగదేవతామూర్తుల మనోహర శిల్ప సౌందర్యంతో అత్యంత సహజంగా జీవకళ ఉట్టిపడుతున్నట్లు కన్పిస్తుంది. అతి ప్రాచీనమైన ఈ ఆలయము ఇప్పటికీ కూడా ప్రజాదరణ కలిగి భక్తుల హృదయాలలో భక్తి ప్రపత్తులు నెలకొల్పుచున్నది. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు ఉత్సవాలు కూడా వైభవంగా జరుగును.

బండ్లమ్మ ఆలయం - చందోలు

గుంటూరు జిల్లాలో చందోలు గ్రామములో బండ్లమ్మ తల్లి ఆలయం ఉన్నది. ఇది ఒక గ్రామదేవత ఆలయంగానే పూజలందుకొంటున్నది. గ్రామ దేవత అయినా జంతుబలుల వంటి ఆచారాలు లేవు. విశాలమైన ఆవరణలో, తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయంలో బండ్లమ్మ దేవత ఒక భక్తుని కృషి ఫలితంగా ప్రతిష్టింబపడి భక్తులను కరుణిస్తుంది. ఇచట నిత్యం జరిగే పూజలతో పాటు పర్వదినాలలో ఉత్సవాలు కూడా జరుగుతాయి.

శ్రీ లింగోద్భవస్వామి - చందోలు



గుంటూరుజిల్లాలో చందోలు గ్రామములో ఈ లింగోద్భవస్వామి వారి ఆలయం ఉన్నది. ఇది ప్రాచీనమైన శివాలయంగా ప్రాచుర్యం పొందినట్లు తెలియుచున్నది. బ్రహ్మ, విష్ణువులు నేను గొప్ప, నేను గొప్ప అని వాదించుకున్నప్పుడు శివుడు వారిమధ్య తేజోలింగంగా వెలిశాడని పురాణ ప్రవచనం. ఈ లింగోద్భవ క్షేత్రానికి ఇదే స్థల పురాణంగా స్థానికులు చెబుతారు. ఇక్కడ ఉన్న శాసనాల ద్వారా ఈ ఆలయం క్రీ.శ.1073లో నిర్మించినట్లు తెలియుచున్నది. ఈ ఆలయము తూర్పుముఖంగా ఉండి, గర్భాలయము, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా నిర్మితమై ఉన్నది. గర్భాలయంలో శ్రీ లింగోద్భవమూర్తి ప్రతిష్ట కావింపబడగా, మండపంలో ఎడమ భాగాన పార్వతీ అమ్మవారు, కుడిభాగాన వీరభద్రుడు ఈశాన్య భాగాన మహిషాసుర మర్ధని మొదలగు దేవతామూర్తులు మనకు దర్శనమిస్తారు. ఈ ఆలయములో ఉన్న ధ్వజస్తంభము ప్రక్కన 11 అడుగుల ఎత్తు, నాలుగున్నర అడుగుల వెడల్పుగల నల్లరాతి శివలింగం (ఇదే లింగోద్భవ శివలింగం అంటారు) ఉన్నది. స్థలపురాణానికి నిదర్శనమన్నట్లు ఈ మహాలింగంపై హంసరూపంలో బ్రహ్మ క్రిందభాగాన వరాహరూపంలో విష్ణువు రూపాలు కనిపిస్తాయి. ఈ లింగోద్భవ శివలింగాన్ని క్రీ.శ.1806లో శ్రీరాజా, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు ఒకప్పుడు ఈ శివలింగమును తీసికొని వెళ్ళి, చేబ్రోలు గ్రామంలో ప్రతిష్టించాలని తలచారట! కాని ఎంత ప్రయత్నించినా, ఆ శివలింగమును తీయుటకు ఎంత ప్రయత్నించిననూ రాకపోవడంతో వారా ప్రయత్నము విరమించుకొన్నారని స్థానికులు చెప్తున్నారు.

శ్రీమహావిష్ణువు వలె శివునకు అవతారాలు లేవుగాని, పేర్లు మాత్రం చాలా ఉన్నవి. ఆవిధంగా ఇచట శివుడు లింగోద్భవ స్వామివార్లుగా పిలువబడుచున్నాడు. ఇచట నిత్య పూజతో పాటు అర్చనలు, ప్రత్యేక పూజలు జరుగును. దసరా, సంక్రాంతి, కార్తీకమాస ఉత్సవములు, మహాశివరాత్రి ఉత్సవము వంటి కార్యక్రమాలు కూడా వైభవముగా జరుగును. ఈ పర్వదినాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించి, అర్చించి స్వామివార్ల కృపకు పాత్రులు అవుతారు.

శ్రీ చెన్నకేశవాలయం - చందోలు



గుంటూరుజిల్లాలో చందోలు గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం కలదు. ఇది ప్రాచీనమైన ఆలయంగా కొనసాగు చున్నది. ఈ ఆలయంలోని శిల్పమును బట్టి ఇది చోళులు లేక చాళుక్యుల కాలంలో నిర్మింపబడినట్లు తెలియుచున్నది. తూర్పుముఖంగా ఉన్న ఈ ఆలయంలో గర్భాలయం, అంత రాలయం, మండపం అను మూడు భాగాలు నిర్మించబడి ఉన్నాయి. గర్భాలయంలో చెన్నకేశవుడు, రాజ్యలక్ష్మి అమ్మవార్లు దర్శనమిస్తుండగా, మండపమునందు శ్రీ ఆంజనేయుల వారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇది చాలా విశాలమైన ఆవరణలో ఉన్న ఆలయం. ఈ ఆలయమునందు నిత్యం జరిగే పూజలతో పాటు అర్చనలు, ప్రత్యేక పూజలు, పండుగ పర్వదినాలలో ఉత్సవము లను కూడా అత్యంత వైభవంగా జరుపుదురు. ఈ ఆలయంలోని స్వామి చాలా మహిమాన్వితుడని ఆర్త రక్షకుడని భక్తుల ప్రగాఢ నమ్మకం.

రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి - శేకూరు



గుంటూరుజిల్లాలో శేకూరు గ్రామములో రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయం కలదు. ఈ ప్రాచీన ఆలయం వద్ద ఉన్న శాసనాలను బట్టి ఇది శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించబడినట్లు ఆధారాలు తెలియజేయచున్నది. ఈ ఆలయానికి ఈ మధ్యకాలంలో శ్రీవాసిరెడ్డి చిన వెంకయ్య గారు కళ్యాణ మండపం వాహనశాల, ఆవరణచుట్టూ ప్రాకారం కట్టించారు. ఈ దేవాలయ ఆవరణలోనే మరొక శ్రీ ఆంజనేయ స్వామి వారి చిన్న ఆలయం ఉంది. ఈ ఆంజనేయ స్వామి

వారు ఎంతోకాలం మట్టిలో దాగి ఉన్నారట! తరువాత ఈ స్వామి వారు ఆ గ్రామ నివాసులైన సూర్యదేవర చిన నరస్సయ్యగారికి కలలో కనిపించి "నేను ఫలానా ప్రదేశంలో భూమిలో ఉన్నానూ, నన్ను బయటకు తీసి ఆలయంలో ప్రతిష్టించండి" అని చెప్పగా, చిన నరసయ్య గారు గ్రామవాసులకు చెప్పి, వారితో కలిసి ఆ ప్రదేశమునకు వెళ్ళి, తవ్వించి పరిశీలించగా, ఆ విగ్రహం ఆంజనేయస్వామి వారిదిగా కనుగొన్నారు. వారందరూ ఎంతో సంతోషంతో ఆంజనేయుని మట్టి నుండి వెలువరించి అచటనే సువర్చలా సమేతంగా ప్రతిష్టించారు. ఆనాటి నుండి శ్రీ వేణుగోపాలస్వామి వారితోపాటు శ్రీ ఆంజనేయ స్వామి వారు కూడా ఇచ్చట కొలువై అర్చనలందుకొనుచున్నారని తెలియుచున్నది.

ఈ విధంగా వేణుగోపాలస్వామికి ఆంజనేయస్వామికి నిలయమైన ఈ ఆలయం ఆవరణలో 1989లో అడుసుమిల్లి పెద సాంబశివరావుగారు ఒక మండపం కట్టించి నూతన శోభను చేకూర్చారు. ఈ వేణు గోపాలస్వామి వారి ఆలయమునందు గర్భాలయంలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారు భక్తులకు దర్శనమిస్తుండగా, శ్రీ ఆంజనేయ స్వామి వారు కూడా భక్తులను తన కరుణా కటా క్షాలతో బ్రోవుచున్నారు. ఈ ఆలయంలో నిత్యం జరిగే అర్చనలు, పండుగ పర్వ దినాలలో ప్రత్యేక పూజలతో పాటు కృష్ణాష్టమి, వైకుంఠ ఏకాదశి, మాఘ పూర్ణిమ నాడు స్వామి వారికి జరిపే కళ్యాణోత్సవము మొదలైన ఉత్స వాలను ఎంతో భక్తి శ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయం - శేకూరు



ఈ ఆలయము గుంటూరు జిల్లా శేకూరు గ్రామము నందు కలదు. ఇది ప్రాచీనమైన ఆల యంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని శ్రీకృష్ణ దేవరాయల కాలమునందు నిర్మింప బడిందని స్థానికుల ద్వారా తెలియుచున్నది. ప్రాచీనమైన ఈ ఆలయము ఈనాడు గత వైభవ మును పోగొట్టుకొని గ్రామానికి దూరంగా పొలంలో ఉన్నది. ప్రతిరోజు జరిగే అర్చనలు, ప్రత్యేక పూజలతో పాటు, సంక్రాంతి, వైకుంఠ ఏకాదశి లాంటి ఉత్సవాలు కూడా జరుపుదురు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొంటారు.

బాలాసుందరి కూడలేశ్వరస్వామి - శేకూరు



గుంటూరు జిల్లాలో శేకూరు గ్రామంలో శ్రీ బాలా సుందరి కూడలేశ్వరస్వామి వార్ల ఆలయం కలదు. ఇది ప్రాచీనమైన ఆలయము. దీని నిర్మాణ కాలము ఏనాటిదో సరిగా తెలియదు. ఈ ఆలయ పోషణకు శ్రీ రాచూరి వెలమ జమీందారులు కొంత భూమిని దానముగా ఇచ్చినట్లు స్థానికుల మాట. తరువాత అమరావతి సంస్థానాధిపతులు శ్రీరాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారు ముఖమండపము మొదలైనవానిని కట్టించి ఆ తరువాత కొంత భూమిని విరాళముగా ఇచ్చి, ఈ బాలా త్రిపురసుందరీ అమ్మవారిని దర్శించి కుంకుమపూజ మొదలైనవి చేయించారని స్థానికులు చెప్తారు.

కొంతకాలం తరువాత క్రీ.శ. 1850 ప్రాంతంలో వాసిరెడ్డి నాగయ్యగారు తాము సంగం జాగర్లమూడి నుండి ఈ గ్రామానికి మాకాం మార్చినప్పుడు, అక్కడనుండి శ్రీ కూడలేశ్వరస్వామిని గూడా తమవెంట తీసికొని వచ్చి ఇచట ఉన్న ఈ ఆలయము ఆవరణలో ఒక చోట ప్రతిష్టించి చిన్న ఆలయం ఒకదానిని కట్టించారు. అందుచేత ఈ ఆలయము అప్పటి నుండి రెండు పేర్లతో పిలువబడుచున్నది. ఈ రెండు ఆలయములతో పాటు ఇటీవల ఇచట మరొక అయ్యప్ప దేవాలయము వెలసినది. దానిని అయ్యప్ప భక్తులు కొందరు కట్టించారు. ఈ విధంగా ఇచట మూడు ఆలయాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయము ముందు ఉన్న ప్రాచీన ధ్వజస్తంభము జీర్ణమగుటచే దానిని తొలగించి, వేదపాఠశాల మధ్య నూతన ధ్వజస్తంభమును వాసిరెడ్డి విద్యాసాగర్ గారు ప్రతిష్టించారు. ఈ ఆలయాలలో ప్రతిరోజు జరిగే అర్చనలు, ప్రత్యేక పూజలే కాక, దసరా ఉత్సవములు, కార్తీక దీపోత్సవము, శివరాత్రి ఉత్సవము వంటి గొప్ప కార్యక్రమాలు అతి వైభవముగా జరుగుచున్నవి.

శ్రీ మిర్యాలభావన్నారాయణస్వామి - అమృతలూరు

గుంటూరుజిల్లా అమృతలూరు గ్రామములో ఈ మిర్యాల భావన్నారాయణ స్వామి వారి ఆలయం కలదు. ఇది ప్రాచీన ఆలయము. ఈ ఆలయము 16వ శతాబ్దంలో నిర్మింపబడినదని తెలియుచున్నది. ఆనాడు కొందరు మిర్యాల వ్యాపారులు తమ వ్యాపారం పనుల మీద చుట్టుప్రక్కల ఊర్లు తిరుగుచూ, అమృతలూరు సమీపాన

గల ఒక వృక్షము క్రింద కూర్చొని కొంతసేపు విశ్రాంతి తీసుకొనుచుండేవారట! ఆ విధంగానే వారు విశ్రాంతి తీసికొనుచుండగా వారికి విచిత్రానుభూతి కలిగినదట! ఆ విచిత్రానుభూతిలో భావన్నారాయణుడు వారికి కన్పించి, ఇచట మీరు నాకొక ఆలయమును కట్టించండి. అది మీకు గుర్తుగా ఉండగలదు. మీ వ్యాపారం కూడా బాగుగా దినదినాభివృద్ధి చెందగలదు అని అన్నారట! వారు ఆ మాటలు విని ఆశ్చర్యము పొంది స్వామివారి కోరిక మేరకు వెంటనే అచట ఒక ఆలయము కట్టించి, అందులో శ్రీ భావన్నారాయణుని ప్రతిష్టించి భక్తి ప్రపత్తులతో ఆరాధించారు. మిర్యాల వ్యాపారులచే కట్టించబడిన ఈ ఆలయం మిర్యాల భావన్నారాయణస్వామి వారి ఆలయమనే పేరుతో అప్పటి నుండి పిలువబడుచున్నది.

ఆ విధంగా కొంతకాలం గడిచిన తరువాత శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయడు గారిచే ఈ ఆలయము పునరుద్ధరణ పొందినది. వారు ఈ ఆలయానికి ధూపదీప నైవేద్యాల నిమిత్తం 24 ఎకరాల భూమిని దానంగా ఇచ్చి వారు స్వామిపై తమ భక్తిని నిరూపించుకున్నారు. ఈ ఆలయ ఆవరణలోనే అమృతలూరు వాస్తవ్యులు, నార్ల అనే ఇంటిపేరుగల వారు 1910లో మదన గోపాలస్వామి వారి ఆలయము ఒకటి నిర్మించారు. ఈ ఆలయమునకు కూడా పది ఎకరాల భూమి కలదు. నిత్యం అర్చనలు, పూజలతో పాటు, వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి, కృష్ణాష్టమి మొదలగు పర్వదినాలలో ఉత్సవాలు కూడా అతి వైభవముగా జరుగును.

శ్రీ అమృతేశ్వరాలయం - అమృతలూరు



గుంటూరు జిల్లాలో అమృతలూరు గ్రామములో శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయంలోని స్వామి స్వయంభూవు. ఇది చాలా ప్రాచీనమైన ఆల యంగా భక్తులు, స్థానికులు చెప్పుదురు.

స్థలపురాణం : పూర్వం ఈ ప్రాంతమంత అరణ్య మయంగా ఉండేది. ఆ అరణ్యంలో కొంతమంది తమ గోవులను మేపుకొను చుండేవారు. వానిలో ఒక ఆవు ప్రతిరోజు రహస్యముగా వెళ్ళి ఒక పుట్టలో పాలు పిదికి వచ్చుచుండేదట! అందుచే ఆ ఆవు ఇంటివద్ద పాలుతక్కువగా ఇచ్చుచుండేది. కారణము తెలియక ఆవు యజమాని గోవులను మేపేవాడిని అడిగాడు. అతడు తనకు తెలియదు అనగా, ఆ యజమాని రహస్యంగా ఒకనాడు ఆ ఆవుల వెంబడి వెళ్ళి, జాగ్రత్తగా గమనించగా, అపుడా ఆవు కొంతదూరం వెళ్ళి

ఒక పుట్టలో పాలు పిదుకుట చూచాడు. కోపముతో ఆ పుట్ట వద్దకు వెళ్ళి తన చేతిలో ఉన్న దుడ్డుకర్రతో ఆ పుట్టపై గట్టిగా కొట్టాడు. అపుడా పుట్టలో ఉన్న శివలింగం రక్తమోడుచూ బయటపడినది. ఆ శివలింగమును చూచి ఆశ్చర్యపడుతూ తాను చేసిన తప్పును గ్రహించి చేతులు జోడించి దేవా! నేను తెలియక చేసిన తప్పును క్షమించుము అని ప్రార్థించాడు. అతని ప్రార్థనలు విని జాలిపడిన పరమేశ్వరుడు "ఓయీ! నీవు తెలియక చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా నీ పాప పరిహారార్థం ఇచట నాకు ఒక ఆలయం కట్టించుము. అంతా నీకు మేలే జరుగు తుంది" అని చెప్పి అంతర్ధానమయ్యారు. వెంటనే అతడు శివుని ఆజ్ఞానుసారం అచట ఒక శివాలయాన్ని కట్టించి అందు ఆ శివలింగమును ప్రతిష్టించి ఆరాధించా డనీ, అమృతము వంటి ఆవుపాలు త్రాగిన పరమేశ్వరుడు ఆనాటి నుండి అమృతేశ్వ రుడు అన్న పేరుతో భక్తులచే పూజలు అందుకొనుచున్నాడు. కాలక్రమంలో ఈ ఆలయ పరిసరాలలో వెలసిన గ్రామమే అమృతలూరు గ్రామంగా ప్రసిద్ధి పొందినదని ఇచ్చటి స్థానికుల, భక్తుల అభిప్రాయము.

ఈ ఆలయము విశాలమైన ఆవరణలో తూర్పు ముఖముగా ఉన్నది. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం అను మూడు భాగాలుగా ఈ ఆలయం నిర్మించబడినది. ఈ ఆలయములో గర్భాలయంలో అమృతేశ్వరుడు కొలువై ఉండగా, అంతరాలయము నందు ఎడమవైపు బాలా త్రిపురసుందరీ దేవి, మండపంలో నందీశ్వరుడు కొలువై ఉన్నారు. ఈ ఆలయ ప్రాంగణములోనే నవగ్రహములకు మంటపం కూడా ఉన్నది.

దుడ్డుకర్రతో దెబ్బలు తినుటచే ఇచటగల శివలింగానికి తలమీద దెబ్బల వలన గుంటలు పడి ఉన్నవి. అర్చకులు అభిషేకం చేయునప్పుడు అభిషేకజలం ఆ గుంటలలో నిలిచిపోవుననియు, ఆనీటిని తుడిచివేసినను, తడిగా ఉండి, గాయము తడిసినప్పుడు వచ్చే వాసన వంటి వాసన వచ్చుచుండునని ఆలయ అర్చకులు చెప్పుచున్నారు. ఈ ఆలయంలో శివునకు అర్చనలు, ప్రత్యేకపూజలతో పాటు, నవరాత్రి ఉత్సవాలు, ఆరుద్ర ఉత్సవము, సంక్రాంతి ఉత్సవము, ఫాల్గుణ పూర్ణిమనాడు స్వామివారి కల్యాణోత్సవము మొదలైన ఉత్సవాలు అంగరంగ వైభవముగా జరుగుతాయి. ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొందురు. ఇచట వంశపరంపరగా వచ్చుచున్న అర్చకులు మాత్రమే స్వామివారికి పూజలు, అర్చనలు చేయుచుందురు.

శ్రీ చంద్రమౌళీశ్వరాలయం - వడ్లమూడి



గుంటూరుజిల్లాలో సుప్రసిద్ధమైన వడ్లమూడి గ్రామంలో శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయం కలదు. ఇది నూతనంగా నిర్మించిన ఆలయం. ఈ ఆలయమును వడ్లమూడి గ్రామనివాసులు శ్రీ గోళ్లమూడి చంద్రయ్య గారు 1921-1944 మధ్యకాలంలో కట్టించారు. తరువాత వారు ధూపదీప నైవేద్యాల నిమిత్తం ఈ ఆలయానికి 10 ఎకరాల భూమిని గూడా దానముగా ఇచ్చి వారి భక్తిని చాటుకున్నారు. ఈ ఆలయ ముఖద్వార గాలిగోపురము ఎంతో ఉన్నతమైనదిగా కనిపించును. ఇచట రోజు వారీ పూజలతో పాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు అతివైభవంగా నిర్వహిస్తారు.

శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయం - వడ్లమూడి

గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామములో శ్రీ వీరభద్రేశ్వరస్వామి వారి ఆలయం ఉన్నది. ఈ వీరభద్రేశ్వర స్వామి ఆలయము చాలా ప్రాచీనమైన ఆలయము. ఈ ఆలయం విజయనగర రాజుల కాలంలో నిర్మాణమైనదని స్థానికులు చెప్పుచుందురు. ఆ విజయనగర రాజుల కాలంలో ఈ ఆలయానికి భూములున్నట్లు కొంతమంది చెప్తారు. తరువాత ఈ ఆలయం కాలక్రమంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు గారి పరిపాలన క్రిందికి వచ్చినది. వారి పోషణలో ఈ ఆలయం మరింత వృద్ధి చెందినది. వారి పేరు మీదగానే ఇప్పటికీ మొదట మంత్రపుష్పం చెప్పబడుచున్నది. ఇప్పుడున్న భూమి వలివేరు గ్రామ వాస్తవ్యులు శ్రీ రూపాకుల సుబ్రహ్మణ్యంగారు ఇచ్చినట్లు అర్చక స్వాముల ద్వారా తెలియుచున్నది. ఈ ఆలయం దక్షిణాభిముఖంగా ఉన్నది. గర్భాలయం, అంతరాలయం, మండపం అను మూడు భాగాలుగా ఈ ఆలయం నిర్మించబడింది. గర్భాలయంలో వీరభద్రుడు, అంతరా లయంలో ఎడమ భాగాన భద్రకాళీ మాత, మండపమునందు నందీశ్వరుడు, విఘ్నేశ్వరుడు మొదలగు దేవతామూర్తులు ప్రతిష్టకావింపబడి ఉన్నారు. ఈ ఆలయమునకెదురుగా ధ్వజ స్తంభము, ఆ ధ్వజస్తంభమునకు తూర్పుగా ఒక వేదిక కూడా కలదు. ఈ ఆలయము. చుట్టూ ఒక ప్రాకారం కలదు. ఇచ్చుట ప్రతిరోజూ అర్చ నలు, ప్రత్యేక పూజలే కాక, ఆరుద్రపూజలు, దసరా ఉత్సవాలు, సంక్రాంతి ఉత్సవాలు వైభవంగా జరుగును.

రామాలయం - వడ్లమూడి



గుంటూరుజిల్లాలో వడ్లమూడి గ్రామంలో ఈ రామాలయం కలదు. వడ్లమూడి గ్రామం చరిత్రాత్మకమైన గ్రామం. ఈ గ్రామంలో ప్రాచీనమైన వైకుంతేశ్వరాలయముతో పాటు మరెన్నో ఆలయాలు ఉన్నాయి. అలాంటి వానిలో కొన్ని శిథిలమైపోగా, ఆ కోవకు చెందినదే శ్రీ వైకుంతేశ్వరాలయము. ఇప్పుడా వైకుంటేశ్వ రాలయ స్థానంలో వడ్లమూడి గ్రామనివాసులు శ్రీ సూర్యదేవర వారు 19వ శతాబ్దంలో ఈ రామాలయం నిర్మించారు. సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్రమూర్తి మొదలగు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆవిధంగా నిర్మాణం కావింపబడిన ఈ రామాలయంలో నిత్య పూజలతో పాటు శ్రీరామనవమి వంటి ఉత్సవాలు పండుగ పర్వ దినాలలో ప్రత్యేక పూజలు జరుపు కుంటూ ప్రజాదరణ పొందినది.

శ్రీ వేంకటేశ్వరాలయం - వైకుంఠపురం




గుంటూరజిల్లాలో అమరావతికి తూర్పున 6 కిలోమీటర్ల దూరంలో వైకుంఠపురం అనే గ్రామము కలదు. కృష్ణానది ఇచ్చుట ఉత్తర వాహినిగా పయనిస్తుంది. ఈ ప్రాంతంలో రెండు శ్రీ వేంకటేశ్వరాలయాలు కలవు. అందులో ఒకటి కొండపైన వెలసి ఉండగా, రెండవది కొండ క్రింది భాగములో కొలువై ఉన్నది. కొండపై భాగములో ఉన్న ఆల యంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరుడు స్వయంభువుగా ప్రసిద్ధి పొందిన స్వామి.

స్థలపురాణం : పూర్వం ఆ గ్రామంలో పెదరామన్న చిన్నరామన్న అనే సోదరులుండే వారు. వారివద్ద వందలకొలది ఆవులమంద ఉండేది. ఆ ఆవులను మేతకోసం ప్రతిదినం పశువులకాపరులు కొండపైకి తోలుకొని వెళ్ళుచుండేవారు. అందులో ఒక ఆవు ప్రతిదినం పాలు తక్కువ ఇచ్చు చుండగా కారణం తెలియక యజమానులు, పశువులకాపరులను అడిగారు. వారుమాకు తెలియదు అన్నారు. అందుచే వారు ఒకనాడు రహస్యంగా ఆవుల వెంబడి అరణ్యానికి వెళ్ళారు. నిశితంగా పరిశీలించారు కాని విషయం

తెలుసుకోలేకపోయారు. ఆ సమయంలో ఆనాటిరాత్రి వారికొక కలవచ్చినది. ఆ కలలో వారికి శ్రీ వేంకటేశ్వరుడు కనబడి, తన విషయం తెలియజేసి, నేను పర్వతముపైన ఒక గుహలో స్వయంభువుగా ఉన్నాను, మీ ఆవు ప్రతిదినం నాకు పాలు ఇచ్చి వెళ్ళుచున్నదని చెప్పి ఇంతవరకు నేను గుహలో ఉన్నాను. ఇప్పుడు బయటకు రాదలచాను, కనుక అచట మీరు నాకొక గుడికట్టించండి అన్నాడట! ఆ మాటలకు వారు చాలా ఆశ్చర్యపోయారు. మరునాడు వారు పర్వతము పైకి వెళ్ళి, అచట గుహను పరిశీలించగా, ఆ గుహలో రాత్రి కలలో చెప్పినట్లుగా అచట ఉన్న శిలమీద శ్రీ వేంకటేశ్వరుని చిహ్నాలు కన్పించాయి. ఆ ప్రక్కనే గుడి కట్టించుటకు అవసరమైన ధనం కూడా కన్పించినది. ఎంతో ఆనందంతో వెనువెంటనే వారొక శిల్పిని పిలిపించి, ఆ చిహ్నమును చూపించి నీవా శిలను శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిమగా మలచాలని కోరారు. ఆ శిల్పి వారి కోరిక ప్రకారం ఆ శిలను ప్రతిమగా తీర్చిదిద్దుటకు తన ఉలితో ఆ శిలపై కొట్టగానే, అదేమి చిత్రమో! రక్తం స్రవించింది. ఈ వింత సంఘటనకు ఆశ్చర్య పడుచున్న సోదరులకు స్వామివారు ప్రత్యక్షమై నన్ను మీరు ప్రతిమ చేయదలచారు. అది నాకు సమ్మతము కాదు. నన్ను ఈ విధంగానే ఆలయంలో ప్రతిష్టించి, నన్ను ఉలితో కొట్టి గాయపరచినచోట చందనపు ముద్దను అద్ది ఆరాధించండి అని అంతర్ధాన మయ్యాడు. ఆవిధంగానే ప్రతిదినం అచ్చట చందనపు ముద్దను ఉంచి, పూజిస్తారు. అప్పటినుండి ఈ ఆలయం సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మాత్రమే మానవులకు, సూర్యాస్తమయం నుండి సూర్యోదయ మగునంత వరకు దేవతలకు, మహర్షులు మొదలగువారిచే పూజలు అందుకొనుచున్నది. అందుచేతనే సూర్యాస్తమయం తరువాత దేవాలయ పరసరాలలో మానవ సంచారం ఉండదని స్థానికులు చెప్తారు.

తరువాత ఈ గ్రామం, శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారి ఆధీనంలోనికి వచ్చినది. అప్పుడు ఈ గ్రామము పేరు ‘రావూరు’ అని పిలిచేవారు. ఆయన ఒకసారి రావూరు గ్రామం వచ్చి ఈ వేంకటేశ్వరుని దర్శించి, వారి మహిమను తెలుసుకొని, ఆ గ్రామమందలి వైష్ణవ్వాముల వేద పాండిత్యమును గమనించి, వారు ఈ గ్రామము నకు వైకుంఠపురం అని నామకరణం చేశారు. అప్పటినుండి ఆ గ్రామం వైకుంఠ పురంగా ప్రసిద్ధమైనది.ఆ వైకుంఠపురంలో పర్వతముపై ఉన్న శ్రీ వేంకటేశ్వరుని సందర్శించేందుకు సరైన దారిలేక ప్రజలు ఇబ్బంది పడుచున్నారని గ్రహించి, పర్వతం క్రింది భాగాన వేరొక వేంకటేశ్వరాలయంను నిర్మించి, విగ్రహ ప్రతిష్ట చేయించారు. ఆనాటినుండి పర్వతంపైనున్న వేంకటేశ్వరాలయము ఎగువ తిరుపతిగాను, పర్వతం క్రింద ఉన్న వేంకటేశ్వరాలయము దిగువ తిరుపతిగాను ప్రఖ్యాతి గాంచినవి. ఇచట గల ఈ రెండు ఆలయాలలోపర్వతం పైనున్న ఆలయము పశ్చిమాభిముఖంగా ఉండగా, పర్వతం క్రిందఉన్న ఆలయం మాత్రం ఉత్తరాభిముఖంగా ఉన్నది. ఈ ఆలయం గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం అను మూడు భాగాలుగా విభజింపబడి ఉన్నది. వానిలో గర్భాలయములో శ్రీ వేంకటేశ్వర స్వామివారు మనకు దర్శనమిస్తారు.

ఉండవల్లి గుహలు - ఉండవల్లి



ఉండవల్లి గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలానికి చెందిన గ్రామము. తాడేపల్లి విజయవాడకు 2 కి.మీ. మంగళగిరికి 5 కి.మీ. దూరంలో ఉంది. తాడేపల్లి సెంటర్ నుంచి అమరావతి వైపుగా ఆరు కిలో మీటర్ల దూరంలో ఉండవల్లి గుహలు ఉన్నవి. ఈ గుహాలయాలు ఒక పర్వత సముదాయం. పర్వతముందు భాగము నుంచి లోపలికి తొలచు కుంటూ వెళ్ళటం చేశారు. మధ్యలో స్థంబాలు, వాటి పై చెక్కిన అందమైన లతలు, గుహాంతర్భాగాలలో గోడలపై చెక్కిన దేవతా ప్రతిమలు మొదలైన వాటితో విశాలంగా ఉంటుంది. ఈ గుహలు క్రీ.శ. 4, 5 శతాబ్దానికి చెందినవని చరిత్రకారుల భావన. ఈ గుహలలో నాలుగు అంతస్తులలో ఆలయాలు నిర్మించారు. అందులో ఒక పెద్ద గ్రానైట్ రాతిలో అనంత పద్మనాభ స్వామి శిల్పం చెక్కబడి ఉంది. ఇతర ఆలయాలు త్రిమూర్తులు అయిన బ్రహ్మ, విష్ణువు, శివుడు దేవతలకు ఉద్దేశించబడినవి. ఇవి గుప్తుల కాలంనాటి ప్రధమ భాగానికి చెందిన నిర్మాణశైలికి లభిస్తున్న ఆధారాలలో ఒకటి. ఈ పర్వత గుహలలో పెద్దదైన ఒక గుహాలయము ఉంది. ఈ గుహాలయములో దాదాపు 20 అడు గుల ఏకరాతితో చెక్కబడిన అనంతపద్మనాభ స్వామి వారి ప్రతిమ ఉంటుంది. ప్రతిమ పొడవుగా శేషపానుపుతో కూడి గుహాంతర్భాగమున కమలంలో కూర్చున్న బ్రహ్మ మరియు సప్తర్షులు ఇతర దేవతల విగ్రహాలు కలవు. పర్వతము బయటివైపు గుహాలయ పై భాగ ములో సప్తఋషుల విగ్రహాలను పెద్దవిగా చెక్కారు. ఒకే పర్వతాన్నిగుహలుగానూ, దేవతాప్రతిమల తోడను ఏకశిలా నిర్మితముగా నిర్మించిన శిల్పుల ఘనతను మెచ్చుకొనకుండా ఉండలేము. ఈ గుహల నుంచి పూర్వకాలంలో మంగళగిరి వరకు సొరంగ మార్గం



ఉండేదని పూర్వీకుల నమ్మకం. ఈ మార్గం నుంచే రాజులు తమ సైన్యాన్ని శత్రురాజులకు తెలియకుండా తరలించేవారిన ప్రతీతి. ఈ గుహాలయాలు క్రీ.శ. 420 నుంచి 620 వరకు సాగిన విష్ణుకుండినుల కాలానికి చెందినవి. ఈ గుహల నిర్మాణశైలి బౌద్ధ విహారాల శైలిని పోలి ఉంది. వర్షాకాలాలలో బౌద్ధ సన్యాసులు ఈ గుహలలోనే విశ్రమించేవారని తెలియుచున్నది. గుహలో గోడలి లోపల చెక్కిన చిత్రాలు ఆనాటి కళాకారుల అద్భుత కౌశలానికి గుర్తుగా కనిపిస్తాయి. ప్రధాన గుహ గుప్తులకాలం ప్రారంభం నాటి నిర్మాణ కళను పోలింది. అనంత పద్మనాభస్వామి, నరసింహస్వామి ఇచ్చట కొలువైన దేవుళ్ళు. ఈ గుహల నిర్మాణశైలి బౌద్ధ విహారాల శైలిని పోలి ఉంటుంది. ఆలయాల చుట్టూరా పచ్చని పొలాలు కనువిందు చేస్తాయి.

శ్రీ రాధామాధవ దేవాలయం- నంబూరు



నంబూరులోగల రాధామాధవ దేవాలయం అధునాతనముగా నిర్మించినది. నంబూరు గ్రామము మంగళగిరికి సమీపంలో ఉన్నది. శ్రీకృష్ణుని జన్మస్థలమైన మధుర లోగల దేవాలయములోని అర్చనలు, పూజలు ఏ విధంగా చేయుదురో అట్లే ఇచ్చటగల ఈ రాధామాధవ దేవాలయంలో కూడా జరిపించుట ఈ ఆలయం ప్రత్యేకత. ఇచ్చట పూజచేయు పూజారులు కూడా శ్రీకృష్ణుని జన్మస్థలమైన బృందావనం నుంచి తీసుకొనిరాబడినవారే. ఇది ఈ ఆలయానికి గల మరొక ప్రత్యేకత. ఇచ్చట రథోత్సవం కన్నుల పండువగ జరుగుతుంది.

శ్రీ నరేంద్రేశ్వరస్వామి- పెదపులివర్రు



ఇది గుంటూరు జిల్లాలో పెద్దపులివర్రు నందు కలదు. ఇది నూతనంగా నిర్మించిన ఆలయం. ఈ నరేంద్రేశ్వర స్వామి ఆలయంలో శివలింగం తెల్లని పాలరాతితో నిర్మిం చబడింది. మకర సంక్రాంతినాడు సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు ఈ విగ్రహంపై పడతాయి అని స్థానికులు

చెప్తున్నారు. ఇక్కడ కంచుతో చేయబడ్డ నటరాజ విగ్రహం చాలా అందంగా చేయబడి భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నది. ఇక్కడ నిత్యపూజలతోపాటు పండుగ పర్వదినాలలో ప్రత్యేకపూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఉత్తరేశ్వరాలయం - పెద్దకొదమగుండ్ల


గుంటూరు జిల్లా, కారెంపూడి మండలం, కారెంపూడికి 8 కి.మీ., దూరంలో పెద్దకొదమ గుండ్ల అనే గ్రామము కలదు. ఇచట ఉత్తరేశ్వరాలయం ఉన్నది. క్రీ.శ. 1142లో పల్నాటిసీమను పరిపాలించిన అనుగురాజు తన పెంపుడు కుమారుడు అయిన ఉత్తరుడు యుద్ధరంగంలో మరణించగా, అతని జ్ఞాపకార్థం ఇచట ఉత్తరేశ్వరాలయంను నిర్మించాడు. తూర్పుముఖంగా నిర్మించబడిన ఈ ఉత్తరేశ్వరాలయంలో స్వామి ఉత్తర ముఖంగా మనకు దర్శనమిస్తాడు. ఈ స్వామికి ఎదురుగా శ్రీ శంకరస్వామి ఆత్మలింగం గల గర్భాలయం ఉన్నది. ఇచ్చట పార్వతీదేవి ఆలయం, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి ఆలయాలు కూడా ఉన్నాయి. ఈ నాలుగు ఆలయాలను కలుపుతూ 12 స్తంభాల మండపం ఉంది. ఇచ్చట కొన్ని సందర్భాలలో ఉత్సవాలు నిర్వహిస్తారు.

శ్రీ వీరభద్రస్వామి ఆలయం - మోదుకూరు

గుంటూరుజిల్లా, గుంటూరు నుండి 40 కి.మీ., దూరంలో మోదుకూరు అనే గ్రామము కలదు. ఈ గ్రామము నందు శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయం కలదు. ఇది చాలా పురాతన ఆలయంగా స్థానికులు చెప్తారు. పూర్వము ఈ ప్రదేశం అంతయూ మోదుగు చెట్లతో నిండి ఉండేది. అందువలననే ఈ ఊరుకు మోదుకూరు అనే పేరు వచ్చింది. పశ్చిమదేశం నుండి వ్యాపారం నిమిత్తం వచ్చిన ఒక లింగబలిజ వర్తకుడు ఇచ్చట విశ్రాంతి తీసు కొనుచుండగా అతనికి స్వామి స్వప్నంలో కనిపించి తనకు ఇక్కడ ఒక ఆలయం నిర్మించమనగా, స్వామి వారి ఆజ్ఞ మేరకు ఇచ్చట ఉన్న మోదుగు వృక్షాలను తొలగించి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం తెలియజేస్తుంది.

శ్రీ వీరభద్రస్వామి ఆలయం - కొమ్మూరు

గుంటూరుజిల్లా కాకుమాను మండలంలోని కొమ్మూరు అనే గ్రామములో శ్రీ వీరభద్రస్వామి వారి దేవాలయం కలదు. ఈ ఆలయం చాలా పురాతన ఆలయంగా స్థానికులు చెపుతారు. ఈ ఆలయంలో కొలువై ఉన్న వీరభద్రస్వామి శ్యామలవర్ణంతో, పది చేతులతో ఆయుధాలను ధరించి ఉన్నట్లు భక్తులకు దర్శనమిస్తాడు. ఈ స్వామి విగ్రహాన్ని రూపాయి నాణెంతో మీటితే సప్తస్వరాలు విన్పించడం గొప్ప విశేషంగా



ఈ శిల్ప నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. పూర్వం ఈ ఆలయానికి నిత్యమూ ఒక సర్పము వస్తూ స్వామి వారిని దర్శించిపోతుండేది. ఒకసారి భక్తులందరికీ ఆ సర్పము నిర్జీవంగా కన్పించింది. భక్తులు దాని భక్తికి మెచ్చి ఆ పాము దేహాన్ని ఒక గాజు పెట్టెలో భద్రపరిచారు. కొంతకాలం తరువాత పాము దేహం అదృశ్యమై, ఆ గాజుపెట్టెను తెరవగా ఆ ప్రదేశమంతా దివ్యసుగంధ పరిమళాలు వ్యాపించినవి. ఈ నాటికీ ఆలయంలో ఉన్న ఆ గాజుపెట్టెను మనం చూడవచ్చు. ఈ ఆలయ ప్రాంగణంలో అనేక దేవతా మూర్తుల విగ్రహాలతో పాటు సప్తమాతృకలు కొలువై ఉన్నారు. ఈ ఆలయంలో నిత్యపూజలు, ఉత్సవాలు కూడా జరుపుతారు.


శ్రీ వీరభద్రాలయం - దుర్గి

గుంటూరు జిల్లా, గుంటూరు నుండి మాచర్లకు వెళ్ళు దారిలో గురజాల తరువాత, మాచర్లకు 15 కి.మీ., దూరంలో దుర్గి అనే గ్రామములో ఈ వీరభద్రాలయం కలదు. ఇది పురాతన క్షేత్రం. క్రీ.శ.12వ శతాబ్దంలో గురజాల, మాచర్ల వీరభద్రాలయాలు హైహయ రాజుల కోటలలో నిర్మించబడి ఉండి, రాజప్రముఖులకూ, రాజోద్యోగులకు, మాత్రమే అందుబాటులో ఉండేవి. కాని ఈ వీరభద్రస్వామి వారి ఆలయం మాత్రం సర్వ దర్శనానికి అందరికి అనుకూలంగా ఉండేది. గర్భాలయంలో శ్రీ వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయానికి ప్రక్కనే ఓంకారేశ్వరాలయం, కొంచెం దూరంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. ఈ ఆలయంలో పూజలతోపాటు, ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు.

శ్రీ వీరభద్రస్వామి - వలివేరు

గుంటూరు జిల్లా, తెనాలికి సమీపంలో వలివేరు అనే గ్రామము కలదు. ఈ గ్రామము నందు శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయం కలదు. ఈ ఆలయం శాసనాలలో త్రై పురుష దేవాలయంగా, స్వయంభూ దేవాలయంగా పేర్కొనబడినది. ఈ వీరభద్రస్వామి ఆలయం క్రీ.శ.11వ శతాబ్దంలో నిర్మించబడినదిగా తెలియుచున్నది. ఈ ఆలయం నందు మూడు గర్భగుడులున్నవి. మధ్యనున్న గర్భగుడిలో శివలింగం ఉండగా మిగిలిన రెండు గర్భగుడులలో ఒకదానియందు పార్వతీదేవి, మరొక దానియందు వీరభద్రస్వామి వారి విగ్రహాలు ఉన్నవి. ఇచ్చట నిత్యం జరిగే పూజలతో పాటు పండుగ విశేషదినములలో ప్రత్యేక పూజలు కూడా జరుగును.

నాగేంద్రస్వామి ఆలయం - నాగులపాడు



గుంటూరుజిల్లా, గుంటూరు నుండి ప్రత్తిపాడు వెళ్ళే మార్గంలో 25 కి.మీ., దూరంలో పెద నందిపాడు ఉంది. దానికి దగ్గరలో నాగుల పాడు అనే గ్రామము కలదు. ఈ గ్రామములో మహిమాన్వితమైన నాగేంద్రస్వామి ఆలయం కలదు. నాగేంద్రస్వామి ఆల యాలలో ఇది చాలా అద్భుతమైనదిగా చెప్ప వచ్చును. ఈ ఆలయంలో దాదాపు 10 అడుగుల ఎత్తుగల పుట్టను చుట్టుకొనిఉండునట్లు నాగపడగ ఒకటి ఏర్పాటు చేయడమైనది. నాగపడగ మధ్యలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఉన్నాడు. అంత ఎత్తుగల పుట్టలో పాలుపోయడానికి, పూజచేయడానికి వీలుగా నిచ్చెన అమర్చబడినది. పుట్టచుట్టూ ప్రదక్షిణ చేయుమార్గంలో చుట్టూ అందమైన నాగశిల్పములు ప్రతిష్టిం చబడినవి. ఇచ్చట నాగుల చవితి రోజున ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చి తమ మ్రొక్కులు తీర్చుకుంటారు.

శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ దేవాలయం - గుంటూరు

గుంటూరు జిల్లా, గుంటూరు నెహ్రూనగర్, 10వలైను, చేనేతకాలనీలో శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ దేవాలయం ఉన్నది. ఈ ఆలయం సుమారు 3 దశాబ్దాల నుండి అంచలంచెలుగా అభివృద్ధిచెందుతూ గుంటూరు–నెహ్రూనగర్ నందు ఒక శివాలయంగా ఎంతో పేరు పొందింది. ఈ ఆలయమునందు గర్భగుడిలో శివలింగం ముందు శ్రీ మార్కండేయుడు తపస్సు చేస్తుండగా పరమేశ్వరుడు ప్రత్యక్షమైన విధంగా ఆలయంలో విగ్రహాలు ప్రతిష్టకావింపబడినవి. స్వామివారికి ముందు నందీశ్వరుడు, గర్భాలయానికి ఎడమభాగాన, చిన్న ఆలయంలో శ్రీ పార్వతీదేవి, కుడిభాగాన చిన్న ఆలయంలో భద్రావతీ సమేత శ్రీ భావనాఋషి స్వామివారు ప్రతిష్టించబడి ఉన్నారు. ఆలయం గర్భగుడికి ముందు 36 అడుగుల ఏకశిలా రాతిధ్వజస్తంభం, రాతి తలంబ్రాల కళ్యాణ మండపం, నవగ్రహాల మండపం, రావి + వేప + ఉసిరి మొదలగు దేవతా వృక్షాలు మరియు ఈ ఆలయంలో జంట నాగేశ్వరులు, శ్రీ షిర్డీ సాయిబాబా, విఘ్నేశ్వరుడు మొదలైనవారు కొలువై ఉన్నారు. ఆలయానికి ముఖమండపము, మండపము దాటగానే ఎడమభాగాన శ్రీ ఆంజనేయస్వామి వారి మందిరము, ఆలయానికి ఎదురుగా రోడ్డు దాటిన తరువాత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మందిరము మొదలగు స్వామి వార్లు ఈ ఆలయంనందు వేంచేసి యున్నారు. 1992వ సంవత్సరంలో ఆలయంలో విగ్రహప్రతిష్ట జరిగినది. ఆనాటి నుండి, శరన్నవరాత్రి మహోత్సవములు క్రమము తప్పకుండా అతి వైభవంగా జరుగుతున్నాయి.

శ్రీ కోదండ రామాలయం - వినుగొండ

గుంటూరు జిల్లా, గుంటూరు నుండి 30 కి.మీ., దూరంలో వినుగొండ అనే గ్రామము ఉన్నది. ఈ గ్రామములో కొండపైన శ్రీ కోదండరామాలయం ఉన్నది. ఈ క్షేత్ర మహాత్మ్యం రామాయణ గాథతో ముడిపడి ఉన్నది. కొండపై అనేక పురాణ కథలను తెల్పే ఆలయాలతో పాటు జటాయువు రెక్కలు కూడా ఉండుట ఒక విశేషం. ఈ క్షేత్రంలో ఆంజనేయ స్వామివారు విశ్రమించిన గజరూపంలో ఉండి 'గుంటి ఆంజనేయ స్వామి'గా ప్రసిద్ధి చెందాడు. ఈ వినుగొండ ప్రాంతమునందే శ్రీరామునిచే ప్రతిష్ఠింప బడినట్లు చెప్పబడుతున్న వరసిద్ధి వినాయకుని ఏకశిలా విగ్రహం ఉన్నది. దక్షిణాభిముఖంగా ఉన్న ఈ విగ్రహం చుట్టూ ప్రతిరోజూ ఒక నాగు పాము ప్రదక్షిణ చేసి వెళుతుందని, ఈ ఆలయం యొక్క మహాత్మ్యానికి ఈ సంఘటన ఒక సాక్ష్యంగా స్థానికులు చెప్తున్నారు. ఈ వినాయక ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలు చాలా గొప్పగా జరుగుతాయి. ఆ ఉత్సవాల సమయంలో సుమారు లక్షమందికి పైగా భక్తులు స్వామిని దర్శించి తరిస్తారు.

నాగేంద్రస్వామి ఆలయం - కట్టెంపూడి



గుంటూరుజిల్లా, గుంటూరు నుండి 20 కి.మీ., దూరంలో పొన్నూరుకు పోవు మార్గంలో పొన్నూరుకు దగ్గరలో రోడ్డుమీదనే కట్టెంపూడి గ్రామ ములో నాగేంద్రస్వామి ఆలయం ఉన్నది. ఈ ఆలయం ముందు విస్తరించుకొని ఉన్న రావిచెట్టు క్రింద నుండి పుట్టను ఆనుకొని సర్పాకార శిలావిగ్రహం ఐదు పడగలతో శివలింగానికి గొడుగులా పడగవిప్పి ఉంటుంది. చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేయుటకు ఎత్తైన వేదిక నిర్మించబడి, చుట్టూ అనేక నాగ ప్రతిమలు ప్రతిష్ఠ చేయబడియున్నవి. గర్భాలయంలో పాలరాతితో మలచబడిన మూడు అడుగుల ఎత్తుగల ఐదు పడగలుగల నాగవిగ్రహం సుబ్రహ్మణ్యస్వామిగా పూజలందుకుంటుంది. ఆవిగ్రహం పడగల క్రింద ఒక శివలింగం ఉన్నది. నాగుల చవితి రోజున అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజాదికాలు చేస్తారు.

శ్రీ నాగేంద్రస్వామి - నవులూరు పుట్ట

గుంటూరుజిల్లా, మంగళగిరి మండలం, మంగళగిరి నుండి 3 కి.మీ. దూరంలో (రైల్వేట్రాక్‌కు అవతల) నవులూరులో ఈ ఆలయం ఉన్నది. ఈ ఆలయం జనా వాసానికి దూరంగా, ప్రశాంతంగా, ఒక ఆశ్రమం వలే ఉంటుంది. ఈ ఆలయం

శ్లాబుతో ఉన్న ఇల్లువలె ఉంటుంది. విశాలమైన గదిలో ఎత్తైన వేదికవలె విస్తరించబడి ఉన్న పుట్టపై ఎర్రని వస్త్రం కప్పబడి ఉంటుంది. పూజాసామాగ్రిని ఆ వస్త్రం పైనే నివేదించి, నాగేంద్రస్వామి కాంస్య విగ్రహాన్ని పళ్ళెంలో ఉంచి భక్తులే స్వయంగా పాలతో అభిషేకం చేసుకోవచ్చును. ఆలయం బయట రావిచెట్టు వద్ద నాగప్రతిమలకు ప్రదక్షిణలు చేస్తూ పూజిస్తారు. నిత్యం ఇక్కడకు భక్తులు వస్తారు. నాగుల చవితి రోజున గొప్ప ఉత్సవంలాగా జరుపుతారు.

నాగేంద్రస్వామి - పెదకూరపాడు

గుంటూరుజిల్లా సత్తెనపల్లి నుండి అమరావతి పోవు దారిలో 15 కి.మీ., దూరంలో పెద్ద కూరపాడు గ్రామము కలదు. ఈ గ్రామములో నాగేంద్రస్వామి పుట్ట కలదు. ఇక్కడ ఆలయం చిన్నదే అయినా గొప్ప మహిమగల దైవంగా నాగేంద్రస్వామిని చుట్టుప్రక్కల ప్రజలు భక్తితో పూజిస్తారు. ప్రధాన ఆలయంలో ఉన్న వృక్షానికి ఇత్తడితో తయారుచేయబడిన పెద్ద పెద్ద నాగేంద్రుని ప్రతిమలు వృక్షానికి చుట్టుకొని ఉన్నట్లు అలం కరించబడి ఉండుట ఈ ఆలయంలో విశేషం. చెట్టు మొదలులో చిన్న శివలింగం కూడా ఉంటుంది. ఇక్కడకు నాగుల చవితి రోజున ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారికి పాలు మొదలైనవి సమర్పిస్తారు.

దైద అమరలింగేశ్వరుడు - గుత్తికొండ బిలం



గుంటూరుజిల్లా, పిడుగు రాళ్ళకు 25 కి.మీ., దూరంలో ఉన్న గుత్తికొండలో ఈ బిలం ఉన్నది. చుట్టూ పర్వత శ్రేణి, మధ్యలో బిల సముదాయం. ఇది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బిలం. ఈ బిలం ప్రధాన మార్గం నుంచి లోపలకు అడుగుపెట్టడంతోనే చీకటి మల్లయ్య పూజలందుకుంటూ కనిపిస్తాడు. కన్ను బొడిచినా కానరాని చీకటిలో విద్యుత్తుదీపాల వెలుగుల వెంబడి ముందుకెళ్తే నీటికొలను వస్తుంది. రూపాయినాణెం కిందపడినా కనిపించేంత స్వచ్ఛమైన నీటితో నిండి ఉంటుంది ఈ కొలను. ఇక్కడికి వచ్చిన వారంతా పుణ్యస్నానాలు చేస్తారు. ప్రధాన బిలం నుంచి లోపలకు వెళ్తే 101 బిలాలు ఉన్నాయని చెపుతారు. ఇంకా ముందుకెళ్తే గరళం సేవించే శివుడి విగ్రహం ఉందని అంటారు. ద్వాపరయుగంలో కాలయవనుని బారి నుండి తప్పించుకునే

క్రమంలో శ్రీకృష్ణుడు ఈ బిలంలోకి ప్రవేశించి తపమాచరిస్తున్న ముచికుంద మహర్షిపై తన ఉత్తరీయాన్ని కప్పి పక్కకు వెళ్తాడు. ఆయనే శ్రీకృష్ణుడని భావించిన రాక్షసుడు తపోభంగం కల్గించడంతో ఆగ్రహించిన ముని అతన్ని భస్మం చేసినట్లు పురాణగాథ.

గురజాలకు 13 కి.మీ., దూరంలో పవిత్ర కృష్ణానది తీరాన అమరలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. సొరంగమార్గంలో స్వయంభువుగా వెలిసిన అమరలింగేశ్వరుడు భక్తుల పూజలందుకుంటూ భాసిల్లుతున్నాడు. శివరాత్రికి భారీ ఎత్తున భక్తజనం చేరుకుంటారు. సొరంగమార్గంలో స్వయంభువుగా వెలియడంతో భక్తులు గతంలో ప్రమిదల వెలుగులో సందర్శించుకునేవారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ లైటింగ్ ఏర్పాటు చేసింది. సొరంగ మార్గంలో 400 మీటర్ల వరకు ప్రయాణం చేసి శివలింగాన్ని చూడవల్సి ఉంటుంది. పల్నాడు యుద్ధం తరువాత బ్రహ్మనాయుడు ఈ బిలంలోకి వెళ్ళినట్లు కథనం ఉంది. ఈ స్వామి దర్శనం గొప్ప అనుభూతినిస్తుంది.

సంజీవికొండ - వినుకొండ

గుంటూరుజిల్లా, వినుకొండకు 22 కి.మీ., దూరంలో, ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి గ్రామసమీపంలో అటవీప్రాంతం అంతర్భాగంలో సంజీవి కొండ కలదు. ఈ కొండలో నిక్షిప్తమైన మూలికలతో, అక్కడ వీచే గాలులు అనేక వ్యాధులు నివారణ అవుతాయని భక్తుల నమ్మకం. అందుకే ఈ కొండని సంజీవి కొండగా పిలుస్తున్నారు. త్రేతాయుగంలో సంజీవని మూలికకోసం హనుమంతుడు పెకలించిన కొండగా భక్తులు ఈ కొండను సంజీవి కొండగా నమ్ముతున్నారు. గుంటూరుజిల్లాలోని చాలా మందికి దీని గురించి అంతగా తెలియదు. చుట్టూ ముళ్ళచెట్లు, ఆపై విషపురుగుల సంచారం, పగటిపూటసైతం ఆ ప్రాంతానికి వెళ్ళడానికి సాహసించేవారు కాదు. ఒకసారి ఒక భక్తుడు కొండపైకి వెళ్ళి, అక్కడ ఉన్న చిన్న గుడిలో ఏదో మొక్కుకున్నాడు. ఆయన కోరిక వెంటనే ఫలించింది. ఆయన ఈ విషయంగురించి తనకు తెలిసిన వారందరికి చెప్పాడు. అలా అప్పుడు సంజీవికొండ అందరికీ ప్రచారంలోకి వచ్చింది. ఈ కొండపై సంజీవని మొక్క ఉందని కొందరు, కొండపై ఒక నిద్రచేస్తే మొండి వ్యాధులు మొదలైనవి నయమవుతాయని సంజీవికొండకు వెళ్తున్నారు.కొండపైవేంచేసియున్న మూలవిరాట్ శివుడిని భక్తులు కోటయ్యగా కొలుస్తున్నారు.తొలుత శివుడు ఇదే కొండపై తపస్సు చేశాడని, ఈ ప్రాంతంలోని మృగాల అరుపులకు తపోభంగం కలగడంతో కోటయ్యస్వామి త్రికోట పర్వతానికి వెళ్ళాడని అది నేడుకోటప్పకొండగా పేరుగాంచినట్లు చెబుతుంటారు. ఈ కొండకు భక్తులు తొలుత వందల సంఖ్యలో వెళ్ళేవారు. కొన్ని మహిమలు జరిగినట్లు ప్రచారం జరగడంతో

నేడు వేల సంఖ్యలో ఈ కొండపై జాగారం చేస్తున్నారు. రాష్ట్ర నలుమూలల నుండిపలువురుభక్తులువేలసంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. వినుకొండ, నరసరావుపేట, గుంటూరు,ప్రకాశం, హైదరాబాద్ తదితర ప్రాంతాలనుండి ప్రతీ సోమవారం అధికసంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు.

నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు - అడిగొప్పల



గుంటూరుజిల్లా, దుర్గిమండలం, అడిగొప్పల గ్రామంలో నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయం ఉన్నది. ఈ అమ్మవారిని సంతానంతో పాటు సకల సంపదలనూ ఇచ్చే తల్లిగా కొలుస్తారు. పేరులో శ్రీలక్ష్మి అని ఉన్నా, ఈమెను పార్వతీదేవి అంశగా భావిస్తారు.

చరిత్ర: పూర్వం కైలాసంలో పార్వతీపరమేశ్వరులు కూర్చుని ఉండగా ప్రమథ గణాలు నాట్యం చేస్తున్నాయి. అప్పుడు నందీశ్వరుణ్ణి చూసి పార్వతీదేవి హేళనగా నవ్విందట. "జగన్మాతా! నా కుమారుణ్ణి చూసి ఎందుకు నవ్వావు? అని మహర్షి శిలాదుడు ఆమెను ప్రశ్నించగా, అతడి నాట్యంలో భావమూ తాళమూ ఏమీలేవు. అని నవ్వుతూ చెప్పింది పార్వతీదేవి. అప్పుడు శిలాదుడికి కోపం వచ్చింది. కలియుగంలో నీవు భూలోకంలో జన్మించి, అవివాహితవైన నీవు చిన్నతనంలోనే గర్భందాల్చి అవమానాలను ఎదుర్కొన గలవు అని శపించాడు. అప్పుడు పార్వతీదేవి శాపవిమోచన మార్గం చెప్పమని అడుగుతుంది. నీతోపాటు కామధేనువు గోమాతగా అవతరిస్తుంది. నీవు రోజూ దాన్ని పూజిస్తావు. ఆ తరువాత నీవొక విచిత్ర గర్భం ధరిస్తావు. నాట్యంలో నంది అసంపూర్ణుడని అన్నావు కాబట్టి, నీ గర్భంలో నందీశ్వరుడు అసంపూర్ణంగా ఉంటాడు. పెళ్ళి కాకుం డానే నీవు గర్భతివయ్యావని తెలిసి, నీ వాళ్ళు నిన్ను అగ్నికి ఆహుతి చేస్తారు. ఆవిధంగా నువ్వు మానవరూపాన్ని వదలి నిదానంపాటి అమ్మ వారుగా భక్తుల కోర్కెలు తీరుస్తూ వారిచే పూజలందుకుంటావు అని చెప్పాడట. ఆవిధంగా శాపానికి గురైన పార్వతీదేవి సుమారు 700 ఏళ్ళక్రిందట గుంటూరుజిల్లా, పల్నాడు ప్రాంతంలోని యాగంటిరామయ్య ఇంట్లో జన్మించిందని చెబుతారు. నలుగురు కుమారుల తరువాత పుట్టిన ఆమెకు శ్రీలక్ష్మి అని పేరు పెట్టారు రామయ్య. ఆయనకున్న పశుసంపదలో కామధేనువు అనే గోవు ఉండేది. శ్రీలక్ష్మి ప్రతిరోజూ గోశాలకు వెళ్ళి, ఆ గోవు చుట్టూ ప్రదక్షిణలు చేసి గోపంచితాన్ని తాగుతూ ఉండేది.

ఒకరోజు ఆ కామధేనువుతో ఒక ఆబోతు క్రీడించింది. ఆ విషయం తెలియని శ్రీలక్ష్మి రోజులానే ఆమె గోశాలకు వెళ్ళి గోమాతకు ప్రదక్షిణ చేసి, పూజించి గోపంచితాన్ని తాగింది. అప్పటివరకూ రజస్వల కూడా కాని ఆమె కొన్నాళ్ళకు గర్భవతి అయ్యింది. విషయం తెలిసిన గ్రామస్తులు సూటిపోటిమాటలన్నారు. వంశగౌరవాన్ని మంట గలిపిన శ్రీలక్ష్మిని మట్టుపెట్టాలనుకున్నారు ఆమె అన్నయ్యలు. ఓరోజు తల్లిదండ్రులు ఇంట్లోలేని సమయంలో ఆమెను పొలానికి పిలిపించి, పత్తి మండె ఎక్కించి నిప్పుపెట్టారు. శ్రీలక్ష్మి మంటలకు ఆహుతికాగా, ఆమె గర్భంలో ఉన్న కోడెదూడ కూడా ప్రాణాలు విడిచింది. గోశాల నుంచి కామధేనువు కూడా వచ్చి ఆ మంటల్లో దూకి ఆహుతి అయ్యింది. మంటలకు ఆహుతి అయిన శ్రీలక్ష్మి శిలగా మారిపోయింది. తరువాత ఆమె ఒక 11 ఏళ్ల బాలికను పూని "ఆదివారం నన్ను అగ్నికి ఆహుతి చేశారు. కాబట్టి ప్రతి ఆదివారం పసుపు, కుంకుమలతో నాకు పూజలు చేయాలి. నన్ను చల్లబరిచేందుకు పొంగళ్లు నైవేద్యంగా పెట్టాలి. నన్ను దర్శించుకునేవాళ్ళంతా ఎండలోనే ఉండాలి. నాకు ఆలయాన్ని నిర్మించవద్దు." అని చెప్పిందట.

అమ్మవారు వెలిసిన ప్రదేశం చుట్టూ 10 అడుగుల మేర స్థలం విడిచిపెట్టి మందిరాన్ని నిర్మించారు. అమ్మవారి దీక్ష తీసుకునే భక్తులు 40 రోజుల దీక్ష పూర్తయ్యాక ఇరుముడులు కట్టుకుని కాలినడకన అమ్మ సన్నిధికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేనివారు ఒకరాత్రి ఇక్కడే బసచేసి అమ్మను ఆరాధిస్తే సంతానం కలుగుతుందని నమ్ముతారు. ఇక్కడకు వచ్చే వాహనాలన్నీ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి వెళ్ళాల్సిందే. ప్రతీఏటా ఉగాదికి ముందు అమ్మవారి తిరునాళ్ళు భారీ ఎత్తున నిర్వహిస్తారు. భక్తులంతా అక్కడే పొంగళ్లు వండుకుని, అక్కడే ప్రసాదం తినేసి వెళ్ళిపోతారు. ఇంటికి తీసుకువెళ్ళరు. ఒకవైపు అమ్మవారికి ధూపదీపాలూ, మరోవైపు పొంగళ్ల నైవేద్యాలతో ఈ ప్రదేశమంతా ఆధ్యాత్మిక పారవశ్యాన్ని పొందుతుంది.

శ్రీ వల్లభరాయస్వామి ఆలయం - వంగిపురం



గుంటూరుజిల్లా, ప్రత్తిపాడు మండలం లోని వంగిపురంలో శ్రీ వల్లభరాయస్వామి ఆలయం ఉన్నది. చోళులకాలం నాటి వేంగిపురమే నేడు వంగిపురంగా పిలువ బడుచున్నది. గుంటూరు జిల్లాలోని అతి ప్రాచీనమైన వైష్ణవ క్షేత్రాలలో వంగి పురం వల్లభ రాయస్వామి ఆలయం



సుప్రసిద్ధమైనది. ప్రాచీనమైన కట్టడంగా అపురూప దివ్యధామంగా ఈ ఆలయం అలరారుతున్నది. ఇక్కడ భక్తులు వల్లభదీక్షను స్వీకరిస్తారు. 4వ శతాబ్దంలో చోళుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయం చారిత్రక యశస్సు కలిగి ఉన్నది.

ఆలయ ప్రాంగణంలో కవచయుక్త ధ్వజస్తంభం, గరుడస్తంభం ఉంటాయి. ఆలయ ముఖమంటపం రాతి స్తంభాలతో, చోళరాజుల కళా నైపుణ్యానికి మచ్చుతునకగా భాసిల్లుతున్నది. ఆలయ ముఖమంటపంపై నక్షత్రాకృతి దర్శనమిస్తుంది. గర్భాలయంలో తిరునామం, శంఖు,చక్రాలతో, మీసాలను ధరించి సర్వాలంకార భూషితుడై వల్లభరాయ స్వామి దర్శనమిస్తాడు. పై హస్తాలలో శంఖు చక్రాలను ధరించి, క్రింది కుడిచేతిని అభయహస్తం, గధాయుధదారిగా, సాక్షాత్తు నారాయణస్వరూపంగా స్వామి దర్శనమిస్తాడు. భాగవతంలోని గజేంద్రమోక్ష ఇతివృత్తానికి ఈ క్షేత్రానికి అవినాభావ సంబంధం ఉన్నట్లు తెలియుచున్నది. మకరుడి నోట చిక్కిన గజేంద్రుని రక్షించటానికి హడావిడిగా అపసవ్యంగా శంఖుచక్రాలను ధరించి, భక్తరక్షణే ధ్యేయంగా స్వామి వల్లభరాయ స్వామిగా ఇక్కడికి తరలివచ్చాడని ప్రతీతి. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీవారి దేవేరిగా ఇక్కడ రాజ్యలక్ష్మీదేవి నెలకొని ఉన్నది. ప్రతీ శుక్రవారం అమ్మవారికి విశేష రీతిలో అర్చనాదులు నిర్వహిస్తారు. వల్లభరాయస్వామి సన్నిధికి ఎడమవైపున క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి సింధూర వర్ణంలో ఉన్నాడు. వల్లభరాయ గర్భాలయ సమీపంలోనే పన్నిద్దరు ఆళ్వార్ల సన్నిధి ఉన్నది. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటూ, పండుగ, పర్వదినాలలో ప్రత్యేకపూజలు, ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

గంగాపార్వతీసమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం - వంగిపురం



గుంటూరు జిల్లా కేంద్రానికి 30 కి.మీ. దూరంలో ప్రత్తిపాడు, మండలంలో వంగిపురం ఉంటుంది. ఇచ్చటనే శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని 11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లు చెబుతారు. ఈ ఆలయంలోని శివలింగాన్ని అగస్త్యమహాముని ప్రతిష్టించినట్లు చెబుతారు. తరువాత చోళరాజులు ఈ లింగానికి గర్భాలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం వల్లూరు ఆనందయ్యగారు అనే వ్యక్తి ప్రస్తుతం ఉన్న ఈ ఆలయాన్ని నిర్మించి, నిత్యపూజలకొరకు కొంత భూమిని కూడా విరాళంగా ఇచ్చినట్లు ఆలయ గోపురం



మీద ఉన్న శిలాశాసనంద్వారా తెలుస్తుంది. గర్భాలయంలో లింగరూప సదాశివునికిచేసే ప్రత్యేక అలంకరణతో ఇచ్చట కైలాస నాథుడు విగ్రహ రూపంలోఉన్నట్లు కనిపిస్తుంది. నమస్కార మండపంలో శ్రీగణేశుడు,పార్వతీఅమ్మవారు కొలువుతీరి కనిపిస్తారు. ముఖ మండపంలో శ్రీవీరభద్రస్వామివారు, శ్రీ భద్రకాళీ అమ్మవారు కనిపిస్తారు. శ్రీ అగస్త్యేశ్వర స్వామివారిని ముఖ్యంగా పరీక్షలలో విజయం కలగటానికి ఎందరో విద్యార్థులు ఇరుగు పొరుగు ప్రాంతాల నుండి వచ్చి తమ హాల్ టికెట్స్ ఇచ్చట పెట్టి పూజించుకొంటారు. నిత్య పూజలతో పాటు ఫాల్గుణ మాసంలో శ్రీ అగస్త్యేశ్వర స్వామివారికి వివాహ వేడుకలను వైభవంగా చేస్తారు.

శ్రీ రంగనాథస్వామి ఆలయం - సొలస




గుంటూరుజిల్లా, ఎడ్లపాడు మండలంలో, నరసరావుపేటకు సమీపంలో సొలస గ్రామంలో శ్రీరంగనాథస్వామి ఆలయం ఉన్నది. ఇది అత్యంత ప్రాచీనమైన ఆలయం అని తెలియుచున్నది. పూర్వం ఒకప్పుడు కీకారణ్య ప్రాంతంగా ఉన్న ఈ ప్రదేశాన్ని నాదెండ్ల ప్రాంతానికి చెందిన కొందరు పశువుల కోసం ఇక్కడ సువిశాలమైన చెరువును తవ్వించారు. కాలక్రమంలో వారు ఆ చెరువు చెంతనే ఒక గ్రామాన్ని నిర్మించుకొన్నారు. పశుకాపరులకు నాయకుడు వలసయ్య. అతని పేరు మీదనే ఆ గ్రామానికి వలస అనే పేరు ఏర్పడి అది క్రమంగా సొలసగా మారిందని చెబుతారు.

క్రీ.శ. 1616వ సంవత్సరం నుండి 1618 వరకు కొండవీటి ప్రాంతానికి పరిపాలకునిగా ఉన్న జూపల్లి రంగపతిరావు రామేశ్వర ప్రాంతం నుండి ప్రత్యేకంగా పనివార్లను రప్పించి రంగనగరమనే పేరుతో గ్రామాన్ని నిర్మింపచేశాడని స్థలపురాణాన్ని బట్టి తెలుస్తుంది. ఆ రంగపట్టణమే నేటి సొలస అని తెలుస్తుంది. రంగపతిరావు ఆరాధ్య దైవమైన రంగనాథుడ్ని ఈ గ్రామంలో ప్రతిష్టించి ఆలయాన్ని నిర్మింపచేశాడని శాసనాలు, ఇతర ఆధారాలను బట్టి తెలుస్తుంది.

క్రీ.శ.1885వ సంవత్సరంలో జూన్ 14వ తేదీన గర్భాలయంలో రంగనాథ స్వామి వారిని ప్రతిష్టించారు. అప్పటి శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని అర్వపల్లి కోటయ్య,



రామస్వామి అనే భక్తుల ఆధ్వర్యంలో పునర్నిర్మించారు. ఆలయాన్ని నిర్మించడమే కాక, 150 ఎకరాల భూమిని దానంగా సమర్పించారు. ఒకప్పుడు ముష్కరుల దండయాత్రలతో దక్షిణా పథం భీతిల్లిచున్న సమయంలో ఈ విగ్రహాన్ని వారి నుండి కాపాడుకోవడం కోసం భూస్థాపితం చేశారు. కొన్ని శతాబ్దాల తర్వాత సొలస గ్రామానికి చెందిన కోటయ్య అనే రైతు పొలాన్ని దున్నుతుండగా మరలా జగన్నాయకుడైన రంగనాథుని విగ్రహం బయటపడినది. శిథిలమైన ఆలయాన్ని పునర్నిర్మించి, ఆలయంలో 1885వ సంవత్సరం జూన్ 14వ తేదీన పునః ప్రతిష్ట చేశారని, ఇక్కడి స్థలపురాణాన్ని బట్టి తెలుస్తుంది. ప్రధాన ఆలయ గోపురంపై సుదర్శనచక్రం అమరి ఉన్నది.గర్భాలయ ద్వారంపై గజలక్ష్మీ అమ్మవారి రూపం ఉన్నది. గర్భాలయ ద్వారానికి ఇరువైపులా జయవిజయులు ద్వారపాలకులుగా ఉండగా, గర్భాలయంలో శేషతల్పంపై శ్రీదేవి, భూదేవి పాదసేవ చేస్తుండగా, యోగనిద్రా ముద్రాంకితుడైన రంగనాథుడు భక్తులకు దర్శనమిస్తాడు.



ఈ క్షేత్రంలో ఆంజనేయస్వామివారి రెండు విగ్రహాలు ఉండటం విశేషం. ఒకచోట స్థానకభంగిమలో, నల్లరాతి ఆంజనేయస్వామివారి విగ్రహం ఉంటుంది. ఈ విగ్రహం చెంతనే ఉత్సవమూర్తి విగ్రహం కూడా నెలకొని ఉంటుంది. మరోవైపు వర్ణరంజితమైన ఆకర్షణీయ రీతిలో కుడ్యంపై హనుమాన్ విగ్రహం ఉంటుంది. ఈ క్షేత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే గణపతి భూ ఆకృతిలో అంటే గుండ్రని రూపం కలిగిన విగ్రహ రూపంలో దర్శనమిస్తాడు.



ఇచ్చట నిత్య పూజలతో పాటూ, ఏకాదశి, పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, భోగి రోజున శ్రీ గోదా, రంగనాథుల తిరుకళ్యాణం, వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. భాద్రపద మాసంలో 11 రోజులపాటు వినాయక చవితి ఉత్సవాలను ఇచ్చట ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం - పిడుగురాళ్ళ



గుంటూరుజిల్లా, పిడుగురాళ్ళలో, జానం పేటరోడ్డులో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఉన్నది. ఈ ఆలయం మనదేశంలోకల వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలలో కెల్లా ఎంతో ప్రత్యేకతను సంతరించుకొంది. కర్ణాటకకు చెందిన శేగు కృష్ణదాసు దంపతులు ఈ ఆలయం నిర్మించి 1978వ సంవత్సరంలో విగ్రహ ప్రతిష్టాపన చేశారు. దేవాలయ ప్రాంగణం ముంగిట అయిదు అంతస్తులతో కూడిన రాజగోపురంపై పలుశక్తిస్వరూపాల ప్రతిమలు ఉన్నాయి.



గర్భాలయంలో స్థానక భంగిమలో, సర్వాలంకార యుక్తంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి దర్శన మిస్తుంది. పాలరాతితో తీర్చిదిద్దిన అమ్మవారి మూర్తి దివ్యతేజోమయంగా ఉంటుంది. అమ్మవారి పాద పీఠపు దిగువన శ్రీచక్రమేరువు నెలకొని ఉన్నది. ఈ శ్రీచక్రానికి భక్తులు పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలు ఉన్నాయి. కన్యకా పరమేశ్వరీదేవికి కుడివైపున వరసిద్ధి వినాయకుని ఆలయం, వినాయకమూర్తి దగ్గరే సిద్ధి బుద్ధి సమేత గణపతి ఉత్సవమూర్తులు కన్యకాపరమేశ్వరీదేవి ఆలయానికి ఎడమవైపున సప్తఫణి అలంకృతంగా ఉన్న నగరేశ్వరస్వామి ఆలయం లింగమూర్తికి వెనుకవైపు భారీ గణపతి విగ్రహం, ఆ ప్రక్కనే నగరేశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవమూర్తులు ఉన్నాయి. ఈ సన్నిధానంలోనే ప్రసన్నాంజనేయస్వామి, శ్రీ రమాసహిత సత్యన్నారాయణస్వామి ఆలయాలు, నవగ్రహమంటపం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధి గీతామందిరం, అర్జునునికి భగవద్గీతను ప్రభోదించే శ్రీకృష్ణుని పాలరాతిమూర్తులు ఈ మందిరంలో నెలకొని ఉంటాయి. ఈ మూర్తులకు వెనుకవైపు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోపాలకృష్ణుని ఉత్సవమూర్తులు ఉన్నాయి.

ఈ ఆలయానికి ప్రక్కనే ఉన్న అద్దాలమంటపంలో ప్రతీ శుక్రవారం అమ్మవారికి పవళింపు సేవను నిర్వహిస్తారు. ఈ ఆలయంలో నిత్యపూజలతో పాటూ, శ్రీ చక్రానికి నిత్య కుంకుమపూజలు, ప్రతి మంగళవారం సామూహిక హనుమాన్ చాలీసా, పండుగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు, వైశాఖ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు కన్యకా పరమేశ్వరీదేవికి ఉత్సవాలు, వైశాఖ శుద్ధ దశమినాడు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి జన్మ దినోత్సవం, మాఘశుద్ధ విదియనాడు అమ్మ వారి అగ్నిగుండ ప్రవేశదినాన్ని గొప్పగా జరుపుతారు.

శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం - పెదవడ్లపూడి



గుంటూరుజిల్లా మంగళగిరి నుండి తెనాలికి వెళ్ళేమార్గంలో మంగళగిరి నుండి 4 కి.మీ., దూరంలో, ప్రధాన రహదారి ప్రక్కనే పెదవడ్లపూడి గ్రామంలో శ్రీ భగవాన్ శ్రీసత్య షిరిడి సాయిబాబా మందిరం ఉన్నది. అమెరికాలోని ప్రవాసాంధ్రుల ఆర్థిక సహాయంతో 2003వ సంవత్సరంలో శంకుస్థాపన చేసి 2005 ఫిబ్రవరి 3వ తేదీన ఆలయంలో షిరిడిసాయి విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. ఆనాటినుండి ఈ మందిరం భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. మందిర ప్రాకార మంటపంపై పలుదేవతామూర్తుల విగ్రహాలు దర్శనమిస్తాయి. ప్రధాన మందిర ప్రవేశ ద్వారంపై సాయినాథుని విగ్రహం ఉన్నది. మందిరశిఖరంపై పంచ లోహ కలశం, ధ్వజం నెలకొని ఉంటాయి. ప్రాకారమంటప పైభాగాన



వినాయకుడు, దత్తాత్రేయస్వామి, శివ పార్వతులు, చతుర్ముఖ బ్రహ్మలు ఉన్నారు. ప్రధానమందిర శిఖరం అందమైన నగిషీలతో అలరారుతుంది. మందిర ప్రవేశ ద్వార బంధంపైన పాలకడలిలో శేషతల్పంపై శయనించిన శ్రీమహావిష్ణువు రూపు ఉన్నది. ద్వారబంధం చుట్టూ దశావతార మూర్తులు ఉన్నాయి. ప్రధానమందిరంలో ఉన్నతపీఠంపై, రజతసింహాసనాసీనుడై, పాలరాతితో తీర్చిదిద్దిన షిరిడిసాయినాథుడు సర్వాలంకార భూషితునిగా దర్శమిస్తాడు. బాబా ప్రధాన విగ్రహం ముందు



వెండిపాదుకలు ఉన్నాయి. ప్రధాన మందిరంలో ఒకవైపున కొయ్య ఊయలలో బాబా ప్రతిమ ఉన్నది. సాయిమందిర ప్రాంగణంలో ఉన్న ఉద్యానవనంలో బాలకృష్ణుడు, గోవులు, గోపికల విగ్రహాలు ఉన్నాయి. ఆలయంలో ప్రతినిత్యం హారతులు, అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి గురువారం ప్రత్యేకపూజలు, పల్లకీసేవ, పండుగ పర్వదినాలలో విశేష అర్చనలు నిర్వహిస్తారు.

శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం - ప్రత్తిపాడు



గుంటూరుజిల్లా, ప్రత్తిపాడు గ్రామంలో రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయం ఉన్నది. పురాతనమైన ఈ ఆలయం పౌరాణిక, చారిత్రక ప్రశస్త్యంతో అలరారుతున్నది. పూర్వకాలంలో ఈ ప్రత్తిపాడు గ్రామం భక్తులవాడ అనే పేరుతో విఖ్యాతి చెందినది. కాలక్రమంలో భర్తిపాడు, ఆతరువాత కాలంలో ప్రతిప్తాడుగా పిలువబడుతున్నది. పల్లవులు, చోళులు, విష్ణు కుండినులు, కాకతీయులు, రెడ్డిరాజులు వంటి ఎందరో రాజవంశీకులు అనేక భూరివిరాళాలు సమర్పించారు. చిలకలూరిపేట జమీందారు రాజా మానూరి వెంకయ్య పంతులు, వారి తదనంతరం వారి కుమారులు ఈ క్షేత్రాన్ని ఎన్నో విధాలుగా సమగ్రంగా అభివృద్ధి చేసినట్లు తెలుస్తుంది.


పెదకోమటి వేమారెడ్డి పరిపాలనాకాలంలో రాజప్రతి నిధియైన కురుగంటి వెంకటరెడ్డి గోపినాథ స్వామి పేరిట రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామిని ప్రతిష్టించినట్లు శాస నాల ద్వారా తెలుస్తుంది. అయితే ఈ ఆలయ ప్రదేశంలో ఒకప్పుడు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండేది. ఆ ఆలయం శిథిలమవ్వటంతో ఇక్కడ వేణుగోపాల స్వామి వారి ఆలయాన్ని ప్రతిష్టించారు. అందుకే ఈ స్వామిని వేంకట వేణుగోపాల స్వామిగా కూడా వ్యవహరిస్తారు.



ప్రధాన ఆలయ గోపురంపై గరుత్మంతుడు, పలు సింహాకృతులు నెలకొని ఉంటాయి. ప్రత్యేకంగా ఉన్న రాతిస్తంభంపై బల్లి ఆకృతి, శాసనాలు ఉన్నాయి. కాకతీయులు, రెడ్డిరాజులు వేయించిన పలు శాసనాలు ఇక్కడ కనిపిస్తాయి. ఆలయ కుడ్యాలపై మీనం, కూర్మం, గరుత్మంత, హంస, ఆంజనేయ తదితర స్వరూపాలు ఉన్నాయి. దారువుతో చేసిన ధ్వజస్తంభం ప్రధాన ఆలయానికి అభిముఖంగా ఉన్నది. గర్భాలయంలో ఉభయదేవేరులతో స్వామి దర్శనమిస్తాడు. గతంలో గర్భాలయంలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి మాత్రమే నెలకొని ఉండేవారు. అయితే సుమారు 70 సంవత్సరాల క్రితం శ్రీనివాసుల



వేంకటాచార్యులు అనే భక్తుడు సత్యభామా దేవి విగ్రహాన్ని కూడాప్రతిష్ఠించారు. ఆనాటినుండి స్వామిరుక్మిణీ సత్య భామా సమేతశ్రీవేణుగోపాలస్వామిసర్వా లంకార భూషితుడైశంఖం, చక్రాన్ని ధరించి దర్శనమిస్తు న్నాడు. ఈ స్వామిని గోపీనాథ స్వామిగా కొంతమందిభక్తులుపిలుస్తారు. దక్షిణాభి ముఖుడై ఉన్న ఈ స్వామి దర్శనం వలన అనారోగ్య బాధలు, అపమృత్యు భయాలు తొలగు తాయని భక్తుల నమ్మకం.



